Barcode : 2030020024474
Title - abalaa sachcharitra ratnamaala
Author - achchama bhandaaru
Language - Telugu
Pages - 289
Publication Year - 1935
Barcode EAN.UCC-13
2030020024474

UNIVERSAL LIBRARY
OU_204060
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 923.5 A17A    Accession No. T4498

Author అచ్చమాంబ, భండారు

Title అబలా సచ్చరిత్ర మాల

This book should be returned on or before the date last marked below.

# అబలా సచ్చరిత్ర రత్నమాల

(భారత వీర నారీమణుల జీవిత సంగ్రహము)

గ్రంథకర్త్రి

కీ॥ శే॥ శ్రీమతి భండారు అచ్చమాంబగారు

ప్రకాశకుడు

కొమర్రాజు వినాయకరావు

అభ్యుదయ ప్రెస్ — బెజవాడ

మూల్యము 2-8-0

సర్వ హక్కులు ప్రకాశకునివి.

పునర్ముద్రణము
1000 ప్రతులు

Checked 1965

Checked 1969

ప్రతులకు—

కొమర్రాజు వినాయకరావు,
అభ్యుదయ ప్రెస్,
గవర్నరుపేట — బెజవాడ

Printed for
K. VINAYAKA RAO
T. P. No. E-46 Copies 1000
at
Abhyudaya Press, Bezwada

# ఉపోద్ఘాతము

★

అబలాసచ్చరిత్ర రత్నమాల అను పేరిట ఉదాత్తము లైన స్త్రీలచరిత్రములు వ్రాయదలచినాను. ఈ చరిత్రములు వ్రాయుటయందు నాముఖ్యోద్దేశము లేవనగా:—

(౧) స్త్రీలు అబల లనియు, బుద్ధిహీన లనియు, వివేక శూన్య లనియు, సకల దుర్గుణములకు నివాసస్థల మనియు గొందరు నిందింతురు. స్త్రీలపయిన మోపబడిన యీ దోషారోపణము లన్నియు నబద్ధము లనియు, స్త్రీలలో నత్యంత శౌర్యధైర్యవతులును, అసామాన్యవిద్యావిభూషితలును, జ్ఞానవతులును, రాజ్యకార్యధురంతరత్వము గలవారును, స్వదేశాభిమానినులును, సకలసద్గుణవిభూషితలును, బూర్వముండిరనియు నిప్పుడున్నవా రనియు స్థాపించుట నామొదటి యుద్దేశము. ఇంతియకాదు. స్త్రీలయొక్క స్వాభావికప్రవృత్తి సద్గుణముల వైపునకేకాని దుర్గుణముల వైపునకు గాదనియు, సిద్ధాంతీకరించుట నాప్రథమోద్దేశములలోని యుద్దేశమే.

(౨) స్త్రీలకు విద్య నేర్పినయెడలను, వారికి స్వాతంత్ర్యమొసగినయెడలను, వారు చెడిపోవుదురనియు, బతుల నవమానించెద రనియు, గుటుంబసౌఖ్యమును నాశముచేసెద రనియు,

గొందరు మహానుభావులు వక్కాణించెదరు. ఈయారోపణము లన్నియు నిరర్థకములనియు, స్త్రీవిద్య దురాచారప్రతీకారాను కూల మగునేకాని దురాచారప్రవృత్త్యనుకూలము గానేర దనియు, స్త్రీవిద్యాస్వాతంత్ర్యముల వలన మన దేశమునకు లాభమే. గాని నష్టము గలుగనేరదనియు, స్త్రీవిద్య యత్యంతా వశ్యకం బనియు, సోదాహరణ పూర్వకముగా నిరూపించుట నాద్వితీయోద్దేశము.

(3) ఆంధ్రదేశములోని భగినీగణములకు మనోరంజ కముగను, ఉపదేశకరముగను ఉండుపుస్తకము నొకదానినిరచిం చుట నాతృతీయోద్దేశము. యుపదేశగ్రంథములవలనను, కేవల కల్పనాకథలవలనను జేసినయుపదేశమునకంటె నిజమైన చరిత్రం బుల వలన జేసిన యుపదేశము అధిక ఫలప్రదంబగునని యందరికి దెలిసిన విషయమే. కాన, నిజములైన యీస్త్రీల చరిత్రముల వలన నాంధ్రసోదరీమణులకు పాతివ్రత్యము, స్వదేశాభిమా నము, స్త్రీవిద్య మొదలయినవాని గురించి కొంత విన్నవించు కొనవలయు నని నాముఖ్యోద్దేశము.

నేను వ్రాసెడి యీచరిత్రములలో ననేకములు మహా రాష్ట్రభాషనుండియు, హిందీభాషనుండియు నాంధ్రీకరింప బడును. కనుక, నీచరిత్రములయందలి యుత్తమభాగములకయి యాయా భాషలలోని గ్రంథకర్తలను మెచ్చవలయునేగాని నన్ను శ్లాఘింప వలసినపని యెంతమాత్రమును లేదు.

ఇట్టి రత్నమాలలు మూడుగ్రుచ్చి జనులకు సమర్పింప వలయునని నే దలచితిని. అవియేవి యనిన:—

౧ అబలాసచ్చరిత్ర రత్నమాలయొక్క మొదటిభాగము:- ఇందు హిందూదేశమునందు బుట్టిన యైతిహాసిక స్త్రీలచరిత్రము లుండును. ఐతిహాసికకాల మనగా వేయిసంవత్సరములనుండి నేటివరకు జరిగినకాలము. ఈభాగమునందు పద్మావతి, సంయుక్త మొదలయిన ప్రాచీనస్త్రీలు మొదలుకొని, ఆనందీబాయి మొదలయిన యర్వాచీనస్త్రీలవరకు నయిన యుత్తమ స్త్రీల చరిత్రములు రాగలవు.

౨ రెండవభాగము— ఇందువైదిక పౌరాణిక బౌద్ధ స్త్రీలయొక్క చరిత్రములు రాగలవు. వైదిక స్త్రీలనగా వేదమందు వర్ణింపబడిన గార్గి, మైత్రేయి మొదలైనస్త్రీలు. పౌరాణిక స్త్రీలనగా పురాణాదులలో వర్ణింపబడిన పార్వతి, సీత, తార, దమయంతి, ద్రౌపది మొదలయినస్త్రీలు.

3 మూడవభాగము—ఇందు ఇంగ్లండు మొదలయిన పరదేశములలోని స్త్రీలచరిత్రము లుండగలవు.

కాలమానమునుబట్టి చూడగా రెండవభాగములోని వైదిక, పౌరాణిక స్త్రీలు మొదటిభాగమునందును, మొదటి భాగమునందలి యైతిహాసిక స్త్రీలు రెండవభాగమునందును రావలసి యుండును. కాని, ప్రస్తుతము రెండవభాగము వ్రాయుటకై

కావలయు సాధనములు నాయొద్ద లేనందుననను, ఆసాధనములు సమకూరువరకు నైతిహాసిక స్త్రీచరిత్రములను ఆపుట యోగ్య మని తోపనందుననను, వైదిక, పౌరాణిక స్త్రీలను రెండవభాగము నందు జేర్చెదను. ఇది యొక గొప్పదోషముగాదు గనుక చదు వరులు మన్నింతురుగాక!

మొదటిభాగమునందలి చరిత్రము లన్నియు నాయొద్ద నొకసారి గూడనందున జరిత్రములు కాలక్రమముగా వ్రాయు టకు వీలుగలదు. ఏయేచరిత్రము నా కెప్పుడెప్పుడు దొరు కునో యాయాచరిత్ర మప్పుడప్పుడు వ్రాయబడును. చరిత్రా ధ్యయనము మనముఖ్యోద్దేశముగాని, పరీక్షలకు జదువువారివలె కాలక్రమానుగతమైన చరిత్రములను జదువుట మన యుద్దేశము కానందున, నీ చిన్నదోషమునుగూడ చదువరులు మన్నిం తురుగాక!

మొదటిభాగమునందు రాగల రాణీ భవానిగారి యొక్కయు, రాణీసువర్ణమయిగారి యొక్కయు చరిత్రముల లోని కొన్నిభాగములు జనానాపత్రికయందు బ్రచురింపబడినవి. ఆ భాగములు గూడ నిందు జేర్పబడినవని యెరుగునది.

భండారు - అచ్చమాంబ

*

# శ్రీమతి భండారు అచ్చమాంబగారి జీవిత చరిత్ర*

పగలు కమలనభోమణి, కపాలిశిరోమణి రే, జగంబు నా
ర్తపమునంతయున్ వెలుగునట్లుగఁ జేయుదు రంతె కాని, యీ
జగతికి మాటుఁ జెందియు నజస్రము నప్రతిమాన తేజమున్
దనరఁ వెలిగింతురిట్టి వనితామణులే కద! దైవసృష్టిలోన్ !!

అప్రతీకాశ పాతివ్రత్యము, అసామాన్య వైదుష్యము, అనుపమాన స్వదేశ ప్రీతి, అనిర్వచనీయ స్వజాత్యభిమానము, అనూనదీనవత్సలత, నిర్నిద్రసత్కార్యాచరణము, నిరంతర సచ్చింత, అసమాన క్షమ మున్నగు గాంగల సుగుణగణంబు లొకటికి మించి యొకటి తనయందు వాసముచేయుచుండ, హిందూదేశమునకు నాయికామణియై విరాజిల్లిన యీ పరమపావనీమణిచరితం బనుకరణీయంబును, ఆహ్లాదదాయకంబును నై యొప్పుచున్నది.

మహారాజ్ఞులు, పతివ్రతాతిలకములు, మానవనారీమణులు, విదుషీరత్నములు, పరిశుద్ధ ప్రవర్తనలు, స్వదేశాభిమానమానినులు మొదలగు ననేక సతీరత్నముల సచ్చరిత్రములు బుధజనసంస్తవనీయంబులుగా విరచించి యించిన యీ విదుషీమణి చరితం బెంతటి మాహాత్మ్యసంభృతంబు గాకపోవును!

కృష్ణామండలములోని ముక్త్యాల సంస్థానమునకు క్రీ. శ. 1880 సం॥ ప్రాంతములవరకు దివాన్‌గిరీ చేసిన ఆర్వేలనియోగి వంశజులగు కొమఱ్ఱాజు వేంకటప్పయ్య పంతులుగారు శ్రీమతి అచ్చమాంబగారి జనకులు. ఈ మహనీయుడు కేవలాధికారైశ్వర్యముచేతనే కాక పరోపకార పరాయణత, క్షమ,

---

* శ్రీమతి సౌ. పులుగుర్తి లక్ష్మీనరసమాంబగారిచే ప్రకటింపబడు 'సావిత్రి' పత్రికనుండి స్వీకరింపబడినది.

గాంభీర్యము, బుద్ధికౌశలము, మున్నగు గుణగణములచే మిక్కిలి సత్కీర్తి గాంచెను. ఆధ్యాత్మికవిద్యాభిజ్ఞయు, సాధ్వీగుణభాసితయునగు గంగమాంబ యను విజ్ఞానవతి యీతని సహధర్మచారిణి. గుణనిధులగు నీ మిథునమునకు సముద్రునకు లక్ష్మీకళానిధులవలె క్రీ. శ. 1874 సం॥న నొక కుమారీమణియు, నాపిమ్మట నొక కుమారరత్నము నుదయించిరి. ఈ యిరువురిలో నగ్రజయె మన యచ్చమాంబగారు. అచ్చమాంబగారి జన్మస్థానము మాత్రము మన దేశాచారము ననుసరించి ఆమె తల్లి పుట్టినింటివారప్పుడు వాసము చేయుచున్న నందిగామ యయ్యెను. ఈ నందిగామ యను గ్రామము కృష్ణామండలము లోనిదే. ఈమె మాతామహుల నివాసస్థల మా తాలూకాలోని కంచెల యను గ్రామమైనప్పటికిని, నీమె మాతామహు లప్పు డచ్చటి జమీందారుల పనిమీద నచ్చట నుండుట తటస్థించినందున నీమె జననస్థల మది యయ్యెను.

మల్లెపువ్వు పుట్టుతోడనే వాసింప మొదలుపెట్టి నట్లు, మన యచ్చమాంబగారిలో కను బాల్యమునాటనుండియు మిక్కిలిగా శీలగుణంబు, అనుకరణశక్తి, దీనవత్సలత మున్నగాగల సుగుణగణంబులు బొడసూపుచుండెను. పెద్దవారు చేయుచుండెడు చాతుర్యములగు ననేక కార్యములను శ్రద్ధగా గ్రహించుచు, జాకచక్యముతో దానుగూడ నట్టి పెద్దపనుల జేయుట కీమె బాల్యమందే ప్రయత్నించుచుండెడిదట! చెలులతో నాడుకొనెడు వేళలందు గాని, యితర సమయములందుగాని, సాధారణముగా దన కెట్టి బాధ కలిగినను దాను లోలోన సహించుచునే యుండెడిదిగాని, పెద్దవారితో జెప్పి బేలవడి వాపోవుట యీమె యెరుగదు. ఇందుకొక చిన్న దృష్టాంతము జెప్పెదను. ఈమె యైదారు సంవత్సరముల పిల్లగానుండినప్పుడొక్కనాడీమెను బెద్ద తేలొకటి కుట్టెను. అనేకమంది పెద్దవారు సైతము వృశ్చికస్పర్శ తగలగానే యోర్వజాలక గుట్టువీడి రోదనముచేయుచు జుట్టుపట్టులవారిని బోగుచేతురు కదా; అట్టి తేలు నొవ్వబొడిచినను నాబాలికాశిరోమణి కిమ్మనక యా బాధ నంతను లోలోన నణచుకొనుచు వారు తమంతవచ్చి తెలిసికొనునంతకు నింటిలోని పెద్దవారికైనను దెలియనీకుండెను. మరియు నీమెకు జిన్నతనమున నాటపాటలు మున్నగువానికి దల్లిదండ్రాదు లిచ్చుచుండెడి సొమ్ము దన స్వంతమునకు గర్చుపెట్టక సదా దీనులకు బీదలకు నిచ్చుచుండెడిదట. ఇత్యాది

సుగుణపుంజము లీమెతో జిన్ననాటనుండియు వర్థిల్లుచున్నవి. గనుకనే తన జీవితకాలమందీమె యనేక విద్యలనంగారితేరి గర్భశోకాదులను సహించి దీనజనులను గన్నబిడ్డలట్లు గారవించుట మున్నగువానియందెంతయు ఘనతను బొందగల్గెను !

అచ్చమాంబగారి కారేండ్ల యీడువచ్చునప్పటికే అనగా క్రీ. శ. **1880** సం॥న పితృవియోగ దుఃఖము తటస్థించెను. వెంకటప్పయ్యగారు మృతులైన పిదప గంగమాంబగారు తన కుమారితెను, కొమారుని వెంటబెట్టుకొని యప్పుడు నైజాము రాజ్యములోని దేవరకొండయను గ్రామమున నుద్యోగము చేయుచున్న తన సవతికుమారుడగు శంకరరావుగారి యొద్దకేగెను. వీరచట నున్న కాలములో మధ్యపరగణాలలో నుద్యోగమందున్న గంగమాంబగారి అన్నగారగు భం. మాధవరావుగారికి ప్రథమ కళత్రవియోగము కలుగగా శంకరరావుగారు అచ్చమాంబగారిని మాధవరావుగారికిచ్చి వివాహము చేసిరి. అదిమొదలు తన యంత్యదశవరకును అచ్చమాంబగారు మధ్యపరగణాలలోనే యుండిరి.

ఇదిమొదలీమె జీవితకాలమందలి ప్రతినిముషము దోడి సోదరీలోకమునకు సన్మార్గబోధకముగా నొప్పుచున్నదని చెప్పవచ్చును. భగవంతుడీమెను లోకమునకు సన్మార్గదీపికగా నుద్దేశించి సృజించెననుటకు సందేహములేదు. "చిన్ననాడు మావాండ్రు నాకు జదువు చెప్పింపలేదమ్మా! నాకిక చదువెట్లు వచ్చు"నని తలంచుచున్న కొందరు వెర్రిసోదరీమణుల తలంపులు, 'కాలుజారి పడిన నాకీయూరచ్చిరాదను'కొనుటను బోలియుండునవి యని అచ్చమాంబగారు తన విద్యాభ్యాసముయొక్క యుదాహరణమువలన నిరూపించుచున్నది. అచ్చమాంబగారికి పదియేండ్ల యీడువచ్చి వివాహమై భర్తతో మధ్యపరగణాలకు బోవువరకును విద్యయనునదేమో తెలియదు. ఇదియే యీమె విద్యాభ్యాసమున కారంభసమయము. ఇప్పుడైనను బడికిబోయిగాని, పెద్దవారింటి యొద్ద జెప్పించుటచేగాని విద్య లభ్యసించుట కాదు. చివరకదెట్లు ఫలించిన నట్లు ఫలించునుగాని, మనవారు జ్ఞానసంపాదనమునకని కాకపోయిన నుదరపోషణార్థమని తలంచి యయిదేండ్ల యీడు వచ్చునప్పటికి మగపిల్లలకు మాత్రము శ్రద్ధగా విద్యాభ్యాసము చేయింప ప్రారంభించెదరు నాచార మిప్పటి

కన్నదిగదా! అచ్చమాంబగారి తమ్ముడగు లక్ష్మణరావుగారికి పెద్దలు శ్రద్ధగా విద్యాభ్యాసము చేయించుచుండిరి. తమ్ముడు చదువుకొనుచుండు సమయములందు అచ్చమాంబగారు తమ్మునియొద్ద కూర్చుండి యాసక్తితో దానుగూడ సహజాభిలాషతో విద్య నభ్యసింప మొదలుపెట్టెను. అప్పుడు తన తమ్ముడభ్యసించుచున్న తెలుగు, హిందీ, భాషలను దమ్మునితో సమానముగా నేర్చుచు, నంతకంతకు దమ్ముని చదువుపాఠముల నాతనికంటెముందు తానే వల్లించుచు, నిట్లుఖండమైన తెల్వితో గొంతకాల మారెండు విద్యల నభ్యసించెను. తదనంతరము లక్ష్మణరావుగా రింగ్లీషుభాషాభ్యాసమునకై నాగపురమునకు బోవలసినవారైరి. అంతట విద్యాభ్యాసమున తోడైన తనతోడు తననువీడి యితరస్థలమున కేగగానే తానొంటరియైనప్పటికి నీమె స్వయంకృషిచే విద్యాభ్యాసము చేయుచుండెను. మరియు నామప్పుడున్న మధ్యపరగణాల లోనిదైన మహారాష్ట్రభాషనుగూడ కృషిచేసి యభ్యసించుచు దానిలో గూడ దగుపాటి జ్ఞానము సంపాదించెను. అచ్చమాంబగారి సహజన్ముడై, స్త్రీవిద్యాభిమానియు, సుగుణశోభితుండునైన లక్ష్మణరావుగారు మాత్రము తమ స్కూలు సెలవులలో దన యక్కగారియొద్దనే యుండి తత్పరతతో నామెకు విద్యాభ్యాసమున సాహాయ్యము చేయుచుండెను. ఇట్లు సుగుణమండితుడగు తమ్ముని సాహాయ్యమున అచ్చమాంబగారు, తెలుగు, హిందీ, మహారాష్ట్రము, బంగాళీము, గూర్జరము అను నైదుభాషలయందును పాండిత్యము సంపాదించెను. సంస్కృతమునందును స్వల్పముగా నీమెకు బరిచయము కలదు. ఇందలి మొదటి మూడుభాషల యందు సమానమగు విశేష పాండిత్యమీమెకుండెను. గుణనిధియగు తమ్ముని సాహాయ్యమున నచ్చమాంబగారింతియ కాదింకయు ననేక ఘనకార్యము లాచరింపగల్గెను. మన హిందూదేశపు సోదరీమణులిట్టి సోదరవర్యు నూటికి బదుగురైనను గల్గినంతలో మనదేశము యథాస్థితికి రాదా? ఇంకేమి కావలయును? ఇచ్చువారికిని బుచ్చుకొనువారికిని దరుగని ధనంబగు నిట్టి విద్యాధనం బవ్యాజప్రేమతో దమ సోదరీతతి కొసంగు సోదరులే నిజమగు సోదరులు. కాని, యేడాదికి నాల్గుసారులింటికి దీసికొని వచ్చి నశ్వరధనంబులగు నాల్గుసారెలు నాల్గు చీరెలుమాత్రము పెట్టి కన్నులు తుడుచు సోదరులు సోదరులా? లోకములోని సోదరులు తమ సోదరీమణుల యెడల శ్రీమతి అచ్చమాంబగారి సహోదరు ననుకరింతురుగాక!

ఇట్లచ్చమాంబగారు పెద్దలయొక్క ప్రేరణగాని, పాఠశాలకు బోవుట గాని, తనకు సంభవింపకపోయినను స్వయంకృషిచే నిన్ని భాషలయందింతటి సామర్థ్యము సంపాదించుటయే కాక, అప్పటను పైబడిన సంసారభారము చక్కగ వహించుచు, ఊలుఅల్లికలు, దారపుఅల్లికలు, మొదలగు ననేకములగు నల్లికపనులయందును, కుట్టుపనులయందును, గృహిణీభూషణములగు గొప్ప గొప్ప వంటకములయందును గూడ నిరుపమాన నైపుణ్యము గడించెను. ఈమె యెప్పుడు దన యింటిపను లితరులచే జేయించుకొని యెరుగదు.

ఇట్లనేక విద్యలయందును, గృహకృత్యములయందును విశేష నైపుణ్యము గల్గి, తనకుగల సవతికూతుతో నీటితో బాలవలె గలిసి వివేకవతియయి కాపురము చేయుచుండ, నచ్చమాంబగారి కొక పుత్రుడును, బుత్రికయును గల్గిరి. ఇంతలో నీ వంశమునకు లోకదీపముగా దాను సృజించిన యీ సాధ్వీరత్నముయొక్క హృదయగాంభీర్యము లోకమునకు బ్రకటించుటకును, దదవకాశము నీమెచే ననేకములగు మేళ్లను జేయించుటకును దలచి, ఈమెకు దాను దయచేసిన పుత్ర, పుత్రికలను బరలోకగతులను జేసెను.

"ఖండితంబయ్యు భూజము వెండి మొలచు
క్షీణుడయ్యును నభివృద్ధి జెందు సోము
డివ్విధంబు విచారించి యెడలు తెగిన
జనములకు దాపమొందరు సాధుజనులు."

మరియు నాపదలయొక్క దాపిడి గలిగినప్పుడే గదా మహాజనుల ధైర్యగుణము ప్రజ్వరిల్లును. అచ్చమాంబగారు తన కిట్లు పుత్ర పుత్రికావియోగము వలన గల్గిన దుఃఖము నెట్లు సహ్యయించుకొనెనో కనుడు! పురుషశ్రేష్ఠులకు గూడ నసాధ్యమైన రచనాచాతుర్యముతో నొప్పునట్టియు, దనకుదానే సాటియగు నట్టియు, సోదరీలోకంబు కనుపమేయ ఫలదాయకం బగునట్టియు, వేయేల; యనిర్వచనీయ మహిమాఢ్యమగునట్టి "అబలా సచ్చరిత్ర రత్నమాల" యను నుదాత్త సద్గ్రంథరచనకు గారణ మచ్చమాంబగారికి బుత్ర పుత్రికా వియోగమే. అచ్చమాంబగారు పుత్రపుత్రికా వియోగదుఃఖమున నుండగా

ఈమె ప్రాణతుల్యుడగు సోదరుడు లక్ష్మణరావుగారు శోకనాశోక ప్రసంగ వశమున నాగోజీభట్టు కృతమగు "శబ్దేందుశేఖరః పుత్రో మంజూషా చైవ కన్యకా" అను శ్లోకమును జదివి, నాగోజీభట్టుగారు తనకు పుత్రపుత్రికావియోగము గలుగగా దన రచించిన "శబ్దేందుశేఖర" మను గ్రంథము తన పుత్రుడుగాను, "మంజూష" యను గ్రంథము తన పుత్రికగాను నుండునని మనస్సమాధానము చేసికొనినట్లు చెప్పగా, నాటనుండియు నచ్చమాంబగారు నాగోజీ భట్టుగారి వలెనే తానును మనస్సమాధానము పొందవలెనని కోరి "అబలా సచ్చరిత్ర రత్నమాల" రచనకు గడగిరట. తన "అబలాసచ్చరిత్ర రత్నమాల" ప్రథమభాగముయొక్క పీఠికను మొదట "ప్రపంచకమునందలి జనులకు బరమేశ్వరుడు సదా మేలే కలుగజేయుననియు, అట్లయినను నొకప్పు డతడు సేయు మేలు మనకు దుఃఖరూపముగా గాన్పించునెడల మనమా దయానిధిని నిష్కారుణుడని నిందించెదమనియు, అట్లు నిందించుట మిక్కిలి యజ్ఞానమనియు, తత్త్వము విచారించి యెడల నీకీడు మన మేలేయని తోచుననియు సుజ్ఞులు చెప్పెదరు. ప్రస్తుత మీ గ్రంథరచనకు గలిగిన కారణమువలన నీసంగతి నిజమని తేలుచున్నది." అని యీ విజ్ఞానవతి వ్రాసియున్నది. ఈ యబలా సచ్చరిత్ర రత్నమాలయొక్క మొదటిభాగము 1901 సం॥లో బూర్తిగా బ్రకటింపబడియెను. ఈ రత్నమాల ఐతిహాసికకాలములోని యుత్తమస్త్రీల చరిత్రములతో మొదటిభాగమును, వైదిక, పౌరాణిక, బౌద్ధ స్త్రీల చారిత్రములతో రెండవభాగమును, ఇంగ్లాండు మొదలగు పరదేశములలోని స్త్రీల చరిత్రలతో మూడవభాగమును, ఇట్లు మూడు భాగములుగా నచ్చమాంబగారు వ్రాయదలచిరి. మొదటి భాగము ముగియగనే రెండవభాగము వ్రాయ మొదలుపెట్టిరి. కాని, యే గ్రంథము వ్రాసినను బూర్తిగా సంగతులు గనుగొని వ్రాయవలయుననియు, వ్రాసిన సంగతులు విశ్వాసార్హములుగా నుండవలయుననియు నీమె యుద్దేశము. కావున, నీమెయే వేదవాక్యము నుదహరించినను, ఏ పురాణశ్లోకము నుదహరించినను, బ్రత్యక్షముగా నాయా వేదములయందు, నాయా పురాణములయందు జూడనిది వ్రాయుదికాదు. ఒక్కొక్క వేదవాక్యము సంపాదించుటకు కొన్నిమారు నెలలు పట్టుచుండెను: ఈమె 1903 సం॥న బుణ్యక్షేత్రాదుల సేవించుటకును, దన సఖుల దర్శించుటకును గృష్ణా, గోదావరీమండలములు మున్నగు తావులకు వెడలినప్పుడు, కాశీక్షేత్రములో

ప్రత్యేకముగా కొన్నినాళ్లు నిలచి, వేదకాలపుస్త్రీలను గురించి కొందరు శాస్త్రులతో ముచ్చటించి, కొన్ని సంగతులను దెలిసికొనెను. తానుదహరింప దలచుకొని మంత్రముల నిజానిజముల గనుగొనుటకు ఋగ్వేదసంహిత దొరక, కొంతకాలము వేచియుండి, తుదకెంతయు గర్చుపెట్టి హైదరాబాదు నుండి ఋక్సంహిత బదులు తెప్పించుకొనెను. అదియు గాక రెండు సంవత్సరములలో నీమె భర్తకు అనుతాపములకు మార్పు గలిగినందున నీమెకు సావకాశము దొరకకుండెను. ఇట్టి కారణములచే నీ భాగము నెమ్మదిగా వ్రాయ దటస్థించి మొదటిభాగమునకు దీనికి నాల్గేండ్లు వ్యవధియయ్యెను. ఇట్లు శ్రమపడి సోదరీలోకమున కమూల్యభూషణముగా నీ గ్రంథరాజమును సమర్పించుచుండ, నదియైనను బూర్తిగానీక యింతలో నీదేశముయొక్క దౌర్భాగ్యదేవత మృత్యుదేవతాకారమున, దనకు గన్నెరగా దేజరిల్లుచున్న యీ నారీమణిని మ్రింగివేసెను. 'అబలాసచ్చరిత్ర రత్నమాల' రెండవభాగము వైదికస్త్రీల చరిత్రములును, పౌరాణిక స్త్రీలలో ద్రౌపది, సీత ఈ రెండు చరిత్రలును మాత్రము ముగిసినవి. ఈ సతీరత్నము తానీలోకమునకు గొప్ప యాపదను సంఘటించి పరలోకమునకేగునప్పుడసంపూర్తిగా నుంచిపోయిన గ్రంథములు, ఇప్పుడు సావిత్రి [illegible] ప్రకటింపబడుచున్న "అబలాసచ్చరిత్ర రత్నమాల" రెండవభాగముగాక మరి రెండు గలవు. 1 క్రోషాఅల్లిక. 2 ఊలు అల్లిక, మొదటిది హిందూసుందరీపత్త్రికకొరకును, రెండవది సరస్వతీపత్త్రికకును వ్రాయబడుచుండెను. ఈ గ్రంథము లారంభించుటకు బూర్వమందు వ్రాసెనో పరమందు వ్రాసెనోగాని యీమె రచించినది వేరొక శతకంబుగూడ నున్నది. ఈమె గ్రంథరచనయందు బద్యరచన యిదియొక్కటియే కానబడుచున్నది. సోదరీమణుల యుపయోగార్థము ప్రకటింపబడుచుండెడి పత్త్రికలకీమె నీతిదాయకములు, నాహ్లాదకరములు నగు ననేకాంశములను వ్రాయుచుండెడిది.

ఈమెకుగల స్వజాత్యభిమానము చెప్పశక్యము కానిది. ఈమె తన జాతిపై నిష్కారణముగా ద్వేష్టలగువారు మోపెడినిందలను గూకటివేళ్ళతో బెల్లగించి, స్త్రీ జాతికిగల సహజ సద్గుణవితానమును సోదాహరణముగా బ్రతిపాదింప గంకణము గట్టుకొనెను. ఈ ప్రతిజ్ఞ 'అబలాసచ్చరిత్ర రత్నమాలా' రచనారూపముగా నెరవేర్చుకొనెను. అబలాసచ్చరిత్ర రత్నమాల రచించు

టకు దండకముల ముఖోద్దేశములను దద్గ్రంథముయొక్క యుపోద్ఘాతములో నీమె మూడుభాగములుగా విభజించి వ్రాసినది. వానిని సంగ్రహముగా నిట బేర్కొనియెద. 1. సామాన్యముగా స్త్రీలకు మందబుద్ధి, సహజభీరుత్వము మున్నగు నీచగుణముల నారోపించెడివారి యారోపణములు పక్షపాత జన్యములనియు, స్త్రీలు గాంభీర్యము, సూక్ష్మబుద్ధి మున్నగు సుగుణములను సహజముగా గలవారనియు నుదాహరణ పూర్వకముగా స్థాపించుట. 2. స్త్రీలు చదువుకొనుటవలన ననేకదుర్గుణములను బొందుదురని నెడివారి వాదము శశవిషాణన్యాయమును బోలుననియు, స్త్రీలు విద్యావతులైన యెడల ననేకములగు లాభములను బొందుదురనే యప్రతిహతమైన సత్యమనియు రూఢిపఱచుట. 3. తన సోదరీలోకమునకు సుబోధకమును సన్మార్గబోధకమును జ్ఞానదాయకమునుగా నేదేని యొక గ్రంథమును రచించి యొసగుట. ఇంత స్వజాత్యభిమాన మీమె హృదయమున బ్రవహించుచున్నది గనుకనే తానురచించిన గద్యమాలలో సదవకాశము చిక్కినప్పుడెల్ల దన స్వజాతిపై మోపబడిన నిందలను దన సహజయుక్తిని వదలి శూరరీతిని ఖండించుచు వచ్చెను. ఇట్టి స్వజాత్యభిమానినియు నింతలో దైవము గొనిపోవుటకే స్త్రీలోకమెంత మందభాగ్యము కలదో కదా !

రెండుపన్యాసములు, నొక యెల్లమ్మకథ, యొక పుల్లమ్మకథ చదువుపాటివారైనంత నే పెద్దవారందరు నేమియు తెలియని మూర్ఖశిఖామణులనియు నితరులందరు చదువుపాటివారు కారనియు విశ్వసించు నిప్పటి కొందరివలెగాక యీ సాధ్వి తల్లిగారు మొదలైన పెద్దలకును బోటివారలకును నెప్పుడు ననుకూలించుచుండెడిది. వీరికుటుంబము పూర్వనియమముల [illegible]మత మందత్యంతాభిమానము కలది. అచ్చమాంబగారు తీరికసమయములందు బూజనీయములగు భారత, భాగవత, రామాయణాది గ్రంథములును, విజ్ఞానప్రదంబులగు తత్సంబంధములగు గ్రంథములును శ్రద్ధగా జదివి తల్లి మొదలైన పెద్దలకు జెప్పుచుండెడిది. అచ్చమాంబగారు తన ప్రాణమునకంటె నధికముగా జూచుకొనుచున్న తన సవతికూతురు దైవవశమున భర్తను గోలుపోగా నామెకు దత్పరతతో బావన బ్రహ్మచర్యమును బోధించి జ్ఞానాభివృద్ధియు విద్యాభివృద్ధియు జక్కగ గలుగజేసినది. ఈమె 1903 సం॥ కుటుంబ సహితముగ

దేశాటనము చేసినపుడాయూతావుల యందలి సోదరీమణులకు నైకమత్యము, సత్కాలక్షేపము చేబోడిసోదరీతతిని బాగుచేసి తాము బాగుపడెడి విధానము మున్నగు ధర్మములను బోధించుచు వచ్చినది.

ఎట్టివిపరీతపు స్వభావము కలవారినైనను తన సౌజన్యముచే దనకనుకూలముగా ద్రిప్పుకొను చాతుర్యమీయామెకు నొక్కటి సాధ్యమైయుండెను. ఇందుకు గొప్పయుదాహరణ నీయామె భర్తయే. ఆయన తొలుత మిక్కిలి కోపమును, స్త్రీలను గారాగృహమువంటి ఘోషాలోనుంచినగాని పాతివ్రత్య రక్షణము జరుగనేరదను నూహను గలిగియుండెడివారు. ఆయన యిచ్ఛ ననుసరించి యీ సాధ్వి మొట్టమొదట కారాగృహమువంటి ఘోషాననుభవించి, తన సౌజన్యమువలనను, అనుపమేయ ప్రవర్తన చాతుర్యమువలనను బతిని శాంతస్వభావునిజేసి స్త్రీలకు విద్యయును, నుచిత స్వాతంత్ర్యమును సామాజోద్ధారణకు మూలాధారములని యాయనకు దోచునట్లు చేసెను.

ఈమె పాతివ్రత్యానుష్ఠానము వర్ణనాతీతము. ఈమె జగత్ప్రఖ్యాతముగా రచించిన 'అబలా సచ్చరిత్ర రత్నమాల' యందలి పతివ్రతాశిరోమణులగు వీరమతి, మీరాబాయి, కొమర్రాజు జోగమాంబ మున్నగువారి చరిత్రములు వ్రాయుచో వారి యుత్కృష్ట పాతివ్రత్యభావములు వర్ణించునప్పుడీమె యుత్సాహము మూర్తీభవించి ఆయాస్థలములయందు తాండవకేళి సల్పుచున్నట్లుండును. ఒక్క కాగితమైనను సరిగానిండని కొమర్రాజు జోగమాంబగారి చరిత్ర యొక్క పాతివ్రత్య విషయముకొరకే తన రత్నమాలయందు జేర్చ యీ సతి దన పాతివ్రత్యాభిమానము నగుపరచినది. ఈమెయు 'అబలా సచ్చరిత్ర రత్నమాల' గన్నవారికి దానియందలి యంకితమే యామెసతీత్వవిశేషముల జెప్పకయే చెప్పుచుండును. ఈసతి సద్గుణసమితియందలి మాకుగల యభిమానముచే వానినిచట మరల బ్రచురించుచున్నాము. "ఎవరి పరిపూర్ణ కటాక్షంబుచే నాకీ గ్రంథము వ్రాయునంతటి శక్తియు, స్వాతంత్ర్యంబును గలిగెనో, నా శరీరము నందలి చర్మంబుచే బాదరక్షల నిర్మించి జన్మజన్మంబులందు బాదంబులకు దొడిగినను నెవరిఋణంబుదీరి నేను ఋణవిముక్తురాలనగుట యసంభవమో, యెవరు నాకు దేవాధిదేవునికంటె నధికతముడైన దేవుండో, యట్టి నా ప్రియభర్తయగు మ॥ రా॥ శ్రీ॥ భండారు మాధవరావుగారి దివ్యపాద పద్మములకు నీ గ్రంథము

సంపర్కించి యింతకంటెం బోధన్నమయున్నదానను." అని పాలిత సతీ ధర్మమైన యీ భర్తృ భక్త్యాదరసముతో నిట్లు వ్రాసియున్నది. ఈ విషయములలో నీ సాధ్వి వ్రాసిన వ్రాతకాక, ప్రత్యక్షోపదేశములుగూడ నా పుణ్యవశమున నాకు లభించెను. ఈమె భర్తృ పుత్రికాసహితమై మా గృహంబున నొక సంవత్సరము కొన్ని దినంబులుండి యనుభవ్యము గావించినది. ఈసతి మా ఇంట నున్న సుదినములలో నొకదినంబున మధ్యాహ్నమందరము భోజనములు చేసి వాకిట గూర్చుంటిమి. ఆనాడెప్పటి యట్లు నేనీ సఖీమణియొద్ద గూర్చుండి తాంబూలము వైకొనగోరుచు వక్కలాకు చేతనిడి యామెకు మడిచి యిచ్చు చుంటిని. ఇల్లు నేనిచ్చు వక్కలును, ఆకుమడుపులుగూడ వైకొని చేయి నింపుచుండెనే కాని యప్పటివారందరు తాంబూలములను వైకొనుట పూర్తి యైనను తానుమాత్రము వట్టియుండెను. అదికని తాంబూలము వైకొనుడని నేనొకటి రెండుసార్లు అడిగితిని కాని, అట్లు వైకొందునని నాకు నెప్పుడిగా నుత్తరువు చెప్పక నేను మరియొకసారి యడిగినపుడు చిన్నగ నవ్వుచు వైకొనుచు నూరకుండెను. అప్పటి మా యిరువురి స్థితిని చూచుచు మాయొద్ద గూర్చున్న మీనాక్షమ్మగారు (అచ్చమాంబగారి సవతితల్లి), మేము గూర్చున్న వాకిలి తలుపించుకదీసి మా వారు కూర్చుండి మాటలాడుచున్న వాకిలివంక జూపినప్పి మా తండ్రిగారికియు తాంబూలము వేసికొనలేదు. వారు వేసి కొనినగాని యామె వేసికొనదని చెప్పెను. అందుకు ముందే మగవారు తమ భోజనములు కాగానే తాంబూలపు పళ్లెము వైకొనిన వారైనప్పటికిని అచ్చ మాంబగారి భర్తగారు నాడు జరుగుచున్న ప్రసంగావసరములో తాంబూ లమును స్వీకరింపక కాలాలస్యముచేసిరి. పతిభక్తి తత్పరురాలగు నా సాధ్వీమతల్లి యీ సంగతి గ్రహించుటచే నట్లొనరించెను. సర్వకాల సర్వావస్థలయందును దేవాధిదేవునిగా నిట్టిసతి పతిని సేవించుట నేను కొన్నినాళ్లవరకు కన్నులార గాంచుచు పూర్వ సతీమతల్లులగు సీతాసావిత్ర్యాదుల గాంచుచున్నట్లానంద నీరధి నోలలాడితిని. ఈ యుత్తమ సతివలన పతివ్రతాధర్మము లిట్లు నియతిగా పాలింపబడినవి. పరపురుషులున్న తావునుండి దూరముగా తొలగిపోవుటయే కాని, తనకేదియైన నవసరమున్నను నటునించుక సేపైనను నీసతి నిలుచునదికాదు. తగినంతపని వచ్చినయెడల తలవంచుకొని సోదరులతో భాషించునట్లు సంగ్రహముగా భాషించి వెడలిపోవుచుండెడిది. ఆహా! యిట్టి నారీరత్నములే

కదా ఆర్యస్త్రీ సంతతిలోని వారమను గౌరవాభిమానమును మన స్త్రీలోకమునకు నిల్పువారు!

ఈమెయందు స్వదేశప్రీతి మెండుగా వాసముచేయుచుండెను. ఈ గుణమింత జాజ్వల్యముగా బహు కొలది పురుషులలో నుండును. స్వదేశ వేష భాషలను మాని పరదేశ వేషభాషల నాదరించువారికి నారీమణికి హృదయ శల్యములవలె దోచుచుండును. చదువుకొని కొలది స్వదేశాభిమాన మధికమగుచుండవలెనని యీమె తన చెలులకు శ్రద్ధతో బోధించుచుండెడిది. ఈమయు తన "అబలా సచ్చరిత్ర రత్నమాల"లో నొక విదుషీచారిత్రమును వ్రాయుచు నా చరిత్ర నాయికయొక్క స్వదేశప్రీతి నిట్లు కొనియాడియున్నది. "కొందరు పురుషులుగాని, స్త్రీలుగాని తమ దేశమును వదలి పరదేశమున కేగిన పిదప దమ దేశాచారముల విడిచి యా దేశాచారములనే స్వీకరింతురు. కాని, మా చరిత్రనాయిక యట్లుగాక సాహెబులలోకమున కరిగియు దన దేశాచారములను మరువక యా దేశపువారికిని వానిని నేర్పెను! ఆమె తన స్నేహితురాండ్రకును, కార్పెంటరు నింటివారికిని మహారాష్ట్ర స్త్రీలవలె జడలు వేసి చీరలు కట్టింపుచుండెను! తాను న్యూజరసీ పట్టణమున కేగుటకు ముందు తన స్నేహితురాండ్ర కందరకును మహారాష్ట్ర పద్ధతి ననుసరించి విందు చేసెను. ఆ దినమామె తానే తన దేశపు పక్వాన్నములు వండి భోజనములకు గూర్చుండుటకు పీటలు వేసి, తినుటకు విస్తరులును దొప్పలును గుట్టి మహారాష్ట్ర దేశాచార ప్రకారము సకల పదార్థములును వడ్డించి విందారగింప వచ్చిన యువతులకు మహారాష్ట్ర స్త్రీలవలె జీరలు, గాజులు, గుంకుమ మొదలైన వలంకరించి చేతితో భోజనముచేయు విధమంతయు వారికి దెల్పి తానును వారితో గూర్చుండి భోజనము చేసెను."

చూచితిరా యీమె స్వదేశాభిమానము! ఈ స్వదేశభక్తిపరాయణ యొకచో శ్రీమతి కొటికలపూడి సీతమ్మగారి 'లేడీ జేన్ గ్రే' యను గ్రంథమును గూర్చి "ఈ కవయిత్రి హిందూదేశము నందలి నారీరత్నములలో నొక స్త్రీని గావ్యనాయికగా దీసికొని, కావ్యము రచించిన యెడల నది హిందువులకు విశేష ప్రియమగునని నా యభిప్రాయము" అని వ్రాసియున్నది. ఈమె స్వదేశములో జేసిన వస్తువులనే గాని, సాధ్యమైనంతవరకు బరదేశములో జేసిన

వస్తువులను వాడుకొనఁగూడదని యిటీవల వ్రతముధరించెను. ఈ వ్రతము నీమె దినదినము నిష్ఠముగాఁ బాలించుచుండెను. తన కట్టకడపటి వ్యాధిలో గాళ్లకు ఉన్ని మేజోళ్లను దొడగ వలసినదని డాక్టర్లుచెప్పఁగా, బజారునుండి మేజోళ్లు తెప్పించిరి. అంతవ్యాధిలోగూడ నామె నాఁటిమతి యా మేజోళ్లమీఁది గుర్తులు చూచి "ఛీ యివి స్వదేశములో జేసినవి కావు" అని వానిని బారవైచి, స్వదేశములో జేసినవాని నప్పుడు తెప్పించి తొడుగుకొనెను. ఆహా! ఏమి యీ స్వదేశాభిమానము! ఇట్టి స్వదేశాభిమాన మా నీయమను గోల్పోయిన మన దేశముయొక్క దౌర్భాగ్య మింతయని చెప్పఁదరమైనదా!

బీదల దుఃఖమును జూచి యంత తానును దుఃఖపడుట యీమె నైసర్గిక గుణము. సాధ్యమైనంతవరకు తన ధనము బీదలకుపయోగపరముగా నీమెను వెచ్చతో బెట్టిన గుణముగా జనులకింతకు మున్నె యెఱుఁగుదురు. అయినను సర్వజనానుకరణీయమైన యీమెగల యీ గుణముయొక్క ప్రచారము నిచట మఱి కొంచెము వివరించెదను; తఱచుగా నామె పర్వదినములు రాత్రులును, పప్పును వండించి గ్రామములోని బీదలకు, అనాథలకు దన యెదుట భోజనము పెట్టించి వాండ్లు తిని సంతసించుట జూచి తాను సంతసించుచుండెడిది. తనకు కుమారుడు పుట్టి పురుడిసరవిధములగు నుత్సవములు మొదలైనవానికై ధనము వ్యయము చేయక, యది కఱవు కాల మైనందున నా ధనమంతయు నసంఖ్యాకులగు బీదలకు, అనాథులకు కొన్ని దినములవఱకు అన్నము పెట్టించుటకుగాను వ్యయపరచెను. తన్నాశ్రయించుకొని యున్న బీదవాండ్ల కన్యకలను దాను స్వయముగా సంబంధములు విచారించి తన ధనమును బెట్టి ధర్మ వివాహములు చేయుచు నా వియ్యాలవారు పెట్టెడి బాధలన్నిటికి దానదలయొగ్గి యనుభవించు చుండెడిది. ఈమె కడుపునఁబుట్టిన సంతానము లేకపోయినను, యీమె యింట నెల్లప్పుడైనఁ గొందఱు పిల్లవాండ్రకు విద్యాదానము దొరుకుచుండెడిది. ఈ పిల్లల నందఱి నెల్లవిధముల గడుపున బుట్టినవారి వలెనే చూచుచుండును. తెలియనివారా పిల్లలందఱు నామె సంతాన మనియే భావించుచుండిరి. అట్టి పిల్లలలో గొందఱామె బంధువులును, మఱికొందఱు పరాయివారును గానున్నను, వారిని, వీరిని నొక్క కంటగాంచి యాదరించుచుండెడిది. వారి కన్ని యంగీలో వీరి కన్ని యంగీలు,

వారి కెన్ని టోపీలో, వీరి కన్ని టోపీలు! "అయం నిజః పరోవేతి గణనా లఘు చేతసాం । ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకం ॥" అనిన మాట యీమె యెడలనే సార్థకమైనది. ఒకసారి యొక యూరినుండి మరి యొక యూరి కీమె భర్తగారికి బదిలియై పోవుచు, మార్గస్థుల కొరకు కేర్పడిన యొక సత్రములో విడిసిరి. ఆ సత్రమును గనిపెట్టుకొని యుండు కూలి వాని గుడిసె యచ్చటకు కొంత దూరమున నుండెను. అచ్చట నెవతియో యొకదె దుఃఖపడుచున్నటుల శబ్దము విని, యచ్చమాంబగారా గుడిసెకు స్వయముగా వెళ్లి, వాండ్ల కష్టములను విచారించి యా స్త్రీకి నీళ్లాట ప్రొద్దులైనందున ఖర్చునకు కొంత సొమ్మిచ్చి వారి నోదార్చెను. అదియునుగాక యాకూలివాని జీతము హెచ్చుచేయుటకై తగనెనిమిటి ద్వారా యత్నముచేసి, వానిజీతముకొంత హెచ్చునటుల జేసెను. ఇటీవల కొంతకాలమునుండి బిలాస్‌పూరులో ప్లేగు ఉన్నందున నూరుపట గుడారములు వేసికొని కాపురము చేయుచుండిరి. డిశంబరు నెలలో వీరు కాంగ్రెస్ నిమిత్తమై బొంబాయివెళ్లుటకు సిద్ధముచేసికొని బయలుదేరబోగా, నొక సేవకునిభార్య నిండుప్రొద్దులదియైనందున నొప్పులు పడజొచ్చెను. అపుడు ప్రయాణమాపి యచ్చమాంబగారు దానికి స్వయముగా మంత్రిసానితనముచేసి పురుడు పోసెను. పిల్లకు బొడ్డుకోసి నీళ్లుపోయించి యప్పుడు ఉన్ని అంగీలు అల్లి, తొడిగించి తల్లికి గావలసిన మందులు వగైరాలు సిద్ధముచేసి, పదిరోజులకు సరిపడు సామానులు వాండ్ల కమర్చి, రెండవరోజున బయలుదేరి బొంబాయి వెళ్లిరి. బొంబాయినుండి తిరిగి వచ్చిన తరువాత నీ గుడారములోనే యచ్చమాంబగారు కీర్తిశేషులైరి. 1898 వ, సంవత్సరము కరువులో నీమెభర్తగారు క్షామశాల (ఫ్యామిన్‌క్యాంపు) పై నధికారిగా నుండిరి. అక్కడ నొకానొక తల్లిదండ్రులు నిర్దయులై రెండు నెలల తనకుమారుని విడిచివెళ్లిరి. ఆపిల్లవానిని పెంచువారెవరును లేనందున మిషనరీల కిచ్చివేయవలయునని యధికారులు నిర్ణయింపగా, దీనావనపరయగు అచ్చమాంబగారా సమాచారమువిని యాపిల్లవానిని దా పెంచెదననియు పరధర్మకుల కియ్యనక్కరలేదనియు నధికారులకు దెలిపి, యాపిల్లని దెచ్చి నెంతయు వాత్సల్యముతో బెంచుచుండెను. ఆ కరవులోనే యింకనొక 10 యేండ్ల పిల్లవాడు వాని యనాథయగు తల్లియు చెల్లెలు నుత్తరదేశమునుండివచ్చి బిచ్చమెత్తుకొనుచు జీవించుచుండిరి. దీన

బాంధవియగు లచ్చమాంబగారు ఆ పిల్లవాని తెల్విఁగాంచి వానిని బిచ్చమెత్తు కొనవలదని చెప్పి, యింటనుంచుకొని యన్ని వ్యయప్రయాసములకోర్చి విద్య నేర్పెను. వాని తల్లి కొక యావును గొనియిచ్చి దీని పాలమ్ముకొని జీవనము చేయుమని త్రోవచూపెను. ఆహా! ఏమి యీ దీనదయాళుత్వము! దీన జనులకును, అనాధులకును దల్లి పోయినదే! 1904 డిశంబరు నెలలో బొంబాయికి వెళ్ళి యచ్చటి ఎగ్జిబిషన్, మహిళాపరిషదము, మున్నగునవన్నియు వీక్షించి, 1 వ జనవరి నటనుండి బయలుదేరి బిలాస్పురము వచ్చి యీ నెల 8 వ తేదీ మొదలు 18 వ తేదీ వరకు నఖండమైన జ్వరముచే బీడింపబడి, యీ యద్వితీయ సాధ్వీమణి 18 తేదీ పగలు 11 గంటలకు బుద్బుదప్రాయమైన ప్రకృతి దేహమును జాలించి, శాశ్వత కీర్తికాయమును బొందినది. ఈ సతి యీ లోకమును విడచునప్పుడు, నీవు చదివిన వేదాంతము నుపయోగపరచుకొని దుఃఖము నడచి వేయుము అని తల్లిగారికిని, దగుగీతి నితరులకును బోధించి, తన ప్రాణ సమానుడగు సోదరుని బిలిచి తానుపెంచుచున్న పసివాడగు దీనబాలునికి విద్యాబుద్ధులు చెప్పించుటకు శ్రద్ధవహింపుమని చెప్పెను. ఈమె వియోగ దుఃఖమగ్నులగు నీమె భర్త, తల్లి, సోదరుడు మున్నగువారి కందరకు నీమె మృతజీవయును విషయ మనుక్షణము జ్ఞప్తికి దెచ్చుచు దుఃఖోపశమనము మనశ్శాంతియు భగవంతుడు కటాక్షించుగాక!

ఉ. హా! వరవర్ణినీప్రముఖ! హా విదుషీమణి!! హా! సుపూజ్య!! హా!
పావని!!! జీవయాత్రగడుపంగల పద్ధతి నీ స్వజాతికిన్
గైవశమాచరించుపనికై ధరియించినయట్టి కాయమున్
బోవిడి కీర్తికాయమును బొందితె! నీ పనిదీరనే కటా!!!

తే. సాధ్వి! యార్యోక్తులను శిరసావహించు
నీగుణాతిశయత "సుకృతీగతాయు"
వనెడు నార్యోక్తిసార్థకంబును నొనర్చి
ధరఁబ్రదర్శింప నిట్టుల దలచితమ్మ!

సీ. నీదుపాతివ్రత్య నిష్ఠాఫలంబు నీ సద్దైవతారాధనాఫలంబు
అతివ ! నీపుణ్యతీర్థాటనాఫలము నీ యఖిలసద్ధర్మక్రియాఫలంబు
కతన దివ్యము సతీకాంక్షితంబునునైన పుణ్యాంగనామృతి బొందఁగల్గి
శ్రీమన్మహాశాంకరీ సన్నిధానంబు గాంచిన ధన్యవీవంచునిన్ను

గూర్చి యీరీతి విలపింప గూడదంచు
పెద్దలెన్నెన్ని భంగుల బుద్ధి తెల్ప
యనునయించిన నీవియోగార్ణవంబు
నీద శక్యంబె? మాబోంట్లకేది తెరవు !!!

మ. తతచేలాంచలమున్ శరీరలతనంతన్ గప్పికొంచున్ బ్రస
న్నతచే గుంకుమబొట్టుచే దనరి యున్నన్ బూజ్యపురంధ్రాంగనా
ప్రతతిన్ జ్ఞప్తికిదెచ్చు నెమ్మొగము నొప్పన్ సుంతపైకెత్తి నీ
వతివాత్సల్యముతోడ నమ్మ ! గనుచున్నట్టే సదా తోఁచెడిన్
మృతజీవావళిజేరితే యకట !! మమ్మీయాపదన్ ద్రోచితే !

మ. అకటా !!! దైవమ ! నీవు నేఁగతిని జేయాడెన్ సతీలోకనా
యిక రత్నంబును ద్రుంచివేయ నకటా ! నిన్నేమందు మాదేశపున్
సుకృతంబాగతినుండె ! దేవ ! కరుణాస్తోకా ! యజస్రంబు న
వ్యకలంకాత్మకు నాత్మసౌఖ్యమిడవే యధ్యాత్మతేజోనిధీ !

"అరక్షితా గృహే రుద్ధాః పురుషై రాప్తకారిభిః
ఆత్మాన మాత్మనా యాస్తు రక్షేయుస్తా స్సురక్షితాః

"ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధింపబడు స్త్రీలు రక్షితు రాండ్రు కారు; ఏ స్త్రీలు, తమ యాత్మను తామే కాపాడుకొందురో, వారే సురక్షితురాండ్రు."

# విషయానుక్రమణిక

★


| | | | |
|---|---|---|---|
| వీరమతి | 1 | లీలావతి | 192 |
| శికందరుబేగము | 29 | తారాబాయి | 195 |
| రాణీదుర్గావతి | 42 | పద్మావతి | 202 |
| తోరూదత్తు | 50 | కృష్ణాకుమారి | 214 |
| విద్యాసాగరజనని భగవతీదేవి | 65 | నాచి | 220 |
| ఖనా | 76 | సరసవాణి | 223 |
| రాణిసంయుక్త | 84 | చాందబీబీ | 234 |
| పద్మిని | 95 | గణపాంబ | 243 |
| మొల్ల | 103 | జిజాబాయి | 245 |
| పన్నా | 106 | రూపమంజరి | 246 |
| ఖడ్గతిక్కనభార్య | 112 | సులీబాపండిత | 248 |
| తరిగొండ వెంగమాంబ | 115 | మారుల | 250 |
| మీరాబాయి | 122 | విజ్జిక | 251 |
| రుద్రమదేవి | 129 | సుభద్ర | 252 |
| డాక్టర్ ఆనందీబాయిజోశి | 133 | హాటీవిద్యాలంకార్ | 253 |
| రాణిఝాశీలక్ష్మీబాయి | 161 | కర్ణాటి | 254 |
| విమలదేవి | 189 | మదిన సుభద్రమ్మ | 256 |

# వీరమతి

★

స్త్రియస్తథా పాఠనీయా యథా తాః కార్యవస్తుని
పుంవత్ ప్రవృత్తిమాధాయ సాధయేయు రనాకులాః,*

సంసారరూపమయిన రథమునకు స్త్రీపురుషులు రెండు చక్రములని యందరికిని దెలిసిన విషయమే. ఈ రెండు చక్రములు సమానముగా నుండినగాని, సంసారరథము తిన్నగా నడవదు. రెండుచక్రములలో నెంతెంత భేదముండునో, యంతంత కష్టముగా రథము నడచును. పురుషుడు జ్ఞానవంతుడును, స్త్రీ యజ్ఞానాంధకారమగ్నయు నైనయెడల గుటుంబములో గొంత మాత్రమైనను సౌఖ్యముండ నేరదని మనలోని యనేకోదాహరణముల వలన స్పష్టమగుచున్నది. భార్యాభర్తృరూపమయిన రెండు గిత్తలు విద్యాబుద్ధులయందు సమానముగానుండిన పక్షమున సంసారశకటము బహుసులభముగా నడచు ననియు, నడుమ నెన్ని సంకటములు వచ్చినను ఆగక, చక్రద్వయ సహాయముచే సులభముగా గదలు ననియు, తుద కానందముగా నీప్సితస్థలమునకు రథము చేరుననియు జూపుటకు వీరమతి చరిత్ర మత్యంతోపయోగకరమైనది. కాన చదువరులు దీనిని విశేషశ్రద్ధతో జదువవలయును.

శాలివాహన శకాబ్దమందలి రెండవ శతాబ్దముననో, లేక మూడవ శతాబ్దముననో గుజరాతు దేశమున చావడా వంశస్థు

---

* "పురుషులవలె ధైర్యము నవలంబించి, భీతిజెందక సర్వకార్యములను నిర్వహించునటుల స్త్రీలకు విద్య నేర్పవలయును."

డగు బిరజుడనురాజు, టుకటోడా యను గ్రామమును రాజధానిగా నేర్పరచుకొని ప్రజాపాలనము జేయుచుండెను. ఇతని తండ్రి బ్రతికియున్నను, అతడతివృద్ధుడయియుండుటవలన, బిరజుడే ప్రజాపరిపాలనము చేయుచుండెను. వృద్ధరాజుకు బిరజుడుగాక వేరుసంతానముండెను. వారందరిలో గడగొట్టు కూతురి పేరు వీరమతి. ఈమె యందరికంటె జిన్నదయియుండుటను గడు గారాబముగా బెరుగుచుండెను. చిన్ననాటినుండియు రాజపుత్రులతో గలసి మెలసి యుండుటవలన నామె రాజపుత్రులు నేర్చుకొను విద్యలన్నియు నేర్చుకొనెను. కావ్య వ్యాకరణాదుల యందు నామె కృషి చేసినదో లేదో తెలియనుగాని, చక్కగ వ్రాయుట, చదువుట, లెక్కలు మొదలైనవానిలో నామె ప్రవీణత సంపాదించినదని చరిత్రము వలన దెలియవచ్చుచున్నది. ఇదియును గాక అశ్వారోహణము, గజారోహణము, సాముచేయుట, గద ద్రిప్పుట, యుద్ధములో వింటనంబుపయోగించుట మొదలైన రాజపుత్రుల కత్యంతావశ్యకమైన ధనుర్విద్యలును ఆమె నేర్చుకొనెను! ఇట్లు యుక్తవయస్సు వచ్చు వరకు వీరమతి స్త్రీలకు స్వాభావికములగు సౌందర్య గాంభీర్య వినయాది సుగుణములను విడువకయే 'పుంవత్ప్రగల్భ' యయ్యెను.

వీరమతి దినదినప్రవర్ధమానయై పదునారు సంవత్సరంబులది కాగానే, యామె వివాహయోగ్యయైనదని తలచి అప్పుడు గల యత్యంత శ్లాఘనీయమయిన స్వయంవరపద్ధతి ననుసరించి యామె వివాహము చేయ నిశ్చయించి, ఆమె యన్నగారగు బిరజమహారాజు దేశ దేశములకు విప్రుల నంపి, అచ్చట

చ్చటి రాజపుత్రుల లక్షణము లరసి వారిపటములను తెండని చెప్పెను. విప్రు లాప్రకారమే దేశదేశములకు వెళ్లి యనేక రాజపుత్రుల స్వరూపపటములను దెచ్చి వీరమతికిజూపి, యా యా రాజపుత్రుల స్వభావగుణములను నోటితో వర్ణనచేసిరి. వారిలో, ధారానగరములో రాజ్యము చేయుచున్న ఉదయాదిత్య మహారాజుగారి కుమారుడగు జగదేవు డను రాజపుత్రుని సద్గుణములను వినియు, నతని సుందరరూపమును జూచియు దానాతని దప్ప మరియొకరిని వరింపనని వీరమతి నిశ్చయించుకొనెను! ఈ సంగతి యామె యన్నగారికి దెలుపగా నతడు 'నాచెల్లెలగు వీరమతిని మీ కుమారుడగు జగదేవున కిచ్చెద' నని ఉదయాదిత్యునకు శుభలేఖ పంపెను.

ఉదయాదిత్యుడు సూర్యవంశపురాజు; విక్రమాదిత్యుని వంశములోని ౮౮ వ పురుషుడు. ఈయన మాలవదేశములోని ధారానగరమును తన రాజధానిగా జేసికొని యనేక సామంతులకు జక్రవర్తిగానుండెను. చావడావంశస్థుడగు బిరజ రాజతనికి సామంతుడుగానే యుండెను. ఉదయాదిత్యు డత్యంత శౌర్యవంతుడని ప్రఖ్యాతిని జెందినవాడు. ఇతని భార్యలిద్దరుండిరి. ఈ రాణీల నామములు తెలియకపోయినను పెద్దభార్య వాఘేలీవంశములోని దనియును, రెండవభార్య సోళంకవంశములోని దనియును దెలియుచున్నది. వాఘేలీ రాణికి రణధవలు డనియు, సోళంకీరాణికి జగదేవుడనియు బుత్రులుగలిగిరి.

వాఘేలీ, సోళంకీ రాణులు సవతులయినందున నొండొరులొండొరులపయి నత్యంత మత్సరముతో బ్రవర్తించుచుండిరి.

బహు పత్నీత్వదోష మీ దేశమునందు బహుకాలమునుండి, శిష్టాచారముగా నడుచుచున్నందున, ననేక కుటుంబముల గృహ సౌఖ్యము నాశన మగుచున్నదని సకల జనులకు దెలిసినవిష యమే. ఒక స్త్రీని వివాహమాడి, యామె తన సహధర్మచారిణి యనియు, అర్ధాంగియనియు, 'నాతిచరామి' యని వివాహము నందు నామెకు వచన మిచ్చితిననియు మరచి, రెండవ భార్యను వివాహమాడి, మొదటి భార్యయందలి ప్రేమను విభజించుట గొప్ప అన్యాయమని చెప్పవలెనా? ఏక పతి వ్రతమును, ఏకపత్నీవ్రతమును, ఉత్తమ నాగరికతా ద్యోత కములని పెద్దలు చెప్పెదరు. మనసమాజములో స్త్రీలయెడ జరగెడి అన్యాయంబులలో బహుపత్నీకత్వ మొక గొప్ప యన్యాయము. 'సవతిపోరు స్వర్గమునందయిన నక్కర లేద'న్న సామెతవలననే యీ బహుపత్నీత్వమువలన సమాజమునందు గలిగెడి కల్లోలములు వ్యక్తము కాగలవు. కావున కుటుంబ దుఃఖమునకు గారణమయిన యీ బహుపత్నీకత్వమును మాన్పి, యనాదికాలము నుండి యీ దేశమున నడుచుచున్న యేకపతివ్రతమువలెనే యేకపత్నీ వ్రతమును దేశాభిమానులు స్థాపించెదరని నమ్ముచున్నాను.

ఉదయాదిత్యమహారాజు వాఘేలిరాణియందు బద్ధా నురాగుడయి, సోళంకిరాణిని దాసివలె జూచుచుండెను. కొంత కాలమునకు సవతిమత్సర మధికమయి వాఘేలిరాణి సోళంకి రాణిని ఇల్లు వెడలగొట్టించెను. కాని, మంత్ర్యాదులు మధ్యస్థు లయి, సోళంకిరాణి యొక్కయు, నామె కుమారునియొక్కయు

నుదర నిర్వాహకమునకు రెండు గ్రామముల నిప్పించి వాసము చేయుటకయి యూరిబైట నొక గృహమునిప్పించిరి. సోళంకిరాణి విచారశీల గావున, సంప్రాప్తమయిన దుస్థితియందుగూడ తన కుమారునకు విద్యాబుద్ధులు చెప్పించుటకు మరచినదికాదు. ఇతర వ్యయము లన్నియు దగ్గించి, మిగిలిన ధనముతో గుమారునకు రాజయోగ్యమైన విద్యలన్నియు జెప్పించెను. ఇట్లు జగదేవుడు కొన్ని దినములలో రణధవలునికంటె నధికశూరుడని విఖ్యాతిని జెందెను. ఇందుచే రాజ్యమునందలి లోకులందరును జగదేవునియందే బద్ధానురాగులయి యుండిరి. రాజుగూడ జగదేవుని శౌర్యసాహసముల విని సంతోషించుచుండెను. కాని వాఘేలిరాణికి గోపము వచ్చునేమోయని రాజు తనకు జగదేవుని యందుగల ప్రేమ స్పష్టపరచుటకు వెరచుచుండెను. ఇట్లు కొంతకాలము జరిగినవెనుక బైని వర్ణింపబడిన బిరజరాజుగా రంపిన శుభలేఖను దీసికొని కొందరు బ్రాహ్మణులుదయాదిత్యుని సభకు వచ్చిరి. ఆ శుభపత్రికలను జూచి, రాజు ఆనందభరితుడాయెను. గాని, రణధవలుని వివాహము కానందున వాఘేలిరాణి జగదేవుని వివాహమున కనుజ్ఞ ఇచ్చునో, లేదోయని సంశయించెను. కాని,జగదేవుని యదృష్టము వలన రాజుగారు వాఘేలిని త్వరలోనే సమాధానపరుపగలిగిరి.

ఇట్లు పెద్దభార్య యనుజ్ఞ పుచ్చుకొని ఉదయాదిత్యుడు టుకుటేడా గ్రామమునకు దరలివెళ్ళి, కుమారుడగు జగదేవునకు వివాహము జేసి కోడలగు వీరమతిని వెంబడిదీసికొని, ధారానగరమునకు వచ్చెను. జగదేవుని వివాహమయినప్పటి

నుండియు సోళంకిరాణియు, జగదేవుడును, పూర్వగృహమునం దుండక రాజగృహమునందే యుండిరి. కొన్నిరోజు లత్తవారి యింటనుండి, వీరమతి పుట్టినింటికి వెళ్ళెను.

రాజగృహమునందుండి, రోజును రాజసభకువచ్చి రాజ కార్యము లనేకములు నిర్వహించుచుండుటవలన జగదేవునికీర్తి దినదినము వృద్ధినిజెంది సభవారందరును, అతనినే ప్రేమించు చుండిరి. వాఘేలీకుమారు డయిన రణధవళుడు చిన్నతనమునాటి నుండియు వెర్రివానివలె నుండుటచేత వాడెవరికిని ప్రియుడు గాకపోయెను. ఇట్లు తన కుమారునిజూచి యందర సహ్యపడుదు రనియు, దన సవతికుమారుని నందరు ప్రేమించెదరనియు జూచి; యటులనే కొన్నిరోజులు జరగనిచ్చినయెడల దనకుమా రుని వెడలగొట్టి జగదేవుడే రాజగుననియు వాఘేలిరాణి తలంచెను. జగదేవుడు తన సవతితల్లియగు వాఘేలీరాణిని సదా సంతోషపెట్టవలయుననియు, తనపయినామె పుత్రవాత్స ల్యము నుంచవలయుననియు, నెల్లప్పుడు ఆమె యంతఃపురము నకు బోయి యామె కరుణను బడయుటకు బ్రయత్నించు చుండెను. ఇట్లు తన యంతఃపురమునకు శుద్ధాంతఃకరణముతో బలుమారు వచ్చెడి బాలునిపై గొప్ప నెపమొకటి మోపి, రాజు నకు నమ్మికపుట్టునటులజేసి, వాఘేలి యీ జగదేవుని రాజ్యము వెడలగొట్టించెను. అప్పుడా కుమారుడు ఒక గుఱ్ఱమును, తన యాయుధములను మాత్రము వెంటబుచ్చుకొని, పట్టణమను స్వతంత్ర సంస్థానమునకు వెళ్ళి, యచ్చటి రాజువద్ద నేదియైన నధికారము సంపాదించుకొనవలయునన్న యుద్దేశముతో నా

సంస్థానమునకు బయలుదేరెను. కాని యంతలో దన సహధర్మ చారిణియగు వీరమతినిజూచి, యామె యనుజ్ఞవడసి, పట్టణము నకు వెళ్లుదమనితలచి,గుఱ్ఱమును టుకుతోడాపట్టణము వైపునకు ద్రిప్పెను. ఇట్లు జగదేవుడుబయులుదేరి కొన్ని దినములకు టుకు తోడా గ్రామసమీపమున నున్న యొక యుద్యానవనము చేరెను. అచ్చటికి జేరువరకు సాయంకాలమైనందు వలనను, గుఱ్ఱము ప్రవాసముచే నత్యంతాయాసము పడినందువలనను, అచ్చట కొద్దికాలము శ్రమ దీర్చుకొని, రాత్రి వెన్నెలలో గ్రామము చేరవచ్చునని దలచి, జగదేవు డా యుద్యానములోనికి వెళ్లి, గుఱ్ఱమును విడిచి, తాను ఫలాహారము చేసి నిదురించెను.

జగదేవుని వెడలగొట్టిన తరువాత వాఘేలీరాణి వెంటనే కొందరు దుర్మార్గులకు ధనాశ జూపి జగదేవుని ద్రోవలో దెగ టార్చి రండని వారిని బంపెను. జగదేవుడు వెళ్ళిన దిక్కునకే వారు వెళ్లిరి; గాని తన సవతితల్లి తనను జంపుటకై యిటుల మను ష్యులను బంపునేమో యని తలచి, జగదేవుడు పెద్ద త్రోవను విడిచి వంకర దారిని నడుచుచుండెను. కనుక వాఘేలీ పంపిన మనుష్యుల కతడు త్రోవలో గనుపడినవాడు కాడు. పైని వర్ణిం చిన యుద్యానవనములో నిదురించినపుడు, ఆనలుగురు మనుష్యు లచ్చట బ్రవేశించి, నిదురించుచున్న రాజపుత్రుని బంధించి యడవిలోనికి గొనిపోయిరి. ఇంతలో దైవవశమున వీరమతియు, నామె చెలికత్తెయు బురుషవేషములు వేసికొని, వేటాడి యా వనములోనికి వచ్చిరి. అప్పుడచటి సేవకజనము లామెతో నెవరో రాజపుత్రు డచ్చటికి వచ్చెననియు, నిద్రించుచున్న

సమయమున నతనిని నలుగురు దొంగలు పట్టుకొని పోయి రనియు జెప్పిరి. ఆమాటలు వినినతోడనే వీరమతియు, నామె చెలికత్తెయు దొంగలు పోయినత్రోవనే రాజపుత్రుని విడిపించుటకై గుఱ్ఱములను పరుగెత్తించిరి. కొంతదూరముపోయిన తరువాత నొక యరణ్యములోనా శూరస్త్రీలు, కాలుచేతులు కట్టబడియున్న జగదేవుని నడుమబెట్టుకొని యతనిని జంపవలెనా వలదా యని తమలో దాము వాదించుకొనుచుండెన చోరచతుష్టయమును గాంచిరి. పురుష వేషధారులగు వీరిద్దరిని జూచి దొంగలు వారివద్ద ధనము దీసికొనవలెనన్న యిచ్ఛచే వారి మీదికి వచ్చిరి; కాని వీరమతియు నామె సహచరియు భీతి నొందక వారిపై తమ కంకపత్రములను, భల్లెములను బ్రయోగింప సాగిరి. ఆ దుష్టులు చేయగలిగిన ప్రయత్నముల జేసిరి గాని, వారిలో నొకడు వీరమతిచే జచ్చెను; మరియొకడు చెలికత్తెయొక్క భల్లెప్రహారణమువలన దొడ తెగి క్రింద గూలెను. వీరమతిని జూచి మిగిలిన యిద్దరును పారిపోయిరి. అప్పుడు వీరమతి జగదేవుని బంధనములు విప్పి, యతడు తన పెనిమిటి యని తెలిసికొని, తానెవరో చెప్పక యతనిని గ్రామమునకు రమ్మని బలవంతముచేసి, వెంట దీసికొనిపోయెను. అచ్చటికివెళ్ళిన తరువాత నిజస్వరూపము జూపగా, తన ప్రాణములు రక్షించినది తన యర్ధాంగియే యని తెలిసికొని, జగదేవు డత్యంతసంతోష చిత్తు డయ్యెను. అప్పుడు వీరమతి "మాకు దెలియపరుపక యిటుల నొక్కరు వచ్చుటకు గారణం బేమి"యని భర్తను అడిగెను. అందుపై నతడు తన వృత్తాంతమంతయు జెప్పి "నన్నుగొని

పోయిన దుష్టులు మా సవతితల్లిగారిచే బంపబడినవారు. నేనికమీద నిచ్చటనుండినపక్షమున, నీయన్నగారు మాతండ్రికి సామంతుడుగాన, నతనికి జేటువాటిల్లును గనుక, నేను పట్టణ సంస్థానమునకుబోయి యచ్చట నుద్యోగమును సంపాదించుకొని, నిన్ను బిలిపించుకొందును. పోవుటకు ననుజ్ఞయిమ్ము" అని పలికెను. అందుపయి వీరమతి, తన్ను వెంటదీసికొని వెళ్ళవలయునని తొందర పెట్టసాగెను. అందుమీద జగదేవుడు బావమరదియగు బిరజుని సమ్మతి బుచ్చుకొని, భార్యను వెంట దీసుకొని పోవుటకు సమ్మతించెను. వెంట గొంత సైన్యము దీసికొనవలసినదని బిరజుడు బలవంతపెట్టెనుగాని, యందుకు జగదేవుడు సమ్మతింపకపోయెను. భార్యాభర్తలిరువురు రెండుగుఱ్ఱములపయి నెక్కి, యుద్ధమునకు నుపయోగించు శస్త్రములను వెంట దీసుకొని, పట్టణమునకు బయలుదేరిరి.

ఇట్లు ప్రవాసము చేయుచు వారొకనాడు మధ్యాహ్నమొక యూరిలో దిగి, భోజనముచేసి, విశ్రమించి, యచటి వారిని పట్టణమునకు త్రోవయేదియని యడుగగా, వారు రెండు దారులుగలవనియు, నందొకదారిలో మనుష్యులను దిను రెండు బెబ్బులులున్నవనియు జెప్పిరి. అప్పుడు పులులున్న త్రోవనే మనము వెళ్లి, వానిని వేటాడి చంపి లోకుల కుపకారము చేయుదమని వీరమతి జగదేవునితో జెప్పెను. భార్యయొక్క శౌర్యోత్సాహములనుజూచి జగదేవుడు సంతసించి యాదారినే వెళ్లుటకు సమ్మతించెను. వారాత్రోవను నాలుగు క్రోశముల దూరముపోగానే వారు "ఈ క్రూరమృగమునుజంపి మా ప్రా

ణములను రక్షింపుడి" యన్న ధ్వనిని వినిరి. ఆ శబ్దమువచ్చెడి దిక్కునకు వారిరువురు తమగుఱ్ఱములను దిప్పి కొంతదూరము వెళ్లిరి. దూరమునుండి చూడగా పెద్దచెట్టుపై నిద్దరుమనుష్యులుకూర్చుండి గజగజ వణకుచుండుటయు, క్రిందనొక పెద్దపులి బొబ్బలుపెట్టుచు, నెగురుచు. భయంకర మయిన రూపమును దాల్చి చెట్టుపైనున్న మనుష్యులను క్రిందబడ వైచుటకు బ్రయత్నించుచుండుటయు గానవచ్చెను. ఇట్టుల జూచి వారిరువురు ఆ పులిని సమీపించి యొక పొదచాటునుండి దాని వీపునకు దగులునట్టుగా బాణమువేసిరి. అంతనాపులి వృక్షముమీది మనుష్యులను వదలి, వెనుకకు దిరిగి తనను నొప్పించిన దంపతులపయికి నురికెను. అంతలో జగదేవుడు మరియొక బాణమువేయగా నది తప్పిపోయెను. అందుచేత నాపులి, మఱింత గర్జించుచు, జగదేవుని సమీపించెను. అప్పుడు వీరమతి తన చేతిబల్లె మాపులి పొట్టలో గ్రుచ్చగా, నది క్రిందబడి ప్రాణములు విడుచుచు పెద్దగా బొబ్బరించెను. ఆ ఘోర శబ్దమును విని, పొదలలోనున్న యాడుపులి యంతకంటె పెద్దగా నరచుచు తనప్రాణనాయకుని సహాయమునకు వచ్చెను. అప్పుడాశూరదంపతులు గూడి యాపులినిగూడా జంపిరిగాని దానిగోళ్ళచే గీరబడినందున జగదేవుని గుఱ్ఱమా బాధచే మృతి బొందెను. అందుకు జగదేవుడు మిక్కిలి చింతించి, తనదేహము పయి పచ్చడము దానిపై కప్పెను. చెట్టుపయిని యిద్దరుమనుష్యులు దిగివచ్చి, తమప్రాణదాతలకు నమస్కరించిరి. మీరెవ్వరని జగదేవుడు వారినడుగగా వారిట్లు చెప్పిరి. "ఉదయా

దిత్య మహారాజుగారికి రెండవకుమారుడగు జగదేవు డిరువది దినముల క్రిందట నేకారణమువలననో యింటినుండి బయలుదేరి యెవరికి జెప్పక యెచ్చటికో పోయినాడు. అతనితల్లియగు సోళంకిరాణి యతనిని వెదకుట కయి ధీరసింహుడను మంత్రిని బంపినది. మేము ధారానగరమువద్ద నున్నయొక పల్లెలోని వారము. ప్రవాసములో సందరికంటె ముందుపోయి భోజన ప్రయత్నము చేయుట కయి ధీరసింహుడు మమ్మ వెంబడి తెచ్చినాడు. నిన్నటిరోజు మేము ధీరసింహునకంటె మొకట బయలుదేరి ముందటిగ్రామమునకు బోవుచుండగా త్రోవతప్పి యీ యడవిలోకి వచ్చి పెద్దపులులచే బాధితుల మయితిమి." ఇట్లు వారిచే దనతల్లి క్షేమసమాచారమును, తనను వెదకుట కయి తనతల్లిగారు తన కత్యంతప్రియుడగు ధీరసింహుని బంపిన దనియును విని, జగదేవు డత్యంత ముదితుడయి ధీరసింహు డెచ్చట నున్నవాడో యచ్చటికి దీసికొనిపొండని వారి నాజ్ఞా పించెను. వారిలో నొకడు ముందు, నడుమగుర్రముపయి, జగదేవవీరమతులు, వారివెనుక నింకొక సేవకుడు, ఇట్లు నడుచుచు కొంతదూరము వెళ్లినతరువాత వారికి నెవరో గుర్రపురౌతులు, ఎనిమిది పదిమంది యెదురుగా వచ్చుచున్నట్లు గానిపించిరి. వారు ధీరసింహుని మనుష్యులేయని నమ్మి జగదేవాదులు వారిరాకకు నెదురు చూచుచు నిలవబడిరి. కాని కొంతసేపటికి వచ్చెడి వారు తమకు మిత్రులుగాక, యెవరో శత్రువులని తెలిసెను. అప్పుడు జగదేవవీరమతులు శస్త్రాస్త్రములను సవరించుకొని యుద్ధమునకు సన్నద్ధులయిరి. వారివెంబడి నున్న సేవ

కులు కొన్ని రాళ్ళను పోగు చేసికొని యచ్చటనున్న యొక వృక్షము నెక్కి శత్రువులపయి రువ్వసాగిరి.

ఇంతలో నాగుఁరపు రౌతులు వచ్చి, యాదంపతులను జుట్టుకొనిరి. వారెనిమిదిమంది యున్నందున వారితో బోరి గెలుచుట యసాధ్యమని తలచి, జగదేవుఁడు వారు తమపయికి రాకుండ ఖడ్గము తనచుట్టు త్రిప్పుకొనుమని తనభార్యకు సూచించి, తానును అదేప్రకారము చేసెను. వీరిలో వెనుక జగదేవుని పట్టుకొనిపోయినవారిలోనివాఁడొక డున్నందున, వీరందరును వాఘేలిరాణిగారిచే దమ్ము జంపుటకునై పంపబడిన వారని వారు గ్రహించిరి. ఇట్లు కత్తి చుట్టుద్రిప్పుకొని యాత్మ సంరక్షణము చేసికొనుచున్న యా దంపతులపయి నాశత్రువు లనేక బాణములు గురిపించిరిగాని, యవి యన్నియు వేగముతో ద్రిప్పబడుచున్న ఖడ్గముచే ఖండితము లయ్యెను. ఆ సమయమున వారిశరీరమును స్పర్శించుటకు వాయుదేవునికిగూడ శక్యముకాక పోయెను. ఇట్లు మహావేగముతో గత్తికొంతసేపు ద్రిప్పిడస్సి యిక నటుల చాలసేపు సేయుట యశక్యమని తలచి వీరమతి వారుచుట్టిన యావరణమును పగులదీసి యవతలకి బోవ యత్నించెను; అటులనే సేయుటకయి పతికిని సూచించెను. వారి రువురు రెండుప్రక్కల నావరణమును బగులదీయుటకయి యత్నింప జొచ్చిరి. వీరమతి యాశత్రువుల నాయకునిపయి నొక బాణము వేయగా నతడా బాణము నుదప్పించుకొనెనుగాని, యాబాణము దగిలి వానిగుఱ్ఱము కూలెను, ఆగుఱ్ఱము కూల గానే యతడును క్రిందబడి మూర్ఛిల్లెను. ఇట్లు వీరమతిచే

దమనాయకునకు భంగపడుట చూచి యితరులందరు క్రోధావేశ పరవశులై యామె యబలపైకి నుఱికిరి. వారందఱి నొక్కసారి పేర్చి యార్చిన వీరమతి వారితో బోరాడెనుగాని, యామెవరకు ఖడ్గము త్రిప్పి త్రిప్పి యలసి యున్నందున నా ఘోరకలహములో నా చేతిపట్టు బడి ఖడ్గము క్రిందబడెను. దానిని తీసికొనుటకై ఆమె ప్రయత్నించు నంతలో రెండుబాణములు వచ్చి యొకటియామె కాలికిని, మరియొకటి యామె చేతికిని తగిలెను. వానిని దీయుటకై యత్నించుచుండ నొకడు వెనుకనుండి వచ్చి యామె మెడ బట్టుకొనెను. ఇందుపై నామె మూర్ఛిల్లెను గాని, యింతలో జగదేవుడు తన ఖడ్గముచే నా సర్దారుని రెండుచేతులును దునిమి తన ప్రియభార్యను విడిపించుకొనెను. ఇక జగదేవునకు మూర్ఛిల్లిన భార్యను రక్షించుకొనుటయు, శత్రువులతో యుద్ధము చేయుటయునను రెండు పనులు చేయవలసివచ్చెను. ఇట్లు జగదేవుడు తన శౌర్యమంతయు జూపుచుండగా ధీరసింహుడిరువది గుఱ్ఱపురౌతులతోను దేమార్గమున వచ్చుటసంభవించెను. ఆయన జగదేవుని గుర్తెరిగి యా దొంగల నందఱిని ఖైదు చేసెను. తరువాత ధీరసింగు గుఱ్ఱముదిగి జగదేవుని కౌగిలించుకొని, అతనిచే దొంగల వృత్తాంతమంతయు విని మూర్ఛిల్లియున్నది వీరమతి యని తెలిసికొని యామెకు శీతోపచారములు చేయించి, గాయములకు గట్లు కట్టించెను. అంత నామె స్మృతినొంది లేచి, ధీరసింగును చూచి యతనికి మ్రొక్కెను. తరువాత వారందరును ఆ రోజున నచ్చటనే కూడి భోజనాదులు చేసిరి. భోజనోత్తరము ధీరసింగు జగదేవునితో నిట్లనియె "ఇది యంతయు వాఘేలీ

రాణిగారు చేసిన పనియే. కనుక, నీవు ధారానగరమునకు వచ్చి యీ సంగతినంతయు, మీ తండ్రిగారికి విశదపరచి. నీయందు దోషము లేకపోవుట స్థాపించుకొనవలసినది. ఇందుకై నేను నీవైపున సాక్ష్యమిచ్చెదను." అందుపై, తానట్లుచేసిన తన సవతితల్లికి నవమాన మగుననియు, తా నింటినుండి బయలుదేరినప్పుడు తన బాహుబలముచే కీర్తి సంపాదించిగాని తండ్రికి ముఖము జూపనని ప్రతిజ్ఞ జేసితిననియు, తాను పట్టణమునకు వెళ్ళి యచ్చట తన బాహు విక్రమముచే కీర్తియు, శ్రీయు సంపాదించి, తల్లిని దండ్రినిజూచుటకు వచ్చెదననియు జగదేవుడు ధీరసింహునితో జెప్పెను. ధీరసింహుఁడందుకు సమ్మతించి, తన గుర్రములలో నొకదానిని జగదేవుని కిచ్చి, యతనియాజ్ఞ బుచ్చుకొని ధారానగరమునకు వెడలెను. అప్పుడు జగదేవుడు "మాతల్లిగారికి నా క్షేమసమాచారము చెప్పి, యామెకు నేమియు నాయాసము గాకుండ జూచుచుండవలసినది" యని చెప్పెను. ఆ మంత్రి సత్తముడు రాజధానికి బోయి యటులనే చేసెను. ఇచట నా దంపతు లిద్దరు గుర్రములపయి సవారులయి మార్గములో ననేక సంకటముల బడుచు కొన్ని రోజులకు బట్టణమని యపరనామము గల అణహితపురమునకు జేరిరి. ఆ గ్రామమునకు సమీపమున సహస్రలింగతటాకమను నొక చెరువున్నది. ఆ తటాకతీరమున దిగి యచ్చటనే గుర్రములను, వీరమతిని ఉంచి తాను బసచూచివచ్చెద నని జగదేవుడు గ్రామములోనికి బోయెను.

జగదేవుడు గ్రామములోనికి వెళ్ళిన కొంతసేపటికి చెరువున కొకవనిత నీళ్ళకువచ్చి వీరమతిని జూచి నేర్పుగా నామె పేరు, ఆమెపెనిమిటిపేరు, మామపేరు కనుగొనిపోయి ఆసంగతులన్నియు దన యజమానురాలితో జెప్పెను. ఆ కాలమున నా పట్టణము పండ్రెండుక్రోశముల వైశాల్యముగలది యయి బహు రమ్యముగనుండెను. జయసింగు సిదరాజనురాజు ప్రజాపరిపాలనము చేయుచుండెను. ఆయన ధర్మాత్ముడనియు, దయాశాలి యనియు బ్రసిద్ధికెక్కెను కాని, అతడు రాజ్యములోని యధికారుల బరీక్షింపక వారలయందు నమ్మకగలిగి ప్రవర్తించుటచే నాపట్టణమందు ననేకాన్యాయములు జరుగుచుండెను. ఆ పట్టణమునకు గొత్వాలనగా, దండనాయకుడుగా నున్న డుంగరసీయనువాడు స్వయముగా నన్యాయములు చేయించుచుండెను. స్వయముగా దొంగలను బ్రోత్సాహపరచి వారు తెచ్చిన సొమ్ములో భాగము గొనుచుండెను. వేశ్యాంగనాసక్తుడయి గ్రామమునందనేక వేశ్యాంగనలను దెచ్చియుంచెను. వారిలో జామొతీయను వేశ్యాంగన మిక్కిలి చక్కనిదియై లెక్కింపరాని ధనమును సంపాదించెను. దానియిల్లు రాజభవనము వలెను పూదోటలు రాజోద్యానములవలెను గానుపించును. ఈ వేశ్యాంగనలలోని రాణి తన దేహమును విక్రయించుటయే గాక పట్టణములోని యనేకసాధ్వీమణులను మోసపుచ్చి తన యింటికి రప్పించి, బలవంతముగా వారిని కాముజనుల కర్పించి వారి పాతివ్రత్యమును భంగముచేయుచుండును. దండనాయ

కుని కుమారుడగు లాలదాసనువాడుగూడ జారశిరోమణి యని పేరుగాంచి యీ జామోతికి దాసుడయి మెప్పుచుండెను.

పైని చెరువునకు నీళ్ళకొరకువచ్చి వీరమతి నాను గ్రామములు కనుగొనినదని చెప్పినవనిత ఈ జామోతియొక్క సేవకురాలు. దాసి చెప్పినమాటలు విన్నతోడనే యీ వేశ్యాంగన రాజస్త్రీకి యోగ్యమయిన వేషము వేసికొని, మేనాయెక్కి వెంటగొందరు భటులను దీసికొని వీరమతి యున్నచోటికి వెళ్ళెను. అచ్చట నామెనుగాంచి ఎవరో కావలసినదానివలె నామెవద్దకి వచ్చి, "పరాయివారివలె మీరిట్లు వేరుబస చూచుకొనుట న్యాయమా? మీరువచ్చెదరని మొదలే కబురుచేసినపక్షమున మేము మీకెదురుగనే వచ్చియుందుము. నేను ఉదయాదిత్యుని పినతండ్రి కూతురను; జగదేవునికి వేలువిడిచిన మేనయత్తను. బసచూచుటకయి జగదేవుడు పట్టణములోనికి రాగా రాజుగారతనినిజూచి యానవాలుపట్టి రాజమందిరములోనికి దోడుకొని వచ్చిరి. అచ్చట నతనిచే నీవిచ్చటనున్న సంగతి విని నిన్ను రాజభవనమునకు దీసికొని పోవచ్చితిని. ఈ గుర్రములు మొదలైన వానిని నాబంట్లు దీసుకొనిరాగలరు. ఈ మేనాలో గూరుచుందుము. పద, పోయెదము"అని పలికెను. ఆమాటలువిని యామె చెప్పినసంగతులన్నియు నిజమనుకొని వీరమతి యామెవెంబడి రాజగృహమునకు సరితూగుచున్న యామె గృహమునకు బోయెను. అచ్చటికివెళ్ళినపిదప నావేశ్యాంగన వీరమతికి నభ్యంగన స్నానముచేయించి, కొంతసేపటికి భోజనమునకు లెమ్మని పిలిచెను. అందుపైని మీ మేనయల్లుడు భోజనముచేసినగాని నేను భోజనముచేయనని యామె యుత్తరమిచ్చెను.అందుపై జామోతి

తన పరిచారికలలో నొక దానిని, 'మీకొరకు మీమేనయత్త కని పెట్టుకొని కూర్చున్నది' అని చెప్పిజగదేవుని దీసికొనిరమ్మని పంపెను. ఆదాసి పోయినటుల నటించి, తిరిగివచ్చి, రాజు గారితో జగదేవుడు భోజనము చేసినాడు; మిమ్మును, వీరమతి గారిని భోజనముచేయుమని చెప్పినాడు అనిచెప్పెను. అందు పయి వీరమతి కొంచెము భుజించెను. తరువాత నా నారయువతి యొక సుందరమైన యరచూపి వీరమతిని అచ్చట విశ్రమించు మని చెప్పివెళ్ళెను. ఈసంగతులన్నియు జూచి వీరమతికి సంశ యము కలిగెనుగాని, సాయంకాలమువరకు పెనిమిటి వచ్చునే మోయన్న యాశచే నామె యాగదిలో శయనించెను. సాయం కాలము కాగానే యింటి యజమానురాలు మరల వచ్చి భోజనమునకు రమ్మని పిలిచెనుగాని, భర్త వచ్చి భోజనము చేయనిది తాను అన్నము ముట్టుట లేదని వీరమతి తననిశ్చ యము తెలిపెను. అప్పుడు జామోతి యేమియు జేయలేక కొన్ని ఫలాహారము లచ్చట బెట్టి తినుమని చెప్పి వెళ్ళిపో యెను. పోవుచు జామోతి గదియొక్క వెలుపలి గొళ్ళెమును వేసికొనెను. అదియాంతయు జూచి ఇదియొక మాయగానున్నదని తలచి వీరమతి మరింత భీతినొందెను. ఆమె యాగదిలో గూరు చుండి పెనిమిటిని నెప్పుడు చూచెదనా యని చింతించుచుండెను.

ఆ పట్టణములోని దండనాయకుని కుమారుడగు లాలు దాసునకు ప్రతిదినమున నొకక్రొత్త యువతిని సమర్పించుట జామోతి యొక్క నిత్యవ్రతము. ఆరోజు వీరమతివంటి చక్కని స్త్రీ దొరికి నందుకు జామోతి యెంతయు సంతసించి, తనకు

గొప్ప బహుమానము దొరుకునని నిశ్చయించుకొని యుండెను. సాయంకాలము కాగానే, యావారకాంత యాదినము జరిగిన వృత్తాంత మంతయు లాలుదాసునకు దెలిపి; వీరమతి పెనిమిటి పేరు చెప్పి, యతని బట్టి కారాగృహములో వేయించి, రాత్రికి నతనిని (లాలుదాసును) తనయింటికి రమ్మని చెప్పెను. ఆ నరాధముడు రాత్రి నియమితకాలమునకు వేషము వేసికొని, సురాపానము చేసి, జామోతి గృహమునకురాగా ఆచండాలిని పుచ్చుకొనవలసిన ధనమంతయు బుచ్చుకొని, యతనికి వీరమతి యున్న మేడ జూపి, తన నివాసస్థలమునకు వెళ్ళిపోయెను. ఆ నరాధముడు మేడయెక్కునప్పుడయినచప్పుడువిని, భర్తృధ్యానరత యైన నచరిత్రనాయిక, తనభర్త వచ్చెనని తలంచి సంతసించెను గాని, యాకీచకుడు లోనికిరాగా వానిభయంకరమైన స్వరూపమునుజూచి పరపురుషుడని యెరిగిగజగజవడకసాగెను. అంతలో రాజస్త్రీలకు స్వాభావికమైన ధైర్యము నవలంబించి, యెన్నియో బోధవచనములచే నా దుష్టుని దుర్మార్గమునుండి తొలగింపయత్నించెను. ఆ మాటలువినక, ఆ నరపశువు, మదోన్మత్తుడయి, వివేకశూన్యుడై, వీరమతియొక్క పవిత్ర దేహమును దనపాపపు హస్తములతో స్పర్శించుటకై యత్నించెను. ఇక నూరకుండిన మానమునకు భంగము కలుగునని తలచి, యాయతులపరాక్రమశీల యగు అబల, తన నడుము లోని గుప్తఖడ్గము స్వరున దీసి యా నరాధముని రెండు తునకలుగా ద్రుంచెను. ఈఖడ్గ మెక్కడిది యని చదువరులకు సందేహము వచ్చునేమో. ఆ కాలపు ప్రతిరాజపుత్రస్త్రీకి

నడుమున మొలకట్టురూపమున నొక సన్నఖడ్గము అమరియుం డును. ఈఖడ్గములు వంచిన విరగనట్టి యుక్కుతో జేసినవి; ఇవి మొలకట్టు ఆకారముగల బంగారపు వరలో నుంచుటవలన జూచువారికి మొలకట్టులవలెనే గానుపించును. మానమునకు మోసము గలుగుచున్న పక్షమున రాజపుత్ర స్త్రీలా ఖడ్గమును ఉపయోగించుచుండిరి. ఆఖడ్గమునే సంకటసమయమున వీరమతి ఉపయోగించి,తనమానమునుసంరక్షించుకొనినది!ఆహా!ఇట్టిపతి వ్రతా తిలకంబుల గొనియాడ నెవరితరము? స్త్రీపురుషుల కంద రికినివంద నార్హమైన యీ నారీతిలకము మునితిలకుడైన మనువు

అరక్షితా గృహే రుద్ధాః పురుషై రాప్తకారిభిః
ఆత్మాన మాత్మనా యాస్తు రక్షేయుస్తాస్సురక్షితాః*

వ్రాసినఅనిన వచనమును సోదాహరణగా స్థాపించి, స్త్రీలకయి మహోపకారము జేసినది. ఓ సోదరీమణులారా! మా దితి రా పాతివత్యప్రభావము! వనితలకు పాతివ్రత్యమే శ్రేయమనియు, గ్రాహ్యమనియు, లలామభూతమనియు నమ్ముడు. పాతివ్రత్య మునకంటె నెక్కుడుధర్మము స్త్రీల కెద్దియులేదు. పతివ్రతా స్త్రీలను సంరక్షించుటకయి సదా సర్వేశ్వరుడు సిద్ధముగా నుండును. పాతివ్రత్యమునకు దన్ను దానే రక్షించుకొను సామ ర్థ్యముగలదని కొందరు చెప్పుదురు. అనగా పతివ్రతా స్త్రీ లెంత దుర్బలలైనను, ఎన్ని సంకటములతో మునిగియున్నను, వారికి స్వసద్గుణములను గాపాడుకొను సామర్థ్యమీశ్వరుడిచ్చును.

---

* ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధింపబడు స్త్రీలు రక్షితు రాండ్రు కారు; ఏ స్త్రీలు తమయాత్మను తామే కాపాడుకొందురో వారే సురక్షితురాండ్రు.

పతివ్రతలను దుష్టుల చేతులనుండి విడిపించుట కయి పతివ్రతలవెంబడి నెల్లప్పుడును దేవదూత లదృశ్యులై తిరుగు చుందురని యొకపాశ్చిమాత్యకవి వ్రాసియున్నాడు. కీచకుని గృహమునకు బోవునపుడు ద్రౌపదీదేవి తనపాతివ్రత్యము రక్షింపవలసినదని సూర్యునికి విన్నవింపగా,

క. "తరణియు దుఃఖిత యగుచ
త్తరుణిం గాంచుటకు సత్యదభ్రభుజాని।
స్ఫురణాఢ్యు నొక్కరక్కసు।
గరుణార్ద్రమనస్కుడగుచు గ్రక్కున బనిచెన్"

అని మహాభారతమున జదువుచున్నారముగదా? దమయంతి శాపంబున గిరాతుడు దగ్ధుడయ్యెననియు వింటిము. ఈదేవ దూతలును, రాక్షసుడును, శాపసామర్థ్యమును పతివ్రతా స్త్రీల యొక్క సత్ప్రవర్తనమును, దృఢనిశ్చయమును, శౌర్యసాహసములును అనియె చెప్పవచ్చు. తమధర్మమునకు భంగము కలుగుట సంభవించినప్పుడు పతివ్రతా నారీమణులకు క్రోధాతిరేకము కలుగును. ఆక్రోధాతిశయమునందె దుష్టుని శిక్షించి, పాతివ్రత్యమును సంరక్షించుకొనుసామర్థ్యము గలదు. కనుక నో హిందూసుందరులారా! ప్రాణములైన బోగొట్టుకొని మీ పాతివ్రత్యమును రక్షించుకొనుడు. మీసచ్ఛీలమనుధనమును అపహరించుట కయి యనేక నరచోరులు సదా తత్పరులైయుం దురు. మీకు విద్యనేర్పక మూర్ఖులనుజేసి తమవలలో వేసికొన వలెనని యనేకులు స్త్రీవిద్య యక్కరలేదని ప్రతిపాదించెదరు. వారిమాటలు వినకుడి. సద్విద్యను గరచి, పతివ్రతలచరిత్రము

లను జదివి, వారివలె ప్రవర్తింపుటకు యత్నింపుడి. విద్య నేర్చుకొనిన నిట్టి సంకటములు రావని నా తాత్పర్యముకాదు. కాని యిట్టి సంకటములు సంప్రాప్తించినపుడు మూర్ఖులవలె నిరాశను బొందక, విద్య నేర్చిన స్త్రీలు ధైర్యము నవలంబింతురు. సంకటమును దొలగించుకొనుటకు వారికి ననేక యుక్తులు తోచును. వీరమతికి శస్త్ర మెటుల నుపయోగించినదో, యటులనే విద్య యిప్పటి స్త్రీలకు సంకట సమయమునందుపయోగించును. కనుక, మీ పాతివ్రత్య రక్షణార్థమై మీ రెల్లప్పుడును విద్య యను శస్త్రమును వెంబడి నుంచుకొనుడి.

ఇట్లు నరాధముడగు లాలుదాసును యమసదనమునకు బంపి, వాని శరీరమును గుడ్డలో మూటగట్టి వీరమతి యా మూటను గవాక్షములోనుండి వీధిలో బారవైచెను. తదనంతరము లోపలికి మరియెవరు రాకుండునటుల మేడత్రోవ లోపల బిగియించుకొని యిక నేమేమి విచిత్రములు జరగునో చూతమని చేత ఖడ్గమును ధరించి గవాక్షమువద్ద నిలువబడెను. అంత రాత్రి గస్తీతిరుగు సంరక్షకభటులు కొంద రా మూటను జూచి, విప్పి, దండనాయకుని కుమారుని శవమని తెలిసికొని, తక్షణమే యా సమాచారము దండనాథునికి దెలియ జేసిరి. తన పుత్రుని శవమును జూచి దండనాయకుడు శోకాకుల చిత్తుడై, యా శవ మెచ్చటదొరికినదని యా భటుల నడిగెను. జామోతియొక్క గుప్తగృహ సమీపమున దొరికినదని వారు చెప్పగా, నతడు వెంటనే యా వారకాంత యింటికి బోయి లాలుదాసుడేడియని యడిగెను. అందుపై జామోతినవ్వి యత

డొక క్రొత్త రంభావిలాసములో నున్నాడు. వెరవకుడి; పిలుచు కొని వచ్చెదనని మేడపైకి బోవుటకు నెడలెను. కాని పైకి బోవు త్రోవయె మూసియున్నందున, నెన్నిపిలుపులు పిలిచినను, ఎవరును బలుకకపోయిరి. అప్పుడామె మరలివచ్చి యాసంగతి యంతయు గొత్వాలుతో జెప్పెను. అప్పుడతడు కొందర భటు లను బిలిపించి, యా మేడతలుపులను దీయ యత్నించెను. కాని జామోతియింట జరిగిన ఘోరకృత్యము లన్నియు నామేడలో జరుగుచున్నందున నా వేశ్యాంగన యెవ్వరికి దీయ నలవిగాని ఘనతరమైన తలుపు ఆ మేడకు బెట్టించి యుండెను. కనుక గొత్వాలు చేసిన యత్నము లన్నియు విఫలములయి తలుపు రాకపోయెను. అప్పుడు వీధిగోడకు నిచ్చెనవేసి గవాక్షములో నుండి లోపలికి బోదమని నిశ్చయించి యటులనే నిచ్చెన వేసి కొని యొకభటుడు పైకెక్కి గవాక్షములో దల బెట్టగానే యచ్చట నిలుచున్న వీరమతి తన ఖడ్గముతో వానిమెడ ద్రుంచెను. అంత వానిమెడ లోపలబడి, వాని మొండెము వీధిలో బడెను! అందుకు భయమునొందక మరియొకడు పైకి రాగా పతివ్రతాతిలక మగు మన చరిత్రనాయిక వానినిగూడ ఖడ్గము నకు బలియిచ్చెను! ఇట్లు పదునొకండుగురు మేటిమగలా యబ లచే నిహతులైరి! అప్పుడు పైకెక్కుట కే శూరుడును సాహ సింపక పోయెను. ఇంతలో నీవార్త ప్రాతఃకాల మగుటవలన గ్రామములో నంతయునిండి, యా వారవనిత గృహమునకు లోకులు గుంపులు గూడి రాసాగిరి. ఒక స్త్రీ పండ్రెండుగురు భటులను గూల్చినదని యందరనుకొనగ నా పట్టణపు రాజు కూడ వినెను. అతడిట్టి విచిత్రమును జూచుటకయి స్వయముగా

యచ్చటికిపోయెను. అచ్చట నామె చంపినవారి సందరినిజూచి, స్వయముగా నిచ్చెనపైకి నెక్కి, గవాక్షమువద్ద నిలువబడి, యిట్లనియె. "ఓ యసమాన శౌర్యముగల స్త్రీ! నీ వెవ్వరవు? ఇట్లు నా ప్రజలను జంపుటకు గారణమేమి? నేనీ పట్టణము నకు రాజును. నీ కెవరైన నపరాధము చేసినపక్షమున జెప్పుము. వారిని నేను దండించెదను." అనుపయి "మహారాజా! నేను చావడా కులోత్పన్నుడయిన బిరజ మహారాజుగారి చెల్లెలను; ధారానగరమునకు నధిపతియైన యుదయాదిత్య మహారాజుగారి కోడలను. నా పేరు వీరమతి" అని చెప్పి తన వృత్తాంత మంతయు, తన్ను మోసపుచ్చి వేశ్యాంగన యిచ్చటికి దీసికొని వచ్చిన విధమును సవిస్తరముగా జెప్పి, లాలుదాసుని యనుచిత కృత్యమును దెల్పి, "నా పాతివ్రత్య రక్షణమునకయి నేను వానిని జంపితిని; నన్ను బట్టుకొనవచ్చిన పదునొకండురనుగూడ అందునకే వధించితిని; నేను క్షత్రియకన్యను. నా దేహము నందు ప్రాణముండువరకు నన్యపురుషస్పర్శ కానియ్యను" అని స్ఫుటముగా వీరమతిపలికెను. ఆ మాటలువిని రాజెంతయు సంతసించి "రాజపుత్ర స్త్రీలకు దగినపని చేసితివి; వెడలి రమ్ము; నిన్ను నేను నా పుత్రికవలె బాలించెదను. నీ పెని మిటిని వెదకించెదను" అని పలికెను. కాని "నా పెనిమిటి వచ్చినగాని యీ మేడతలుపు తియ్యనని ప్రతిజ్ఞ చేసియున్నాను. కనుక మొదట నా పెనిమిటిని దెప్పించిన పక్షమున తమయాజ్ఞ శిరసావహించెదను. లేనిపక్షమున నిచ్చటనే దేహమును విడిచె దను" అని వీరమతి యుత్తర మిచ్చెను.

జగదేవునికి నధికారప్రాప్తియైనప్పటినుండియు, దుష్టులకు బహుబాధ గలుగుచుండెను. కనుక, వారందరును జగదేవుని జంపుటకై యనేకోపాయములబన్నిరి గాని, యవియన్నియు నిష్ఫలములయ్యెను. కాని యొకసంవత్సర మాపట్టణమున గత్తరలు పుట్టిలోకులనేకముగా జచ్చుచుండిరి. ఎన్ని యుపాయములు చేసినను గత్తర ఆగకపోయెను. అప్పుడు రాజు సర్వప్రజాసంహారమగునేమో యని భీతిల్లి, తన్నివారణమునకై యూరిబైటనున్న కాళికాదేవినిబూజించుటకు రోజును స్వయముగా వెళ్లుచుండెను. ఇట్టి సంకటసమయమున నెవరేమిచెప్పినను, ఎట్టి యసంభవములైన దైవికచమత్కారములను జూపినను, రాజుగారు నమ్మగలరని తలచి దుష్టులొక యుక్తిని గల్పించిరి. వారిలో నొకడు కాళికాదేవి విగ్రహమునకు వెనుక నిలువబడి, రాజుగారేకాంతముగా బూజచేయునప్పుడు, దేవి పలికినటులే యిట్లనియె. "ఓ మహారాజా! నీ భక్తికి మెచ్చితిని; ఈ రోగముపోవుట కొక యుపాయము చెప్పెదను వినుము. సర్వసద్గుణ సంపన్నుడైన యొక రాజకుమారుని నాకు బలియిచ్చిన పక్షమున, ఈరోగము పోయి ప్రజలు సుఖింతురు; నీవును నూరేండ్లు రాజ్యము చేసి ఆనందమొందెదవు." అందుకు రాజు "ఓ తల్లీ! నారాజ్యములో సకల సుగుణములుగల రాజపుత్రుడెవ్వడుగలడో నీవే యానతియిమ్ము" అనెను. అప్పుడు కాళికాదేవి యిట్లనియె. "వత్సా! నీరాజ్యములో నిట్టి రాజకుమారుడు లేడని చింత పడకుము. నీ దండనాయకు డగు జగదేవు డిన్నిగుణములు గలవాడు. కనుక నతనిని బలి యిచ్చిన పక్షమున నీవును, నీ ప్రజలును సుఖించె

దరు.” ఈ మాటలువిని రాజు మిక్కిలి ఖిన్నవదనుడై యింటికి బోయెను. రాజు ఖిన్నవదనుడగుటకు గారణమేమి యని, జగదేవుడు విచారించి, యా సంగతిని దెలిసికొని, చిన్నబోవలదనియు, లోకులకొరకును, రాజుగారికొరకును, దాను సంతోషముతో బలిపోయెద ననియును, రాజుగారితో జెప్పెను. రాజు వలదని చెప్పెనుగాని, యామాటలువినక జగదేవుడింటికి బోయి భార్యతో నా మాటలు చెప్పగా నామె తానును, దనకుమారుడును బలివచ్చెదమని చెప్పెను. ఇట్లు లోకహితార్థమై యాత్మదేహములను సమర్పింప నిశ్చయించి, యా దంపతులు తమ సొత్తంతయు బీదలకు బంచిపెట్టి, యభ్యంగనస్నానము లాచరించి, ప్రాతఃకాలమున మంగళవాద్యములతో దేవి కడకు బోయిరి. దేవికిబూజచేసి, మొదట పిల్లవానిని, పిదప వీరమతిని తరువాత జగదేవుని బలియియ్య దలంచిరి. ఇట్లు ఆ దంపతులు కృతనిశ్చయులైయున్న సమయమున రాజుగారికి నా సమాచారము తెలిసి, వారిని వారించుటకై యతడు దేవిగుడికి వచ్చెను. వచ్చి జగదేవుని వలదని రాజు వారించుచుండగా నా దుష్టులలో నొకడు మరల దేవి వెనుకకుబోయి దేవివలెనే యిట్లనియె—

“రాజా! వలదని యతని నివారింపకుము. ఈ బలివలన నీకు జాల లాభము గలుగును.” ఈ మాటలు వినగానే రాజుగారికి సంశయము గలిగి, దేవి వెనుక వెదకిచూడగా నా దుష్టుల కృత్రిమము తెలిసెను. ఇదేకథ కొందరిట్లు చెప్పుదురు. జగదేవుడును అతని భార్యాపుత్రులును కాళికాదేవి వద్దకుబోయి స్వదేహములను స్వహస్తములతో బలి యిచ్చికొనిరట. వీరందరు మృతు

లయినవెనుక రాజచ్చటికి వచ్చి, వారినిజూచి దుఃఖించి, తన దేహమునుగూడా దేవికి సమర్పింపబోగా, దేవి ప్రత్యక్షయయి యతని నివారించి, మృతులయి పడియున్న జగదేవాదుల లేపె నట. ఈ రెండు చరిత్రములలో నేది నిజమైయుండవచ్చునో చదువరులే గ్రహింపగలరు.

ఇట్లు దుష్టుల దుర్మార్గత తెలిసినతోడనే రాజుగారు వారికి దగినశిక్షలను విధించి జగదేవుడు లోకహితార్థమెయును, రాజహితార్థమెయును జూపిన సాహసమునకయి యతనికి నేమి ఇచ్చినను ఋణము దీరనేరదని యెంచి, యతనికి ప్రభావతియను తన కొమార్తెనిచ్చి వివాహముచేసెను. కూతుతో ననేక గ్రామముల నల్లునికి వరదక్షిణ యిచ్చెను. దుష్టులు జగదేవునకు గీడుచేయదలచిరిగాని, యందువలన నతనికి మేలే కలిగెను.

ఈ ప్రకారము జగదేవుడు సుఖముగా కాలక్రమణము చేయుచుండగా నచ్చట ధారానగరములో ఉదయాదిత్యుడు వాఘేలీరాణీగారి కుతంత్రములనుగానలేక యామె చెప్పినట్టు రాజ్యము చేయుచున్నందున, రాజ్యములో నంతయు నన్యాయములు జరుగుచుండెను. ప్రజలందరు అసంతుష్టులై యుండిరి. ఈ సంగతులన్నియు జూచి దగ్గరనున్న యొకరాజు దండెత్తి వచ్చి, ఉదయాదిత్యుని రాజ్యమును దీసికొని, యతనిని, ఆతని బాంధవుల నందరిని గారాగృహములో వేసెను. ఈ సంగతి యంతయు జగదేవునికి దెలిసి యతడు, మామగారియాజ్ఞ పుచ్చుకొని, బయలుదేరి, ధారానగరమునకు బోయి, శత్రురాజుల నోడించి, తండ్రిగారిని మరల రాజ్యారూఢునిగా జేసెను.

అప్పుడు మంత్రిసత్తముఁడగు ధీరసింహుఁడు రాజునకు జగదేవుని సమాచారమంతయుఁ జెప్పి; యతనియందెంతమాత్రము తప్పు లేదనియు, వాఘేలీరాణియొక్క కుయుక్తులే జగదేవుని దుఃఖములకు గారణములనియు దెలియఁజెప్పెను. అప్పుడుదయాదిత్యుఁడు జగదేవుని కౌఁగిటఁ జేర్చుకొని, ముద్దాడి, యతనిని యువరాజుగా నియమించెను. అప్పటినుండి ఉదయాదిత్య మహారాజుగారికి వాఘేలీరాణియం దసహ్యతగలిగి, యాయన సోళంకీరాణిగారినే ప్రీతితో జూచుచుండెను; కాని వాఘేలిని దిన్నగా జూడవలసినదని పతివ్రతాతిలకమగు సోళంకీరాణి భర్తకు జెప్పుచుండును. ఉదయాదిత్యుని యనంతరము జగదేవుఁడు సింహాసనము నెక్కి న్యాయముగా రాజ్యపరిపాలనము చేసెను.

జగదేవునకు ముగ్గురు భార్యలుండినను, వారియందరిలో మొదటినుండి, పతికి బ్రతికార్యమందును సహాయము చేసి, యతని ఛాయవలె దిరిగిన వీరమతియే యతని ముఖ్యమహిషిగా నుండెను. కాని, యామె సద్గ్రంథములను జదివినదిగనుక గణ్వ మహాముని శకుంతలకు నుపదేశించిన

> శుశ్రూషస్వ గురూన్ కురు ప్రియసఖీవృత్తిం సపత్నీజనే
> భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మప్రతీపం గమః
> భూయిష్ఠం భవ దక్షిణా పరిజనే భాగ్యేష్వనుత్సేకినీ
> యాంత్యేవం గృహిణీపదం యువతయో వామాః కులస్యాధయః.

అను సదుపదేశము ననుసరించి సదాచారిణియై, గృహిణియన్న సార్థక బిరుదమును వహించెను.

# శికందరు బేగము

★

* "సుచింత్యచోక్తం సువిచార్య యత్కృతం
సుదీర్ఘకాలేపి నయాతి విక్రియాం"

నర్మదానదికి నుత్తరమున మధ్య హిందూస్థానములో భూపాళమను సంస్థానమొకటి కలదు. శిందేసర్కారువారి గ్వాలేరుసంస్థానమీ సంస్థానమునకును త్తర భాగముగానుండును. ఈ సంస్థానముయొక్క వైశాల్యము రమారమి యేడువేల చదరపు మైళ్లుండును. సంవత్సరమునకీ సంస్థానముయొక్క యాదాయము ౪౦ లక్షల రూపాయలు. కథానాయికయగు శికందరు బేగమీరాజ్యమునకు రాణిగా నుండెను.

పదియేడవ (౧౭) శతాబ్దముయొక్క యంత్యమునందు డిల్లీలో రాజ్యముజేసిన యౌరంగజేబు బాదషహావద్ద సర్దారుగా నున్న దోస్తమహమ్మదను తురుష్కునిచే నీరాజ్యముసంపాదింపబడెను. ఈ యఫగాను సర్దారుడు శూరుడనియు, సాహసియనియు, బుద్ధిమంతుడనియు విని యతనికి నౌరంగజేబు బాదషహా మొట్టమొదట సైన్యములో నొక చిన్నయధికారమిచ్చెను. తదనంతర మొక పర్యాయము దోస్తమహమ్మదు సైన్యముతో గూడ రాజకార్యమునకయి మాళవప్రాంతమునకు బోయెను. ఇతని ధైర్యాదిగుణములజూచి, యచ్చటి సుబేదారితనియం

---

* చక్కగా యోజించి చెప్పిన మాటయు, జక్కగా విచారించి చేసిన పనియు దీర్ఘకాలమునకును విఫలములు కానేరవు.

దనుగ్రహముగలవాడై, బాదుషాగారితో జెప్పి, ఇతనిని భైర సయా ప్రాంతమునకు సుబేదారుగా నేర్పరచెను. అచ్చటనుండు కాలములో దన చాతుర్యమువలన దాను సుబేదారుగా నున్న ప్రాంతమంతయు దనచేతికి దెచ్చుకొని, ఔరంగజేబు మరణానంతర మాతడు స్వతంత్రరాజై, భూపాళుఅను పట్టణమును తన రాజధానిగా నేర్పరచుకొనెను. కనుక బేగముగారి వంశమున కీతడు మూలపురుషుడని చెప్పవచ్చును.

దోస్తమహమ్మదుఖాన్ ౧౭౨౩-వ సంవత్సరమున మృతుడయ్యెను. ఇతని మరణానంతరము భూపాళరాజ్యమును గురించి యనేక కలహములు జరిగెను. కానితుదకు సుల్తానుమహమ్మదు యారమహమ్మదు, యాపీనమహమ్మదు, హయాతుమహమ్మదులు క్రమముగా రాజ్యారూఢులైరి. వీరిలో నాఖరువాడగు నవాబు హయాతుమహమ్మదు ౨౫ సంవత్సరములు రాజ్యము చేసెను. ఇతని రాజ్యములోనే మరాఠావారితో ననేక ఘోర యుద్ధములు జరిగినవి. ఇతడు కాలముచేసిన తదనంతర మతని కుమారుడగు గోసమహమ్మదు రాజ్యస్థుడాయెను. ఈ గోసు మహమ్మదు పేరుకు రాజుగా నుండినను నితని పినతండ్రి కుమారుడగు వజీరుమహమ్మదు రాజ్యమును జరుపుచుండెను. ఈవజీరు మహమ్మదు ధైర్యస్థైర్యములుగల పురుషుడుగావున, నాభూపాళ దేశముపై వచ్చిన సంకటముల నన్నిటిని నివారించి, దండెత్తి వచ్చిన పరరాజుల నోడించి రాజ్యమును రక్షించెను. ఈవజీరు మహమ్మదు ౧౮౧౬ వ సంవత్సరమున గతించెను. అనంతర

మాయన కుమారుడగు నజరు మహమ్మదు రాజాయెను. ఇతడు తండ్రి వలెనే బహు గుణసంపన్నుడయి ప్రజలను సుఖపెట్టెను. ఈ నవాబు కొమార్తెయే శికందరబేగము. హిందూదేశ చరిత్రములో భూపాలబేగమని ప్రసిద్ధి[1]గాంచిన నారీరత్న మీయామెయే. నజరు మహమ్మదొక దినము తన కొమార్తెను ముద్దాడి యాడించుచుండగా, అతని బావమరదియగు, ఎనిమిది సంవత్సరముల వయస్సుగల ఫౌజదారుఖాన్ అచ్చటనే యొక చిన్న తుపాకి దీసికొని యాడుకొనుచుండ నందులోనిగుండు అకస్మాత్తుగా నెగిరి, నవాబుకు దగిలి యతనిని గతప్రాణుని జేసెను !

నజరు మహమ్మదునకు బుత్రు లెవరును లేకపోయిరి ; శికందరు బేగమను కొమార్తెమాత్ర ముండెను. కాని యామె చిన్నదైనందువలన నీమెకు రాజ్యము కట్టుటకు వీలులేక పోయెను. అప్పుడచ్చటి యధికారు లందరును కంపెనీవారి యనుమతి బుచ్చుకొని, నజరుమహమ్మదునకు నన్న కుమారుడైన మునీరమహమ్మదు ఖానునకు శికందరబేగమును పెండ్లిచేసి యతనిని నవాబుగా జేయవలయుననియు, వివాహ మగువరకు నజరుమహమ్మదు భార్య యగు కుదుషిబేగము రాజ్యము చేయవలయు ననియు నిర్ణయించిరి. అటులనే శికందరు బేగము తల్లియగు కుదుషియా బేగము రాజ్యాధికారిణి యాయెను. చేతికి సంపూర్ణాధికారము వచ్చినతోడనే యామె చక్కగా రాజ్యము చేయసాగెను. రాజ్యసుఖము బహుదినములవరకు ననుభవింపవలయు నన్న యిచ్ఛగలదై, కుదషియాబేగము తన

కొమార్తెకు త్వరగా వివాహము చేయకపోయెను. త్వరగా వివాహమైనయెడల దనకు రాజ్యము రాగలదని, మునీర మహమ్మదుఖాను వివాహోత్సుకుడై, తనకు వివాహము త్వరగా జేయుమని యతడు కుదషియాబేగమును కోరసాగెను. ఇందుచే వీరిద్దరికి వైరము సంప్రాప్తమాయెను. కాని రాజ్యములోని సామంతులు, ఉద్యోగస్థులు మొదలయిన వారందరును కుదషియాబేగము పక్షమువారయినందువలన, పూర్వము చేసిన నిబంధనను కొట్టివేసి, మునీరుఖానుకు ౪౦,౦౦౦ రూపాయలిచ్చి, వారి తగవుతీర్చి, కుదషియాబేగమే రాజ్యము చేయవచ్చునని నిర్ణయించిరి. మునీరుఖానుకును శికందరు బేగముకును వివాహము చేయవలయునన్న యేర్పాటు మీరిన తరువాత, జహాంగీరనువానితో శికందరుబేగముగారి వివాహము జేయవలయునని నిర్ణయించిరి. ఈ జహాంగీరుకూడ శికందరు బేగముయొక్క పెదతండ్రి కుమారుడే. ఇచ్చట హిందూ చదువరులు మహమ్మదీయులలో గల యొక రూఢిని జ్ఞాపక ముంచుకొనవలయును. మనలో మేనమామకూతురును వివాహమాడుట సశాస్త్రీయ మైనట్లు; తురకలలో బినతండ్రి పెద తండ్రుల కొమార్తెలతో బెండ్లియాడుట సశాస్త్రీయము. ఇది మనకు వింతగా గానుపించునుగాని, తురకలలో సామాన్యమైన రూఢియే.

కుదషియాబేగము సంపూర్ణముగా రాజ్యలోభగ్రస్తయై నందువలన దనబిడ్డను జహాంగీరునకు కిచ్చి వివాహము చేసెద నని కాలము గడుపుచుండెనేగాని, త్వరగా వివాహము

చేసినదికాదు. ఐనను శికందరుబేగముపవరరైనందువలన ౧౮౩౯వ సంవత్సరమున నాందువివాహము జరిగెను. ఈవివాహ సమారంభము బహు గొప్పగా జరిగెనట. వివాహము జరిగిన తోడనే జహాంగీరు తాను 'నవాబు' అను బిరుదును వహించి, రాజ్యము చేయ యత్నించెను. తనచేతిలోని రాజ్యము వదలగూడ దని కుదషియాబేగము నిశ్చయించెను. ఇట్లు రాజ్యలోభముచే, అత్తగారును, అల్లుడును పరస్పర వైరులయిరి. ఇట్లు కొంత కాలము జరిగినపిమ్మట, నొకరితో నొకరు యుద్ధము జేయుటకయి వారిద్దరును సైన్యములను పోగుచేసిరి. కుదషియాబేగమును బట్టి కారాగృహమునం దుంచుటకయి జహాంగీరుఖాన్ యత్నించెను. కాని యతనికి జాలునంత ధైర్యము లేనందువలన నతడీ యత్నమునందు విఫలుడయ్యెను. ఇట్టి యత్నము జరిగినతరువాత బేగము అత్యంత క్రోధాన్వితురాలయి యుద్ధమునకు సన్నద్ధురాలాయెను. ఇద్దరికిని ఘోరయుద్ధము జరిగి యందు జహాంగీరు పరాజితుడయ్యెను. అందువలన నతనికి మూడు మాసముల వరకు గారాగృహవాసము చేయవలసివచ్చెను. కాని ఇంతలో ఇంగ్లీషువారును, మరికొందరును, మధ్యస్థులై, ఆయనను విడిపించి ౧౮౩౭వ సంవత్సరమున రాజ్యాభిషిక్తుని జేసిరి. కుదషియా బేగముగారికి ౬౦,౦౦౦ రూపాయీల స్వతంత్రజమీన్‌దారి యిచ్చిరి. అప్పటినుండి యామె భూపాళరాజ్యవిషయమైన సంగతులలోనికి రాగూడదని కట్టుదిట్టములు చేసికొనిరి.

జహాంగీరు రాజ్యము జేయుటయందు దక్షుడు కానందు వలన లోకప్రియుడు గాకపోయెను. స్వభావముచేత దుష్టుడై

నందువలన భార్యను దిన్నగా జూడకుండెను. సదా వ్యసనాసక్తుడై యున్నందువలన భార్యాభర్తల కనుకూలత లేక కలహములే జరుగుచుండెను. కాని శికందరు బేగము సద్గుణవతి గనుక, ఆ దాంపత్యకలహము చాలరోజులవరకు జరిగినదికాదు. పెనిమిటికి వీలయినంతవరకు బుద్ధిచెప్పి చూచి లాభము లేదని తెలిసికొని, కలహము లాపుటకొరకై తల్లివద్దకు వెళ్ళియుండుచు వచ్చెను. జహాంగీరుఖాన్ దుర్మార్గుడై, యత్యంత వ్యసనాసక్తుడై నందువలన దొమ్మిది సంవత్సరములే రాజ్యముచేసి ౧౮౪౭వ సంవత్సరమున మృతుడయ్యెను. ఇతనికి దస్తగీరను దాసీపుత్రుడొకడుండెను. జహాంగీరు మృతుడయినప్పుడీ దాసీపుత్రునకు రాజ్య మియ్యవలసినదని మృత్యుపత్రమునందు వ్రాసెను. కాని ఈమృత్యుపత్రము నెవరును ఒప్పుకొనిన వారు కారు. శికందరు బేగమునకు శహాజహానను స్వల్పవయస్కురాలగు కూతురొకతె యుండెను. ఈమె రాజ్యమున కధికారిణి గనుక,నీమె పెద్దదియగువరకు నీమె పేరిట శికందరు బేగముగారు రాజ్యపరిపాలనము చేయవలయునని ఇంగ్లీవారు నిర్ణయించిరి.

శికందరు బేగము మొదలే బుద్ధికుశలత గలదని విఖ్యాతి జెందియుండెను. అందులో నింత గొప్పరాజ్యమునకు స్వామిని యైనందువలన నామెకు బుద్ధివికాసముజూపుటకు మరింత యవకాశము గలిగెను. వర్షోదయమువలన చాతకములకును, క్షీరపానమువలన హంసపక్షులకును, చంద్రోదయమువలన చకోరములకును, అత్యంతానందము గలిగినటుల, శికందరు బేగము రాజ్యాధికారమును వహింపగానే ప్రజల కమిత ప్రమోదము

గలిగెను. ఈమె సింహాసనారూఢ కాగానే సంస్థానమునందంత టను గొప్ప యానంద ఘోషమునకు ప్రారంభ మాయెను. రాజ్యమునందనేకోత్సవములు జరిగెను.

ఈమె రాజ్యకార్య ధురంధరత్వమును సవిస్తరముగా వర్ణింపబూనిన నొక గొప్ప స్వతంత్ర గ్రంథమగును. కనుక నటుల చేయక యీ మె విషయమై యొక గ్రంథకారుడు సంక్షేపముగా వ్రాసియున్న సంగతినే యిచ్చట భాషాంతరీకరించి వ్రాసెద. "శికందరుబేగమునకు రాజ్యాధికారము సంప్రాప్తమైనందువలన, ఆమె బుద్ధిప్రకాశము ప్రసరించుట కత్యంతవిశాలమైన యవ కాశము దొరకెను. ఆమెకర్తృత్వసామర్థ్యములనుగురించి లోకు లకు గల నమ్మకము నిజమని యామె కార్యముల వలన స్థిరపర చెను. రాజ్యమునకుగల ఋణమంతయు నామె యారు సంవత్స రములలో దీర్చివేసెను. గ్రామములు, తహశ్శీళ్లు వగైరాలు మక్తాకిచ్చెడి పూర్వపురీతి దీసివేసి,సొంతముగా గ్రామాధిపతుల వద్దనుండి తానే పన్నులు పుచ్చుకొనసాగెను. కొన్ని పదార్థ ముల గొందరు వ్యాపారులే అమ్మవలయునని గల నిర్బంధముల దీసివేసి, ఆ పదార్థములందరు అమ్మవచ్చునని ఏర్పాటుచేసెను. ఇట్లు వ్యాపారవృద్ధికి దాను ముఖ్యకారణమాయెను. టంక శాలయొక్క బందోబస్తు సొంతముగా నామె చూచుకొనెను. సంరక్షకభటుల ననేకుల క్రొత్తగా నేర్పరచి వారు దేశ మునకు నష్టముచేయకుండ క్షేమమే చేయునటుల నేర్పాటు చేసెను. ఇట్లు రాజ్యములో ననేక సంస్కరణలాచరించెను. ఆమె ధైర్యముతో, సతతప్రయత్నముతో, బుద్ధికుశలతతో ప్రజల

హితముకొరకు రాజ్యమునందు జేసిన సంస్కరణములు, అనుభవము గలిగినట్టియు. రాజ్యకార్యధురంధరు డగునట్టియు బురుషునకుగూడ భూషణాస్పదంబులు" ఈ గ్రంథకారుని వాక్యముల వలన శికందరుబేగ మెంత రాజధర్మ నిపుణమయినది తేటపడుచున్నది. ఈమెయందు గల ముఖ్యగుణము వత్సలత; అనగా ప్రజలను వాత్సల్యముతో జూచుకొని ప్రేమించుట. ఇందు విషయమై భర్తృహరి తన నీతిశతకమునందిట్లు వ్రాసియున్నాడు.

రాజన్ దుధుక్షసి యది క్షితిధేనుమేనాం
తేనాద్య వత్సమివ లోకమముం పుషాణ
యస్మింశ్చ సమ్యగనిశం పరితుష్యమాణే
నానాఫలైః ఫలతి కల్పలతేవ భూమిః.*

ఇట్లు బేగమువారు లోకులయెడ వాత్సల్య ముంచుటవలన, వారు సకలజనులకు బూజ్యులయి, పృథ్విని కల్పవృక్షముగావించి, స్వేప్సితఫలములను గైకొనిరి! బేగముగారివలె బ్రజావాత్సల్యమే పరమధర్మమని సకలరాజులు తలంచి, అటుల వర్తించుటకు యత్నించిన పక్షమున, లోకములోని జనులందరు సుఖింతురుగదా ? జితజేతలలోని వైరముడుగునుగదా ?

రాణీగారు తురుష్కులయినను, శమరాజ్యములోని హిందూ జనులను దయతో జూచుచుండిరి. నిరపరాధులగు

---

* "తే. గీ. ధరణిధేనువు బిదుకంగ దలచితేని
జనుల బోషింపు మధిప వత్సములమాడ్కి
జనులు పోషింప బడుచుండ జగతి కల్ప
లతవిధంబున సకలఫలంబు లొసగు."

హిందువుల ననేకులను తురుష్క-రాజులు పశువులవలె నరికి వేసిరని యితిహాస ప్రసిద్ధమే కనుక, బేగముగారియందు గల సమత విశేష ప్రశంసనీయము.

బేగము షహాజహానునకు, అనగా బేగముగారి కొమారెకు బదునెనిమిది సంవత్సరముల ప్రాయము వచ్చువరకు బేగముగారు రాజ్యము చేయవలయునని యింగ్లీషువారు సిద్ధాంతము జేసిరని వెనుక వ్రాసియుంటిని. ఇంత కొద్దికాలములోనే బేగమువారు తన సంస్థానమును ఒక యద్వితీయమైనట్టియు, ననుకరణీయ మైనట్టియు సంస్థానముగా జేసిరి. అక్బరుబాదుషా తరువాత జన్మించి రాజ్యపరిపాలనను జేసిన తురుష్క-లలో నీమె యుత్తమ ప్రభ్వియని చెప్పుటకు సందేహము లేదు. అక్బరునందుండిన సద్గుణములలోని యనేక సద్గుణము లీమెయందు వాసము చేయుచుండెను. కంపెనీవారి ప్రభుత్వములోని గొప్పగొప్ప యధికారు లీమె రాజ్యవ్యవస్థను జూచి సానందాశ్చర్యమును బొందుచుండిరి. రాజ్యములోని ప్రజలందరును సదా సంతోషముతో "మా పురాకృత పుణ్యమువలన మాకీ శికందరు బేగముగారు రాణిగా లభించిరి" అని కొనియాడుచుండిరి.

ఇట్లు బేగముగారు సకలవందితులయి రాజ్యము జేయుచుండ, ఆమెకూతురగు బేగముషహాజహాను ఉపవరయయ్యెను. అప్పుడు బేగముగారి చిన్నదానికి, బక్షీబాకర మహామ్మదఖానను వరుని దెచ్చి, వివాహము జేసిరి. అప్పటికి బేగముగారు బిడ్డకు రాజ్యమిచ్చుటకు మూడుసంవత్సరముల

వ్యవధి యుండెను. బేగముగారి మనమున నంత్యకాలమువరకు దామః రాజ్యము చేయవలయు నన్న యిచ్ఛయుండెను. బేగముగారియిచ్ఛ త్వరలోనే సిద్ధించెను.

౧౮౫౭ వ సంవత్సరమున ఉత్తర హిందూస్థానము నందలి పటాలములోని సిపాయిలు తిరుగబడినందున ఇంగ్లీషు వారికి గొప్ప సంకటము సంభవించెనని, హిందూదేశ చరిత్రము చదివినవారి కందరికిని తెలిసినవిషయమే. ఆ సంకటసమయమున, దయార్ద్రహృదయ యగు బేగమువారు ఇంగ్లీషువారి కనేకరీతుల సహాయము జేసి, ఇంగ్లీషువారు సూర్యచంద్రాదు లుండువరకు మరవగూడని యంత యుపకారము జేసినది. సంకట సమయమున నింగ్లీషువారికి నుత్తర హిందూస్థానము నందు శిందోహోళకరులును, మధ్యహిందూస్థానమునందు భూపాళుబేగముగారును, దక్షిణమున నైజామును, సహాయము జేసి నందువలననే యీ దేశమునం దాంగ్లేయులుండ గలిగిరేమో. అనగా మనమిపుడింగ్లీషురాజ్యమువలన ననుభవించుచున్న శాంతత, నాగరికత, విద్యాభివృద్ధి మొదలగు సౌఖ్యములకు అంశతః శికందరుబేగముగారు కారణ భూతురాలని నిర్భయముగా జెప్పవచ్చును. ఈమె రాజ్యములోని యనేక జనులును, సొంతముగా నీమె తల్లియు, నింగ్లీషువారిపై దిరుగబడిరి; కాని యీమె వారందరిని నివారించి, మృత్యుముఖమున బడనున్న యనేకాంగ్లేయుల యుక్తి ప్రయుక్తులతో నింగ్లీషు సైన్యముండిన హుషంగాబాదు పట్టణమునకు సురక్షితముగా జేర్చుటయందు బేగముగారు చూపిన ధైర్యమత్యంత

ప్రశంసనీయము. ఇట్లనేకరీతుల బేగముగారు ఇంగ్లీషువారికి సహాయముచేసి అంతగ శాంతపడిన తరువాత నింగ్లీషువారి రాజ్యము స్థిరపడుటకును అనేక రీతుల సహాయము చేసెను. ఈ ప్రకారముగా నీమె ఇంగ్లీషువారిని కృతజ్ఞతా బద్ధులనుజేసి నందువలన, వారీమెను చాల సన్మానించి, అదివరకు దీసికొనిన భైరసియాప్రాంత మామె కిచ్చివేసిరి. ౧౮౫౯వ సంవత్సరమున నింగ్లీషువారు, శికందరుబేగము భూపాల సంస్థానమునకు స్వామినియనియు, మరణకాలమువరకీమెయే రాజ్యము చేయ వలయుననియు, ఈమె మరణానంతర మామెకొమార్తెకు రాజ్యము దొరకుననియు నేర్పాటు చేసిరి. ఇట్లు బేగముగారి యిచ్ఛ సిద్ధించెను. ఇంగ్లీషువారు కృతజ్ఞతాబుద్ధితో నామెకు నాలుగు తోపులు బహుమాన మొసంగిరి. వారు ౧౮౬౩ వ సంవత్సరమున గొప్ప దర్బారుచేసి బేగముగారికి 'స్టార్ ఆఫ్ ఇండియా' అనగా 'హిందూదేశముయొక్క నక్షత్ర'మను బిరుదు నొసంగిరి. ఇట్లు బహువిధముల నింగ్లీషు ప్రభువు లీమెను సన్మానించిరి.

శికందరుబేగ మిట్లు రాజ్యకార్యదక్షతను గురించి కీర్తిని సంపాదించి, ఇంగ్లీషువారియెడ రాజనిష్ఠతనుజూపి, వారిచే ననేక సన్మానములను బడసి, ప్రజల ప్రీతికి పాత్రురాలయి యైహికసుఖముల ననంతముగా ననుభవించుచుండెను. కాని సౌఖ్యములలో నామె పారమార్థికవిచారమును మరచినది కాదు. ఆమె బీదలయందధిక దయగలదయి వారి దుఃఖనివారణమున కనేకోపాయములను జేసెను. ఈమెస్త్రీలకు స్వాభా

వికములయిన యనేక ధర్మకృత్యములను జేసియున్నది. తురుష్కుల ధర్మశాస్త్రప్రాకార నామె ప్రతిదినమును మూడు పూటల దప్పక ఈశ్వర ప్రార్థన చేయుచుండెను. ౧౮౬౩ వ సంవత్సరమున, ఆమె రాజ్యమంతయు బిడ్డకప్పగించి, ఆరాజ్యమును కాపాడవలయునని ఇంగ్లీషు ప్రభుత్వమువారికి విన్నవించి, తాను మక్కాయాత్రకు వెళ్ళెను. మన హిందువులకు గాశీ మొదలనో, తురష్కులకు మక్కా అట్లలనని చనువరులు గ్రహింపగలరు. యాత్ర చేసికొని అచ్చట ననేకధర్మములు చేసి, దానశూరురాలని కీర్తిని జెందెను. అచ్చటినుండి తిరిగి తన రాజ్యమునకు వచ్చి, ౧౮౬౮ వ సంవత్సరము వరకు బరమార్థ విచారములో సుఖముగా గాలము గడిపెను. ౧౮౬౮ వ సంవత్సరమున నీమెకు నొకవ్యాధికలిగి, అక్టోబరు నెల ౩౦ వ తేదీని ఈమె కాలధర్మమును జెందెను. అప్పుడీమె ప్రజలును, ఇంగ్లీషువారును దుఃఖితులయిరి.

ఈమె కాలము చేసినతరువాత నీమె కూతురగు షహాజకా బేగము సింహాసనమెక్కి, మిక్కిలి న్యాయముతో రాజ్యము చేయుచున్నది. తల్లివలె నీమె ప్రజావాత్సల్యమునందును, ఇంగ్లీషువారియెడ రాజభక్తి దృఢముగా జూపుటయందును మిక్కిలి ఖ్యాతినిగన్నది. ఈమె సుగుణములను దర్బారునందు నింగ్లీషువారు పొగడి, యీమెకు జీ. సీ. యస్. ఐ అన్నపదవిని ఇచ్చిరి.

లార్డు ల్యాండున్సడౌకగారి ప్రభుత్వ సమయమునందాయన భూపాలు సంస్థానము జూచుటకు వెళ్ళి, యచ్చటి

ప్రభుత్వమునుజూచి మెచ్చి యా సంస్థానమును గురించి యిట్లు వ్రాసియున్నాడు :—

"భూపాలసంస్థానాధీశ్వరు లెప్పుడును రాజ్యకార్యధురంధరత్వమునకును, రాజభక్తికిని, ఔదార్యమునకును ప్రఖ్యాతులయి యున్నారు. ప్రస్తుతపు సింహాసనాధీశ్వరియొక్క తల్లిగారగు శికందరు బేగముగారు ౧౮౫౭వ సంవత్సరమున బ్రిటిషువారికి (ఇంగ్లీషువారికి) జేసిన సహాయ మెప్పుడును మరవదగినదికాదు. ఇప్పటి బేగముగారు, తల్లిగారిరాజ్యము గ్రహించినటులనే, ఆమె సద్గుణములనుగూడ గ్రహించినది. ఈమె, సారాసార విచారము గలిగినట్టియు, బుద్ధివైభవము గలిగినట్టియు, రాజ్యకర్త్రియని పేరొందినది; ఆమె లోకోపకార ప్రదములైన యనేక కార్యముల కొరకత్యంత ధనమును వ్యయపరచినది. ఈమె రైళ్ళు కట్టుటకు సహాయము జేసినది; భూపాలులోని లోకులకొరకు నద్వితీయ మయిన జలము దెప్పించినది. తాను కొన్ని దినములక్రిందట తన సైన్యములలో నుండి యిచ్చెదనన్న సైన్యమును బ్రిటిషువారు తీసికొనవచ్చుననియు, ఆ సైన్యము హిందూదేశ సంరక్షణార్థ ముపయోగింపవలసినదనియు, నీమె నాకు నేడు తెలియజేసినది."

ఈ వంశస్థులిటులనే కీర్తినిజెంది, శికందరుబేగము వంటి యనేక బేగములచే భూషితులగుదురుగాక యని ఈశ్వరుని ప్రార్థించి, యీ చరిత్రము సమాప్తి చేయుచున్నాను.

# రాణీ దుర్గావతి

★

గీ. చిగురుల గదల్చుటను నగ్ని చెలఁగి మంచు;
చెడుగు చేయుటచే బాము పడఁగ ద్రిప్పు
మఱియు క్షోభంబువలనే మానవుఁడును
దనదు మహిమంబు చూపును తథ్యముగను. — వీరేశలింగ కవి.

పదునారవ శతాబ్దమున బుందేల్‌ఖండు సంస్థానములో ప్రసిద్ధికెక్కిన రాజులలో ప్రథముఁడగు చందవేల్ రాజునకు రూపగుణసంపన్నురాలగు ఒకకన్యకగలిగెను. ఆమె పేరు దుర్గావతి. ఆమె రూపగుణముల కీర్తి దిగంతములనిండి, యనేక రాజపుత్రు లామె కొరకు చందేల్ రాజును ఆశ్రయించుచుండిరి. కాని, యా రాజపుత్రులు తన కూతునకు దగినవారు కారని యెంచి, చందేల్ రాజు వారికేదో యొక కారణముచెప్పి పంపుచుండెను. ఒకసారి గఢామండలా సంస్థానాధిపతియగు గోండు రాజు దుర్గావతిని దన కిమ్మని యామె తండ్రిని వేడెను. ఈ గోండురాజుయొక్క శౌర్య సాహసములను గురించి చారులచే వినినది గావున, దుర్గావతియు నాయన యందు బద్ధానురాగయై యుండెను. గోండులు జాతియందును, విద్యయందును, నాగరికత యందును రాజపుత్రులకంటె దక్కువవారు. గోండువారార్యులుగారు; అనార్యులు. కనుక నిట్టి నీచకులజునికి దమ శ్రేష్ఠవంశపు కన్యను ఇచ్చుటకు చందేల్ రాజునకు నిష్టములేక పోయెను. కాని, అప్పుడు గోండురాజు మిక్కిలి బలవంతుడుగా

నుండెను. ఈరాజు పాలించెడి గఢామండల రాజ్యమంతగా
గొప్పది కాకపోయినను, అతడు మిక్కిలి బలవంతుడై, అతనికి
అనేక రాజులు సహాయులుగా నుండిరి. ఇట్టి రాజుతో బోరి
గెలుచుట దుర్లభమనియు, దుర్గావతి మనము అతనియందు
చిక్కినదనియు నెఱిగి, చందేల్ రాజు గఢామండలేశ్వరునకు
దన కన్యకనిచ్చి మహావైభవముతో వివాహము చేసెను.

వివాహము జరిగినతరువాత నత్తవారింటికి వచ్చినప్పుడు
దుర్గావతి, తండ్రిరాజ్యమునందున్న బీదసాదల కనేకులకు
శాశ్వత జీవనము లేర్పరచెను. అందువలన వారందరామెను
తమపాలిటి దైవమని భావించి యామె కనేకములైన దీవన
లొసంగిరి. ఈమె గఢామండలమునకు వచ్చినతరువాత నీమె
భర్త, రాజ్యవిచారణమేమియు చేయక, యీమెయందే యధి
కానురాగము కలవాడై, సదా నర్మదానదీతీరమునను, అచ్చట
నున్న యుద్యానవనములయందును విహరించుచు కాలము
వ్యర్థపుచ్చుచుండెను. అనేకపర్యాయములు దుర్గావతి రాజ్య
మును బాగుగా నేలుడని రాజునకు సూచించెనుగాని, విషయా
సక్తుడయిన రాజు ఆ మాటలను లక్ష్యపెట్టినవాడు కాడు. అంత
గొంత కాలమునకు దుర్గావతీరాణి గర్భవతియయి యొక
పుత్రుని గనెను. ఆ పుత్రునికి ఖదిసంవత్సరముల ప్రాయము
వచ్చినప్పుడు, రాజుగారేదో రోగముచేత మృతినొందెను.
అప్పుడు రాజ్యపాలనమంతయు దుర్గావతిమీద బడినందున
నామె తన కుమారుని సింహాసనాధీశు జేసి, యతని పేరిట తానే
రాజ్యము జేయజొచ్చెను. ఆమె తన పెనిమిటివలెగాక, మిగుల

దక్షతతో, న్యాయముతో, రాజ్యపరిపాలనము జేయుచు బ్రజలను సంతోష పెట్టుచుండెను!

ఇట్లు తన ప్రజలను సుఖపెట్టుచు, పరరాజులతో వైరము లేక యిదారుసంవత్సరములు రాణీగారు రాజ్యముచేసినతరువాత, మొగలాయి రాజైన యక్బరుబాదుషా ఆమె కీర్తివిని, యిట్టి రాజ్యము పరిపాలించెడి రాణి మనకు నంకితురాలుగా నుండవలయునని నిశ్చయించెను. ఇట్లుతలచి యక్బరు ఆసఫ్ ఖాన్ అను ప్రసిద్ధవీరుని ౧౫౬౪వ సంవత్సరమున దుర్గావతి రాజ్యముపైకి బంపెను! అక్బరు సకలసద్గుణసంపన్నుడని చరిత్రకారులు చెప్పెదరు. అతనియందు ననేకసద్గుణములుండెడివి. ఇతర యవనప్రభువులతో బోల్చిచూచినయెడల నతడు దేవసమానుడే యనిచెప్పుటకు సందేహము లేదు. కాని, యిట్టి మహాత్మునిగూడ రాజ్యకాంక్ష వదలినదికాదు. రాణి దుర్గావతి యక్బరునేమి, ఆయన రాజ్యములోని ప్రజలనేమి యెంతమాత్రము బాధపెట్టినది కాదు. వారి జోలికైన నెన్నడు పోయినదికాదు. ఇట్టులుండగా నా యబలమీదికి సైన్యమంపుట మహాత్వాకాంక్షగాక మరి యేమి? ఇట్లు ఆసఫ్ ఖాను శూరుడు (అవును. అబలతో యుద్ధమునకు దలపెట్టినవాడు శూరుడే.) తనపై దండెత్తి వచ్చుచున్నాడన్నమాట విని, దుర్గావతి భయపడక, మహాధైర్యముతో యుద్ధమునకు సిద్ధము చేయసాగెను. మహాప్రయత్నముచేసి కొద్దికాలములోనే ౧౫౦౦ కరులను, ౧౫౦౦౦ తురంగములను, గొప్ప కాల్బలములను సిద్ధపరచెను. తాను పురుషవేషము ధరించి, ఆయుధములను బుచ్చుకొని, ఏనుగుపై నెక్కి.

ప్రత్యక్షదుర్గవలె యుద్ధభూమికి వెడలెను! ఆమెనుజూచి సైనికుల కందరికిని ఉత్సాహము గలిగి వారిశౌర్య మినుమడియై వారు శత్రుసైన్యముపై నడరి యతిధూర్తు లగు యవన సైనికుల ననేకుల రూపుమాపి, మరునాడా సేనాధిపతిని యమసదనమున కనుప నిశ్చయించిరి. కాని, ఢిల్లీశ్వరునిచే మహావీరుడని ప్రఖ్యాతిని గాంచిన ఆసఫ్ ఖాన్ కొద్దిసైన్యముతో నీమెను జయించుట దుస్తర మని తెలిసికొని, మరునా డింకను సైన్యమును గూర్చుకొని, తమవద్దనున్న ఫిరంగీలన్నియు నగ్రభాగమునం దుంచి, గోండుసైనికులపై నకస్మాత్తుగా వచ్చి, తన సామర్థ్యమంతయుజూప, వారు చీకాకుపడి శత్రువుల మార్కొన శక్తులు కాకయుండిరి. ఇట్టి దురవస్థజూచి, దుర్గావతీకుమారుడల్పవయస్కు డయ్యును, అభిమన్యు కల్పుడుగాన తాను ముందై వెరవవలదని సైనికులకు ధైర్యమిచ్చి, శత్రువులను మార్కొనెను. ఇట్లు కొంతసేపు మహాధైర్యముతో బోరాడి యాబాలశూరుడు బాణఘాతముచే మూర్ఛిల్లెను. అప్పుడు సైనికు లందరు చింతాక్రాంతులై యాదుఃఖవార్త యింకొకవైపున తురకలను మర్దించుచున్న దుర్గావతికి దెలియజేసిరి. ఆమాటవిని, దుఃఖించుట కిది సమయము కాదనియెంచి రాణీగారిసుమంతైనను జలింపక పుత్రవాత్సల్యమును ఆపి, తనసేనాధిపతికి నిట్లు వర్తమానము చేసెను. "ఈసమయము ధైర్యమును వదలి దుఃఖించుచు కూర్చుండ తగినదికాదు. శత్రుహననము మన ముఖ్యకర్తవ్యము. ఈశ్వరేచ్ఛ వలననైన కార్యమునకు వగవ పనిలేదు. కాన పిల్లవానిని శిబిర

మునకు గొనిపోయి తగిన యుపచారములు చేయుడు. నేని ప్పుడు యుద్ధమును విడిచి వచ్చుటకు వీలులేదు. రణయజ్ఞము సమాప్తముచేసి, ప్రాప్తియున్న మరల జూచెదను." ఈయనుజ్ఞ ప్రకారము సైనికులు కార్యమును జరిపిరి.

యుద్ధమునందు గొంతసేపు వారికి జయమును, కొంత సేపు వీరికి జయమును గలుగుచు; తుద కెవరు గెలుతురో నిశ్చయించుటకు వీలులేకయుండెను. ఇట్లు కొంతసేపు వుభయ పక్షముల సమానముగా యుద్ధము జరిగి, అది హిందువుల స్వాతంత్ర్య నాశన కాలముగాన, తురుష్కులకే యాధిక్యము వచ్చెను. గోండుసైనికులు పోరాడిపోరాడి, ఉత్సాహహీనులైరి. గోండులెట్లెట్లు ఉత్సాహహీనులైరో, అట్లట్లు మ్లేచ్ఛుల బలము హెచ్చుచు బోయెను. తమరాజ్యమును గోండుదేశమునందు స్థాపించవలె నన్న దృఢేచ్ఛ గలవారు గనుక 'దీన్‌దీన్' అను రణశబ్దముచ్చరించుచు ఘోరముగా గోండు సైన్యములను వెగ టార్చిరి. ఇట్లుభయంకరమయిన హననయజ్ఞము జరుగగ,మూడు వందల సైనికులతోడ దుర్గావతిరాణిమాత్రము బ్రతికి భయం కరముగా బోరాడుచుండెను. ఆమెను మార్కొనుటకు ఆసఫ్ ఖాన్ దుర్గావతివద్దకి స్వయముగా వచ్చెను. కాని యామెరౌద్ర మునుజూచి భయమంది, దూరముపోయి, అటనుండియామెపై బాణవర్షమును గురిపించదొడగెను. ఆమెయాబాణముల నన్ని టిని దునిమెను. కానియందొక బాణము శిరస్సునందు గ్రుచ్చు కొనగా నామె మరింత క్రోధాయమానమానసయై, ఆ బాణ మును తానె పెరికివైచి, మరింత రౌద్రముతో యుద్ధము చేయ

సాగెను! అప్పుడామె శరీరమంతయు రక్తమయమైన సంగతి చూచి, ఆమె పస్సినదని తెలిసికొని, స్వామిభక్తిగల యొక సేవకుడు డామెను సమీపించి యిట్లనియె. "అమ్మా! మీరిక యుద్ధమును జేసినందువలన లాభమేమియు లేదు. కొద్దికాలములోనే శత్రువులు మిమ్ము చెరబెట్టగలరు. వారిచేతులలో బడక శీఘ్రముగా నిచ్చటనుండి పలాయనము చేయుట మేలు; తమకు కొంక యిబ్బందిలేక నేను ఆవలకు దీసికొనిపోయెదను." ప్రియ సేవకుడు పలికిన యీ వచనములు విని, ఆమె చింతించి, శత్రువులు నిజముగా సమీపించుచున్నారని చూచి, పవిత్రమైన దేహము మ్లేచ్ఛులచే నపవిత్రమగునన్న మాటమాత్రము తలపునకు రాగా సహింపలేక, విషణ్ణవదనయై, తన సేవకుని జూచి యిట్లనియె. "ఓరీ! నీ వన్నమాట నిక్కము. ఇదిగో నా చేత నున్న ఖడ్గముం గొని, యిచ్చటనే నా శిరచ్ఛేదము చేయుము; నేను క్షత్రియకన్యను; కాన పగరకు వెన్నిచ్చి చనుట నాకనుచితము. ఈ శరీరము శత్రులంటగూడదు. కాన నీ వన్యథా విచారము చేయక నా తల నరుకుము. అందుచే నేను వీరస్వర్గమును బొందుదును. నా యాజ్ఞ విని నన్ను సంకటము నుండి కాపాడినందున నీకును బుణ్యమే గలుగును; పాపము గలుగ నేరదు." ఈ మాటను విన్నతోడనే ఆ స్వామిసేవాపరాయణుడయిన సేవకుడు నిశ్చేష్టితుడై, యేమియుదోచక నిలువబడెను. కొంతసేపట్లు నిలువబడి వాడిట్లనియె. "తల్లీ! నా విన్నపమాలకించి, ఈ యేనుగు నెక్కుడి. అది శీఘ్రముగా మిమ్మును శత్రువుల బారినుండి తప్పించి, యవతలకు గొనిపోవును. నేను స్త్రీ

వధ చేయజాలను." అప్పుడా రాణీగారు మిక్కిలి విచారించి, మ్లేచ్ఛులామెను సమీపించుట గని, తన ఖడ్గమునకు మ్రొక్కి దానితో దనంతట దానే పొడుచుకొని రణభూమియందే ప్రాణములు విడిచెను!!! రాణీగారి శవము మ్లేచ్ఛులచే బడకుండ నామె సేవకుడు భద్రపరచి, తానును యుద్ధముచేసి యచటనే మృతుడయ్యెను! రాణీగారి కుమారుడును పరలోకగతుడయ్యెను. ఇట్లొక తురకబాదుషాయొక్క రాజ్యలోభముచేత గోండు సంస్థానములోని నిరపరాధులగు లోకులందరు హతులైరి. ఆహా! రాజ్యలోభ మెట్టి ఘోరకృత్యములను జేయునో చూడుడి.

ఈ రణశూరయైన దుర్గావతి యొక్క సమాధి జబ్బలపురమువద్ద నున్నది. ఆ సమాధియొద్దనే ఈమె గుణవర్ణనాత్మకమైన శిలాశాసనము కలదు. అచ్చటికి వెళ్లిన బాటసారులందరును ఆ సమాధిని మహాభక్తితో జూచి, ఈ శూరనారినిగురించి పూజ్యభావమును వహించెదరు. బరమ ధార్మికుడయిన యొక బాటసారి యీమెను గురించి యిట్లు వ్రాసియున్నాడు. "దుర్గావతి యొక్క సమాధ యీ పర్వతదేశమునందు నిర్మించబడినది. అచ్చట రెండు పాషాణ స్తంభంబులున్నవి; వానిని జూడగానే వెనుక జరిగిన యుద్ధము మూర్తివంతముగా గనుల యెదుట గానబడును. ఆ గిరిశిఖరముమీద నిప్పటికిని భయంకరమైన రణఘోషము రాత్రిపూట వినవచ్చునని అచ్చటిలోకులు నమ్మెదరు. నిర్జనమయ్యును, రమణీయమగు నీ స్థలమునకు వచ్చెడి బాటసారులు ప్రేమపూర్వకముగా రాణీగారి సమాధిని దర్శిం

తురు. ఆమె పరాక్రమశ్రవణముచే విస్మయచిత్తులయి నానందములో నామె సమాధిని బూజించెదరు. ఆ స్థలమునందు ప్రకాశమానము లయిన గాజుతునుకలనేకము లున్నవి. ఆగాజు తునుకలే రాణీగారికి బాటసారులర్పించెదరు. ఈ పూర్వా చారము ననుసరించి, నేనును దుర్గావతియొక్క దివ్యగుణము లను అభినందించుటకయి యొకగాజుతునుక సమాధికి సర్పిం చితిని.” అవును. ఇట్టి యలౌకికశౌర్య మేరికినభినందనీయము గాకుండును? క్షత్రియులకు నత్యంత శ్రేయస్కర మయిన ధర్మమును నాచరించి స్వర్గద్వారమునందు జొచ్చినవారు పురుషులయినను, స్త్రీలయినను సర్వజనవంద్యులే. కృష్ణ మూర్తియు నర్జుననకదియే బోధించినాడు :—

యదృచ్ఛయాచోపపన్నం స్వర్గద్వార మపావృతమ్
సుఖినః క్షత్రియాః పార్థ ! లభంతే యుద్ధ మీదృశమ్. *

* ఓ అర్జునుడా ! కోరకుండ సంభవించినట్టియు, తెరవబడిన స్వర్గ ద్వారరూపమయినదియు నగు నిట్టి యుద్ధమును ఏరాజులు పొందుచున్నారో వారలు సుఖులగుచున్నారు — భగవద్గీత. అ. ౨. శ్లో 3౨.

(7)

నిచ్చెను. అందు సందరకంటెను చిన్నకూతురగు తరులత కలకత్తాలో ౧౮౫౬వ సంవత్సరమునందు జన్మించెను. ఈమె బాల్యమంతయు నా నగరములో గడిచెనని చెప్పవచ్చును. తరులత యందరకన్న కడసారి కూతురగుటచే నామెను అందరును "తోరు" అను ముద్దుపేరు పెట్టి పిలుచుచుండిరి.

తోరూదత్తు తండ్రి స్త్రీవిద్యాభిమాని యయినందున నితరబంగాలీ స్త్రీలకు విద్యార్జనమునందు గలుగు నిబ్బంది లేమియు లేక విద్య నభ్యసించుటకు నితర బాలికలకు నలభ్యములైన సాధనములెన్నియో ఈమెకు బాల్యమునుండి లభించెను. ఈమెతండ్రి యత్యుత్సాహముతో నీమెకును, పెద్దకూతురగు ఆరూబాయికిని విద్యగరపెను. పిదప కుమారుడగు అబాజీతో నీ యాడుబిడ్డలకును ఇంగ్లీషు నేర్పుటకు బాబు శివచంద్రబనర్జీ గారిని గురువుగా నియమించిరి. గురువగు బనర్జీ తోరుయొక్క బుద్ధికుశలత గనిపెట్టి విశేషశ్రద్ధతో నేర్ప నామె ఇంగ్లీషువిద్య యందు నధికప్రీతి గలిగినదై బహు శీఘ్రముగా విద్యార్జనము చేయుచుండెను. ఇట్లు విద్యార్జనముజేయ గొలదికాలములోనే యామెకును ఆమె యక్కకును ఇంగ్లీషుభాషలోని మహాకావ్యములయొక్క యర్థము స్వయముగా గ్రహించునంతశక్తి గలిగెను. "ఘనతవహించిన మిల్టను కవివరుని గ్రంథము' నీ అక్కచెల్లెండ్రు పఠనగ్రంథముగా గైకొని, తమతో సమవయస్సుగల యాంగ్లేయ బాలికలకంటె నెక్కుడుగా నర్థమును గ్రహింపగలిగి, కవితాప్రవాహములను జూచి యత్యద్భుతము బొందుచు వచ్చిరి." అనియొక చరిత్రకారుడు వీరినిగురించి

వ్రాసియున్నాము. ఈ జాన్ మిల్టనుకవి యింగ్లీషుకవులలో బహు గొప్పవాడట. ఆయనగ్రంథములు ప్రథమశాస్త్రపరీక్షకును, బట్ట పరీక్షకును, మరియితరమైన గొప్పగొప్పపరీక్షలకును, బఠనీయ గ్రంథములుగా నుంచెదరట. గొప్పగొప్పవిద్యార్థులకును ఈయన గ్రంథములలోని యర్థము తెలియుట కష్టమట. వానిలోని యంతరార్థము తెలియుట యంతకంటె దుర్లభ మట. సంస్కృతములోని మాఘ, నైషధకావ్యములయొక్కయు, ఆంధ్రములోని వసుచరిత్రముయొక్కయు భాకముమీాదనే ఈ కవియొక్క కావ్యములును దిగినవట. ఇట్లయ్యును ఈకవియొక్క కావ్యములలోని రహస్యములు చిన్నతనమునందే కనిపెట్టిన తరులతా దత్తుయొక్క బుద్ధివైభవమును దైవికమనియే చెప్పవలసియున్నది.

౧౮౬౯ వ సంవత్సరమునందు బుత్రమరణదుఃఖితుడగు గోవిందచంద్రదత్తుగారు, కన్యలే తమకు బుత్రులని యెంచి వారివిద్యాభివృద్ధికయి, వారిని నైరోపాఖండమునకు గొని పోయెను. వారికి ఉన్నతవిద్య నేర్పదలచి, ప్రథమమునం దాయన ఫ్రాన్సుదేశమునకు బోయి 'నీసు' నగరమునందు వసించెను. అచట నాసోదరీమణులిరువురును తమబుద్ధిబలిమిచే విద్యార్థివేతనముల సంపాదించుకొనుచు, ఫ్రెంచువిద్వాంసుల రక్షాశ్రయించి ఫ్రెంచుభాష నేర్చుకొనిరి. కొన్నిరోజులు వీరు ఫ్రాన్సుదేశమునకు రాజధానియగు పారీసునగరములో నుండిరి. అచ్చట ఫ్రెంచువిద్య చక్కగా నేర్చుకొని యా ముగ్గురును ఇటాలీదేశము జూచి లలితకళా విద్యలకు బుట్టినిల్లయిన

ఇంగ్లాండునకు వెళ్ళిరి. ౧౮౭౩వ సంవత్సరమువరకు వారచట నుండిరి. వారాకాలమునందును వ్యర్థముగా గాలము గడపక యింగ్లీషు, ఫ్రెంచుభాషలయందసాధారణప్రవీణత సంపాదించిరి. వారు కేంబ్రిడ్జ్ పట్టణము (మనకాశీ పట్టణము వలెనీ గ్రామ మింగ్లండునందు నొకగొప్పవిద్యాపీఠము) నందుండి బ్రేస్లిల్ దొరసానిగారు ఫ్రెంచుభాషయందునిచ్చిన యుపన్యాసములకు దప్పకపోవుచుండిరి. తదనంతరమందు వారిరువురును సెంటులియోనార్డ్సు పట్టణమునందు తమ ఫ్రెంచు విద్యనువృద్ధి పరచిరి. యూరపుఖండమునందున్న కాలమున తోరుదత్తు తననిత్యప్రవర్తన నిత్యము వ్రాయదొడగెను. ఆపుస్తకమునందు ననేకసంగతులామె మిగులశ్రద్ధతో వ్రాయుచుండెను. నిత్యము జరిగినసంగతులాపుస్తకమునందు నత్యంతశ్రద్ధతో నతివివరముగా వ్రాయబడినవి. అందు నామె యనేక సంగతులను గురించి తనసొంత యభిప్రాయము వ్రాసియున్నది. ఆ యభిప్రాయము లెంతయో రమ్యముగా నున్నవట.

ఈ చిన్నకుటుంబము ఫ్రాన్సుదేశముకంటె నింగ్లీషుదేశముననే విశేషదినములుండుట తటస్థించినను, తోరూదత్తుకు ఫ్రాన్సుదేశమునందే విశేష గౌరవముకలిగియుండెను. జన్మభూమియయిన హిందూదేశముపై నామె కెంతప్రీతి యుండెనో, యంతప్రీతి ఫ్రాన్సుదేశముమీద నుండెను. ౧౮౭౦ వ సంవత్సరమున ఫ్రాన్సుదేశమునకును, జర్మనీదేశమునకును జరిగిన ఘోర రణమునందు ఫ్రాన్సునకు బరాభవము కలిగినప్పుడు చూడనోపక తోరూదత్తు తననిత్యప్రవర్తన గ్రంథమునందు నిట్లు

వ్రాసెను. "నేను వెనుక దినచర్య వ్రాసి యెన్నియో దినములు గడిచెను. అయ్యో! ఈ యవకాశమునందు ఫ్రాన్సుదేశమున నెన్నియో మార్పులుగలిగినవి. పారీసునగరమునందు మేమున్న స్వల్పకాల మా పట్టణ మెంతయో రమణీయముగా నుండెను. అచటి రాజమార్గము లత్యంత రమ్యములుగానుండెను. ఆదేశం లోని సైన్యములన్నియు నత్యంత సువ్యవస్థతో నుంచబడెను. అట్టి వైభవసంపన్నమగు పట్టణము నే డిట్లు దీనదశకు వచ్చుట గన, నా కత్యంత దుఃఖకరముగా నున్నది. పృథ్వీలోని సర్వపట్ట ణములలో నధికముగునదని ప్రసిద్ధిజెందిన పట్టణమునకిట్టి దీనా వస్థ గలుగుట గని, యెరికి హృదయము కరగకుండును? ఫ్రాన్సు దేశీయులకును, జర్మనీదేశీయులకును యుద్ధమారంభమైన నాట నుండియు నా మనసంతయు ఫ్రాన్సుదేశ జయమునే కోరు చుండెను. తుద కట్లుగాక ఫ్రాన్సుదేశమునకే పరాభవము కలు గుట మిగుల వ్యసనకరము" ఈ వాక్యములవలననే యామెకు ఫ్రాన్సుదేశమునందుగల గౌరవాతిశయము వెల్లడియగుచున్నది. ఆ దేశమునందు దనకు గల గౌరవమును తోరూదత్తు ఇంగ్లీషు నందు స్వయముగా నొక పద్యకావ్యము రచించి వెల్లడించెను.

౧౮౭౩వ సంవత్సరమున కొమార్తెలను దీసికొని గోవింద చంద్రదత్తుగారు తిరిగి కలకత్తా ప్రవేశించిరి. ఇంటికి వచ్చిన పిదప తోరూదత్తు ఇంగ్లీషు ఫ్రెంచుభాషలయందు నధిక పరి శ్రమ జేయుచు, తండ్రిగారియొద్ద సంస్కృతమునేర్చుకొన నారం భించెను. ఈ సమయమునందే ఆమెకు పద్య గద్యకావ్యములు వ్రాయుటకు విశేషస్ఫూర్తి కలిగెను. అందుపై నామె తండ్రి

కవిత్వముచేయుటకై, కవిత్వస్ఫూర్తిని వృద్ధిపరచుటకై, కొమార్తెను సదా ప్రోత్సాహ పరచుచుండెను. అందువలన దనకు గవిత్వశక్తి లభించి దృఢపడినదని తోరూద తెల్లప్పుడును తండ్రిగారియెడ మిగుల కృతజ్ఞురాలయియుండెను. ఇటులగదా తండ్రి తన పుత్రీపుత్రులను జ్ఞానవంతుల జేయవలసిన విధి. ఇటులగదా పుత్రీపుత్రులు తమ మాతాపితలయెడ గడు గృతజ్ఞులయి యుండవలసిన విధి.

ఇట్లు గోవిందచంద్రదత్తు తన కుమార్తెలకు విద్యాబుద్ధులు చెప్పించి, పుత్రులవలెనే పెంచుట చూచి కొందరాశ్చర్యపడుదురేమో. కాని, యిట్లు ఆశ్చర్యపడుటకు గారణము లేదు. పుత్రికలను పుత్రులవలె జూచుటయే శాస్త్రధర్మము. కన్యావివాహ సమయమునందు దండ్రి 'పుత్రవత్పాలితామయా' 'పుత్రునివలె నాచే బెంచబడిన కన్య' యని చెప్పుట సర్వప్రసిద్ధమేకదా. ఇదియుగాక మునిశ్రేష్ఠుడైన మనువు పుత్రీపుత్రులు సమానమని స్పష్టముగా వ్రాసియున్నాడు.

యథాఽఽత్మా తథా పుత్రః పుత్రేణ దుహితా సమా.
"తనతో సమానుడు పుత్రుడు. పుత్రునితో సమాన కూతురు."

శాస్త్రము లిటుల నుద్ఘోషించుచుండగా మన దేశమునందు బాలికలను బాలురకంటె నతినీచముగా జూచుటజూడ మిక్కిలి ఖేదకరముగా నుండకమానదు. ఆడుపిల్ల పుట్టిన నాటినుండియు దలిదండ్రులకు మిక్కిలి ఖేదకరముగా నుండక మానదు. ఆడుపిల్ల పుట్టిననాటినుండియు దలిదండ్రులు మిక్కిలి ఖేదముతో

నుండెదరు. పెద్ద పెరిగినకొలది పుత్రికలను పుత్రులవలె జూడక యెటులనైన బెంచవలయునని పెంచుదురు. ఇట్లనుట వలన నాడుపిల్లలను దయతో బెంచువారే యీ దేశమునందు లేరని నాతాత్పర్యముకాదు. అట్టి సజ్జనులుగూడ నున్నారు. కాని, ఈదేశములోని యాడుపిల్లలలో నూటికి తొంబదితొమ్మండ్రు బాలికలు నేను చెప్పినప్రకారమత్యంతాలక్ష్యముతో బెంచ బడుచున్నారనుటకు సందేహము లేదు. ఆంధ్ర మహారాష్ట్ర దేశముల బాలికలస్థితి యంతశోచనీయముగా లేదు. కాని, బంగాళా పశ్చిమోత్తరపరగణాలు మొదలయిన దేశములలో నాడుపిల్లలు కలుగుట కుటుంబమునకు నొక గొప్ప సంకటము ప్రాప్తించుటయే యని యెంచెదరు. ఇట్లు మనదేశమునందు బాలికలకు నత్యంత దురవస్థ ప్రాప్తించుటకు గారణము, స్త్రీ లన్నిసంగతులయందును పురుషులకంటె దక్కువవారని మన దేశమునందుగల వాడుకయే. ఈ వాడుకకు గారణము, స్త్రీల యజ్ఞానదశ. కాన, స్త్రీ విద్యాభివృద్ధియైన గాని, బాలికలకు నిట్టి యవస్థ తప్పదు. గనుక దేశాభిమాను లగు సహోదర సహోదరీ మణులారా! మీరు దత్తుగారివలె మీ బాలకులను, బాలికలను సమానప్రీతితో జూచుచు బాలికలకు బాలురకువలె నింగ్లీషు ఫ్రెంచులు చెప్పించకపోయినను, మీ మాతృభాషయైన జెప్పించి దేశక్షేమమునకు దోడగుదురని నమ్ముచున్నాను.

బంగాళాస్త్రీ పరకీయభాషయందు నుత్తమకవిత్వము జెప్పి ప్రసిద్ధిగాంచునని యీసమయమునం దెవ్వరును స్వప్న

ముంచెనను అనుకొనినవారు కారు. అట్లగుట సాధ్యమని చెప్పిన నెవ్వరును నమ్మకుండిరి. మనదేశపుస్త్రీ లనేకశతాబ్దముల నుండి యజ్ఞానాంధ కారమునకు బుట్టినిల్లు చేయబడినందున హిందూదేశమునందలి యొక యబల ఈ పద్యముల వ్రాసెనని యెవ్వరును తలపరైరి. తోరూదత్తు ప్రథమమున నొకఫ్రెంచు కవిని గూర్చియొక వ్యాసము వ్రాసి యొకమాసపత్రికలో బ్రసిద్ధపరిచెను. ఆపత్రిక యందు నామె ఫ్రెంచుభాషయందలి యనేక పద్యముల నింగ్లీషునందు భాషాంతరీకరించి యచ్చు వేయించు చుండెను. ఆకాలమునం దాపత్రికను జదివినవారి కామె వ్రాసిన వ్యాసములును పద్యములును బహు ఆనందము గలిగించు చుండెను.

ఇంతలో ౧౮౭౪ వ సంవత్సరమునం దీమె యక్కగా రగు ఆరూబాయి క్షయరోగమువలనబరలోకవాసినియయ్యెను. ఆరూబాయి కవిత్వకల్పనలయందు జెల్లెలికంటె దక్కువ నేర్పరి యైనను, బంగాళీ, యింగ్లీషు, ఫ్రెంచుభాషలయందలి పాండిత్య మునందు తోరుతో సమానముగా నుండెను. ఈమె వృత్తియు బహు సాధువృత్తియైయుండెను. ఆమెకు నేకాంతవాసమునం దుండుటయే యధికసౌఖ్యకరమై యుండెను. ఆరూబాయికి దన పేరు ప్రసిద్ధియగుట యెంతమాత్రమును ఇష్టము లేకుండెను. కాని, యామె తనచెల్లెలి కవిత్వస్ఫూర్తిని గని సంతోషించు చుండెను. ఈమె పటములను వ్రాయుటయందు మిగుల ప్రవీణు రాలుగా నుండెను. ఈయక్కచెలియండ్రిద్దరలో తోరూదత్తు గ్రంథములను రచించునటులను,ఆరూబాయి యాగ్రంథములకు

ననుకూలము లయినపటములను వ్రాయునటులను, నియమించు
కొనిరి. కాని, యదియంతయు నారూబాయి మరణముతో
నడగెను. ఈ యక్కచెల్లెండ్రిద్దరును గాయనమం
దసమాన ప్రజ్ఞగలవారై, యనేక వాద్యములను బహు కుశ
లతతో వాయించుచుండిరి. వీరు తమ విద్యాభ్యాసమును
చేయుచు సాధారణకుటుంబపు స్త్రీలవలెనే తమ గృహకృత్య
ములను చక్కబెట్టుచుండిరి. 'ఆడుది చదివి చెడె' నన్న మూర్ఖపు
లోకోక్తి యబద్ధమనియు, 'చదువక మగవాడు చెడె' నన్న
లోకోక్తివలెనే 'చదువక యాడుది చెడె' నన్న లోకోక్తియే
నిజమని యీ యక్కచెల్లెండ్రు ఉదాహరణ పూర్వకముగా
స్థాపించిరనుటకు సందేహము లేదు.

తోరూదత్తు అన్ని పనులయందును చురుకుతనము
జూపుచుండెను. ఆమెకు ప్రతిపనియందును గల బుద్ధికుశలత
జూచి యామె తండ్రి మిక్కిలి యద్భుతము నొందుచుండెను.
ఆమె జ్ఞాపకశక్తి బహు యద్భుతము. ఆమె రచించిన పద్యము
లన్నియు, నామెకు కంఠముగా నుండెనట. సంస్కృత,
బంగాళ, ఇంగ్లీషు, ఫ్రెంచు భాషలలోని మహాకవీశ్వరుల
పద్యము లనేకము లామెకు కరతలామలకములై యుండెనట.
ఆమె తాను చదివిన గ్రంథముల నన్నిటిని తిరిగి యొకసారి
మననము చేయుచుండెను. ఒకానొకచోట దనకర్థము తెలియ
కుండిన మరలమరల జదివి, యందలి యర్థమును గనుగొనినగాని
ముందు చదువునదికాదు. ఇటుల నామె యాత్మోన్నతియందు
మిగుల తత్పరురాలై యుండెను. తోరూదత్తు తనయక్క

గతించినపిదపను ధైర్యము విడువక తన ప్రయత్నమును మాన
కుండెను. ఈమె రచించిన 'పద్యసముదాయము'ను ప్రథమ
గ్రంథము ౧౮౭౬ లో వెలువడెను. దానియందు ఫ్రెంచు
కవీశ్వరుల కావ్యములనుండి, ఇంగ్లీషుభాషకు భాషాంతరీకరింప
బడిన పద్యరూపమునసున్న చిన్నచిన్న కథలుండెను.

అందు పీఠికస్థానమున నొకపద్యము వ్రాసి ఈ గ్రంథము
తనతల్లికి కృతియిచ్చినటుల జెప్పెను. ఇందుచే నీమె మాతృ
భక్తి వెల్లడియగుచున్నది. ఈ గ్రంథము మొట్టమొదట
బంగాళాదేశమునందలి భవానీపురమునందు నచ్చువేయబడెను.
కాగితములు బహు సన్ననివిగాను, అచ్చు అంటియుంటనటులు
గాను, ఈ పుస్తకము గుజనీ పుస్తకముగా నచ్చువేయబడెను.
లోకములో బైసౌందర్యము జూచి భ్రమించు వాడుకగలదు.
కాన, నది మంచి గ్రంథమేయైనను దాని బహిరంగము చూచుట
కింపుగా లేనందున నందలి పద్యరత్నములను చదువుట కాకా
లమునం దెవరికిని బుద్ధిపుట్టదయ్యెను. అందువలననే ఈ కవ
యిత్రి పుస్తకము మన దేశమునందా కాలమున మెప్పువడయ
కుండెను. ఇట్లు బయిటిదంభమునకే భ్రమపడువార నేకులుండి
నను, ఈ జగత్తునందు సత్యశోధకులును, సద్గుణపరీక్షకులును
నూటికి కోటికైనన నొక్కరు గానపడక పోరు. ఇట్టి రసికు
లుండుట వలననే కవిత్వాదివిద్యలువృద్ధిబొందుచున్నవి. తోరూ
భాగ్యమువలన నిట్టి రసికు డొకడు, ఇంగ్లీషుదేశమునందుండెను.
దైవ వశాత్తుగ నీ పుస్తక మాయన చేతబడుట సంభవించెను.
ఈ గుణగ్రహణ పారీణుని పేరు ప్రొఫెసర్ ఎడ్మండ్ గ్యాస్.

ఆపుస్తకము జదివి యతఁడు ఇంగ్లీషు దేశమునందలి "ఎగ్జామినర్" అను వార్తాపత్రికయందు దాని నిట్లు ప్రశంసించెను. "ప్రొ. మింటో దొరగారు 'ఎగ్జామినర్' అను వార్తాపత్రికాధిపతిగా నున్న సమయమునం దొకదినము నేను వారి కార్యస్థానమునకు బోవుట సంభవించెను. అపుడాయన తనయొద్దకు నభిప్రాయము నకై వచ్చిన పైని హిందూస్థానముద్రగల, యొకపుస్తకము నా చేతికిచ్చెను. ఆ పుస్తకము చూచుట కసహ్యముగా నగు పడుచుండెను. అది భవానీపురమునందలి సప్తాహికసంవాద మను ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది. ఇది రెండు వందల పుటములుగల పుస్తకము. దీనియందు నుపోద్ఘాతము మొదలైనవెంతమాత్రమును లేవు. దాని జూచినతోడనే చిత్తుకాగితముల బుట్టలో బాఁగవేయవలయునని తోఁచును. అందలి సగము అంటీయంటని యక్షరముల గనిన, దానిలో నుత్తమకవిత్వము కలదని తోఁచకుండుట యొకవింతకాదు. కాని, పుస్తకము విచ్చి దానియందలి పద్యమొకటి చదివిన తోడనే నాకు గలిగిన యానందాశ్చర్యములు వర్ణింపశక్య ముకాదు." తోరూదత్తు రచించినగ్రంథము లన్నిటిలో నిది ప్రథమ ప్రయత్నమేయైనందున ఈ కావ్యము తదనంతర మామెచే రచియింపబడిన కావ్యములంత రసవంతమైనవి గాక యుండుట సహజము. అయిన నట్టిగ్రంథమే పాశ్చాత్యపండి తులచే గొనియాడబడినప్పుడు ఆమెచే రచియింపబడిన యితర కావ్యము లెంతరసవంతములై యుండునో చదువరులేయూహిం చుకొనగలరు.

తోరూదత్తుకుగల ఇంగ్లీషుఫ్రెంచు భాషాజ్ఞానము ఈమె కంటె నధికవయస్కురాండ్రగు ఇంగ్లీషుఫ్రెంచు స్త్రీలలోనే కానవచ్చుటయే దుర్లభము. ఈరెండుభాషలును తోరూదత్తుకు బరభాషలేయైనను వానియందామె స్వభాషవలెనే కవిత్వము చేయుట గని లోకు లాశ్చర్యపడుచుండిరి. ఈమె కవిత్వములో విశేషభాగము భాషాంతరీభూతమైనను, అందు కవిత్వము నకు గావలసినలక్షణములన్నియు ననగా శబ్దశ్లేషవము, అర్థగాంభీర్యము, రసపుష్టి మొదలైన గుణము లున్నందున జనువరుల కామెకావ్యములు భాషాంతరీకృతములుగా దోచక స్వతంత్రరచనగానే తోచుచుండెను. తోరూదత్తు 'ప్రాచీన హిందూస్థానములోని పాటలు' అను కావ్యమొకటి రచించెను. ఆకావ్యమునకు ప్రొ. గ్యాస్దొరగారొక పీఠికవ్రాసిరి. అందు నాతడు "పందొమ్మిదవ శతాబ్దములోని కవులచరిత్రమును వ్రాయునప్పుడు తోరూదత్తుచరిత్రమును వ్రాయవలసి యుం డును"అని వ్రాసియున్నాడు. ఆంగ్లేయునిచే నిట్టిస్తుతివడసిననా నారీరత్నమును స్తుతించుటకు నేనెంతదానను.

ప్రథమగ్రంథ మచ్చుపడిన కొద్దిదినములకే తోరూ బాయికి వ్యాధిసంభవించెను. అందువలన నామె, తండ్రిబలముచే సంస్కృతాధ్యయనమును మహాకష్టముతో వదలివేసెను. రోగము నడుమనడుమతగ్గినట్లు కనబడుచుండినను దినదిన మామెసత్తువ తగ్గుచుండెను. ఆమెకుబలముక్షయించిన కొలదిని కవిత్వధోరణి యధికమయ్యెను. తానీ ప్రపంచమునందుండుట కొద్దిదిన ములవరకే యనితోచిన కొలదిని కావ్యములువ్రాసియజరామ రణ కీర్తిని సంపాదించవలయునను ఇచ్ఛయామె కెక్కువగా

గలుగుచుండెను. ఆసమయమునందు క్లారీసాబదేవరను ఫ్రెంచు స్త్రీచే రచింపబడిన గ్రంథమొకటి ఈమె చదువుట తటస్థించెను. దాని నింగ్లీషున భాషాంతరీకరింప వలయునని యామెకు దృఢతరమైన యిచ్ఛకలిగెను. అంత నామె భాషాంతరీకరణమునకు ననుజ్ఞ యిమ్మని పుస్తకకర్త్రికి నుత్తరము వ్రాసెను. అందుకు నా గ్రంథకర్త్రి యనుజ్ఞనిచ్చెను. అప్పటి నుండి వారికి నత్యంతస్నేహము కలిగినందున, తోరూ ఆగ్రంథకర్త్రికి గృతజ్ఞతాపూర్వకముగా దనపటమును, సంస్కృతము నుండి తాను ఫ్రెంచుభాషలోనికి భాషాంతరీకరించిన సరసపద్యములను బంపెను. ఆ పద్యముల నా దొరసాని యెంతయో మెచ్చెనట! గాని, యీ దేశముయొక్కయు, విశేషముగా నీ దేశములోని స్త్రీలయొక్కయు దౌర్భాగ్యవశమున విద్యావతియగు తోరూదత్తు ఫ్రెంచు గ్రంథకర్త్రియొక్క గ్రంథమును భాషాంతరీకరింపకయే ౧౮౭౭వ సంవత్సరమున నశ్వరమగు ప్రపంచమును వదలి శాశ్వతమగు పరలోకమున కరిగెను. ఈమె యంత్యసమయమునందు జెప్పిన వాక్యముల వలన నామె శుద్ధాంతఃకరణము వ్యక్తమగుచున్నది. ఆ సమయస్థితి నా యమ తండ్రిగారిట్లు వ్రాసిరి. ఆమె తన యంత్యదినములు సమీపింపగా తనకు మందిచ్చు డాక్టరుతో నిట్లనియె. 'శారీరకబాధను నేను సహింపజాలకున్నాను, కాని నా యాత్మకు నాయాస మెంతమాత్రమును లేదు. పరమేశ్వరుని యందు నాకు దృఢమైన నమ్మకముగలదు.' ఈ వాక్యముల వలన నీమెకుగల యనుపమేయ దైవభక్తి తెలియుచున్నది.

కొడుకు కొమారెల మరణముచే నదివరకే దుఃఖపీడితుడయిన గోవిందచంద్రుడు తరులతామరణముచే నత్యంత విహ్వాలుడయ్యెను. దుఃఖము కొంత శమించినవెనుక గోవిందచంద్రదత్తుగారు తన ప్రియపుత్రిక విద్యాభ్యాసముచేయు గదిలోనికి సరిగి చూడగా నాతనికి తోరుబాయి వ్రాసియుంచిన కాగితములు కొన్ని దొరకెను. అంతపై నాతడు తోరు కృత గ్రంథములన్నియు నచ్చువేయించ నిశ్చయించెను. ప్రథమమున తోరుబాయిచే వ్రాయబడిన గ్రంథము రెండవ కూర్పునందు దళసరి కాగితములపై సుందరమయిన యక్షరములతో నచ్చువేయబడెను. దానితో నొకచిన్న యుపోద్ఘాతమును తోరుదత్తు చరిత్రము ఆతోరూరుల పటములును జేర్చబడెను. కావున పూర్వము పల్చని కాగితములపై నసహ్యముగా దోచిన గ్రంథమే యిప్పుడు పెక్కు చదువరులకు నత్యంత పూజ్యమయ్యెను. దత్తుగారికి దొరకిన కాగితములలో మన పురాణకథల ననుసరించియు, వేదాంతకథల ననుసరించియు, హూణభాషయందు రచించినకొన్ని చిన్నచిన్న కావ్యములుండెను. నవకావ్యముల రత్నముల మాల గ్రుచ్చవలయునని తోరూదత్తు సంకల్పించియుండెను. కాని వానియందు నేడు కావ్యములే వ్రాయబడెను. మిగిలిన రెండు కావ్యములకొరకు విష్ణుపురాణమునుండి కొన్ని కథలను భాషాంతరీకరింప నిశ్చయించెను. సంకల్పప్రకార మామె యదివరకే 'కలకత్తా రివ్యూ' 'బెంగాల్ మాగ్యజీన్' అను మాసపత్రికయందు గొన్ని కావ్యములను ప్రచురపరచెను. ఈ తొమ్మిది కావ్యము లొక పుస్తకముగా నచ్చువేయబడెను.

చావుముందర తోరుదత్తు "కుమారీ డార్వెరను ఫ్రెంచు స్త్రీ ఆత్మవృత్త"మను ఒక కథను వ్రాయుచుండెను. పరదేశీయులనుగూర్చి యిట్టి కథలు వ్రాయవలెనన్న వారి యాచారవిచారములును, వారిదేశచరిత్రము మొదలయినవియు బాగుగా దెలియవలయును. తోరూదత్తా దేశమునసుండిన స్వల్పకాలములోనే యీ సంగతుల నన్నిటిని తెలిసికొనెను. ఈ కల్పనాకథాగ్రంథ మంత యుత్తమమయినది యని చెప్పుటకు వీలులేదు. కాని తోరూదత్తు జీవించి యాగ్రంథమును మరల దిద్ది యచ్చువేయించియుండిన పక్షమున నింతకన్న నుత్తమముగా నుండి యుండవచ్చునని చెప్పుటకు సందియము లేదు. ఈగ్రంథమును బాడెరను ఒక ఫ్రెంచుస్త్రీ దిద్ది యుపోద్ఘాతము వ్రాసి ప్రచురపరచెను.

కవయిత్రి యనియు, గ్రంథకర్త్రియనియు మిగుల, ప్రఖ్యాతిబొందిన తరులత యల్పకాలములోనే వాడిపోవుట యీ దేశముయొక్క దౌర్భాగ్యమే యని చెప్పవలసియున్నది. అయినను ఒక కవి

చ. మనుజుని జీవితంపు బరిమాణము నేండ్లచేత గాక చే
సిన ఘనకార్యసంచయముచేత గణింపగ జెల్లు నెప్పుడున్.

అని చెప్పినందున ఘనకావ్యనిర్మాణమును ఘనకార్యసంచయముచే తోరూదత్తు 'జీవితంపు బరిమాణము' అత్యల్పమయ్యెను, ఆమె దీర్ఘాయుష్మతియే - మృతజీవియే - యని చెప్పవచ్చును.

# విద్యాసాగరజనని భగవతీదేవి

> తే. ఒక పరోపకారంబు చేయుటయె కాదె
> యిలపయిని జన్మమెత్తిన ఫలము మనకు;
> గాన మన మేలుచూడకయైన దరుణి!
> పరులకుపకార మొనరింపవలయు జూవె. —వీరేశలింగకవి.

బీదలయొక్కయు, దుఃఖితులయొక్కయు బంధువును, వంగదేశముయొక్క సత్పుత్రుడును, భారతవర్షమను ఆకాశమునకు తేజోమయమగు నక్షత్రమును, విధవాబంధుడును నగు ఈశ్వరచంద్ర విద్యాసాగరుని తల్లియగు భగవతీదేవి చరితము సకలజనులకు ననుకరణీయము. ఏ సద్గుణములవలన విద్యాసాగరుడు ప్రాతఃస్మరణీయుడాయెనో, యా సద్గుణములకు మూలకారణ మాతని తల్లియే యని బహుజనులకు దెలియదు. ఎట్టి విత్తో, యట్టి ఫలమే కలుగుననుట భగవతీదేవి విద్యాసాగరుల చరిత్రములవలన దెలియును. దయ, ధర్మము, క్షమ మొదలైన సద్గుణములు భగవతీదేవి వలననే విద్యాసాగరునికి బట్టుపడెను. కావున విద్యాసాగరుడు తన తల్లిని సాక్షాదన్నపూర్ణనుగా భావించి పూజించుచుండెను.

ఈమె ౧౭౩రవ బంగాలీసంవత్సరము ఫాల్గుణమాసమునందు బంగాలీదేశము నందలి యొక పల్లెయందు బ్రాహ్మణవంశమున నవతరించెను. ఈమె తండ్రిపేరు రామకాంతచట్టోపాధ్యాయుడు. తల్లి గంగాదేవి. రామకాంతుడు చిన్నతనము

నుండియు దైవభక్తిగలిగి విరక్తుఁడయ్యెను. ఆతఁడు విశేషముగా నెవ్వరితోను మాటలాడక అరణ్యమున కరిగి, యేకాంతముగ జపము చేసికొనుచుండెడివాఁడు. ఆయన బొత్తుగ సంసారము నందు విరక్తుఁడగుట విని గంగాదేవి తండ్రియగు విద్యావాగీశుఁడు తన పుత్రికను సంతానసహితముగా పాతూలగ్రామమునకుఁగొని చనెను. నాఁటినుండియు గంగాదేవి తన యిరువురు కూతులతో పుట్టినింటనే యుండెను. పంచానన విద్యావాగీశునకు నిరువురు కన్యకలును, నలుగురుకొమాళ్లును ఉండిరి. వారిలో బెద్దకొడుకు పేరు రామమోహన విద్యాభూషణుఁడును, రెండవవాని పేరు రామధన్ తర్కవాగీశుఁడును, మూఁడవవాని నామము గురుప్రసాద శిరోమణియును, నాల్గవవాని పేరు విశ్వేశ్వర తర్కాలంకారుడును. ఈ కుటుంబము విద్య, దయ, ధర్మము, అతిథిసత్కారము మొదలయిన సద్గుణములచే విశేషఖ్యాతి వహించెను. విద్యాసాగరుఁడు తన జీవనచరితమునం దీ పరివారమునుగూర్చి యిట్లు వ్రాసెను. "అతిథి సేవయందను, అభ్యాగతుని సన్మానించుట యందను నీ కుటుంబమునకుగల శ్రద్ధ మిగుల స్తుత్యము. అట్టి శ్రద్ధ మరియొకచోట గానుపించదు. ఆ పరివారమునం దీసద్గుణములు లేనివా రొకరును గానరాకుండిరి. రాధామోహనవిద్యాభూషణుని వాకిటికి వచ్చి యన్న మడిగి దొరకక వెళ్ళిపోయిన యతిథి యొకఁడును కానరాడయ్యె. ఆ యింటనుండు బాలురు వృద్ధులు నందరును ఇట్టి గుణములు గలవారే." ఇట్టి పరివారములో బెరిగి నందుననే భగవతీదేవికి నట్టి సద్గుణములు పట్టువడెను. అందువలననే యదివరకు దురదృష్టవంతురాలగు

వంగజనని తేజోమయమగు నక్షత్రమువంటి విద్యాసాగరుడను న్యాయరత్నమును గాంచ సమర్థురాలాయెను. తమ సంతానమునకు సద్గుణములు నేర్పుటకయి కుటుంబ మెటులుండవలయునో నేర్చుకొన దలచినవారికి పాతూల గ్రామమునందలి విద్యావాగీశుని పరివారమే చాలినంత దృష్టాంతము. భగవతీదేవి యొక్కయు విద్యాసాగరుని యొక్కయు చరితములందు బ్రకాశించుదయ, ధర్మము మొదలగు సద్గుణములకు విద్యావాగీశుని కుటుంబమే మూలము. ౧౭౩౭వ సంవత్సరమున బనిమాంగాపురమునందలి రామజయబంద్యోపాధ్యాయుని పుత్రుడగు ఠాకుర్‌దాసుని భగవతీదేవి వివాహమయ్యెను. ఈ దంపతులకే ప్రాతః సంస్మరణీయుడగు ఈశ్వరచంద్రవిద్యాసాగరుడు జన్మించెను.

ఠాకుర్‌దాసుని బాల్యమునందే యాతనితండ్రి సంసారము నందు విరక్తుడయి స్వదేశపరిత్యాగము చేసి తీర్థయాత్రలు చేయుచుండెను. కాన ఠాకుర్‌దాసుని తల్లియగు దుర్గాదేవి తన పుట్టినింటి కరుగవలసినదాయెను. అచ్చట నామెదుఃఖ మెంతమాత్రము తగ్గక, మిూనుమిక్కిలి యన్నలయొక్కయు, వదినెలయొక్కయు బాధవిశేషమయ్యెను. కావున నామె యాగ్రామముననే యొకకుటీరము నిర్మించుకొని యొకవిధముగా కాలము గడుపుచుండెను. ఆమె రాత్రియంతయు దారమువడికి దాని నమ్మి తానును కొమారుడును భోజనము చేయుచుండిరి. బుద్ధిమంతుడగు ఠాకుర్‌దాసు, తల్లికష్టము చూడనోపక, కలకత్తా కరిగి యతికష్టముతో విద్య నభ్యసించెను. ఆయన త్వరగా

స్వల్పవిద్య నేర్చి యల్పవేతనముగల యుద్యోగమును సంపాదించెను. ఆ దినములలో భోజనసామగ్రి చవుకగా దొరకుట వలన స్వల్పవేతనముగల యుద్యోగము దొరకినను ప్రజలానందించు చుండిరి. ఠాకుర్ దాసునకు ౮ రూపాయిలవేతనముగల పని దొరకుట విని దుర్గాదేవి తన పర్ణకుటీరములో నానందోత్సవము చేసెను. వారి హితకాంక్షులందరా సమయమున మిగుల సంతసించిరి. తదనంతరము కొన్ని దినములకు రామజయుడు (విద్యాసాగరుని తాతవచ్చి) భార్య కష్టములనువిని మిగుల చింతనొంది పుత్రుని గనుగొని యాతని వివాహముజేసి మరల తీర్థాటనమున కరిగెను; గాని యాతడు పూర్వమువలె విశేష దినములు తీర్థాటనము చేయుచునుండక త్వరలోనే యింటికి వచ్చెను. ఆయన వచ్చినందున కిట్లొక కారణమును జెప్పెదరు. ఒకదిన మాతడు కేదారపర్వతమున నిదిరించుచుండగా నొక మహాపురుషుడాయన స్వప్నమున నగుపడి ఇట్లనెను. "ఓ రామజయుడా ! నీవేల నీ కుటుంబమును విడిచి తిరిగెదవు ? త్వరగా నీవు నీయింటి కరుగుము. మీ వంశమునందొక మహాపురుషుడు పుట్టగలడు. వాని దయాదాన విద్యాదిగుణములచే మీవంశము కీర్తిగాంచును. పరమేశ్వరునికి మీయందు విశేషదయగలదు." ఈ స్వప్నముజూచి రామజయుడు వీరసింహగ్రామమునకు వచ్చి చూచునప్పటికి ఠాకుర్ దాసు కలకత్తాలో నుద్యోగము చేయుచుండెను. అతని భార్యయగు భగవతీదేవి గర్భవతియయి యున్మాదముగలిగి యింటియొద్దనే యుండెను. రామజయుడు కోడలి పిచ్చిపోవుట కనేకౌషధములును, మంత్రతంత్రములును

చేసి చూచెను. గాని యందువలన నాపిచ్చి కుదరకుండెను. కాన తుదకొక జ్యోతిష్కుని బిలిచి యడుగగా నాజ్యోతిష్కుడు భగవతీదేవియొక్క జాతకమును ఆమెయవయవములును జూచి యిట్లు చెప్పెనట. "ఈమె గర్భమునందొక మహాపురుషుడు గలడు. ఆయన ప్రభావమువలననే యీమె కిట్టియున్మాదావస్థగలిగెను. ప్రసవానంతర మీమె బాగగును. ఇప్పుడౌషధోపచారములు చేయుటవలన నేమియు ప్రయోజనములేదు." 1820వ సంవత్సరము ఆశ్వయుజమాసమునందు సాక్షాత్ దయయొక్క యపరావతారు డగు ఈశ్వరచంద్రుడు జన్మించెను. నీశాడిన పిదప భగవతీదేవికిగల యున్మాదము పోయెను.

భగవతీదేవి విశేషరూపవతి గాకున్నను, ఆమెముఖమునందలి తేజము విశేషహృద్యముగా నుండెను. వంగదేశమునందలి యాధునిక ప్రఖ్యాతకవి యగు రవీంద్రనాధుడు భగవతీదేవిరూపమునుగూర్చి యిట్లు వ్రాసెను—"భగవతీదేవి ముఖమునందలి గాంభీర్యము, నుదారతయు నెంత చూచినను తృప్తి కలుగదు. ఆమె బుద్ధియొక్క ప్రసారతను దెలుపునున్నత లలాటము, సుదూర దర్శులును స్నేహవర్షులునునగు ఆ యత నేత్రములు, సరలనాసిక, దయాపూర్ణమైన యోష్ఠాధరము, దృఢతా పూర్ణమైన చుబుకము - ఇట్టివి యవయవములు పొంకముగ గలిగి మహిమ మయమైనయామె ముఖసౌందర్యము చూచువారి హృదయమున కధికముగా బూజ్యభావమును బుట్టించును. ఇందువలన (భగవతీదేవి ముఖమునందు దైవికకళ గలిగినందున) నే విద్యాసాగరుడు ఇతర పౌరాణిక దేవతల

నేరిని బూజింపక తనతల్లి నే దేవతయని పూజించుటకు గారణము కూడ వ్యక్తమగుచున్నది."

పేదలదుఃఖముల గనినభగవతీదేవికి మిగుల జాలిపుట్టి కన్నుల నీరు గారుచుండెను. ఆకొన్నవారికి నన్నమిడుటయు, రోగుల కౌషధోపచారము లొనర్చుటయు, తృష్ణాతురుల కుదకదానము చేయుటయు, చలికి బాధపడువారికి వస్త్రములొసంగుటయు లోనుగాగలవి భగవతీదేవియొక్క నిత్యవ్రతములు. ఎవ్వరికేని రోగమువచ్చినయెడల భగవతీదేవి చేత నౌషధములు తీసికొని వారిసేవచేయుటకు సిద్ధముగా నుండెను. ఎవ్వరేని అర్థాభావము వలన బాధపడుచుండినచో, భగవతీదేవి తన చేత గలది కొంగున గట్టుకొని వారికి గుప్తముగా సహాయపడుటకు చనును; ఎవ్వరేని చలివలన బాధపడుచుండినచో భగవతీదేవి తనవెచ్చనిబట్ట వారి కిచ్చును! ఆమె బ్రాహ్మణకులమునందు జన్మించినదైనను నీచకులీనుల మలమూత్రములు తీసి వారి కుపచారములు చేయుటలో నెన్నడును అసహ్యపడినదికాదు. ఇదియే నిజమయిన భూతదయ.

ఒకానొక సమయమునందువిద్యాసాగరు డింటివారుకప్పుకొనుటకు గొన్నిఊర్ణవస్త్రముల నింటికి బంపెను. అవి ఇంటికి రాగా జూచి తమపొరుగువారలు చలిచే బాధపడుచుండుట గని భగవతీదేవి వానిని పొరుగువారల కిచ్చి కొడుకున కిట్లు వ్రాసెను. "ఈశ్వరా ! నీవు పంపినబట్టలు మనపొరుగువారలు చలిచే బాధపడుచుండగా వారి కిచ్చితిని. కాన మనయింటి కొరకు వేరేబట్టలు పంపవలయును." తల్లియొక్క భూతయకు

సంతసించి విద్యాసాగరుడు 'మనయింటికొరకును బీదవారికొర కును మరియెన్నిబట్టలు కావలయునో వ్రాసినయెడల బంపెద' నని తల్లికి వ్రాసెను. తల్లి యెట్టిదో కుమారుడు నట్టివాడే యగును గదా?

విద్యాసాగరుని సహోదరుడగు దీనబంధు న్యాయరత్న మును మిగుల నుదారుడుగానే యుండెను. ఆయన వస్త్రహీను లను జూచినచో తన పైవస్త్రమునైనను వారి కిచ్చుచుండెను. పరుల దుఃఖమును గనిన నాతడా దుఃఖము తనకే కలిగినటుల విచారపడును. ఒక దినము దీనబంధుడు వీధిలో నొంటరిగానిలిచి యుండగా నొక బీదస్త్రీ చింపిరిబట్టను గట్టుకొని పోవుచుండెను. దాని గని దీనబంధుడు పైనున్న చిన్న వస్త్రమును, తాను కట్టు కొనిన కట్టుబట్టను దానికిచ్చివచ్చి తల్లికావృత్తాంతమునంతను చెప్పెను. అంత నామె మిగుల సంతసించి "నాయనా! నీవు బహు మంచిపని చేసితివి. నేనొకదినము రాత్రి నూలు వడికిన నీకు దోవతియగు" నని చెప్పెను. ఇట్టి బీదతనమునందును వారి యిల్లు అతిథి అభ్యాగతులకును, దుఃఖులకును సుఖప్రద మగు చుండెను. పిదప విద్యాసాగరుని బుద్ధికౌశలముచే లక్షాధీశు లయినప్పు డెంత పరోపకారము చేసియుందురో చదువరులే గ్రహింపగలరు.

పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరులవారు వితంతూ ద్వాహములను గురించి యత్నముచేయుట భగవతీదేవిగారి ప్రేరణచేతనే యని చెప్పెదరు. ఇందును గురించి జనానాపత్రిక యందిట్లు వ్రాయబడి యున్నది—

"విద్యాసాగరుడు మ పట్టాస్కృత పదవియందుండి తన సత్పాత్రదానమువలన వంగదేశమున కొక కష్టము రాకుండ గాపాడుచున్న సమయమునందొక నాడు శ్రీ భగవతీదేవిని సందర్శించుటకై యొక బాలవితంతువు వచ్చియుండెను. ఆమె శ్రీభగవతీదేవిని దర్శించి సంభాషణవశమున దన నిర్బంధవైధవ్యదశను గూర్చి దుఃఖముతో నింపుక ముచ్చటించెను. ఆ స్త్రీ త్రాణపరాయణత్వమును వహించిన భగవతీదేవి యామె కష్టమును వినగానే పట్టజాలని దుఃఖముతో దన కుమారునివద్దకు బారివచ్చి "కుమారా! నీవు సమస్తశాస్త్రములను జదివితివిగదా, ఆపన్నులయిన బాలవితంతువులను సంరక్షించు శాస్త్రమేదియును నీకు గానుపించలేదా?" అని యడిగెను.

"విద్యాసాగరునికి దన తల్లియందతి గౌరవము గలదు. అతడు తన యౌన్నత్యము నంతను జిన్ననాడు తన కామె కరపిన సద్గుణపుంజమువలన నందియుండెను. దుఃఖముతోనట్లు తన తల్లి చెప్పిన మాటలను వినగానే విద్యాసాగరుడు తిరిగి శాస్త్రములను జదువుట కారంభించి తుట్టతుదకు బరాశర స్మృతియందు స్త్రీ పునర్వివాహములు తప్పక జరుపబడవలెనని విధించు నీ క్రింది వాక్యమును గాంచెను."

"నష్టే మృతే ప్రవ్రజతే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే."

"తన కుమారుడు స్త్రీపునర్వివాహములను జేయ నారంభించిన తరువాత నాతనికి బహువిధముల ధైర్యము నొసంగుచు

కుమారా! నీ వవలంబించిన మార్గమును విడువక పూనిన యీ మహాకార్యమును నిర్వహింపుము. నీ కెన్నికష్టములు వచ్చినను మే మెప్పుడును నిన్ను విడువక నీకు సహాయులమై యుండెదము. ఒకవేళ మేము నిన్ను విడిచిపెట్టినను నీవు నిరుత్సాహుడవు గాకుమా" యని యాతనికి బోధించుచు శ్రీభగవతీదేవి బాలవితంతువుల పాలిటికి సత్యమయిన రక్షకురాలయి నిలిచెను.

పునర్వివాహము చేసికొనిన వధూవరులను ఆ కాలమునందు వారియాప్తులు తిరస్కారముగ జూచి, మిగుల బాధపెట్టుచుండిరి. ఆ యువతులను దనయొద్దకి బిలిచి భగవతీదేవి వారికి ననేకబుద్ధుల గరపి, బుజ్జగించి వారిని దనప్రక్కన గూర్చుండబెట్టుకొని, భోజనముచేసి యాప్తుల తిరస్కారమువలన ఖిన్నులైన వారిని సంతోషపెట్టుచుండెను. ఇంటికి వచ్చిన అతిథిని తాను సన్మానించి పంపనిదినము భగవతీదేవికి మిగుల దుఃఖదినముగా నుండెను. తన శరీర మస్వస్థముగా నున్నను అతిథి కన్నము పెట్టించిగాని, యామె నిద్రించుచున్నది కాదు.

సివిలియన్ హారిసన్ దొరగారొకదినము వీరియింటికి విందారగింప వచ్చెను. అప్పుడు భగవతీదేవి తానే పాకముచేసి వడ్డించెను. భోజనానంతరము వారందరు మాటలాడుచుండ నాదొర భగవతీదేవిని జూచి 'మీయొద్ద చాల ధనమున్నదా' యని యడిగెను. అందుకామె కార్నేలియావలె తనకొమారుల జూపి వీరే నాధనమని చెప్పెను. ఆమెనుగని యాదొర విద్యాసాగరునితో 'నీ సాధ్వివలననే నీవింత సద్గుణవంతుడవయితివ'ని పలికెను. భగవతీదేవియొక్క సుగుణసంపదలగని యామె

యందధిక పూజ్యభావము గలిగి యామె యాంగ్లేయ డామెకు హిందూరీతిని ననుసరించి సాష్టాంగముగా నమస్కరించెను.

స్త్రీలయినను, పురుషులయినను, శ్రీమంతులయినను, బీదలయినను, కులీనులయినను, కులహీనులయినను, విద్వాంసులయినను, మూర్ఖులయినను, భేదభావములేక భగవతీదేవి యందరను సమానముగా జూచుచుండెను. ఈ సమభావము చేతనే యామె సకలజనులచే సకలదిక్కుల బూజింపబడుచుండెను.

భగవతీదేవిగారి దయకు మితిలేకయుండెను. పరుల దుఃఖముంగనిన నామెహృదయము కరగిపోవుచుండెను ఆమె యతిథులకు, నభ్యాగతులకు, విద్యార్థులకు, రోగులకు సహాయము చేయుచు వీరసింహా మనుపల్లెలోనే వాసము చేయుచుండెను. ఒక సమయమునందు విద్యాసాగరు లామెను కలకత్తాకు దీసికొనివచ్చిరి. కలకత్తాలో వీరసింహామునలో జేసినట్టు పరోపకారము చేయుటకు వీలులేదని సూచి, యామె కుమారునితో బలికిన పలుకులు వినిన పాషాణహృదయులుగూడ దయామయులగుట వింతకాదు. ఆమె కుమారునితో నిట్లనెను. "నేను వీరసింహామునకు బోకుండిన మనయింట నారగించి విద్య నభ్యసించు విద్యార్థుల కెవరు భోజనము పెట్టగలరు? ఎండ వానలలో నడచి యలసవచ్చిన యతిథులకు నాశ్రయ మొసగువారెవరు? నిరాశ్రయమగు కుటుంబమునకు నాశ్రయ మొసంగువారెవరు? ఇట్లచ్చట ననాథులు కష్టపడుచుండగా నేనిచ్చట నెట్లు సుఖముగా నుండగలను? నన్ను త్వరగా

వీరసింహామునకు బంపుము." విద్యాసాగరు లామె యభిప్రాయమును గనిపెట్టి దీనరక్షణార్థమై యామెను వీరసింహామునకు బంపిరి. మరియొకసారి యామెను ఈశ్వరచంద్రులు దమయొద్దికి దోడ్కొని వచ్చుటకు యత్నించిరి. కాని పరోపకారార్థమై యామె యా పల్లెను విడిచినదికాదు.

స్వర్ణాలంకారములయందు భగవతీదేవి కెంతమాత్రము నిష్టము లేకయుండెను. "నగలు పెట్టుకొనిన నేమి ప్రయోజనము? ఒక దినము దొంగలు తీసికొనిపోగలరు. కాని యా ధనముతోనే సహాయహీనకుటుంబములకు, దరిద్రులగు విద్యార్థులకు సహాయముచేసిన నెంతయో యానందము కలుగును!" ఇట్లు భగవతీదేవి లోకుల కుపదేశించుచుండెను. ఒకసారి విద్యాసాగరుడు తల్లితో నిట్లనియె. "అమ్మా దేవిపూజ చేయుట మేలా? లేక యాధనముతోనే పరోపకారము చేయుట మేలా?" అందు కాపరోపకారపరాయణ "అదే ధనముతో దుఃఖితుల దుఃఖము నివారణమయ్యెడి యెడల బూజచేయుట కంటె దుఃఖితుల కిచ్చుటయే మేలు" అనెను. ఆహా! భూతదయ యనిన నిట్టిదియే కదా! ఈమె వార్ధక్యకాలమునందు కాశీవాసము చేసి యచ్చటనే కాలధర్మము నొందెను.

*

# ఖనా

★

'విద్యచే శాశ్వతంబుగ వినుతి కెక్కు'

పూర్వకాలమునందు ఖనా యనుస్త్రీ జ్యోతిశ్శాస్త్రము నందధిక ప్రవీణురాలై యుండెను. ఆమె చేసిన కవిత్వ మాబాల వృద్ధుల కధిక ప్రియముగా నుండెననియు ఖ్యాతి గలదు. కాని మన దేశమునందు చరిత్రములు వ్రాయు వాడుక లేనందున నామె చరిత్రము సవిస్తరముగా నెచ్చటను దొరకలేదు. ఇందున కెంతయుం జింతిల్లవలసి యున్నది. ఈమె తల్లిదండ్రు లెవ్వరో తెలియదు. కాని యీమె జననీజనకులు బాల్యమునందే మృతి నొందినందువలన నీమె నెవఁడో యనార్యుఁడు పెంచుకొని యతడే యామెకు జ్యోతిషవిద్య నేర్పెనని యొక వింతకథ జెప్పెదరు. ప్రాచీనకాలమునం దార్యులకంటె ననార్యులే జ్యోతిషము నందు విశేష పాండిత్యము గలిగియుండిరని యందురు. ఖనా కుశాగ్రబుద్ధిగలదైనందున నితర బాలికలవలె నాటలతో గాలము గడపక తన పెంపుడుతండ్రియొద్ద స్వల్పకాలములోనే సంపూర్ణ జ్యోతిశ్శాస్త్రము నభ్యసించెనట! ఆ పెంపుడుతండ్రి ఈమె బుద్ధి కెంతయు మెచ్చి తనకు వచ్చినవిద్యయంతయు నామెకు సాంగో పాంగముగా నేర్పెను. ఇట్లు పురుషులకు సహితము దుర్లభమైన గణిత జ్యోతిషము లీమెకు గరతలామలకము లయ్యెను.

ఖనా వసియించెడి గ్రామము నందే మిహిరుడను బ్రాహ్మణ చిన్నవాఁడొక డనార్యులచే బెంపబడెను. పెంపుడు

తండ్రియైన యనార్యుడు మిహిరుని బుత్రవాత్సల్యముతో బెంచి పెద్దవానిజేసి జ్యోతిషమునం దపార పండితునిగా జేసెనట. తదనంతరమునందు ఖనా మిహిరు లిరువురును యుక్తవయస్కులై తమ పెంపుడుతండ్రుల యనుమతి వడసి వివాహము జేసికొని సంసారభారమును మోయుచుండిరి.

ఖనాయొక్క తల్లిదండ్రు లెవ్వరైనది తెలియకపోయినను మిహిరునివంశము మన మెరుగవచ్చును. లోకప్రసిద్ధుడగు విక్రమాదిత్యుని సభయందుండు నవరత్నములలో నొకడగు వరాహున కీమిహిరుడు పుత్రుడట. వరాహుడు జ్యోతిషమునందధిక ప్రవీణుడయి జ్యోతిషగ్రంథములు కొన్ని రచించెను. ఆయనకు మిహిరుడు పుట్టగానే జాతకము వేసిచూచి యందులోసంఖ్యలు తప్పుటవలన, నూరేండ్ల ఆయుర్దాయ మున్నను తండ్రి లెక్కకు బది సంవత్సరములే జీవితమని వచ్చెనట. అందుకు వరాహుడు మిక్కిలి చింతిల్లి పిల్లవాడు పది సంవత్సరములు పెరిగి మృతినొందిన విశేషదుఃఖమగు గాన, నిప్పుడే వీని నెక్కడనైన విడిచిన బాగుండునని యోచించి, కర్రదోనెలో బాలుని నునిచి నీట ప్రవాహములో విడిచెనట. తదనంతర మాబాలు డొక యనార్యునకు దొరకగా, వాడు సాకి విద్యనేర్పిన సంగతి యిదివరకే వ్రాసినాను.

వివాహానంతరము ఖనా మిహిరుల కిరువురకు ఆర్యులలోనికి వెళ్ళవలయునను వాంఛగలిగి, తమపాలనకర్తల యనుజ్ఞ నడిగిరి. అందుకు వారు సమ్మతించి వారినంపి వచ్చుటకయి వెంటనొక యనార్యదాసిని బంపి దానిచేతికి గొన్ని జ్యోతిష

గ్రంథముల నిచ్చిరి. ఆర్యులుండు ప్రాంతముయొక్క పొలిమేర దాటి వారి దేశమునకు వెళ్ళునపుడు, ఆస్త్రీ జ్యోతిషమునందు ఖనాకును మిహిరునకునుగల ప్రజ్ఞను బరీక్షింపదొడగెను. వారు జ్యోతిషమునందు పండితులని తెలిసిన నా పుస్తకముల మరల స్వదేశమునకు దీసికొని రమ్మనియు, లేనియెడల పుస్తకములు వారికినిచ్చి రమ్మనియు ననార్యులు చెప్పిరట. కాన వారిని బరీక్షించుటకయి యాదాసి యచట నీనుటకు సిద్ధముగా నున్న యొక గోవును మిహిరునకు జూపి 'ఈ యావునకు నెర్ర దూడ పుట్టునా' తెల్లదూడ పుట్టునా' యని యడిగెను. మిహిరుడు 'తెల్లదూడ పుట్టు'నని ప్రత్యుత్తరమిచ్చెను. అంతట నాయావీనగా నెర్రదూడ పుట్టెను. అందుపై నాదాసి మిహిరునకు జ్యోతిషజ్ఞానము పూర్ణముగా లేదని యెంచి, యా పుస్తకముల నాతనికిచ్చి తన స్వదేశమునకు మరలిపోయెనట. అంత మిహిరుడు తా నిన్ని దినములనుండి శ్రమపడి యభ్యసించిన విద్యయందు తాను ప్రవీణుడు కానందుకు నెంతయు జింతిల్లి, యింత కష్టపడిన రానివిద్య యిక నీ పుస్తకములవలన నేమి రాగలదని కోపముతో నా పుస్తకములను యేటిలో బారవేసెను. అప్పుడు ఖనా సమీపముననే యున్నదిగాన, పరుగెత్తుకొని వెళ్ళి యా పుస్తకములలో రెంటినిమాత్రము నదీప్రవాహములోనుండి యీవలికి దీసెను. కడమ పుస్తకములామెకు దొరకక ప్రవాహములలో కొట్టుకొనిపోయెను. తదనంతరమా దంపతులు తిన్నగా విక్రమాదిత్యుడు వేటకు వచ్చి యున్న స్థలమునకు సమీపగ్రామము జేరిరి. అచట విక్రమా

దిత్యుడు విద్వాంసులను మన్నించునని విని మిహిరుడు రాజు సందర్శనము జేసి తన విద్యావిశేషమును గొంత కనుపరపగా రాజు సంతోషించి యాయనను దన యాస్థానపండితునిగా నేర్పరచి తన గ్రామమునకు దోడుకొనిపోయి వరాహుని బిలిపించి యీదంపతుల నతనికి జూపి 'వీరిని నీయింటనునుంచుమని' చెప్పెను. అందుపై వరాహుడు వారిని దనయింట నుంచుకొనెను. అంత గొంతకాలమునకు వరాహునకు దాను పారవేసిన తన కొమారుడే మిహిరుడే యని తెలిసి పితాపుత్రులిరువురకును అపరిమితానందము కలిగెను. తదనంతర మెప్పుడును వరాహుడు, మిహిరుడు, ఖనా తమలో దాము జోతిషమును గురించి అనేక ప్రసంగములు చేయుచు జ్యోతిశ్శాస్త్రములోని క్రొత్తక్రొత్త సంగతులను గనిపెట్టసాగిరి. మిహిరుడు తండ్రితో సమాన విద్యావిశేషములు గలవాడు గాన, విక్రమార్కుని సభయందును, దేశమునందంతటను ఆయనకీర్తిని గొనియాడనివారు లేకయుండిరి. ఖనా యింటిమొద్దనే యుండి రాజసభ కెన్నడును బోకపోయినను, ఆమె యందుండు సుగుణసంపదయు, విద్యాపరిమళమును దిగంతములయందంతటను వ్యాపించెను. వరాహుని కోడలును, మిహిరుని భార్యయు నగు ఖనా ఖగోళవిద్యయం దధిక ప్రవీణురాలని యందరును జెప్పుకొను చుండిరి.

ఇట్లుండ నొకనాడు విక్రముడు వరాహుని బిలిచి ఆకాశమునందుగల నక్షత్రసంఖ్య చెప్పుమనె నట! అందున కాయన గ్రంథములను శోధించియు నక్షత్రసంఖ్య కనుగొనజాలక, ఆకా

శమునందు గల నక్షత్రములను లెక్కించుటకు వీలు లేనందున మిక్కిలి చింతనొంది యీ సంగతి కొమారునకు దెలిపెను. కొమారుడును దన శక్తి యంత వినియోగపరిచి చూచెనుగాని, యీ యుక్తులేవియు నక్షత్రసంఖ్య దెల్పుట కెంత మాత్రమును పనిపడినవి కావు! ఇట్లు పితాపుత్రు లిరువురును నిరుపాయులై రాజసభలో దమకు నవమానము గలుగునని చింతాక్రాంతులై యుండ, వారిని జూచి ఖనా విచారహేతు వడిగెను. ఆమె యందుకు గారణము తెలిసికొని దీని కింత విచారమేల యని వారికి గొంత ధైర్యము జెప్పి తానొక గడియసేపు గణితము చేసి నక్షత్రసంఖ్య గనిపెట్టి వారికి జూపెను. అందుపై వారు ప్రముదితులై భోజనములు చేసి, రాజసభకుబోయి యానక్షత్ర సంఖ్యను దాని గనుగొనిన రీతియు జూపగా సభికు లందరును అధికాశ్చర్యమగ్న మానసులైరి, అంత వరాహు డా మహా కార్యము తనప్రజ్ఞవలనదెలియ లేదనియు, తనకోడలే విద్యాధికు రాలైనందున నీ సంఖ్య సులభముగా గనిపెట్టెననియు జెప్పెను. ఆ మాటవిని యచట నున్నవారందరును ఆ విదుషిని వేనోళ్ళ గొనియాడిరి. విక్రమాదిత్యుడు మిగుల సంతసించి "నా సభ యందు నవరత్నములలో రేపటినుండి ఆమె దశమరత్నముగా నుండును. కాన రేపటినుండి యామెను అవశ్యముగా సభకు దోడ్కొని రమ్మని యానతిచ్చెను! రాజాజ్ఞ వినినతోడనే వరా హున కత్యంత భీతికలిగెను. ఎందుకన, స్త్రీలను రాజసభలలోనికి దీసికొనిపోవుట మొంతయు నవమానకరమనియు, లోకనిందా స్పదమనియు వరాహుని యభిప్రాయమట! కోడలిని రాజసభకు

దీసికొని పోకుండిన రాజత్యంతాగ్రహపడునని తలచి వరాహుఁడు ఇందుకు మూలకారణురాలయిన ఖనాను చంపివేసిన బాగుండునని నిశ్చయించెనట! వరాహుఁడా సంగతి గొమారునకు దెల్పి నీ భార్య నాలుక కోయుమని యాజ్ఞాపించెనట! కాని సద్గుణమణియగు ప్రియభార్య నంత క్రూరతవహించి చంపుటకు మిహిరున కెంతమాత్రమును మనసొప్పకుండెనట! ఈ సంగతి యంతయు ఖనాకు దెలిసి, మామగారి యాజ్ఞను ఉల్లంఘించక శిరసావహించి తన నాలుకను జూపి ఖండింపుమని భర్తను భక్తితో వేడుకొనెనట! అందుపై నాతఁడు మనసు దృఢపరచుకొని ప్రియభార్యయొక్క జిహ్వను ఖడ్గముతో గోసెనట! అందుపై నామె త్వరలోనే యిహలోకము విడిచెనట! కొందరీ కథనే యిట్లు చెప్పుదురు:—విక్రమార్కుని యాజ్ఞప్రకారము ఖనా యాతని సభలోని పదియవ రత్నమయ్యెను. తరువాత గొన్నిరోజులకు గాలధర్మము నొందెను. ఇట్లు చెప్పువారిమె స్వాభావికముగా మానవులందరు మృతిజెందునట్లుగానే మృతి జెందినదనియు, బరులచే జంపబడలేదనియు జెప్పెదరు. మొదటి కథకంటె నీ రెండవకథయే విశేష సంభవనీయముగా నున్నది. విక్రముని కాలమునందు స్త్రీలకు రాణివాసము లేక యుండెనని యనేక ప్రమాణములవలన గానబడుచున్నది. ఇదియుంగాక యంతరాణివాస ముండినయెడల రాజు ఖనాను రాజసభకు దీసికొని రమ్మని యేల చెప్పియుండును? తన ప్రియభార్యను నిష్కారణముగా మిహిరుడు చంపెనన్న క్రూరపుమాట నమ్మ తగినది కాదు. కనుక రెండవకథయే యుక్తియుక్తముగా నున్నది.

ఈ చరిత్రమునం దనేకాసంభవములైన సంగతు లచ్చటచ్చట గానుపించుచున్నవి. వానిని విడిచినను పూర్వకాలమునందొక స్త్రీ, పురుషులకుగూడ నసాధ్యమగు జ్యోతిర్విద్య నభ్యసించి ప్రవీణత నొందియుండెననియు, ఆమెకు జ్యోతిషముయొక్క యంగములైన జాతక స్కంధమునందును గణిత స్కంధమునందును, అసమానప్రజ్ఞ గలిగియుండినదనియు స్పష్టముగా దెలియుచున్నది. ఖనాయొక్కబుద్ధి యిట్టి గహనవిషయమునందింత సులభముగా బ్రవేశించుట జూడగా, స్త్రీలబుద్ధి పురుషులబుద్ధి కంటె మందమనియు, నాడువారి మెదడు (మస్తిష్కము) మగవారి మెదడుకంటె బలహీనమనియు దక్కువ తూగుననియు నందువలన పురుషులకు దెలిసినంతటిజ్ఞాన మతివలకు దెలియుటసంభవింపదనియు జెప్పువారిమాట లన్నియు బక్షపాత వచనములని నిర్వివాదముగా జెప్పవచ్చును. స్త్రీలు నైసర్గికమూర్ఖురాండ్రని చెప్పుటకంటె నేటివరకు స్త్రీలకు బాల్యమునుండియు విద్యాగంధము నించుక సోకనియ్యనందున వారు మూర్ఖురాండ్రుగా గానుపించెదరని చెప్పవచ్చును. బాల్యమునందు బాలురును బాలికలును సమానబుద్ధివైభవములు గలిగియె యుందురని మనకందరకును దెలిసినమాటయే. బాలురకంటె బాలిక లెప్పుడును బుద్ధిహీనలుగా నుండరు. బాల్యమునందాడుపిల్ల యెట్టి బుద్ధివైభవము గలదైనను తలిదండ్రులుదాని కెంతమాత్రమును విద్యనేర్పక జ్ఞానాభివృద్ధికిం దగిన యుపాయములేవియు జేయనందున నది వివేక హీనురాలగుచున్నది. బాలుడు చిన్నతనమునందెంతమందబుద్ధియైనను

# రాణి సంయుక్త

౧౨వ శతాబ్దమునందు రాథోడ్ వంశీయుడగు జయచంద్రుడు కనౌజ (కాన్యకుబ్జ) రాజ్యమును, చవ్వాణవంశోద్ధారకుడగు పృథివీరాజు ఢిల్లీరాజ్యమును పాలింపుచుండిరి. ఈయసామాన్య పరాక్రమవంతు లిరువురిలో సంయుక్త జయచంద్రునకు గూతురును, పృథివీరాజునకు భార్యయు నయ్యెను. కాన నా రెండువంశములును నామెవలన బవిత్రములయ్యె ననుటకు సందేహము లేదు.

జయచంద్రునకు సంయుక్త యొక్కతయే కూతురగుట వలన, జయచంద్రుడు సంయుక్త నెక్కువ గారాబముతో బెంచెను. సంయుక్త స్వభావమువలననే సద్గుణవతిగాన, బెరిగిన కొలదిని ననేకవిద్యల నేర్చి మిగుల నుతికెక్కెను. ఆమె సద్గుణములును లావణ్యమును గనిన ప్రజలందరు దమ జన్మము సార్థకమయ్యెనని తలచి సంతసింపుచుండిరి. ఇట్లీమె కొన్ని దినములు బాల్యావస్థయందు గడపి యౌవనావస్థం దాల్చెను.

ఇట్లు యుక్తవయస్కురాలగు బిడ్డకు దగినవరు డెవడా యని జయచంద్రుడు చింతింపసాగెను. సంయుక్త రూపలావణ్యముల కీర్తి సకలదిక్కులను వ్యాపించినందున ననేక రాజపుత్రులామెను దమ కిమ్మని కోరుచు వర్తమానము లంపిరి. ఢిల్లీపతియగు పృథివీరాజామె రూపగుణములను విని యామెను నెటులయిన జేపట్ట నిశ్చయించెను. సంయుక్తయు

ననేకపర్యాయములు పృథివీరాజు పరాక్రమములను విని రూపము చూచియున్నందువలన నాతనినే వరించెదనని మనంబున నిశ్చయించుకొనియెను. జయచంద్రుడు తన కూతునకు దగినవరుడు దొరకవలయునని స్వయంవరము చేయనెంచెను. పుత్రికా వివాహమునకు బూర్వము రాజసూయముచేయ నిశ్చయించి సకలదిక్కుల రాజులకును వర్తమానము లంపెను. జయచంద్రుడు పరాక్రమవంతు డగుటవలన నితర మాండలిక రాజులందరాయన పిలిచినదినమునకు వచ్చి కనోజనగరము నలంకరించిరి. పృథ్వీరాజుమాత్రము జయచంద్రునితోగల పూర్వవైరమువలన నాయుత్సవమునకు రాకుండెను. అందునకు జయచంద్రుడు మిగుల కోపించి యాతనితో గల వైరము వలన, పృథివీరాజు ప్రతిమ నొకదానిని జేయించి, యాప్రతిమను ద్వారపాలకుని స్థలమునందుంచి తనపగ సాధించెను. యజ్ఞమువిధిప్రకారము జరిగినపిదప స్వయంవరోత్సవ మారంభమయ్యెను. అప్పుడనేక దేశాధీశు లొకచోట నానందముగా గూడినందున కనొజపట్టణము మిగుల నందముగా గానుపించెను.

రాజాజ్ఞప్రకారము మంత్రులు మండపము నలంకరించి రాజుల నందరిని వారి వారికి దగుస్థానముల గూర్చుండబెట్టిరి. అటుపిమ్మట సంయుక్తచేత బుష్పమాలను ధరియించి సఖీసహితమయి యా మండపమునకు వచ్చెను. రాజకన్య సభకు రాగానే రాజపుత్రు లందరి చూపులునామెవైపునకే మరలెను. ప్రతిభూపతియు నామె తనను వరియింపవలెనని కోరుచుండెను. సంయుక్త మిగుల గంభీరదృష్టితో రాజలోకము

నంత నొక్కసారి కలయజూచెను. తన కిష్టుడగు పృథివీ రాజచటికి రాలేదనియు, ఆయనను బరిహసించుట కాయన ప్రతిమనొక దానిని జేసి ద్వారమునం దుంచిరనియు నామె కంతకుపూర్వమే తెలిసియుండెను. అందువలన నా బాల యొక గడియవరకే యోచించి, తుదకు దృఢనిశ్చయురాలై, తిన్నగా నడిచి ఢిల్లీశ్వర ప్రతిమను సమీపించి యామూర్తికంఠమునందు బుష్పహారమును వేసెను. దాని గనినతోడనే సభయందంతట నొకటే కల్లోలమయ్యెను. జయచంద్రుడిట్టి యవమానమును సహింపజాలక కోపావేశపరవశుడై "దుష్టురాలగు దీనిని గారాగృహమునం దుంచు"డని యాజ్ఞాపించెను. అంత రాజులందరు నిరాశనుబొంది తమతమ నగరములకు జనిరి. ఇదియే యీ దేశమున జరిగిన కడపటి స్వయంవరము.

ఈ సంగతి యంతయు విని పృథివీరాజు పరమానంద భరితుడయ్యెను. జయచంద్రుడు తనను బరచిన యవమానమును సంయుక్త తనయందు గనపరచిన ప్రేమయు నేకీభవించి తన్ను ద్వరపెట్ట పృథివీరాజు జయచంద్రునిపై యుద్ధయాత్ర వెడలెను. ఇట్లాయన శూరులగు యోధులతో గనోజిబట్టణము సమీపమున విడిసెను. అచటనున్న కాలముననే యొకరాత్రి మిగుల రహస్యముగా పృథివీరాజు సంయుక్తనుగలిసి గాంధర్వ విధిచే నామెను వరియించెను.

వీరి వివాహవార్త యొకరిద్దరు దాసీలకు దప్ప నితరుల కంతమాత్రము దెలియదు. పృథివీరాజు వచ్చి తన గ్రామము బైట విడియుట విని యాతనినిబట్టి తెండని జయచంద్రుడు

మూడువేల సైన్యము నంపెను. కహారకంఠీరుడను వాని ముందిడుకొని శత్రుసైన్యంబు తమవైపునకు వచ్చుట గని పృథివీరాజును వారితోఁబోరుటకు సిద్ధముగా నుండెను. తదనంతర మా రెండుసైన్యంబు లొండొంటితోఁ దాఁకి మిగుల ఘోరంబుగా బోరసాగెను. అందు పృథివీరాజు సేనానియగు ఆతతాయికిని, జయచంద్రుని సైన్యాధిపతియగు కహారకంఠీరునకును ద్వంద్వయుద్ధంబు ప్రారంభించెను. ఆ వీరు లిరువురును సింహనాదములు చేయుచు నొండొరులతో నెక్కుడు పంతంబులు పలుకుచు, నొకరినొకరు నొప్పించుచుండిరి. అంత గొంత సేపటికి భటులయొక్కయు, గుఱ్ఱములయొక్కయు, నేనుగుల యొక్కయు, దేహములనిండ కారు రక్తము ప్రవాహమయి పారదొడఁగెను. అట్టి సమయమున కహారకంఠీరుని రోషావేశ మధికమయినందున నాతడు తన రథంబు డిగ్గి ఆతతాయిని తన ఖడ్గమునకు బలియిచ్చి పృథివీరాజు కంఠము తెగవేయ నుంకించెను. కహారకంఠీరుని శౌర్యమునకోడి పృథివీరాజు బలంబులు చెదరి పారసాగెను. అట్టి సమయంబున నాకస్మికముగా నొక శౌర్యనిధి యచటికివచ్చి పృథివీరాజు కంఠముపైబడనున్న ఖడ్గమును నుసియలుచేసి యాతని గాపాడెను. ఈ పరాక్రమ వంతుడెవడో యొక రాజపుత్రుడని చదువరులు భ్రమపడ వలదు. అట్లు తన సాహసమువలన పృథివీరాజును గాపాడినది యాతని పత్నియు, జయచంద్రుని కూతురునగు సంయుక్తయే. ఆమె తన భర్తనుగలసి యాతనితో వెళ్ళవలయునని బహు ప్రయాసముతో గారాగృహమువెడలి యతి యోగ్యమైన

సమయమున నా స్థలము ప్రవేశించెను. తా నెన్నడును సంగ్రామము జూడనిదైనను, ఆమెజాతక సమయసూచకత గలదియై తానును యుద్ధముచేసి తన భర్తప్రాణముల గాపాడెను.

సంయుక్త వచ్చిన పిదప పృథివీరాజు బలములు మరల చేరుకొని జయచంద్రుని సేనల నోడించెను.తదనంతరము పృథివీరాజు భార్యాసహితుడయి ఢిల్లీనగరమున కరిగెను. ఈ దంపతు లిరువురును గొంతకాలమువరకు పరస్పరానురాగము కలవారయి ప్రజలను తమబిడ్డలవలె బాలింపుచుండిరి.

ఇచ్చట జయచంద్రుడు పృథివీరాజు తన సైన్యము నోడించి, తనకూతును గొనిపోవుటవలన సంత పహృదయుడయి పగతీర్చుకొన సమయమును వేచియుండెను. ఇట్లీ దేశపు రాజులలో నన్యోన్యద్వేషములు కలిగిన సమయమున 'శాహాబుద్దీమహమ్మద్ గోరీ'యను మహమ్మదీయుడు హిందూదేశముపై దండు వెడలెను. వాడిచటికి వచ్చి దేశమంతను మిగుల నాశము చేయసాగెను. అనేక దేవాలయముల బడగొట్టి, మునిజనుల నన్యాయంబుగా జంపియు, స్త్రీల పాతివ్రత్యంబుల జెరిచి వారిని తమ దాసులను చేసికొనియు, మహాక్రూరత్వమును జూపదొడగెను. వానిపాదము సోకిన చోటెల్లను నాశమొందుచుండెను. కాన నట్టి వాని నోడించి పతివ్రతల పాతివ్రత్యమును, మఠమందిరములను గాపాడనెంచి పథివీరాజు గోరీని శిక్షించ వెడలెను. అప్పుడు జయచంద్రు డొకడుదక్క నితరరాజులందరాతనికి దోడుపడిరి. కోపమే ప్రధానముగా గల జయచంద్రుడు దేశక్షేమముగోరి పృథివీరాజునకు దోడుపడకున్నను, దేశీయుల దురదృష్టమింకను

ముదరసంపన నప్పటికిమాత్రము గోరీకి సాహాయ్యము గాకుండెను.

పృథివీరాజు మహాశౌర్యముతో దిలావడీయను మెడారి యందు గోరీసైన్యముల పలుమారు నోడించెను. పృథివీరాజు పరాక్రమమున కోర్వజాలక తుదకు గోరీ బహుకష్టముతో పలాయితుడయ్యెను. పృథివీరాజును విజయానందముతో నితర సామంతులతో దననగరు బ్రవేశించెను.

పృథివీరాజున కయిన జయమువలన జయచంద్రున కధిక వ్యసనము గలిగి యాతని మనం బెప్పుడును పృథివీరాజు చెరుపునే కోరుచుండెను. అందువలన నాతడెట్టి నీచోపాయము వలన నయినను బృథివీరాజునకు జెరుపుచేయ నిశ్చయించెను. అందువలన నాతడు తన దూతనంపి పారిపోవుచున్న గోరీని మరల మనదేశమునకు గొనివచ్చెను. ఇట్లు రప్పించి యాకుత్సితుడు తా నతనికి దోడుపడుటయేగాక, యితర రాజుల నేకులను నీకు దోడు తెత్తునని నమ్మిక దోపబలికి యాతనిని మరల పృథివీరాజు పైకి యుద్ధమునకు బురికొల్పెను.

జయచంద్రుని సహాయమువడసి మిగుల ధైర్యముతో గోరీ మరల ఢిల్లీనగరముపై దండువెడలెను. జయచంద్రుడు తా నన్నప్రకార మితరరాజుల ననేకులను దనవెంట దీసికొని యా తురష్కునికి దోడుపడెను. ఇట్లు చేసి పృథివీరాజున కిక జయము దొరకదని యా దీర్ఘక్రోధి సంతసింపుచుండెను. దుర్జనులు తమకార్య మీడేరుటవలన దేశమున కంతకును నష్టము కలుగునని తెలిసినను వెనుక దీయరుకదా?

కాలిందీనదీతీరమునందు జయచంద్రుఁడు తనసేనలతో దిగి యొకదినము తన శిబిరంబులో గూర్చుండి రాజ్యాభివృద్ధిని దలఁచుకొని సంతోషించుచుండెను. ఇంతలో నొక సేవకుఁడు వచ్చి తమ వైరిసైన్యములోనుండి యొకరాయబారి తమతో మాటలాడ వచ్చెననియు, దమ సెలవయినయెడల నాతని నిటకు దోడ్కొని వత్తుననియు జెప్పెను. అందు కాతఁడా పరిచారకునితో నీ వావలనేయుండి యాతనిని నావద్దికి బంపుమని చెప్పి తాను తన ఖడ్గము చేతఁగొని కూర్చుండెను.

అంత గొంతసేపటికి నొకతరుణు డచటికివచ్చి జయచంద్రునిపాదముల కెరఁగెను. ఆవచ్చిన యోధుఁడు పురుషుఁడుగాక మన కథానాయికయగు సంయుక్తయే. కాన జయచంద్రుఁడు తనకొమార్తెను గురించి నీ వేమికోరెదవని యడిగిన తోడనే యామె యిట్లనియె. "నాయనా! నేను తమ యనుజ్ఞను బొంది మనదేశమునకు శత్రువగు గోరీని జంపఁగోరి వచ్చితిని. ఈ సమయమునందు బెద్దల యాశీర్వచనము వడసి చనిన తప్పక జయముకలుగును" జయచంద్రుఁడు కూతుమాటలు విని కొంతతడ వేమియు దోఁచకుండి పిదప "వోసి స్వేచ్ఛాచారిణీ! ముందుజరుగఁబోవు ప్రజాక్షేమమున కంతకును నీవేకదా మూలమయినదానవు. పొమ్ము నీ విచటికివచ్చి నాక్రోధమును హెచ్చించితివేగాని వేరులాభములేదు" అని కోపముతో ననెను. అందుపై సంయుక్త మిగులవినయముతో "నోనాయనా! మీరు మీ జన్మభూమివైపించుక దృష్టిసారింపుఁడు. నిరాశ్రితురాండ్రగు ననేక స్త్రీల మానమును గాపాడుఁడు. మనమెంత

భక్తితో గొలుచు విగ్రహాదుల నాశమునకు దోహదపడకుడు. మన స్వాతంత్ర్యసుఖమును చెరుప బ్రయత్నించినయెడల పిదప విశేషదుఃఖము కలుగును." అని విన్నవించుకొనెను. ఇంతలో జయచంద్రుడు కోపారుణలోచనుడయి "నోరుమూసికొని వెళ్లు. నావద్ద నీవంటి దుష్టస్త్రీలు మాటలాడదగరు." అని ధిక్కరించెను. "అట్లయిన నా ప్రార్థన యంతయు వృథ వోయెనా?" యని యా కాంతాలలామ రౌద్రరూపము వహించి తండ్రివంకజూచి యిట్లనియె. "పూర్వులార్జించిన సత్కీర్తి నాశము చేసి మీ కపకీర్తిని శాశ్వత పరుచుటకు బూర్వమే నీ కుమార్తె నయిన నన్ను యపకీర్తి వినకుండ నేల చంపవైతివి? నీవు నాతండ్రివిగాన నేనింతగా జెప్పవచ్చితిని. కాని నీ యభిప్రాయ మెరిగిన పిదప స్వదేశద్రోహి కూతురనిపించుకొని బ్రతుకుటకంటె జావుమేలని తోచుచున్నది."

ఆడుసింగమువలె నెదిరించి మాటాడు కూతున కేమియు జెప్పజాలక జయచంద్రుడు మెల్లగా నావల కరిగి యశ్వము నెక్కి యా మ్లేచ్ఛసైన్యములోని కేగెను. ఇచట సంయుక్త తండ్రి లోపలకు వచ్చునని కొంతసేపెదురు చూచి యాతడు వచ్చు జాడగానక నిరాశతో మరలి తన పతి చెంత కేగెను. ఈ తడవ తమవైపున నల్పసైన్యమును, పగఱ వైపున నమిత సైన్యమును గలదు గాన, తన కపజయమే యగునని పృథ్వీరా జెరిగి యా సంగతి సంయుక్తకు దెలిపెను. ఆ దంపతు లిరువురును ఇసుమంతయు ధైర్యము విడువక నొకరి కొకరు తగు నీతుల నుపదేశించుచు నుత్సాహాయుతులై యుండిరి. వారిరువురి ఆలో

చన ప్రకారము యుక్తమని తోఁచగా నాఁమె ఢిల్లీకి ప్రయాణ మయ్యెను. గమన సమయమునం దాఁమె భర్తకు నమస్కరించి "ప్రాణేశ్వరా! తమరు క్షత్రియులు గాన మీ శస్త్రాస్త్రములను గాపాడుకొని యుద్ధమునకు సిద్ధమగుఁడు. క్షత్రియులు తమ దేశముయొక్కయు, వంశముయొక్కయు ప్రతిష్ఠలకొఱకు ప్రాణముల విడిచిన నది మృతి యనంబడదు. మనుజుఁడు జన్మించినందుకు ఫలముగా సత్కృత్యముల జేసి సత్కీర్తిని బొంది అమరుఁడు కావలయును. తమకు జయము దొరికిన మరల మనమిరువురము సుఖ మనుభవింతుము. లేనిపక్షమున నేనును తమతో స్వర్గసుఖ మనుభవించుటకు శీఘ్రముగనే వత్తును." అని ధీరోక్తులు పలికెను. అందుకు బృథివీరాజు తన భార్యను గౌఁగిలించుకొని "సతీమణీ! నా దేహములోఁ బ్రాణము లుండునంతవరకు నేను శత్రువునకు వెన్నియ్యనని దృఢముగా నమ్ముము. నా సైనికులును కీర్తికాములే గాన వారెప్పుడును పరాజయము బొంది మరల తమ ముఖము లితరులకు జూప నిశ్చయించరని నేను నమ్మెద"నని చెప్పెను. ఆ వాక్యములు విని సంయుక్త "స్వామీ! ఢిల్లీలోని స్త్రీలు తమ్ముదాము రక్షించుకొనుటకు నసమర్థురాండ్రు గాన, నేనిపు డచటి కరిగి వారి కందరకును ధైర్యము చెప్పెదను. నే నిచటనే యుండిన నా కాంత లేమియు దోఁచక యుండెదరు. ఏది యెట్లయినను మిమ్మును గెలిచి యా మ్లేచ్ఛుఁడు ఢిల్లీకి వచ్చెనా, వానికి రాజపూతస్త్రీ యొకతె యయినను జీవముతోఁ దొరక నేరదు." అని యాఁమె ఢిల్లీకిఁ బోయెను. అచట నాఁమె మిగుల నియమముతోఁ బరమేశ్వరుని తనభర్తకు

విజయము నిమ్మని ప్రార్థన జేయుచుండెను. ఆమె యుపదేశము విని యా నగరమునందలి యువతులంద రామె వలెనే ఢిల్లీశ్వరునకు విజయము కలుగవలయునని పరమేశ్వరు ననేకవిధముల వేడుకొనుచుండిరి.

తుద కొకదినమున నాసైన్యములు రెండును నొండొంటి దాక నా యుభయ సైన్యములలోని వీరులును దమతమ సంగ్రామకౌశలములు మీర ఘోరంబుగా బోరదొడంగిరి. వా రట్లు పోరుటచే నాకాశమంతయు ధూళి గ్రమ్మి, సూర్యుని మరుగుపరచెను. అంత గొంతవడికి నాధూళియడగి రక్తనదులు బారజొచ్చెను. పీనుగులపెంట లనేకములు పడెను. ఇట్టి రణరంగమునందు పృథివీరాజునకు నపజయము కలిగెను. కాని యాతని సైనికులలో శత్రువునకు శరణుజొచ్చినవాడేని, యుద్ధభూమినుండి పారిపోయినవాడేని కానరాకుండెను. పృథివీరాజు గూడ నా యుద్ధమునందే మడిసెనని కొందరు చెప్పెదరు. గోరీ విజయుడయి పృథివీరాజును చెరబట్టి గ్రుడ్లు తీసివేసి యాతని పాదములకు మిక్కిలి బరువులయిన లోహపు బేడీలను వేసి కారాగృహమునం దుంచెననియు, నీ సంగతి యంతయు విని పృథివీరాజు మంత్రియు, నతని చరిత్రలేఖకుడును, మహాకవియు నగు చాందభట్టు గోరీయాస్థానమున కరిగి కొన్ని దినము లచట నుండి యాతని కృపకు బాత్రుడై పృథివీరాజును చూచుట కనుజ్ఞవడసెననియు, అట్లు సెలవంది కారాగృహమున కరిగి పృథివీరాజును పలుకరింపగా నాతడు కన్నులు లేకున్నను మాటనుగుర్తించి యా భట్టును కౌగిలించుకొనెననియు, అచట

వారిరువురు నొకయుక్తివలన నా తురుష్కుని జంప నిశ్చయించుకొనిరనియు, అంతుపై చాందుభట్టు గోరీయొద్దికి వెళ్లి ప్రసంగరీత్యా పృథివీరాజుయొక్క బాణనైపుణ్యమును వర్ణింపుచు, నాతడిపుడు కన్నులు లేకున్నను శబ్దము జాడపట్టి సూటిగా బాణమువేయునని చెప్పగా, గోరీ యా విచిత్రమును గనుటకై యొక సభజేసి, యా సభకు పృథివీరాజును బిలిపించి యతనికి నతని విల్లు బాణములిచ్చి చమత్కారమేమయిన జూపుమని యాజ్ఞాపించెననియు, ఆ మాట సూటినిబట్టి పృథివీరాజాతనిపై బాణమువేయ నాతడు (గోరీ) మృతినొందెననియు, తదనంతరము చాందుభట్టు పృథివీరాజు లిరువురును దురకల చేబడక యా సభయందే యొకరినొకరు పొడుచుకొని జీవములను విడిచిరనియు, మరికొందరు చెప్పెదరు. పైని జెప్పబడిన శరసంధానమాహాత్మ్యమంతయు మనదేశముననే జరిగినదని యొకరును, తురకదేశమున జరిగెనని ఇంకొకరును వక్కాణించెదరు. వీనిలో నేది నిజమో మనము చెప్పజాలము.

గోరీకి జయముకలిగి, వాడు ఢిల్లీకి వచ్చుచున్నవాడనిన వార్త వినగానే, పట్టణములోని స్త్రీలందరితో సంయుక్త అగ్నిప్రవేశము చేసెను. గోరీ ఢిల్లీకివచ్చి చూచునప్పటికి గ్రామమంతట భస్మరాసులవిచ్ఛిన్నముగా గానవచ్చుచుండెను.

# పద్మిని

★

పత్యనుకూలా చతురా ప్రియంవదాయా సురూపసంపూర్ణా
సహజస్నేహరసాలా కులవనితా కేన తుల్యాస్యాత్. *

ఈ పతివ్రతాతిలకము పంద్రెండవ శతాబ్దారంభము నందు జన్మించెను. ఈమె తండ్రి సింహళద్వీప వాసియగు హామీరసింహ చవ్హాణుడు. ఈ సతీరత్న మసమాన రూపవతి యగుటచే జననీజనకు లామెకు పద్మిని యని పేరిడిరి. పద్మిని వివాహయోగ్యయైన పిదప, రజపుత్రస్థానములోనిదైన మేవాడ్ అను సంస్థానమున కధీశ్వరుడగు భీమసింహ రాణాగారికి నామె నిచ్చి వివాహము జేసిరి. వివాహానంతరము పద్మిని తనరూపము నకుదోడు, సుగుణములు సహాయపడగా భర్తకు ప్రాణతుల్యు రాలాయెను.

ఆ కాలమునందా రాజ్యము రాణాలక్ష్మణసింహుడను బాలరాజు పరిపాలనలో నుండెను. కాని, ఆతడు బాలుడగుట వలన, నాతని పినతండ్రియగు భీమసింహుడే రాజ్యతంత్రములను నడుపుచుండెను. భీమసింహుడు మిగుల శూరుడును, చతురు డును నగుటవలన నాతని రాజ్యమున కంతగా శత్రులభయము లేక, ప్రజలు సుఖముగా నుండిరి. కాని వారి దురదృష్టమువలన స్వల్పకాలములోనే ఢిల్లీ బాదుషాయగు అల్లాఉద్దీను మేవాడు

---

* పతికి ననుకూలయైనట్టియు, ప్రియభాషిణియు, సురూపవతియు నైన కులవనితతో నెవ్వరును సమానులు కారు.

రాజధానియగు చితురుపై దండువెడలెను. ఈ బాదుషా పద్మిని యొక్క యసమాన సౌందర్యము విని యామె యందధికాభిలాషి యయ్యెను. అసహాయశూరులగు రజపూతులతోఁ బోరి గెలుచుట దుస్తరమని తలచి యా బాదుషా పద్మినిని వశపరుచుకొన జూచెను. కాన ప్రథమమునం దాయన తన సైనికులతోఁ జితురుసంస్థాన ప్రాంతభూమిని వసియించి, గుప్తముగా ననేక దాసీజనులకు ద్రవ్యాశజూపి వారు తనరూపము, ఐశ్వర్యము మొదలగునవి పద్మినికి దెలిపి, యామె తనకు వశవర్తిని యగుట కనేక యుక్తులను బన్నునటుల జేసెను. కాని సతీమణి యగు పద్మినియొద్ద మ్లేచ్ఛప్రభువుయొక్క తుచ్ఛయుక్తు లెంతమాత్రమును బనికిరాక నిష్ఫలములయ్యెను. అందుకు బాదుషా మిగుల చింతించి తనకు పద్మినిపైని గలిగిన దురుద్దేశ్యమును మరల్చుకొనజాలక, రజపూతులతో యుద్ధముజేసి పద్మినిని చెరబట్ట నిశ్చయించెను. అల్లాఉద్దీను ఆ సమయమునందు "పద్మినిని చేకొనుట యొండె, ఈ రాజపుత్రస్థానమునందే యుద్ధము చేసి ప్రాణములు విడుచుట యొండె" అని ప్రతిన పట్టెను. తదనంతర మాతడు తన సైన్యములతో నారాజధానిని ముట్టడించెను.

అల్లాఉద్దీను తమ నగరమును ముట్టడించుట విని యసమానశౌర్యధుర్యులగు రజపూతులు యుద్ధసన్నద్ధులయిరి. అంత వారందరు భీమసింహుని యాజ్ఞప్రకారము బైలువెడలి ప్రతిపక్షులతోఁ ఘోరముగా బోరదొడగిరి. ఇట్లు యుభయ సైన్యములంగల వీరులు కొన్ని మాసములవరకును యుద్ధముచేసిరి. కాని యా రెండు తెగలవారిలో నెవ్వరును వెనుకదీయరైరి.

రజపూతు సర్దార్లనేకులు రణరంగమునందు హతులయిరి. రజపూతులెంత దృఢనిశ్చయముతో బోరినను తురకసైన్యములు బీరువోకుండుటయు, నానాటికి రజపూతుసైన్యములు పలుచబడుటయు గని భీమసింహుడు మిగుల చింతాక్రాంతుడయ్యెను. తుదకాతడు ప్రజాక్షయమున కోర్వజాలక ఢిల్లీశ్వరునితో సంధి సేయనెంచి యందుకై కొందరు మంత్రుల నంపెను. కాని యది పొసగినది కాదు. సంధి దెల్పవచ్చినవారితో అల్లాఉద్దీను తనకు పద్మిని దొరికినంగాని రణమాగదని స్పష్టముగా దెలిపెను. ఈ వార్త వినగానే శూర రజపూతులందరు పడగ ద్రొక్కిన సర్పముల భంగి అదరిపడి, తమ యందరి ప్రాణములు పోవు వరకును యుద్ధముజేసెదమని విజృంభించిరి. అందుపై నాయిరువాగు సైన్యంబులుం దలపడి యుద్ధము చేయుచుండిరి.

ఇట్లు పదునెనిమిది మాసములు యుద్ధము జరుగుచుండెను. కాని శూరులగు రజపూతులు బాదుషా సైనికులను బట్టణములోనికి బోవ నియ్యకుండిరి. అల్లాఉద్దీను వారి నిశ్చయముగని రజపూతుల యుదమునం దోడించి పద్మినిని బట్టు ప్రయత్నము మానుకొనవలసినవాడాయెను. యుద్ధము మానుకొన్నను పద్మినియం దతనికి గల వ్యామోహ మతని నాపొలిమేరదాటి పోనియ్యకుండెను. అందువలన నతడు భీమసింహున కిట్లు వర్తమాన మంపెను. "నాకు పద్మిని దొరుకునన్న యాసలేదు. కాని యామె రూప మొకసారియయినను మీరు నా కగుపరచినయెడల నేను సైన్యసహితముగా ఢిల్లీకి మరలి వెళ్ళుదును." ఈ వర్తమానము విని కొంతరోషము గలిగినను

పోరునకు విసుగు కలిగిన రజపూతు లందున కొప్పుకొనిరి. తదనంతర మా సంగతి భీమసింహుడు పద్మినికి దెలుపగా నామె తాను ప్రత్యక్షముగా నామ్లేచ్ఛునికంట బడనని స్పష్టముగా దెల్పెను. అంతపయి భీమసింహు డామెకు నామె ఢిల్లీశ్వరునకు గనిపించని పక్షమున రజపూతులకు గలుగు బాధల నెరిగింపగా, నామె యద్దమునందు దన ప్రతిబింబమును బాదుషాకు జూప నొప్పుకొనెను. అప్పుడు "పద్మిని నీ కగుపడజాలదు; గాని నామె ప్రతిబింబమును జూపెద" మని చిత్తూరునుండి అల్లాఉద్దీనుకు జెప్పి పంపిరి.

అంతపయి యుద్ధము నాపి నియమితదివసంబున నొక రిద్దరు సేవకులతో అల్లాఉద్దీను పద్మినిని జూచుటకయి చితూరు కోటలోనికి వచ్చెను. అచట భీమసింహుడు రాజునకు దగు మర్యాదలు చేసి యాతనికి దర్పణంబున పద్మినిరూపమును జూపెను. తాను విన్నదానికంటెను పద్మిని విశేషరూపవతి యగుట గనినందున, బాదుషాయొక్క చిత్తచాంచల్య మినుమడించెను. దానిని మనమునం దడచుకొని యా మ్లేచ్ఛప్రభువు మరలిపోవునపుడు తనకృత్యమునకు బశ్చాత్తాపపరుడయి నటుల భీమసింహునితో నిట్లనియె. "భీమసింగుగారూ! నేను చేసిన నేరమును మన్నించవలయును. నే డాదిగా చిత్తూరు సంస్థానీకులతో నేను సఖ్యము చేయదలచితిని. ఇంతవరకు మీ యోగ్యత తెలియకపోవుటవలన నే వైరము తలపెట్టితిని. కాని నేడు మీ యోగ్యత నా కన్నులార చూడగా మీవంటి మిత్రులు దొరుకుట నాకు మిగుల శ్రేయస్కరమని తోచు

చున్నది. కాన, నీ ప్రథమదివసంబున తమరు నావిడిదికి దయ చేసి నే చేయుపూజల నంగీకరింతురని నమ్ముచున్నాను. ఈ నా చిన్న విన్నపము మీా రంగీకరింపక తప్పదు." బాదుషా యొక్క నమ్రతత్వమును కని యాతని మాటలనునమ్మి భీమ సింహుడు మితపరివారముతో నాతని శిబిరంబునకు బ్రయాణ మయ్యెను.

అల్లాఉద్దీను మిగుల దుర్మార్గుడగుటవలన రాజుగారిని నమ్మించి తనతో దోడుకొనివచ్చి, తనశిబిరసమీాపమునం దాయ నను సైన్యము చుట్టడించి ఖైదు చేయునట్లు చేసెను. రాజు పట్టు పడుటవలన మిగుల నుప్పొంగి అల్లాఉద్దీన్ చితురున కిట్లు వర్తమాన మంపెను. "పద్మిని నావద్దకు రానియెడల భీమ సింహుని ప్రాణములగొని మరల రజపూతులను సంహరించె దను." ఈ సంగతి విని రజపూతులాదరు నేమిచేయుటకును దోచక మిగుల విచారముగా నుండిరి. రాజగు లక్ష్మణసింహుడు బాలుడగుటవలనను, భీమసింహునిపుత్రులు పండ్రెండుగురును అల్పవయస్కు లగుటవలనను, ఇట్టిసమయమునం దగిన యుపా యము యోచించువారు కాన రారయిరి. కాని పద్మినిమాత్ర మప్పుడితర స్త్రీలవలె దుఃఖింపుచు గూర్చుండక మిగుల ధైర్యము వహించి భర్తను విడిపించు నుపాయము యోచింపు చుండెను. ఆసమయమునం దేవోపనిమిాద నామె సోదరుడగు గోరాసింహుడును, నాతని పుత్రుడగు బాదలుడను వీరుడును అచటికి వచ్చిరి. ఆమె వారితో యోచించి మిగుల చిత్రమగు యుక్తిని బన్నెను. పద్మిని అల్లాఉద్దీనున కిట్లు వర్తమానము

చేసెను "మీరు భీమసింహునివిడిచి ఢిల్లీకిబయలుదేరిన యెడల నేను తగుదాసీలతోడంగూడి యచటికి వచ్చెదను. కాని నా దాసీల పరువునకును, రాణివాసమునకును మీ సైనికులు భంగము సేయకుండునటుల కట్టుదిట్టములు చేయవలయును." పద్మిని తెలిపిన వార్త విని అల్లా ఉద్దీను పరమానందభరితు డయ్యెను. అంత నాతడామె యన్నప్రకార మొప్పుకొని యామెకు ద్వరలో రమ్మని కబురు పంపెను. బాదుషాయొద్దనుండి తన పలుకుల కంగీకారము వచ్చుట విని, పద్మిని తాను ప్రయాణ మాయెను. ఆమెతోడ వచ్చుటకు నేడువందల మేనాలను సిద్ధపరచెను. ఒక్కొక మేనాలో ముగ్గురేసి శూరులు ఆయుధహస్తులయి కూర్చుండిరి. ప్రతిమేనాకును నారుగురువంతున గుప్తాయుధులగువీరు లాయందలములను మోయుచుండిరి. పద్మిని తన సైన్యమునకును, తనకును దోడుగా గోరాసింహుని, నాతని పుత్రుడగు బాదలుని సహితము తనతో దీసికొని పోయెను. ఇట్లు వీరందరు తురకలశిబిరమును సమీపించి బాదుషాయాజ్ఞవలన నామేనాల నన్నిటిని శిబిరములోనికి నిరాటంకముగా గొనిపోయిరి. తదనంతరము పద్మిని భీమసింహునినొకసారి చూచెదనని బాదుషాకు తెల్పి, భీమసింహుని ఖైదుచేసిన స్థలమునకు దన మేనాను బట్టించుకొని చనెను. అంత స్త్రీలవలెనున్న యాగుప్తసైన్యమంతయు తమ నిజస్వరూపమును గనబరచి మ్లేచ్ఛసైన్యముల దైన్యము నొందింపసాగెను. భీమసింహు డదియంతయు నేమని యడుగుచుండగా పద్మిని యాతనిని త్వరపెట్టి సిద్ధపరచి తెచ్చిన

అశ్వములపై తానును, భర్తయు నెక్కి యా సంగ్రామపు సంద డిలోనుండి తప్పించుకొని క్షణములో చితురు ప్రవేశించెను. ఇచట జోరాసింహుడు సైన్యాధిపత్యము స్వీకరించి యా తుర కల నోడించెను. కాని యర్జున తుల్యుడగు గోరాసింహుడును, నాతని పుత్రుడగు బాదలుడును ఆ యుద్ధమునందు మృతు లగుటవలన రజపూతులకు విజయానందమంతగా రుచింప దయ్యెను అల్లా ఉద్దీను పరాజయమునకు బిసిబిల్లాయనుచు దన సైనికులతో ఢిల్లీమార్గమునకు దరలిపోయెను.

ఆ యుద్ధానంతరము మరికొంతకాలమునకు ఢిల్లీపతి విశేష సైన్యముతో మరల చితురుపై దండు వెడలెను. ఈ తడవ చితురునందు శూరులు లేనందున రజపూతులకు విజయాశ యంతగా లేకయుండెను. కాని, యావీరు లంతటితో నిరాశ నొందియుండక ప్రాణములకు దెగించి శత్రువులతో బోరాడ దొడగిరి. అట్టి సమయమునందొక కారణమువలన నా రజ పూతులకు జయము దొరకదని నిశ్చయముగా దోచెను. అది యేదియనగా నా యుద్ధము జరుగునపు డొకదినము రాత్రి గ్రామదేవత భీమసింహుని స్వప్నమునందగుపడి "నా కతి దాహముగా నున్నది. ఈ దాహము పండ్రెండుగురు రాజుల రక్తము త్రాగినగాని తీరద"ని చెప్పెనట. అదే ప్రకారము భీమ సింహుని పుత్రులు పదునొకండుగురు శత్రువులతోడ బోరి హాతులయిరి. అంతటితోనైనను రజపూతులు ధైర్యమును విడువక పురమునంగల పురుషులందరును వైరులతోడం బోరి స్వర్గసుఖమంద నిశ్చయించిరి. అంత వారందరు సిసోదియా

వంశము నాశమొందకుండుటకు వగచి భీమసింహుని కనిష్ఠపుత్రుని నొక దాదిచేతికిచ్చి సమీపారణ్యమునకు బంపిరి. పిదప వారందరు రాజవంశమునకు గౌరవమగునని నిశ్చయించుకొని సమరరంగమున కరిగిరి. ఆదినము రజపూతుల శౌర్యాగ్ని మరింత ప్రజ్వలింప వారు శత్రువులకు మిగుల దుస్సాధ్యులని తోచిరి. కాని విస్తీర్ణమగు మ్లేచ్ఛసైన్యము ముందల్పమగు రజపూత సైన్యమున కెట్లు జయముదొరకును? ఆ సాయంకాలము వరకు క్షత్రియ వీరులందరు వీరస్వర్గమున కరుగగా జయలక్ష్మి అల్లాఉద్దీనునే పొందెను.

భీమసింహునితోడ సకల రాజపుత్రులును యుద్ధమున మడియుట నగరమునందలి స్త్రీలకు తెలియగా, పద్మినియు సకల రజపూతుల భార్యలును, పాతివ్రత్య రక్షణమునకై అగ్నిప్రవేశము చేయ నిశ్చయించుకొనిరి. ఇట్లు వారు కృతనిశ్చయురాండ్రై యొక గొప్పచితి బేర్చి దాని కగ్ని ముట్టించిరి. అంతపై పద్మిని తానే ముందాయగ్నియందు దుముకగా నందరు స్త్రీలును దుమికిరి. (ఈ యగ్నిప్రవేశమునే రజపూతులు జోహారు, లేక జహారవ్రతమని యెదరు) బాదుషా విజయానందముతో పురప్రవేశము చేయగా నా గ్రామమంతయు చితామయమయి యుండెను. అంతు తానింత ప్రయత్నము జేసి చేకొనదలచిన పద్మిని దేహము భస్మమయి యుండగా జూచి, అల్లాఉద్దీను మిగుల వగచెను. యుద్ధమునకు ప్రయాణమైనపుడు భీమసింహుడే స్త్రీల నందర నొక గుహలోనికి దోలి యా గుహను మూసి గుహాద్వారమున కగ్ని యంటించెనని కొందరు చరిత్రకారులు వ్రాసియున్నారు.

# మొల్ల

★

కిం కులేన విశాలేన విద్యాహీనేన దేహినాం
దుష్కులం చాపి విదుషో దేవైరపి సుపూజ్యతే*

మొల్ల యాతుకూరి కేశయసెట్టి కూతురు. ఈమె కులాలవంశ సంభూతయని పరంపరగా వాడుక వచ్చుచున్నది. ఆంధ్రభాషయందు ఈమె రామాయణము రచించినందున ఈమెకీర్తి జగములో నజరామరమై యున్నది. ఈ యువతి ౧౬-వ శతాబ్దారంభమున నున్నట్లూహింపబడుచున్నది.

... ... ... ... గోప
వరపు శ్రీకంఠమల్లేశు వరముచేత । చెలఁగి కవిత్వంబు చెప్పనేర్చినాను.

అని చెప్పుకొనుటచే, ఈమె నివాసస్థలము నెల్లూరిమండలములోని గోపవరమని తెలియుచున్నది. ఈమె రామాయణము చదివినవారందరీమెకు దెనుగున నత్యంత ప్రావీణ్యముండెనని యొప్పుకొనక మానరు. ఈమె కవిత్వము మృదుమధురమై, 'తేనె సోక నోరు తియ్యన యగురీతి, దోఁడ నర్థమెల్ల' దోచునదియై, 'గూఢశబ్దవితతి కొల్లలాట' లేనిదియై, ద్రాక్షాపాకమై యొప్పుచున్నది. గూఢపదగుంభనముచే నర్థకాఠిన్యము సాధించి చదువరుల బాధపెట్టుట యీమె కెంతమాత్రమును ఇష్టము

* శ్రేష్ఠమైన కులములందు బుట్టివిద్య లేకుండిన నేమి లాభము? నీచ కులమునందు బుట్టినను విద్యావంతులైనవారు అందరికి బూజ్యులు. అనగా కులము ప్రధానము గాదు; గుణమే ప్రధానమన్నమాట.

లేదు. కవిత్వధోరణి యెట్టులుండవలయునో యన్న విషయమై యీమె సుందరమైన మూడు పద్యములు వ్రాసియుంచినది. ఆ మూడు పద్యములు కవిత్వము చెప్పువారందరును తమతమ హృత్పటములమీఁద వ్రాసియుంచుకొనదగినవి. అవి యెవ్వియన—

క. మును సంస్కృతంబు తేటలఁ | దెనిగించెడిచోట నేమి తెలియక యుండన్
దనవిద్య మెఱయఁ గ్రమ్మఱ ఘనముగ సంస్కృతము చెప్పఁగా రుచి యగునే?

గీ. తేనె సోఁక నోరు తియ్యన యగురీతిఁ దోఁడ నర్థ మెల్ల దోఁచకున్న
గూఢశబ్దవితతిఁ గొల్లాటపని యెల్ల మూఁగ చెవిటివారి ముచ్చటరయ

క. కందువమాటల సామెత లందముగాఁ గూర్చి చెప్పనవి తెనుగునకుం
బొందై రుచియై వీనుల విందై మరి కానిపించు విబుధుల కెల్లన్.

మొల్లకు గవిత్వస్ఫూర్తి విశేషముగా నుండినందున నామె యాశుకవిత్వము సులభముగా జేయుచుండెను. మొల్ల తలయంటికొని స్నానముచేసిన పిదప రామాయణరచన కారంభమును చేసి తలవెంట్రుకలారులోపల నొక కాండమును ముగించెనని లోకవార్త గలదు. "అక్కడక్కడ గొన్ని వ్యాకరణ దోషము లున్నను మొత్తముమీఁద నీమె కవిత్వము మిక్కిలి మృదువై; మధురమై రసవంతముగా నున్నది. ఈ రామాయణము గొంతకాలము క్రిందటివరకును వీథిబడులలో బాలురకు పాఠమునుగా జెప్పుచుండిరి. ఇది పురుషులు చెప్పిన గ్రంథములలో ననేకములకంటె మనోజ్ఞమై ప్రౌఢమై యున్నది." అని కవిచరిత్రకారులీమె కవిత్వమును గురించి వ్రాసియున్నారు. మొల్లభక్తిపూర్వకముగా రచియించిన రామాయణము మొల్లరామాయణమను పేరిట నాంధ్ర

దేశమునం దంతటను సువిఖ్యాతమే. ఈ రామాయణములోని కొంతభాగము ప్రవేశపరీక్షకు బఠనీయ గ్రంథముగా నప్పు డప్పుడు నియమింపబడియున్నది. ఇందువలన నీ రామాయణ మొక శ్రేష్ఠమైన కావ్యమని స్పష్టమగుచున్నది. ఈమె కవన ధోరణి దెలుపుటకయి మొల్ల రామాయణమునందలి కొన్ని పద్యముల నిందుదాహరించెదను.

ఉ. రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు మృగరాజులు విక్రమ కేళియందు గో
రాజులు భోగమందు దివిరాజులు సంతతతేజమందు రా
రాజులు మానమందు నవరంబున రాజకుమారు లందరున్.

ఉ. సాలము పొంత నిల్చి రఘుసత్తము డస్త్రము వేసి శబ్దవి
న్మూలము గాగ నిల్ దివిచి ముష్టియు దృష్టియు గూర్చి గోత్రభృ
త్తూలము వజ్రపాతహతి గూలువిధంబున గూల నేసె న
వ్వాలి బ్రతాపశాలి ప్రభువంద్యశీలి సురారి మెచ్చగన్.

ఉ. పున్నమచందమామ దెండడి సొంపెసలారెడు మోముదమ్మియున్
గన్నులు కల్వరేకులను గాంతి జయించెకగాని రక్తిగన్
జెన్ను దొలంగి యుండ వరచేతులు పాదములున్ దలంపగా
నున్నవి వర్ణముల్ గలిగి యెప్పు దొరంగదు రాఘవేశ్వరా.

ఈ మొల్ల కుమ్మరకులమునం దుద్భవించియు దన విద్య వలన నుచ్చవర్ణమువారిచే గూడ గౌరవింపబడ బాత్రురా లాయెను. ఇట్టివిద్య మా సోదరీమణుల కందరకును గలిగిన యెడల మనదేశ మితరదేశము లన్నిటికిని మాన్యస్థాన మగు ననుట కెంతమాత్రమును సందియము లేదు.

# పన్నా

## ౧

క. ఇప్పాటి నయ్యుత్తమసతి । నప్పురముఁ నొప్పవార లతిముద మొదలం
జొప్పడ గీర్తన సేయుదు । రిప్పటసున నుండ దలచి యింతులు ఘనమున్.

[చింతామణి.

మేవాడదేశపు రాజగు సంగ్రామసింహుఁడు మృతుఁడయిన వెనుక నాతని పుత్రులు మువ్వురిలో నిరువురు స్వల్ప కాలమే రాజ్యము పాలించి పరలోకమున కేగిరి. మూడవవాఁడగు ఉదయసింహుఁడు దైదేండ్లప్రాయము కలవాఁడయి దాది పోషణలోనే యుండెను. ఈతని దాది పేరు **పన్నా**. ఈపన్నాకు రాజధాత్రిత్వము వంశపరంపరగా వచ్చుచుండెను. ఈను సుగుణములు మిగుల విలువగలవని తెలుపునటుల గాబోలును నవరత్నములలోని దగు * (పన్నాపచ్చ) యని తలిదండ్రు లామెకు బేరిడిరి. పన్నా వారిడిన నామమునకు దగు గుణవతి యయ్యెను.

సంగ్రామసింహుని పుత్రు లిరువురును స్వర్గస్థులైనపిదప, నుదయసింహుని పేర పృథ్వీరాజునకు దాసీపుత్రుఁడగు బనబీరుని రాజ్యము నడుపునట్లేర్పాటు చేయబడెను. బనబీరుని జన్మము వలెనే గుణమును నీచమైనదియేగాన, వాఁడు తాననర్హుఁడయినను,

* ఈమె పేరు ఒకానొక తెలుగు గ్రంథకారుఁడు మోతి (**ముత్యము**) యని వ్రాసినాఁడుగాని యందు కాధారమేమియు రాజపుతానా చరిత్రమునందు గానరాలేదు.

అదృష్టవశమున దనకు రాజ్యమును రాజపాలకత్వమును దొరకుటకు సంతసించి యుండక, రాజ్యము తనకే శాశ్వతముగానుండు నుపాయము విచారింపసాగెను. ఇట్లు విచారింపగా రాజపుత్రుని నెట్లయిన జంపక తనకు రాజ్యము దొరకదని వాడు తెలిసికొని, యెవ్వరికి నెరుకపడకుండ తానే యీ పనిని జేయ నిశ్చయించుకొనెను. ఆ నీచుడు తనకృత్యమించుక బైలపడిన యెడల రజపూతు సరదార్లు తనను దెగజూతురని యెరిగినవాడు కాన, పైకి మిగుల సత్ప్రవర్తనగలవానివలె నగుపడుచుండెను. రాజపుత్రుని నెటులయిన దానుజంపి యీ ద్రోహమితరులపై నిడి సరదార్ల సమ్మతిచే దానే రాజగు నుపాయము నాతడు యోచింపుచుండెను.

బనబీరుని మనమునందిట్టి ద్రోహము కలదని యెరికిని సంశయమయినను రాకుండెను. గాని యిట్టి పాపవిచారము బైలపడకుండుట దుస్తరముగాన నాతని దుష్టవిచారమంతయు సమీపమునందుండు నంగలివాడొకడు తెలిసికొనెను. వాడును పన్నావలెనే ప్రభుభక్తుడు. వానికి బనబీరుని పరిపాలనమే యసమ్మతము. బనబీరుడు తన దుష్టత్వమెంత గుప్తముగా నుంచినను, పరమేశ్వరుడు ఆ పాపమునకంతకును నీ మంగలివాని నొకనిని సాక్షిగా నియమించెను. బనబీరుడే సమయమునం దేమియాలోచన చేసినను బహు యుక్తులచే నీ మంగలి యప్పుడే దానిని గనిపెట్టుచుండెను.

ఇట్లుండగా నొకనాటిరేయి రాజనగరమునం దాతటను నిశ్చలముగానున్న సమయమున, పన్నా రాజపుత్రుని వానితో

సమవయస్కుఁడగు తన పుత్రుని నిసురపుచ్చి తాను సమీపమున నేదో కుట్టుకొనుచు కూర్చుండెను. ఇంతలో ద్వారమావల నేమో కాలుచప్పుడు వినవచ్చినందున నాదాది లేచి చూచెను. అప్పుడు పైని జెప్పబడిన మంగలివాఁడు మిగుల నాతురతతో వచ్చుటగని, పన్నా "నీవింత తొందరగావచ్చి పిచ్చివానివలె నాతురడవయ్యెదవేమి? యేదియేని యప్రియమా? యని యడిగెను. అందుకా నా పితుఁడు "అవును మిగుల ఘాతకాబోవుచున్నది. ఇంక నొక గడియ కాబనబీరుడు రాజపుత్రుని జంప నిట కేతెంచెను." ఈ వాక్యములు చెవిని సోకగానే పన్నా దేహము ఝల్లుమన నొక యూర్ధ్వశ్వాసను విడిచి యిట్లనియె. "నే నిన్నిదినములు వచ్చునని భీతిల్లుచుండినదే నేడు ప్రాప్తమయ్యెను. ఆదుష్టునిపై నా కిదివరకే యనుమానముండెను. కాని నే నాడుదాననగుటచే నేమిచేయుటకు జాలకుంటిని. ఏది యెట్లైనను నిప్పుడు రాజపుత్రుని రక్షించుట మన కర్తవ్యము" అనఁగా మంగలి "యది బహుసంఘటము. అయినను నీ కేదేని యాలోచన దోచినచో త్వరగా జెప్పుము. నీవెట్టి కార్యము చెప్పినను నేను నిర్వహింపగలను" అనెను. తదనంతరము పన్నా యొకించుక విచారించి "రాజపుత్రుని నొకానొక సుస్థలమునకు గొనిపోవుదమ"ని చెప్పెను. "అట్లు చేయుటకు వీలులేదు. నేఁడే బాలకులను రాజనగరు వెలుపలికి గొనిపోకుండ పాపాత్ముఁడు కట్టడి చేసెను." పన్నా అటులైన నీ రాజపుత్రుని నొక తట్టలో బెట్టి పైన పెంట బోసి నీ కిచ్చెదను. నీవు దానిని గొనిచని సురక్షితమగుచోట నుంచు

నంతలో నేనచటికి వత్తును." మంగలి "బనబీరు డింతలో నిచ
టికి రాగలడు. వచ్చువర కిచట రాజపుత్రుడు లేకుండెనేని
తత్క్షణము చారులచే వెతకించి పిల్లని చెప్పించును. అటులైన
రాజపుత్రుని ప్రాణములను మనము కాపాడ నేరము." పన్నా
కొంచెము యోచించి మిగుల గాంభీర్యముగా "ఇందు కంతగా
విచారింపనేల? వా డిచటికి వచ్చినయెడల రాజపుత్రు డిచట
లేడనుమాటనే వానికి దెలియనియ్యను. రాజబాలుని నగలను,
బట్టలను నా బిడ్డనికి నలంకరించి యీ పక్కమీదనే పరుండ
బెట్టెదను! నా పుత్రుని మరణమువలన మేవాడదేశపురాజును,
మా ప్రభువును నగు నీ బాలుడు రక్షింపబడును. కాన నా
కదియే పరమ సమ్మతము." పన్నా దృఢ నిశ్చయముగా బలి
కిన వాక్యములనువిని, యీ నాపితుడు మిగుల నాశ్చర్యముతో
నేమియు ననక నిలువబడి యుండెను. ఇంతలో పన్నా రాజ
పుత్రుని నొక తట్టలో నునిచి, పైన పుల్లాకులు, పెంట మొద
లయినవి పోసి, యాతట్ట త్వరగా గొనిచనమని యీ సేవకుని
తొందరపరుపసాగెను. దీని నంతను గని పన్నా ధైర్యమునకును,
రాజభక్తికి వింతపడి దానియం దధికదయగలవాడై యాభృ
త్యుడు "పన్నా! నీవింత సాహసకార్య మేలచేసెదవు? ఇంకను
నీ మనంబునం దించుక విచారింపుము," పన్నా! "విచారింప
వలసిన దేమున్నది? నా కర్తవ్యము నేను చేయుటకు దగిన
విచారము చేసినాను. నీవిట్టి యాటంకములనే చెప్పుచు నిచట
నాలస్యము సేయకు."

ఎంతచెప్పినను పన్నా వినదని తెలిసికొని తానాలస్యము చేసిన రాజపుత్రుని ప్రాణము దక్కదని యెరిగినవాడగుటచే వాడా తట్టను నెత్తిన నిడికొని రాజనగరు వెలుపలి కరిగెను. పన్నాదాయియు రాజపుత్రుని యలంకారములను తన పుత్రునకు నలంకరించి, వానిని రాజబాలుని పాన్పుపై నిదురబుచ్చెను. ఇటులా రాజభక్తిగల యువతి తన పుత్రుని నిదురింపుచుండ తానా పక్కసమీపమునందుండి బనబీరుని రాకకై నిరీక్షించుచుండెను. ఇంతలో నా కాలస్వరూపుడచటికి వచ్చి మిగుల దయగలవానివలె రాజపుత్రుని దేహము స్వస్థముగా నున్నదాయని పన్నా నడిగి, వానిని జూచెదనని పక్కయొద్ది కరిగెను. ఆ ప్రకారమచటి కరిగి, వాడు నిదురింపుచున్నవా రెవ్వరని విచారింపక నా యర్భకుని పొట్టలో కత్తి పొడిచి పారిపోయెను. వాడట్లు పొడువగా నా బాలుడొక కేకవేసి ప్రాణములు విడిచెను. ఆ కేక రాజభవనమునందంతటను వినబడి జనుల నందరిని లేపెను.

ఆ కేక విన్నతోడనే రాజభవనమునందలి వారందరచటికి వచ్చిరి. వారు వచ్చి చూచునప్పటికి రాజపుత్రుని దేహమంతయు రక్తమయమయి, యా బాలుడు ప్రాణములనువిడిచియుండెను. పన్నాదాయి యాబాలునిసమీపముననే దేహము తెలియక పడియుండెను. చచ్చినవాడు రాజపుత్రుడేయనితోచుటచే జనులందరు మిగుల దుఃఖించిరి. పన్నా సేదదేరిన పిదప రాజపుత్రుని జంపినవా రెవ్వరని యడుగగా "నొక నల్లటి పురుషుడెవడో చంపెన"ని చెప్పెను. రాజపుత్రుని జంపిన

వారెవ్వరోయని యనేకు లూహించిరి. కానిసాక్షులు లేనందున దానిని నిశ్చయింపలేకుండిరి. పన్నాదాయి యచటనుండి వెడలి రాజకుమారుని దాచినస్థలమునకరిగియాబాలుడు ప్రౌఢుడగువరకు నాతనిని పోషించెను. ఈ సంగతి యంతయు రజపూతులకు దెలియగా వారు ఉదయసింహుడు పెరిగినపిదప బనబీరుని దేశము వెడలగొట్టి ఉదయసింహునినే రాజునుగా స్వీకరించిరి. ఇట్లొక రాజభక్తిగల యువతివలన సంగ్రామసింహుని వంశము నిలిచెను. అనేక ప్రజలను గాపాడు ప్రభువు బ్రతికెను. కాననట్టి యువతికీర్తి భరతఖండమునందంతటను నిండియుండుట వింతగాదు. ఉదయ సింహుడు పన్నాను తల్లినిగా భావించి పూజింపుచుండెను.

★
★★★
★

# ఖడ్గతిక్కన భార్య

* అమృతం సద్గుణాభార్యా.

ఈ యువతీరత్నముయొక్క నామధేయ మయినను తెలియనందువలన నీమె భర్తపేరిటనే యీమెను జనులు గుర్తించెదరు. ౧౩ వ శతాబ్దమున సూర్యవంశపు రాజగు మనుమసిద్ధి నెల్లూరుమండలము పాలించుచుండెను. ఆయన యాస్థానమునందున్న కవి తిక్కన, కార్యతిక్కన, ఖడ్గతిక్కన యను సహోదరులలో బరాక్రమవంతుడగు ఖడ్గతిక్కన కీమె భార్య. ఈ ఖడ్గతిక్కన నియోగిబ్రాహ్మణుడు. ఈయన తన పరాక్రమమువలన రాజుచే మిగుల మన్నింపబడుచుండెను

ఖడ్గతిక్కన భార్య విద్యావతియు, గుణవతియు నై సదా పతి శ్రేయమునే కోరుచుండెను. ఆమె భర్త చేసినదంతయు మంచి పని యని యూరకుండక, యాతడేదేని కానికార్యము చేయ దలచినయెడల, తన చాతుర్యమువలన నాతనిచే నట్టి కార్యము జరుగకుండ జేయుచుండెను. ఇందునకు నిదర్శనముగా నొకప్పు డామె చేసిన చాతుర్య మిం దుదహరించెదను.

ఒకానొక సమయమున రాజగు మనుమసిద్ధిపై శత్రు రాజులు దండెత్తి వచ్చిరి. అపుడు కొంత సైన్యమును తోడిచ్చి రాజు ఖడ్గతిక్కనను శత్రువులతో యుద్ధమున కంపెను. ఖడ్గ తిక్కన యెంతటి శౌర్యవంతుడయినను, వైరు లధిక సైన్యసహితు

* సద్గుణవతియగు భార్య అమృతమువలె హితకరురాలు.

లగుటచే నీతని శౌర్య మేమియు వినియోగింపకుండెను. ఇట్లు కొంతవడి పోరాడి తనకు జయము కలుగకున్న యాస సున్నయగుటచే. ఖడ్గతిక్కన యుద్ధభూమినుండిపారి తన గృహమునకు వచ్చెను.

పరుల కోడి తనభర్త పారివచ్చుట విని మానవతియగు నాతని కాంత మిగుల చింతించి, సమయోచితబుద్ధిగలది యగుటచే పెనిమిటి వచ్చులోపల మరుగు స్థలమునందు స్నానజలముంచి నీళ్లబిందెకు పసపుముద్ద యంటించెను. ఇట్లు స్త్రీలు స్నానము చేయుటకు నావశ్యకమగు వస్తువు లచ్చట నుంచి యామె భర్తరాగానే యాదరింపక తిరస్కారముగా స్నానము చేయుడని చెప్పెను.

తిక్కన తనభార్య ముఖమునందలి తిరస్కారభావమును గని యెపుడేమియు ననక, స్నానమున కరిగెను. అచట నాడువారి కుంచునట్లొక మంచ మడ్డముగానుంచి, నీళ్లబిందెకు పసుపుముద్ద యద్దుట గని, తిక్కన యది తాను యుద్ధమునుండి పారి వచ్చినందుకు భార్య తనను దిరస్కరించుటకై చేసిన పనియని తెలిసికొనెను. అయినను ఆయన యంతటితో నూరకుండక తన భార్యను బిలిచి యిది యేమియని యడిగెను. అంతనా వీరపత్ని యాతనికి పౌరుషము కలుగుటకై ఈ పద్యము జదివెను—

క. పగరకు వెన్నిచ్చినచో। నగరే నిను మగతనంపు నాయకులందున్?
ముగురాడువార మైతిమి। వగపేటికి జలకమాడ వచ్చినచోటన్?

ఇదివరకు అత్తకోడండ్ర మిద్దరమే యింట స్త్రీల ముంటిమి. ఇప్పుడు మీరు యుద్ధము వదలి పారివచ్చినందున స్త్రీ

సమానులరయితిరి గాన, నింట ముగ్గురు స్త్రీలమయినా మన్న యర్థముగల యీ వాక్యములు చెవిసోకిన వెంటనే ఖడ్గతిక్కన మిగుల లజ్జించి యపుడే మరల యుద్ధమున కరిగి మిగుల కీర్తి గాంచెను. కొంద రిది యంతయు దిక్కన తల్లి యొక్క పని యని యెదరు. ఇట్లు పూర్వమాంధ్రదేశమునందు పూజనీయలగు వీరపత్నులు, వీరమాతలు, వీరభగినులు అనేకు లుండుట వలననే ఆంధ్రదేశములోని బ్రాహ్మణులలోగూడ క్షాత్రతేజ మత్యంత ప్రబలమై యుండెనని చెప్పుటకు సందేహము లేదు.

# తఱిగొండ వెంగమాంబ

క. కందమునఁ బాటల సామెత । లందముగాఁ గూర్చి చెప్పె నవి తెనుఁగునకుం
బొందై రుచియై వీనుల । విందై మరి కానిపించు విబుధుల కెల్లన్.

తఱిగొండ వెంగమాంబ వసిష్ఠగోత్రికుఁడును, నందవరీక బ్రాహ్మణుఁడును నగు కృష్ణయ్య యను నాతని పుత్రిక. ఈమె వాసస్థానము కడపమండలములోని తఱిగొండయని యూహింపబడుచున్నది. వెంగమాంబ తెలుగునందు విద్వాంసురాలని యామెచే రచింపబడిన గ్రంథములే వేనోళ్ల దెలుపుచున్నవి. వేంకటాచలమాహాత్మ్యమునం దీమె ఆశ్వాసాదిని వేసిన శ్లోకములవలన సంస్కృతము నందును నీమెకుఁ గొంత పరిచయము గలదని తోఁచుచున్నది. ఈమె బాలవితంతువు. వేదాంతగ్రంథపఠనమువలనను, గ్రంథరచనవలనను, కడపమండలములోనేగాక తెనుఁగుదేశమునం దంతటను వెంగమ్మగారి కీర్తి విస్తరిల్లెను. కాన జను లామెయం దధిక విశ్వాసము గలిగి దేశాచార ప్రకార మామెపై ననేక కథలను జెప్పుకొనసాగిరి. అవి యన్నియు నిందుదాహరించుట యనావశ్యకముగాన నొకటిరెంటిని మాత్ర మిందుదాహరించెదను.

వెంగమాంబ గ్రంథరచనచేయుచు నేకాంతముగా నొకగదిలోఁ గూర్చునుచుండెను. అచటినుండి యామె యీవలికి రాఁగానే యామె ముఖమునం దానందమును, దేహమునందు సుగంధమును గానవచ్చుచుండెనట. ఇందువలన నామె వదినలామెయందు దోషము గలదని తలఁచి, దానిని కనిపెట్టుటకయి

యా గది ద్వారముకడ కాచియుండిరట. అంత గొంతసేపటికి లోపల నెవ్వరో పురుషుడు నవ్వినట్లును, నృత్యము చేసినట్లును వారికి వినబడెనట. అందుపై వారు తమ భర్తలను బిలచి, తాము విన్న సంగతులను తెల్పిరట. అట్లందరు గుమిగూడి వెంగమ్మను తలుపు తెరువమనగా, ఆమె నిర్భయంగా తలుపుతీసెనట. అప్పుడు వారా యఱ్ఱనంతను శోధించి పురుషుని నెవ్వనిగానక యామె నడుగగా శ్రీకృష్ణుడు దప్ప నన్యపురుషుడేల వచ్చునని పలికెనట. ఇవి యన్నియు నామె భక్తివిశేషమును దెలుపు కథలేగాని వేరుగాదు.

వెంగమాంబ తన జీవితకాలమునం దంతను శిరోజములను తీయలేదని చెప్పెదరు. ఆమె బహుదినములు శిరోజముల నుంచుకొనినందున జను లామె యస్పృశ్యురాలని బహిష్కరించెదమని బెదరించిరి. వారంతటితో నూరకుండక శంకరస్వాములవారు రాగా నాలోకగురువున కీసంగతి విన్నవించిరి. అందుపై నా స్వాములవారు వెంకమ్మను బిలిచి నీశిరోజములు తీయించుకొమ్మని చెప్పెను. అందుకామె యిుంచుకయు జంకక పరమేశ్వరు డిచ్చినవి మనుజులేల తీయవలెననియు, అందువలన పరపురుషస్పర్శదోషము కలుగుననియు, ఒక పర్యాయము తీసినవి మరల రానియెడల నది పరమేశ్వరునకు సమ్మతమనియు, అట్లుగాక మరుదినముననే మరల వెండ్రుకలు మొలచుటచే నది పరమేశ్వరునకు నసమ్మతమని స్పష్టముగా దెలియుచున్న దనియు వాదించెను. అంతటితో నూరకుండక గురు వాజ్ఞాపించగా బంధువు లామెను బట్టుకొని బలవాతముగా కేశవపనము

చేయించిరనియు, అంతుపై నామె నదికిపోయిస్నానముచేయగా వెంటనే పూర్వమువలెనే కేశములు మొలిచెననియు, అదిగని గురువులును, బంధువులును మిగుల నాశ్చర్యపడి యట తరువాత నామె జోలి మానిరనియు గొందరు చెప్పెదరు. ఏది యెట్లున్నను వెంగమాంబగారికి వితంతుస్త్రీలకు కేశవపనము చేయుట కిష్టములేదనుట వాస్తవము.

వెంగమాంబగారికి నిష్టములేని ఈకృత్యము ఏ స్త్రీలకును సమ్మతంబు కానేరదు. మన దేశమునందు నంధపరంపరగా వచ్చిన యీ యాచారమునకు గాదనలేక కొందరు యువతులు సమ్మతించినటుల నగుపడినను వారి యాంతరములయందు నపరిమిత దుఃఖము కలిగియే యుందురు. వారివారి భర్తల మరణసమయమున కంటెను కేశవిసర్జన కాలములయందే వారధిక దుఃఖితు లగుచుండిరి. వపనకర్మవలన దమకును, దమ భర్తలకును నిజముగా బుణ్యలోకములు దొరుకునని వారికి నమ్మకమున్న యెడల వారా సమయములయందు దుఃఖించుటకు మారుగా నమితసంతోషమును బొందవలసినదే. స్త్రీలు పతివిహీనలై యలంకార రహితలై మంగళకార్యములకు దూరలై మితిమీరిన దుఃఖవహ్నిలో బొరలుచుండ సుఖమునందున్న వారి బంధువులు మంచిమాటలతో వారి శోకాగ్ని నార్పుటకు మారుగా, బరమేశ్వరుడిచ్చిన కిరీట మన దగిన కేశకలాపమును నేలపాలుచేసి యా దుఃఖాగ్నిలో నెయ్యిబోసి ప్రజ్వలింప జేయుదురు. ఇది యెంతటి యన్యాయము. ఈ దురాచారము సహగమనముకంటెను దక్కువ

క్రూరమైనది యయినను, కొందరు యువతులకిది సహగమనము కన్నను విశేష భయంకరమయినదని తోచుచున్నది. వారిట్లు విహాపులై నలుగురిలో నవమానకరమగు నిట్టి బ్రతుకు బ్రతుకుట కంటెను సహగమనము చేసి యొక గడియ సౌఖ్యముతో దేహము విడుచుట నూరురెట్లెక్కువ సులభమని తలచు చున్నారు. వారు సహగమనము లేకపోవుటకు విశేషచింత నొంది దాని మాన్పినవారినే క్రూరులని నిందింపుచున్నారు. సాధారణముగ పురుషులకయినను నిస్సహాయముగ నవమానము కలిగి బ్రతుకుటకంటెను, మరణమే సుఖదాయకముగ నుండు నని తోచుట సహజము. యుంతు దను కవమానము కలుగునని తెలిసి యాత్మహత్య చేసికొనిన పురుషు లెందరో కలరు. ఇందువలన సహితము నవమానముకంటె మరణమే మేలని జనులకు దోచునని మనకు దెలియుచున్నది. కాన నస్మద్దేశ బాంధవులందరును మన దేశములోని స్త్రీలకు గలుగుచున్న యీ వ్యసనకరమగు నవమానమును దొలగింప బ్రయత్నింతురు గాత.

ఈమె మిక్కిలి వృద్ధురాలయి కాలధర్మము నొందెను. ౧౮౪౧వ సంవత్సరము వరకీమె జీవించియున్నట్లు తెలియుచున్నది. బాలవితంతువైనందున నీమెభర్త నామగోత్రము లెచటను గానరావు. వెంగమాంబచే రచియింపబడిన గ్రంథములలో రాజయోగసార మను వేదాంతపరమయిన ద్విపద కావ్యమును, వెంకటాచల మహాత్మ్యమును మాత్రమును ముద్రింపబడి యున్నవి. వీనిలో రాజయోగసారము భాగ

వతము నందలి తృతీయ స్కంధాంతర్గతమైన కపిలదేవహూతి సంవాదమును గొని, మిగుల రసవంతముగాను, సులభముగాను, ద్విపదకావ్యముగా రచియింపబడినది. దీనిలో సామాన్య జనంబులగు గూడ సులభముగా తెలియునటుల వేదాంతము వివరింపబడినది. వేంకటాచల మహాత్మ్యమునందు విష్ణుమూర్తి పద్మావతిని వివాహమాడిన కథ మిగుల చిత్రముగా జెప్పబడియున్నది. కడమ గ్రంథములేవియు ముద్రింపబడనందున, వానిని గురించి యేమియు వ్రాయుటకు వీలులేదు. "ఈమె కవిత్వమునం దల్పదోషము లక్కడక్కడ గానవచ్చుచున్నను మొత్తముమీద కవన మతికఠినముగాక, మృదుమధుర రచనను గలదియయి యున్నద"ని కవిచరిత్రమునందు రాయబహదూరు కందుకూరి వీరేశలింగము పంతులవారీమె కవిత్వమును బొగడిరి. ఇట్టి వారిచే బొగడొందదగిన విద్యయు, గవిత్వశక్తియు గలిగినను నీమె యిసుమంతయు గర్వములేక మిగుల వినయవతిగా నుండెనని రాజయోగసారములోని యీ క్రింది ద్విపదలు వెల్లడించుచున్నవి.

ద్వి. వినరయ్య కవులార విద్వాంసులార
వినరయ్య మీరెల్ల విమలాత్ములార
ఘనయతిప్రాస సంగతులు నే నెఱుఁగ
వగున నాక్షేపింపవలదు సత్కృపను

ఈమె రచియించిన గ్రంథములు తరిగొండ నృసింహస్వామి కంకితములు చేయబడినవి. ఈమె శృంగార రసాధిదేవత యగు కృష్ణుని భక్తురాలయినను, ఆమెకు దన గ్రంథ

ములయం దెక్కడను శృంగారవాక్యములను జొప్పింప నిష్టము లేక యుండెను. అందువలనను నామె కృష్ణుని నిట్లు స్తుతి యించెను.

శా. శృంగారాకృతితోడ వచ్చి ...ముల్ శృంగారసారంబుతో
డం గూఢంబుగ జెప్పు నీవని ...ల్లే జెప్పలే ...న్
ముంగోపంబున జూచి లేచి యతఁడే క్రమ్మఱం బన్నించి త
చ్ఛృంగారోక్తులు తానె పల్కుకొను నా శ్రీకృష్ణు సేవించెదన్.

ఇందువలన దన గ్రంథములయందు శృంగార వాక్య ముల నినుడ్చుటకు దన కెంతమాత్రము నిష్టము లేకుండగా సందర్భానుసారముగా నా గ్రంథములయం దక్కడక్కడ వచ్చిన శృంగారపద్యములను శ్రీకృష్ణుడే రచియించెనని యామె తెలుపుచున్నది. ఈ విద్యావతి కవనరీతిని దెలుపుట కయి ముద్రితగ్రంథములోని కొన్ని పద్యము లిందుదాహరించి యామె చరితను ముగించెదను.

వేంకటాచలమాహాత్మ్యము.

ఉ. రామనృపాల, ఘోరతర రావణశౌర్యవిఘాల, భవ్య సు
త్రామ సురార్య యోగిజన తాపసపాల, కృపాలవాల, శ్రీ
భూమిసుతాత్మలోల, పరిపూర్ణసుకీర్తివిశాల, వానర
స్తోమముతోడ వచ్చు మిము జూచి కృతార్థులమైతి మిద్ధరన్. ఆ ౧

చ. విని యది భీతి నొందుచు వివేకముతో ద్విజుమోముజూచి యి
ట్లనియెను జారకాంతను మహా విషసర్పమునంటి యెవ్వరై
నను గడతేరినారె నిను నమ్మిన భార్యను వీడి నన్ను బొం
దిన నిహమున్ బరంబు చెడు ధీరతతో ఒను బ్రాహ్మణోత్తమా! ఆ ౨

## రాజయోగ సారము.

ద్వి. సంపద గలిగిన సామర్థ్యమనుచు
సొంపుమీరిన తుచ్ఛసుఖ మిచ్ఛయించి
కామాంధులై తమ గతి గానలేక
భామల వలలోన బడి లేవలేక
తరగని యీషణత్రయవార్ధిలోన
మరిమరి మునుగుచు మమత రెట్టింప
నాలుబిడ్డల కని యర్థంబు గూర్చి
కాలంబు నూరకే గడుపుచునుండి
* * * *
పుట్టుచు గిట్టుచు పొరలుచుండెదరు.

# వీరాబాయి

★

సంగ్రామే సుభటేంద్రాణాం కవీనాం కవిమండలే
దీప్తిర్వా దీప్తిహానిర్వా ముహూర్తాదేవ జాయతే.*

వీరాబాయి చితూరు సంస్థానాధీశ్వరుని భార్య. ఈమె అక్బరు బాదుషాకాలము సంబంధించినట్టి యితిహాసమువలన దెలియుచున్నది. కాని యీమె జన్మమరణ సంవత్సరములును, జననీజనకుల నామములును దెలియు మార్గ మెంతయును గానరాదు.

వీరాబాయి స్వశౌర్యమువలన అక్బరు నోడించి తన భర్తను విడిపించెను. అక్బరుబాదుషా చితూరుపై రెండు పర్యాయములు దండెత్తినను ఫెరిస్తాయను ఇతిహాసకారుడు వ్రాసిన గ్రంథమునం దొకసారి దండువెడలుటయే వర్ణింపబడి యున్నది. స్వజాతీయుడగు బాదుషాయొక్క పరాభవము నాత డెట్లు వ్రాయగలడు? ఒకా నొక రజపూతస్త్రీచే నోడింపబడి పలాయితు డైనందున బాదుషాకీర్తికి సంభవించిన కలంక మగుపడ కుండుటకయి తురుష్కులైన యితిహాసకారు లెవ్వరును చరిత్రములలో నీసంగతి వ్రాయనేలేదు. కాని యాసమయము నందు చితూరుదరబారు నందున్నవారప్పటి యుద్ధమును చక్కగా వర్ణించియున్నారు.

---

* యుద్ధమునందు వీరుల శౌర్యాశౌర్యములును, కవి సంఘమునందు కవులయొక్క చాతుర్యాచాతుర్యములును ఒకక్షణమాత్రములో వెల్లడి యగును.

అక్బరుబాదుషా తనయమిత సైన్యముతో చితూరుపై దండు వెడలినప్పు డచట నుదయసింగు డనురాజు రాజ్యము జేయుచుండెను. ఉదయసింగు రాణా యంతటి పిరికి రాజపుత్రుడు మరియొక డుండడు. అక్బరుబాదుషా దండెత్తి వచ్చిన వార్తవిని రాణాగారికి భయమువలన దేహముకంపమెత్తెను. కాన ఆయన విజయులగు తురుష్క సేనలతోడ బోర సాహసింప లేడయ్యె. అందుపై నాతని శూరులగు సరదార్లందరు కుంభ రాణా మొదలగు నాతని పూర్వుల ప్రతాపమును దెలిపి యుద్ధమునకు బురికొల్పసాగిరి. కాని యతడు యుద్ధమునకు వెడల డయ్యెను. రాణా సంగ్రామమునకు వెరచుట గని, యాతని సరదార్లు మిగుల నాగ్రహించి "మీరు శత్రువుల నెదిరించి యుద్ధము చేయకుండినయెడల మిమ్ము రాజ్యభ్రష్టులను జేయుదుము" అనిరి.

ఇట్లందరు నేకతీరుగా జెప్పినందువలన విధిలేక భయముచే దేహము వడక, నాయధైర్యశిరోమణి వీరులగు తన సైనికులతో యుద్ధభూమిని సమీపించెను. కాని సాగరమువలె నలుగడల నిండియున్న యవనసైన్యములంగని భీతిచే గొంతవడి నేమియు దోచక నిలుచుండెను. తదనంతర మెట్టులనో యారాజు తన సైన్యములకు యుద్ధమున కనుజ్ఞయిచ్చెను. రజపూత శూరసైనికు లందరు మిగుల శౌర్యముతోడ బెనగ జొచ్చిరి. వారు జయకాంక్షవలన నెంతపోరినను, ముఖ్యనాయకుని యధైర్యమువలనను, పరబలాధిక్యమువలనను వారికి జయము గలుగు మార్గము కానరాకుండెను. చితూరు కోట

కాశూరు లెంత శౌర్యము గనబరచినను అదియంతయు నిష్ఫలమై ఉదయసింహునకు బరాభవము కలిగెను. అక్బరుబాదుషా తత్క్షణమే యా పిరికిరాజును బట్టి చెరలోనుంచెను. అందుపై జేయునదిలేక రజపూతవీరులు గ్రామమునకు దిరిగిపోయిరి. వారిలో కొందరు తమయిండ్ల కరుగగా వారి స్త్రీలు పరాభవము నొందివచ్చిన భర్తలను, పుత్రులను, సోదరులను లోపలికి రాకుండ తలుపులుమూసి వారిని తిరస్కరింపుచు నిట్లనిరి. "రజపూతకులమునందు మీరేల జన్మించితిరి? సిగ్గులేక మీ మొగములు మరల మాకు జూపకుడు. సంగ్రామ మరణముగాని, జయముగాని దొరికిననే మీకు కీర్తియు, యశమును కలుగును."

ఉదయసింహుని తురుష్కులు చెరబెట్టిరని తెలియగా రాజభవనమునందంతట నెటుచూచిన దుఃఖమయముగానే యుండెను. అప్పుడు రజపూతు వీరులందరు సభచేసి "ఉదయసింహ మహారాజుగారి నెటుల విడిపించనగు? శత్రువుల నోడించుట యెట్లు" అని చింతింపసాగిరి. ఇటుల వారనేక తీరుల విచారించి, తోచక చింతాక్రాంతులై కొంతవడి యూరకుండిరి. ఆ సమయమునం దాపట్టణమంతయు మిగుల నుదాసీనముగా నుండెను. కాని మరల క్షణకాలములో నొక యువతి వారి నానందసాగరమునం దోలలాడించెను. ఆస్త్రీ ఉదయసింహుని పత్నియగు వీరాబాయియే! నాభర్తను మ్లేచ్ఛులు కైదుచేసిరి. రజపూతు లోడిపోయిరి. చితూరు యికె తురకల యధీనమగును. మనమందర మానీచుల స్వాధీన

మగుదువు”ను నట్టి విచారము లనేకము లామె మనంబున నుద్భవింపసాగెను. రాజభవనమునందు నిరుపయోగములై పడి యున్న యనేక శస్త్రములామె కంటబడగా నామెయందు నడగియున్న శౌర్యాగ్ని ప్రజ్వలింపసాగెను. అంత నామె నిలువక, యుద్ధమున కనుకూలమగు పురుషవేషము దాల్చి యనేకాస్త్ర శస్త్రములను ధరియించి కాళికాదేవి ప్రత్యక్షమైనది యనినట్టుగా రాజపుత్రుల సభలోకి ప్రవేశించెను.

సుకుమారమగు మేనితో బురుషవేష ధారిణియు శస్త్రధారిణియునై వచ్చిన విరాబాయిని గనినతోడనే యచటి రజపూతువీరు లాశ్చర్యమగ్న మానసులయిరి. స్వాతంత్రేచ్ఛయు, స్వధర్మాభిమానమును హృదయనం దుండుటవలన నామె కాంతి మిగుల ప్రజ్వరిల్లెను. ఆమె మిగుల రోషముతో గూడియున్న రాజపుత్రులతో నిట్లనెను. “శూరాగ్రేసరులగు రజపూతులారా! మీరిట్లధోముఖులై చింతిల్లుచు నెవరికొరకు నిరీక్షింపుచున్నారు. మీయందలి శౌర్యధైర్యాది క్షత్రియ గుణము లెటుపోయెను? చితూరుసంస్థానమిపుడే పౌరుష హీనమయ్యెనా? ఇచటి రజపూత వీరులందరు కేవలము శ్వాసోచ్ఛ్వాసముగల పురుగులై పోయిరా? వీరమాత యగు భారతవర్షము నేడే నిస్తేజమై పోయెనా? మీరు శూరులవంశములయందేల జన్మించిరి? అటుల జన్మించినవారు వైరులకు వెన్నిచ్చి యేల పారివచ్చితిరి? ఇప్పుడింద రేకీభవించి యేమి చింతించెదరు? చితూరు నలంకరించువాడును మన ప్రాణసమానుడు నగు మహారాజును శత్రువులు కారా

గృహ బద్ధుని జేయగా స్త్రీలవలె చేతులకు గాజులు తొడుగు కొని యింటనుండుట కేల సిగ్గుపడకున్నారు? నేనిట్లు బాహాటముగా మిమ్ము నవమానపరుపుచుండగా మీరు విని యెట్లు సహించెదరు? ఇంతకంటె యుద్ధము చేసి వైరులచే జంపబడుట సర్వోత్తమము కాదా? శూరాగ్రేసరులగు సరదారులారా! మీరిటుల నుపేక్ష చేయకుడు! మీకు గలిన పౌరుష హీనతయను కళంకము సంపూర్ణముగా గడుగుడు. మీకుగల శౌర్యధైర్యాధిగుణముల నగుపరుప నిదియే సమయము. లెండు నడువుడు. మరియొకరి రాకకు నిరీక్షింపనేల? ఒరలనుండి మీమీ ఖడ్గములను తీయుడు. "జయహర! జయమహాదేవ" యను రణఘోష మొనర్పుడు. తీవ్రగతి నరిగి సంగ్రామరంగము నందు మీమీ ప్రతాపములను గనుపరుపుడు! నేనిదే యుద్ధ మునకు బోవుచున్నదానను."

ఇట్లని యామె యొకగుఱ్ఱము నెక్కెను. అప్పుడు రజపూతులందరు తమ యౌదాసీన్యమును వదలి యుద్ధసన్నద్ధు లైరి. మేకలుగానున్న యా వీరులు విరాబాయి ప్రోత్సా హముచే శార్దూలములుగా మారిరి! అందువలన నా భీమ పరాక్రములందరును నేకవాక్యతగా జయఘోష మొనర్చిరి. అపుడు వారందరు "యుద్ధమునందు శత్రువులను జంపెదము లేక వారిచే జచ్చెదమే కాని పగరకు వెన్నియ్యమ"ని ప్రమా ణములు చేసిరి.

విరాబాయియు వారి యావేశమును, దృఢనిశ్చయ మును గని విశేష ప్రోత్సాహము గలదియై యుద్ధమునకు

వెడలెను. ఆమె తన సైన్యముతో నాకస్మికముగా నాకొన్న యాడుసింగమువలె శత్రుసైన్యములపై నకస్మాత్తుగా బడెను. అందువలన విజయానందమునం దోలలాడుచుండిన యగ్బరు సైన్య మీ ప్రళయమున కోర్వజాలక నలుదిక్కులకు బార దొడగెను. వారిని బోనియ్యక పట్టుకొని వీరాబాయి సైనికులు కాలాంతరుప్రముల భంగియాతెము నొందింపసాగిరి. వారికి వుత్సా హాకరముగా వీరాబాయి తానును అనేక తురుష్కులను వీరస్వర్గమునకు నంపుచుండెను.

ప్రళయాగ్నిని బోలిన యామె పరాక్రమము గని యగ్బరత్యాశ్చర్యమును బొందెను. ఆయన జడునివలె నేమియు దోచక నిశ్చేష్టితుడయి నిలువబడెను. అప్పుడా క్షత్రియవీరుల యుత్సాహంబు రెట్టింప, మ్లేచ్ఛసైన్యముల ననేకరీతుల బాధింప దొడగిరి. బాదుషా తనకు జయము కలుగుటకు మారుగా నపజయ మగుటగని చేయునదిలేక సంధిని దెలుపు పతాక మెత్తెను. తక్షణమే ఉదయసింహుని సహితము బంధవిముక్తుని జేసెను. పరాక్రమవంతురాలయిన వీరాబాయివలన మహా బలవంతుడైన అక్బరునంతటి తురుష్కప్రభువు సహితము జయ కాంక్షనుమాని హతశేషులగువారింగొని మరల తనపురి కేగ వలసిన వాడాయెను. తదనంతర మా రజపుత్రులందరును విజయానందముతో సింహనాదములు చేయుచు వీరాబాయి ననేకవిధముల గొనియాడుచు వీరాబాయితోడను; వుదయ సింహుని తోడను పురప్రవేశము చేసిరి. అంతకు బూర్వము తేజోహీనమైన చితూరుపట్టణము రాణిగారి విజయవార్త విని

మరల తన దివ్యతేజమును బొందెను. జనులందరును పరమానంద భరితులయిరి. వీరాబాయి జయమునుగాంచి విశేష తేజస్విని యయ్యెను. పురవాసులందరా వీరరజపూతులను, రాణాగారిని, రాణిగారిని మంగళ వాద్యములతో నెదుర్కొని వారిపై పుష్పవృష్టి చేయుచు రాజభవనములో ప్రవేశపెట్టిరి! ఇట్లు జన్మమందెప్పుడును యుద్ధమెరుగనిదయ్యును ఒక క్షణములో తన శౌర్యముచే వీరాబాయి "గొప్ప శూరస్త్రీ" యన్న బిరుదునుబొంది, ప్రస్తుత చరిత్రమునకు శిరోలేఖముగానున్న శ్లోకార్థమునే స్థిరపరచెను!

# రుద్రమదేవి

★

ఈ సతీరత్న మాంధ్రదేశమునందలి యోరుగంటిరాజ్యమును మిక్కిలి చక్కగా నేలిన శూరవనిత. ఈమె కాకతీయ గణపతిరాజు భార్య. దేవగిరిరాజు కూతురు. రుద్రమదేవి తన భర్త మరణాంతరము క్రీ. శ. ౧౨౫౭ వ సంవత్సరమునుండి ౧౨౯౫ వ సంవత్సరమువరకును ముప్పదియెనిమిది సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లు దానశాసనములవలనను, చరిత్రకారులు వ్రాసినదానివలనను స్పష్టముగా దెలియుచున్నది. సోమదేవరాజీయమునందును రుద్రమదేవి ముప్పదియెనిమిది సంవత్సరములు రాజ్యపాలనము చేసినట్లీ క్రింది పద్యమున జెప్పబడినది.

గీ. ఆయమనకు నప్పగించి యయ్యమ్మ యట్లు
బుధజనంబులు బ్రజలును బొగడ నవని
ముప్పదియు నెన్మిదేడులు మోద మొదవ
నేలి కైలాసశిఖరి నేగుటయును.

కాకతీయగణపతి మరణానంతర మాతని భార్య యగు రుద్రమదేవి దుఃఖసముద్రమున మునిగి యుండెను. అప్పుడు మంత్రియయిన శివదేవయ్యగారి హితవచనములవలన నామె దుఃఖమును మరచి రాజ్యమునకు వారసు లెవ్వరును లేక యుండినను కూతురగు ఉమ్మక్కకు గలుగు సంతానమే సింహాసనము నెక్క నర్హులని కొంత మనస్సమాధానము చేసి

కొని రాజుయొక్క ఖడ్గమును ముద్రికను సింహాసనమునందుంచి శివదేవయ్య సాహాయ్యమున రుద్రమదేవి రాజ్యము చేయ సాగెను. ఆమె రాజ్యము బహుయోగ్యముగా జేసెనని చెప్పుదురు. అప్పుడామె యోరుగంటి చుట్టును మూడు నాలుగు ప్రాకారములుగల కోటను శత్రువుల కభేద్య మగునటుల గట్టి దానికి దగిన చోటుల సైన్యముల నుంచెను. అందువలన నా రాజ్యమును గెలుచుట బహుదుస్తరమని పెరరాజులు వెరచు చుండిరి. ఇదిగాక రుద్రమదేవి చేయు న్యాయపరిపాలనమువలన జను లామె రాజ్యమే శాశ్వతముగా నుండ గోరుచుండిరి.

ఈమె తనరాజధానిలో ననేకములైన చెరువులు త్రవ్వించియు, సత్రములు కట్టించియు జనోపయోగ్యము లయిన యనేక కార్యములను చేసెను. బీదవిప్రులకు బంగారపు కొమ్ములుగల గోవు లనేకములు దానమిచ్చెను. అనేక దేవస్థానములు కట్టించి వాని కన్నిటికిని వృత్తుల నేర్పరచెను.

ఒకసారి రుద్రమదేవియుమ్మక్క సహితయయి మొగలి చెర్లకు బోయి యచట వీరాశక్తిని బూజించుచు నైదుదివసంబు లచట వసియించెను. అప్పు డామెపైకి హరిహరదేవుడును, మురారియు దిరుగబడగా వారి నపుడు సామంబునం దనలోనం జేర్చుకొనియె. తదనంతరము రుద్రమదేవి యోరుగంటి కోట లోనికి వచ్చి, హరిహరుడును మురారియును జేయు కపటము

నెరిగి యామె సైన్యము నంపి వారిని గెలిచి వారి నందరిని హతము గావించెను.

తదనంతర మామె కొన్ని దినములు సుఖముగా రాజ్యము చేసిన పిదప, దేవగిరిరాజు దళములతోఁడవచ్చి యోరుగంటిని ముట్టడివేసెను. దాని గని రుద్రమదేవి యెంతమాత్రము జంకక, పరమేశ్వరుని దలచి మహారౌద్రముతో పగవారిని ప్రతిఘటించి పోరాడి వారి బలంబుల హీనంబులు గావించె. అంత వారును ముట్టడిని విడిచి, నలుగడలం బలాయితులు కాగా, రుద్రమదేవి వారిని పోనియ్యక దేవగిరి వరకును దరమెను. వారును రుద్రమదేవి శౌర్యమున కత్యంతాశ్చర్యము బొంది, కోటిద్రవ్య మామెకిచ్చి శరణాగతులయి తమదేశమున కరిగిరి. అంత రుద్రమదేవి జయవాద్యములు మ్రోయ తన నగరునకు జనుదెంచి సైనికులకు దగిన బహుమతుల నిచ్చెను.

పిమ్మట నామె కూతురు ఉమ్మక్కకు గర్భచిహ్నము లగుపడెను. వానిం గని రుద్రమదేవి యపరిమితానందభరితయై పుంసవనము మొదలగు సంస్కారముల నొనరించి వినోదములతో గాలము గడుపుచుండెను. ఇట్లుండగా ఉమ్మక్కకు పది నెలలు నిండిన పిదప శా. శ. ౧౧౬౬ వ సంవత్సరమగు నందన సంవత్సర చైత్ర శుద్ధ గురువారమునా డుదయమున నొక పుత్రు డుదయించెను. రుద్రమదేవి యా బాలకునికి స్నానముచేయించి సింహాసనమునందు బరుండబెట్టి పౌరులను, సామంతులను రాబిలిచి వారందరికిని మీ ప్రభు వితడని తెలిపెను. వారునుమిగుల సంతసించిరి. తదనంతర మామె పుత్రో

త్సవమునం దనేక దానధర్మములు చేసెను. బాలకునకు నామ కరణ దివసంబున శివదేవయ్య పూజ్యురాలగురుద్రమదేవి పేరు బాలకున కిడదలచి ప్రతాపరుద్రుడని నామకరణము చేసెను. తదనంతర మా బాలకుడు దినదిన ప్రవర్ధమానుడై శివదేవయ్య వలన సకల విద్యల నభ్యసింపుచుండెను. ఈయన వెనుక ఉమ్మక్కకు మరియొక పుత్రుడు కలిగెను. అతనికి అన్నమదేవుడని పేరిడిరి.

రుద్రమదేవునికి గర్భాష్టకంబున నుపనయనంబు చేసివిద్య లన్నియు నేర్పి రాజ్య మాతనికిమ్మని శివదేవయ్య కొప్పగించి క్రి. శ. ౧౨౯౫-వ సంవత్సరంబున రుద్రమదేవి దివి కరిగెను. ఈమె మన యాంధ్రదేశంబునకు శిరోరత్నమని చెప్పుట కెంత మాత్రమును సందియము లేదు. స్త్రీలలో నిట్టివా రుందురని ప్రత్యక్షప్రమాణమువలన నెరిగియు మనవారు స్త్రీలను హీన ముగా జూచుట మిగుల శోచనీయము.

# డాక్టర్ ఆనందీబాయి జోషి

స్త్రీవిద్యా విజయదుందుభి !!!

గీ. తనసిరే వేల్పు లుదధిరత్నములచేత
వెరచిరే ఘోరకాకోలవిషముచేత
విడిచిరే యత్న మమృతంబు వొడము దనుక
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు.

ఇయ్యుత్తమకాంత క్రీ. శ. ౧౮౬౫-వ సంవత్సరము మార్చినెల ౩౧-వ తేదీని పూనాపట్టణమునందు జన్మించెను. ఈమె తండ్రిపేరు గణపతిరావ్ అమృతేశ్వర్ జోశి. ఈయన పూర్వు లార్జించిన యగ్రహారములోని ధనమువలన జీవింపుచుండెను. వీరి నివాసస్థలము కల్యాణపట్టణము. ఆయన భార్య పూనాకు బుట్టినింటికి నీళ్ళాడబోయెను. కాన ఆనందీబాయి యచటనే జన్మించెను. మన దేశమునందలి యాచారమువలన నాడుబిడ్డ పుట్టుటవలన దలిదండ్రుల కేమి, బంధువుల కేమి మిగుల వ్యసనము కలుగును. అదే ప్రకార మీమె జననీజనకులును విచారపడిరి. అప్పుడీ బిడ్డవలన దామును ప్రసిద్ధుల మగుదుమని వారి కేమి తెలియును? దేశాచారప్రకారము పదునొకండు దినములు గడచిన వెనుక పండ్రెండవదినమున బారసాల చేసి పిల్లకు యమున యని నామకరణము చేసిరి. శిశువునకు మూడునెలలు వెళ్లగానే, తల్లి కల్యాణమునకు వెళ్లెను. యమున క్రమక్రమముగా. బాలలీలలను జేయుచు దల్లిదండ్రుల నానంద సాగరమున ముంచుచుండెను. ఈమె నాలుగైదు సంవత్సరముల

వయసునందుననే మిగుల తెలివిగలదిగానుండెను. అటుపిమ్మట నా చిన్నది యింటిలో నుండిన జెరుపుపనులు చేయునని తల్లి సమీపము నందున్న బాలికాపాఠశాల కామెను బంప దొడగెను. కాని చిన్నతనమువలన నాచిన్నది విద్యాభ్యాసమునందు జిత్తములేనిదై యుండెను. ఆమెతల్లి బిడ్డలను గొడ్డువలె బాదు మూర్ఖస్త్రీలలోనిది యగుటవలన నామె చిన్నతనమున తల్లి చనువులేక యెప్పుడును శిక్షకు బాత్రురాలగుచుండెను. ఆమె తల్లితల్లియు గణపతిరావుగారి యింటనే ఉండెను. కాన యమున నెవ్వరేమనినను నా ముసలమ్మ వారితో దగవులాడుచుండెను. యమున చిన్నతనమునుండియు నేదోయొక పనిలేక కూర్చుండు స్వభావముగలది గాక, సదా యేదో యొకపనిని చేయుచునే యుండెను. యమున యేడు సంవత్సరములది కాగానే తల్లిదండ్రుల కామె వివాహమును గురించి చింత కలిగెను. వారనేక స్థలముల వెదకి యనుకూలుడగు వరుని చింతించు నెడ, నొక గృహస్థుడు ఠాణా యను గ్రామమునుండి కల్యాణమునకు వచ్చెను. ఆయనతో గణపతిరావు కొమార్తె వివాహచర్చ తేగా నాయన "ఠాణాలోని పోస్టుమాస్టరుగారి భార్యనివర్తించెను. మీరాయనకడకు వెళ్ళి విచారింపుడ"ని చెప్పెను.

ఆయన చెప్పినవాడు గోపాలవినాయకజోశి సంగమనేర్ ఖర్ గారు. ఈయన తన చిన్నతనములో దన యక్కయు దానును జదువుకొను కాలములో స్త్రీలబుద్ధి పురుషుల బుద్ధితో సమానముగా నుండునని తెలిసికొనెను. గోపాలరావుగారికి జిన్నతనముననే ప్రథమ వివాహమాయెను. ఆయన

తన భార్యకు విశేషవిద్య గరపి స్త్రీవిద్యవలని లాభములను ప్రపంచమునకు కగుపరచవలెనని దృఢముగా నిశ్చయించుకొనినవాడు. అందువలన నాతడనేక ప్రయత్నములచే దన సతికి విద్య నేర్పదొడగెను. కాని యీ చిన్నది యత్త యాడుబిడ్డల కోడంట్రికముచే నలుగుచుండినందున విశేష విద్యాభ్యాసము చేయులేకుండెను. ఇట్లుండగా నా చిన్నదానికి బదుమూడవయేట నొక కొమారుడు కలిగి తల్లిని స్వర్గమునకంపెను. ఆ చిన్నవానిపేరు కృష్ణా. ఆతడిప్పటివరకును సుఖముగానే యున్నాడు. ప్రథమభార్య చనిపోయినపిదప గోపాలరావు మిగుల నుదాసీనుడయి రెండవ వివాహము చేసికొనననిని నిశ్చయించుకొనెను. ప్రథమపత్ని యున్నకాలములోనే యతనికి మొదట పూనాలో పోస్టాఫీసులో నొకచిన్న జీతముగలపని దొరకి పిదప స్వతంత్రముగా ఠాణాలోని పోస్టుమాష్టరుపని దొరకెను. ఆయన తన ప్రథమపత్నికి గలిగిన కోడంట్రికముం గని చిన్నతనముననే వివాహములుచేసి పిల్లల నత్తవారియింటికి బంపు తల్లిదండ్రులను, పరులపిల్లల నతిక్రూరముగా జూచెడి యత్తలను మిగుల దూషింపుచుండెను. ఇవన్నియు విచారించి యాయన ద్వితీయవివాహము జేసికొనుటకు నిష్టము లేనివాడయి యుండెను. కాని గణపతిరావు అయనవద్దికి వచ్చి తన కొమార్తెను చేసికొనవలసినదని యడుగగా నాతడు తానొక స్త్రీని పూర్ణవిద్యావతిని జేసి ప్రపంచమునకు నుదాహరణము చూపదలచినవాడగుటచే, 'నాభార్యకు నే నెట్టి విద్య గరపినను మీ రడ్డుపడకుండెడి

యెడల నే వివాహమునకొప్పుకొనెద” ననెను. గణపతిరావు గారందున కొడంబడగా గొన్ని దినములకు వివాహము జరిగెను. దేశాచారప్రకారము వివాహానంతరము యమునాబాయికి 'ఆనందీబాయి' యని యత్తవారు పేరుపెట్టిరి. పెండ్లియైనపిదప గణపతిరావుగారి యనుమతిప్రకారము, గోపాలరావు నిత్యము సాయంతనము కళ్యాణపట్టణమునకు వచ్చుచుండెను. ఆనందీబాయి కొంచెము చదువుకున్నదని తెలిసి గోపాలరావు మరాఠీపుస్తకములు కొనితెచ్చి ముత్తవచేత నామె కిప్పించి చదువునట్లు చేయించుచుండెను. రెండవ పెండ్లివాడగుటచే పిల్లదానిని త్వరలో భర్తగారితో మాటలాడ బురికొల్ప సాగిరి. కాని ఆనందీబాయి కా కాలములో భర్తయనిన నొక వ్యాఘ్రమువలె దోచుటచే నామె మిగుల భయపడుచుండెను. గోపాలరావామె నెంతమాత్రమును భయపెట్టక బుజ్జగించియే చదువు మొదలయినవి చెప్పుచుండెను.

గోపాలరావు ఆనందీబాయికి విద్య నేర్పుట ఆయన మామగారి కెంతమాత్రమును సమాధానము లేదు. ఆయన తానందు కొడంబడినవాడగుటవలన నల్లునితో నేమియు నన జాలక యితరులచే స్త్రీవిద్యవలనంగలుగు నష్టములు చెప్పించి మాన్పజూచెను. కాని గోపాలరావు వారికి దన ప్రత్యుత్తరము చెప్పి పంపెను. మామగారి యూరికి సమీపమునందుండిన యెడల భార్యవిద్య సాగదని గోపాలరావు అల్లీబాగను గ్రామమునకు మార్చుకొనెను. అచటికి ఆనందీబాయితోడ నామె

ముత్తువ పోయియుండెను. కాని పిల్ల కేవిధమయిన భయము లేకయుండెను.

అటుపిమ్మట గోపాలరావామెకు విద్యవలన లాభముల నెరింగింపగా నామె మిగుల శ్రద్ధతో ప్రతిదినము తప్పక పాఠములు చదువుచుండెను. ఆమె చురుకుదనమును జూచిన కొలదిని గోపాలరావునకు మరింత యుత్సాహము కలిగి యాతడామెతో ననేకసంగతులను ముచ్చటించుచుండెను. అందువలననే ఆనందీబాయికి త్వరగా విద్యాసక్తి గలిగెను. పెండ్లియైన పిదప రెండు సంవత్సరములలో ఆనందీబాయికి మహారాష్ట్ర భాష చక్కగా జదువుటకును, వ్రాయుటకును వచ్చెను. అంతలో నామె కా భాషయందలి వ్యాకరణము, భూగోళము ప్రకృతిశాస్త్రము, గణితశాస్త్రము మొదలయినవి గోపాలరావుగారు చక్కగా నేర్పిరి. అల్లీబాగునందుండు కాలముననే ఆనందీబాయి ఋతుమతియైనందున భార్యాభర్తల నొకటి చేసిరి. వెంటనే యానందీబాయి గర్భవతియైనందున నామె కళ్యాణమునకు బోయెను. అచట నామెకు కొమారుడుగలిగి పదియవదినంబుననే చనిపోయెను. కాన ఆనందీబాయికి జిన్నతనముననే పుత్రదుఃఖము గలిగెను. అందువలన గొన్ని దినముల వరకును ఆమె విద్యాభ్యాసమునకు భంగము గలిగెను. కాని యటుపిమ్మట మరల నామెచదువు చక్కగా సాగుచుండెను. కొన్ని దినములలో నామెకు దన మనోగతమును బాగుగా వ్రాసి తెలుపునంతటి ప్రజ్ఞ గలిగెను. అల్లీబాగులోని లోకు లానందీబాయికి వచ్చిన విద్యనుగని యోర్వలేక

గోపాలరావు ననేక కష్టముల పెట్టుచుండిరి. కాన నచట నుండుట కిష్టములేక, కోలాపురమునందు స్త్రీవిద్య కనుకూలు రగువా రున్నందున బహుప్రయత్నముతో గోపాలరావుగా రచటికి మార్చుకొనిరి. కోలాపురములో బాలికాపాఠశాల వీరింటికి దూరమగుటచే ఆనందీబాయిని నొక్కర్తె నంతదూరము కాలినడకతో బంప వీలులేక యుండెను. పాఠశాలలో నుపాధ్యాయినిగా నుండిన మిస్ మూయసీగారి యిల్లు వీరియింటికి సమీపమునందుండెను. ఆమె బహుమంచిదని విని గోపాలరావుగా రామెతోడ మాటాడ నరిగెను. ఆయన ప్రసంగవశమున "నా భార్యను మీబండిలో గూర్చుండబెట్టుకొని వెళ్లెదరా" యని యడుగగా నామె కొంత యోచించి మంచిదనియెను. అందుపై ఆనందీబాయి కొన్నిదినము లచటి పాఠశాల కరుగుచుండెను. కాని యటుపిమ్మట మూయసీ తన బండిలో స్థలమియ్యనందున నామె పాఠశాల కరుగుట మానుకొనవలసిన దాయెను.

కోలాపురమున నీదంపతులు పాద్రీల (క్రైస్తవధర్మగురువుల,) యిండ్లకగుచుండిరి. పాద్రీ యాడువారు ఆనందీబాయికి నింగ్లీషు రెండు మూడుపుస్తకములవరకును నేర్పిరి. ఆనందీబాయి యల్పవయస్కురాలయినను వారు చేయు మతబోధను గ్రహింపక కేవల నీతివాక్యములనే గ్రహింపుచుండెను వీరివలననే యీదంపతుల కమేరికాలోని సంగతు లనేకములు తెలిసెను. కాన నమేరికాలోని కరిగి విద్యనభ్యసింపవలయునని ఆనందీబాయి కప్పటినుండి యిచ్ఛగలిగెను.

౧౮౭౯ వ సంవత్సరప్రారంభమున గోపాలరావుగారిని బొంబాయికి మార్చిరి. అచట నుండుకాలములో ఆనందీబాయి కొంతవర కింగ్లీషును, సంస్కృతమును నేర్చుకొనెను. కాని యచటను లోకులామె విద్యాభ్యాసమున కనేక విఘ్నములు తెచ్చుచుండిరి. ఇట్లుండగా ౧౮౮౦ వ సంవత్సరము నచటనుండి భూజయను గ్రామమునకు మార్చినందున, నాదంపతు లచటికరిగిరి. బొంబాయినుండి భూజకు బోవునపుడు ఆనందీబాయి ముత్తవ యామెతోడ రానందున నింటిపని యంతయు నామెయే చేయవలసి యుండెను. ఇంటిపనినంతను చేసి యానందీబాయి భర్తకడ సింగ్లీషు మాటలాడుట చక్కగా నేర్చుకొనెను.

గోపాలరావుగారికి భార్యను విశేష విద్యావతిని జేయవలెనని యుండుట నొకవార్తాపత్రికలోన జదివి ఆమేరికాలోని న్యూయార్కుపట్టణవాసినియగు మిసెస్ బీ. ఎఫ్. కార్పెంటర్ అను నామె ఆనందీబాయికి సహాయము చేయదలచి యామె కొకఉత్తరమువ్రాసెను. ఈమెయే ఆనందీబాయి కనేకవిధముల సహాయముచేసి యామెను కూతురివలె జూచుచుండెను. కాన ఆనందీబాయియు నీమెయం దధికప్రేమ గలది యయి ఈమెను పిన్ని యని పిలుచుచుండెను. ఈమెకు ఆనందీబాయి వ్రాసిన యుత్తరముల వలన మనదేశమునందలి స్త్రీలకు గల పరతంత్రతయు, దానిని వదలించుటకై ఆనందీబాయికి గల యభిప్రాయములు దెలియుచున్నవి. స్త్రీలకు విశేష విద్యగరపినంగాని స్వహితము తెలియదని యామె మతము. ఇదియంతయు నామె

స్వానుభవము వలననే తెలిసికొనెను. ఇట్లుత్తర ప్రత్యుత్తరముల వలన నా యిరువురకును సఖ్యమధిక మయ్యెను.

తదనంతరము గోపాలరావుగారిని కలకత్తాకు మార్చిరి. అచ్చట నుండుకాలములో పోస్టుఆఫీసులో 30 రూపాయల వేతనముగల యుద్యోగము ఆనందీబాయికొరకు సిద్ధమయ్యెను. కాని యుద్యోగములో ప్రవేశించి స్వాతంత్ర్యతను పోగొట్టుకొనుట కిష్టములేక, యామె దానిని స్వీకరించకుండెను. తదనంతర యామెకు నమెరికాలో వైద్యవిద్య నభ్యసించుకోరిక యధికమయ్యెను.

కలకత్తానుండి శ్రీరామపురమను స్థలమునకు మార్చినందున నాదంపతు లచటికి కరిగిరి. అచటికి కరిగినపిదప గొన్ని దినములు సెలవు తీసికొని వారు సమీపమునందుగల జయపూర్, ఆగ్రా, గ్వాలేర్, లఖనౌ, కాన్‌పూర్, ఢిల్లీ, ప్రయాగ, కాశీ మొదలగు ప్రసిద్ధ పట్టణములను జూడ నరిగిరి. అందువలన ఆనందీబాయికి గొంతవరకు ప్రవాసస్థితి తెలిసెను. వారు మరలి శ్రీరామపురమునకు వచ్చిన కొద్దిదినముల లోనే రెండు సంవత్సరముల సెలవుతీసికొని అమెరికాదేశమున కరుగ నిశ్చయించిరి. కాని యింతలో నీకు సెలవియ్యజాలమని పైనుండి యుత్తరువు వచ్చెను. అందువలన ఆనందీబాయి నొకరనే యమెరికాకు బంపదలచి గోపాలరావుగారామెతో నొకదిన మిట్లు ప్రసంగించిరి:—

గోపాలరావు;-(చింతతో) నీవు ఒంటరిగానే అమెరికాకు వెళ్ళరాదా ? నా కిప్పుడు సెలవు దొరకదు. నీకిచటనుండిన

విద్యాభ్యాసము కానేరదు. కాన నొంటరిగా నైన నరుగుట యావశ్యకము. మన మిరువురము కలసి వెళ్ళవలెననినచో నింకను రెండుసంవత్సరముల వ్యవధి గలదు. ఇంతలో నీచదు వచట జాలవరకగును.

ఆనందీబాయి:- (ఏమియు ననక భర్తవంకజూచి మీారే మనెదరని యడిగినటుల నగుపడెను; దానింగని.)

గోపాలరావు:- నేటివరకును బ్రాహ్మణ స్త్రీ పరదేశ మునకరిగి విద్యనభ్యసించిన యుదహరణ మొందును గానరాదు. కాన నీవు వెళ్ళి విద్యనభ్యసించి యుదాహరణీయవగుము. స్త్రీలు సామర్థ్యహీన లన్నవాక్యమును నీవబద్ధము చేయుము. మన నడవడిని విడువక అమెరికావారికి మన నడవడిని నేర్పుము. ప్రస్తుతము సంస్కరణము కావలయు ననువారు పెక్కండ్రు పురుషులు కలరు. కాని వారిచేత గొంచమైనను సంస్కరణ మగుటలేదు. నీవు స్త్రీవై కొంచెము సంస్కరణముచేసి చూపి నను మిగుల నుపయోగ కరముగా నుండును.

అందు కానందీబాయి సమ్మతించి యొంతదూరదేశ ప్రయాణమునగు సాహసించెను! ఆమె తన కెట్టి కష్టములు వచ్చినను వెనుకదీయక స్వదేశ సోదరీమణుల కొక యుదహార ణముచూపి వారికి మేలుచేయ దలచెను!!

ఇట్లు వారు కృతనిశ్చయులయి ఆనందీబాయికొరకమే రికాలో ననుకూలములగు బట్టలనుకుట్టించి, సిద్ధపరుచుచుండిరి. ఆనందీబాయి పరదేశపువస్త్రములు ధరియింపనని నిశ్చయించు కొని మనదేశమునందలి ముతక బనాతుగుడ్డలతోనే దుస్తులను

కుట్టించుకొనెను. ఇట్టిదిగదా స్వదేశాభిమానము! ఈమె అమే రికా కరుగునని విని యనేకు లనేకాక్షేపణలు చేసిరి. కాన వారి కందరకును సమాధానకరముగా ఆనందీబాయి యొకపాఠశాలా మందిరమున సభచేసి గంటసేపు హూణభాషయందు నస్ఖలిత ముగా నుపన్యసించెను. అందువలననే యామెకు నింగ్లీషునందు గల ప్రజ్ఞయు, నామెయొక్క యప్రతిమ వక్తృత్వశక్తియు వెల్లడి యగుచున్నవి. ఆయుపన్యాస మత్యంత శ్రవణీయము. కాన జనానాపత్రికోక్తముగా నిచ్చట నుదాహరించుచున్నాను.

"నా యమేరికాదేశయాత్రను గురించి వందలకొలది ప్రశ్నలు నన్ననేకు లడుగుచున్నారు. కావున నే నిప్పుడు అవ కాశము గలుగజేసికొని వానిలో గొన్నిటికి బ్రత్యుత్తరములం జెప్ప దలంచితిని అవి యెవ్వనగా :-

౧. నేనమేరికాదేశ మేల వెళ్ళవలెను?

౨. హిందూదేశమునందు గృషిచేయుటకు నాకు సాధ నములు లేవా?

3. నేనొంటరిగా నేల వెళ్ళవలెను?

౪. నేనీ దేశమునకు తిరిగివచ్చినప్పుడు జాతిలోని వారి నుండి నాకు బహిష్కారము గలుగదా?

౫. ఏదేని యాపద సంభవించిన యెడల నేనేమి చేయ వలెను?

౬. స్త్రీలలో నెవరునుజేయని పనిని నేనెందులకు జేయ వలెను? అనునవి.

౧. మొదటిప్రశ్నకుత్తరము:— నేను వైద్యమునేర్చుకొన దలచి యమేరికాదేశమునకు వెళ్ల నిశ్చయించితిని. ఈ హిందూదేశమునందు స్త్రీలకు జికిత్స జేయదగిన సాధనకలాపము లేని కారణమువలన గలిగెడి బాధలను ఇప్పు డిక్కడకు దయచేసిన నారీమణులు బాగుగా దెలిసికొని యున్నారు. ప్రకృతిశాస్త్రములను, స్త్రీవిద్యను, వెలయింపజేయు నీ దేశమున వెలయుచున్న సమాజము లెవ్వియు మనదేశపు యువతుల నేర్పినిగాని, నాగరికతచే బ్రతిష్ఠ గాంచిన ఖండాంతరములకంపించి వైద్యశాస్త్రప్రవీణలను గావించి, వారిచే నిచ్చటం బ్రమదలకా వైద్యశాస్త్రమును గరపు కళాశాలలను స్థాపింప దలంపమికి నే నత్యాద్భుతము నొందుచున్నదానను. తనకుగల లోపముల నెల్ల వెల్లడి సేయక తన్నివారణార్థమై యత్నింపక యుపేక్షించుచు నిందాస్పదమైనదేశము ఈ హిందూదేశమునకంటె మరియొక్కటి యేదియు లేదు. ఈ హిందూదేశమంతట స్త్రీవైద్యులు లేని లోపము కష్టముగనున్నది. యూరపుదేశపు నారులును, హిందూసుందరులును, అవసరము తటస్థించినప్పుడు పరపురుషులకు తమదేహస్థితిని వివరించి వారిచే జికిత్స జేయించుకొనుటకు సహజముగా నిష్టపడకయున్నారు. యూరపు, అమెరికాదేశములనుండి యిక్కడకు కొందరు స్త్రీవైద్యులు వచ్చుచున్నారు. గాని, వారిభాషయు, నాచారమర్యాదలును, క్రొత్తలగుటచే, వారు మనస్త్రీలకంతగా నుపయోగపడక యున్నారు. తమ దేశమంతను దమవారలయెడలను నైసర్గికమయిన ప్రేమగల హిందూసుందరులు పరదేశ యువతులతో

గలిసి మెలగలేరు. కావున వారివలన నే సహాయలాభమును బడయజాలకయున్నారు. ఈ హిందూదేశమున, స్వదేశ స్త్రీవైద్యుల అక్కర మిక్కిలిగా నున్నట్టు నాకు దోచుచున్నది.

౨. ఇక నీ హిందూదేశమునం దంగనలకు తగిన సాధనములు లేవా యను రెండవ ప్రశ్నమున కుత్తరము :— లేవని నిష్కర్షగా మనవిచేయుచున్నాను. కానివున్న సాధనములు సులభసాధ్యములు గావని నా యభిప్రాయము. చెన్నపురి యందు నొక సర్వకళాశాలయు నన్ని రాజధానులలోను మంత్రసానితనము నేర్పు తరగతులును నుండుట సత్యమే. అయిన నందలి బోధకులు ప్రాచీనాచారప్రవిష్టు లగుటచేతను, కొంత వరకసహిష్ణులగుటవలనను అచ్చట నొసంగబడుచున్న విద్య యసంపూర్ణ మయినదిగాను లోపములతో గూడినదిగాను నున్నది. ఇట్లనుటనే నా బోధకుల తప్పుల నెంచుటకు గాదు సుడీ. అది పురుషుల స్వభావమని మనవిచేసితిని. వీరికి మారుగా నాస్థానములను స్త్రీలలంకరించువరకిట్టి యిబ్బందులకు మన మోర్చుకోవలసి యున్నది.

నేను క్రైస్తవురాలనుగాను; బ్రాహ్మమతావలంబినిని గాను కాబట్టి హిందూ మతాభిమానముగలిగి తద్ధర్మముల ననుష్ఠింపుచు నీదేశమున నెందయినను పాఠశాలకు బోయి విద్య గరచుట నాబోటి బోటికి దుష్కరము. ఇంగ్లీషువారి యుడుపుల దొడిగికొని నడయాడు మతాంతరులయినను ఇచటిప్రజలు నన్ను జూచినట్టూరక యెగదిగ జూడరు. నగరులలోను, వెలుపలను, నావంటి హిందూయువతులకు గలుగుచున్న దురా

క్షేపణలు, దుర్వాదంతులు స్వదేశీయులైన క్రైస్తవ స్త్రీలకు లేశమును గలుగుటలేదు. పొగబండిలోగాని, వీధులవెంటగాని నే నొంటరిగా బోవునపుడెల్ల ప్రజలు కొందరు నన్ను జేరి నా మొగమువంక నట్టే చూచుచు కొంటెప్రశ్నలచే నన్నలయింపు చుందురు. ఈ పోడిమాటలకంటె కొన్ని యుదాహరణముల వలన నిజము మీ మనసులకు నాటజెప్పెదను చిత్తగింపుడు.

కొన్ని సంవత్సరముల క్రిందట నేను బొంబాయి నగరమున నుండగా పాఠశాలకు బోవుచుంటిని. చేత పుస్తకములం బట్టుకొని నేను బడికి బోవుచుండునపుడు కొందరు కిటికీలగుండ నన్ను చూచువారును, మరికొందరు బండ్లెక్కి పోవుచు నన్ను జూచువారును, వీధులలో ద్రిమ్మరుచుండు నిక కొందరు పెద్ద పెట్టున నవ్వుచు "ఇదేమి వింత! కాళ్ళకు మేజోళ్ళను బూట్సులను దొడిగికొని పాఠశాల కేగు నీ గరిత యెవ్వతె! ఇంత మూలమున కలి యిప్పుడే ప్రజలమనసుల నావహించినజాడలు బొడగట్టుచున్నవిగదా!" యని నాకు వినబడునట్లుగా కోలాహలముగా బలుకువారుగ నుండిరి.

ఓమానినీమణులారా! అట్టిప్రశ్నలను మిమ్మడిగినప్పుడు మీ మనస్సెట్టి సంతాపమును బొందెడినో మీరే సులభముగా నూహించి తెలిసికొనగలరు.

ఒకప్పుడు నేను కొంతకాలము పాఠశాలలో నుండ వలసివచ్చి భోజనము నిమిత్తము దినమునకు రెండు సారులు బంధువుల యింటికి బోవలసి వచ్చెను. నేనప్పుడట్లు పోవుచు వచ్చుచున్నప్పుడెల్ల వీధి వెంట నేగువారు నా చుట్టును జేరి

కొందఱు గేలిసేయ నారంభించిరి. కొందరు కడుపుబ్బ నవ్వ జొచ్చిరి. తక్కిన గృహస్థులు డాంబికముగా తమతమ పంచ లలో గూర్చుండి నన్నుగని వికృతాలాపము లాడుచు నాపైని రాళ్ళు రువ్వుట కెంతయు లజ్జింపరైరి. ఇక నంగడివాండ్రు బేర గాండ్రన్ననో నన్ను వెక్కిరింపుచు నసహ్యాకరమైన సైగలం జేయసాగిరి. అట్టి సమయములో నాస్థితి యెట్లుండెనో శీఘ్రముమే యిల్లు చేరుకొనుటకు నా మనసెట్లు త్వరపెట్టెనో దాని నూహించి మీరే తెలిసికొనుడు.

బొంబాయినగర వాస్తవ్యులతీరిట్లుండగా, బంగాళావారి రీతి యిక జెప్పుటకే శక్యముగాకున్నది. ఇది యెల్ల కడు శోచ నీయము. గాలిపట్టుల కెప్పుడయిన నేను వ్యాయామముకొరకు పోయినప్పుడు ఇంగ్లీషువారయిన నన్నెప్పుడు కన్నెత్తి యంత నిబ్బరముగా జూడరయిరి. కాని బంగాళావారు తమ దంభము నంతను వెల్లడిచేసి హాస్యాస్పదము గావించుకొన నన్ను గని, "నీ వెవతెవు? నీ పేరేమి? నీ స్థలమేమి? నీ వెందులకేగెదవు?" అని యపరిచితు లడుగగూడని ప్రశ్నల నడిగి యాగడ మొన ర్చిరి. శ్రీరామపురములో విద్యావంతులని యెన్నిక గన్న కొందరు స్వదేశ క్రైస్తవులు నేను వివాహితనో, వితంతువునో దుర్వర్తన గలదాననో, కులభ్రష్టనో యని శంకింపుచుండిరి. ప్రియులయిన యో సభాజనులారా! యిట్టి యవినయప్రచార ములు స్వదేశ క్రైస్తవులు చేయగూడునా? ఎంతమాత్రము చేయగూడదు. వీనిని మీకిట్లు విన్నవించుట మీరిట్టి లోపము లను సవరణ చేయ దివిమెదరనియు, మీలోని కష్టముల నెన్న

డెరుగనివారు వీనినెల్ల విననపిమ్మట నమెరికాదేశమునకు నేను పోవ యత్నించుట కేవలము వేడుకకై గాదని యెంచెదరన్నియే కాని మరియొక తలపున గాదు.

3. నేనొంటరిగా నేల విదేశమునకుబోవలెననుమూడవప్రశ్నకు తరమేమనగా— తొలుత నేను, నా పెనిమిటియును గలసి వెళ్ళుటకే యుద్దేశించితిమి. కాని స్థితిగతులనుబట్టి యాతలంపు మానుకొనవలసివచ్చెను. మాయొద్ద ధనమా చాలినంత లేదు. ఋణమా చేయుటకు మా కిష్టము లేదు. ఈ హేతు వొక్కటియె కాక, యింతకంటె ముఖ్యములయినవి యొందరి నొప్పింప దగినవి మరికొన్ని గలవు. అవి యేమనగా నాభర్తగారికి వయోవృద్ధయగు జననియు, పసివాండ్రుగా నున్న తోబుట్టువులును, తమ్ములును గలరు. వారందరికి సంరక్షకుడు నా భర్తగారే యగుటచేత నాయన నాతోగూడ వచ్చితేని వారు దిక్కుమాలిన వారలయి, వారి బ్రతుకు భగ్నమయి, వారు తీరని దారిద్ర్యబాధలకు లోనగుదురు. నా యొక్కతె కొరకు పెక్కండ్రను మలమలమాడునట్లుజేయుట ఎంత యమానుషకృత్యము! కాబట్టి నే నొంటరిగా నేగ నిశ్చయించితిని.

4. నే నిండియాకు (హిందూదేశమునకు) మరల వచ్చినప్పుడు నాకు బహిష్కారము గలుగకయుండునా యనుదానికి సమాధానము— అట్టి భయమువలన నేను చలించెదనని తలంతురా? నేనందుకు నావంతయినను వెరవను. ఇక్కడ నే విధముగా నుంటినో, యక్కడగూడ నాతీరుననే యుండ నిశ్చయించుకొని యుండగా నాకు బహిష్కార మేల కలుగును?

నా యాచార వ్యవహారముల యందుగాని, ఆహార విహారము లలోగాని, వేష భాషలయందుగాని మార్పుగావింప నేనెంతయు దలంపలేదు. హిందూయువతిగనే పోయి, మరల హిందూ మానవతిగనే వచ్చి, యిక్కడ హిందూ సుందరులలో నే గలసి యుండ నిశ్చయించితిని. ఇప్పు డున్నదానికంటె భిన్నముగా నుండక నా పూర్వులెట్లు సామాన్యముగ జీవించిరో నేనునట్లే యుండగలదానను. ఇప్పుగిది నేను ప్రవర్తించునప్పుడు అస్మ ద్దేశీయులు నన్ను బహిష్కరింప జూతురేని, యప్పుడేల? ఆ పని యిప్పుడే చేయరాదా? అందుకు వారికి సర్వస్వాతంత్ర్యము గలిగియే యున్నది. మా మహారాష్ట్రకుటుంబ మొక్కటియై నను లేని యీ బంగాళాదేశమందలి యీ స్థలమున నేనిప్పుడు వాసము చేయుచుంటిని గదా! నేనిచ్చోట నా దేశాచారధర్మ ముల ననుష్ఠించి ప్రవర్తింపుచుంటినో లేదో యెవ్వరెరుగుదురు? కాబట్టి యెన్నడును సంభవింపగూడనట్టియు, సంభవించినప్పుడు మానుషప్రయత్నములకు లోబడనట్టియు వానిని గురించి చింతిం పక యుండుటయే యుత్తమము.

౫. నాకేది యయిన చిక్కట్టు తటస్థించిన నే నేమి చేయుదుననెడి ప్రశ్నకు సదుత్తర మేమన్న :-కొందరు మను ష్యులు ప్రపంచములో గనబడుదానికంటె నతి భయంకరముగా గ్రంథములలో గనబడు దురవస్థలను, దుర్దశలను నుదాహరణ ముగా జూపి భయము నతిశయింపజేయ బ్రయత్నింతురు. కాని యీ యాపదలెంత భయంకరములో యంత యరుదుగా సంభవించునట్లుగ నిర్ణయింపబడియున్నవి. పురుషులుగాని, స్త్రీలు

గాని యెద్దియేని యొక కార్యము చేయబూనినప్పుడు తొలుత మేలెంచెదరుగాని కీడెప్పుడు నెంచరు. ఒకానొకప్పుడు తప్పక కీడులు మూడి మగవారినిగాని, యాడువారినిగాని భూమిలోని కడగ ద్రొక్కినయెడల నికెప్పుడు వృథా చర్చలతో బని యేమి? అవి వచ్చినప్పు డనుభవించి తీరవలసినదే కాని యా యాపదలు రాబోవు నన్నప్పుడుండెడి బాధకంటె వాని ననుభవించునపుడుండెడిబాధ యల్పమనుట జగద్విదితమే. ఏవిధమున నయినను ఈ లోకమున శాశ్వతమయిన సుఖమును బడయగలమా యనుశంకను నివృత్తి చేసుకొనుటకీ ప్రపంచము మన కవకాశ మెన్నడును గలుగజేయనేరదు. కాని పయికగుపడుచున్న సాధనముల యంతరములకు దగిన సౌఖ్యమును మనుజు లెల్లప్పుడును బొందుచుండుట లేదనిమాత్రము మనము చెప్పవచ్చును. ఆ సౌఖ్యమనునది కొందరుచేరి తమలో తాము విభాగించుకొన దగిన పదార్థముగాదు. అది మన మనసునుబట్టి యుండును. సారవస్థలలోకెల్ల మరణమే గొప్పదని యెంచెదముంటిమా కొందరు దాని రాకకేల సంతోషింతురు? మరికొందరేల దుఃఖింతురు? వేయేల? మృత్యువు దుర్దశయును, మంచివారికిని, చెడ్డవారికిని, పుణ్యాత్ములకును, పాపాత్ములకును, భాగ్యవంతులకును దరిద్రులకును, దేశదిమ్మరులకును గృహస్థులకును సమానముగనే వచ్చుచుండును. ఆపత్కాలమున నందరు వివశులగుటయు, కష్ట్యావేశముచే నెవ్వరు ప్రతిభావంతులు గాకుండుటయును సుప్రసిద్ధమే. రానున్న విపత్తు నెంతటి మనుజుడైన నడ్డగింపలేడు. ఆపదయును, నెల్ల

ప్పుడు మనల ననుసరించియే యున్నది. కాబట్టి వాసి రాకకు ప్రతి మనుష్యుడును నిరీక్షించియే యున్నాడు. ఏదియయిన నొక యుత్కృష్టమైన పనియొక్క ఫలిత మనుకూలముగా నుండెనా, దానిని పూనికతో నెరవేర్చినవారి పరిశ్రమమును ఘనముగా ప్రశంసింతుము. లేక యది ప్రతికూలముగా పరిసమాప్తి నొందెనా తత్కార్యవాహకుల యవజ్ఞతను నిందింతుము. ఈ తీరుననే యదృష్టము మారి, ఫలము విఫలమైనచో లోకమది యవివేకమని చాటుటకు సిద్ధమయి యుండును.

ఇంకకొందరు కూపస్థమండూకములవలెనింటి నంటిపెట్టుకొనువారే సుఖభోగు లందురు. కాని, వారికి సుఖభోగమేలాగున గలుగునో తెలియదు. అది కోరినప్పు డనుభవింపదగినట్టు సిద్ధముగా నమర్చబడియున్న పదార్థము కాదుగదా ? కొందరికి నూతనప్రియత్వ మెంత యధికముగా నుండుననగా సౌఖ్యమయినను నెడతెగనిదిగా 'నుండిన దానియందు రుచి లేదని వారప్పుడప్పుడు కష్టములను గోరుచుందురు. విదేశమున కేగుట చెడుపనిగాదు. కొన్ని యంశములనుబట్టి యొక్కచో నివసించియున్న దానికంటె మేలయిన పనియని చెప్పవచ్చును. దేశాటనమున నాయాదేశములయొక్కయు, ప్రజలయొక్కయు స్థితిగతులు బాగుగ మనసున బట్టగలవు. అట్టివాని దెలిసికొనుటయందు విముఖులమయి యుండగూడదు. అవజ్ఞతను మనము బుద్ధిపూర్వకముగా నవలంబించుట యనునది గొప్ప దోషములలో నొకటి. విదేశయాత్రలం గావించుటచే మనకు బుద్ధివికాసము, జ్ఞానాభివృద్ధియు నగుటయేకాక యంతరించిన

కళాకౌశలములు జీవించుటయు గలుగును. ఎల్లవారును యుక్తమయిన దానిని జేయవలసినదే. ప్రతి మనుష్యుడును తన సహజీవులకు జేతనయినంత యుపకారము జేయ బద్ధుడయి యున్నాడు. నరులయి పుట్టినవారెల్ల నితరులవలన దమకు గలిగిన యుపకారమునకు ప్రత్యుపకారముచేసి ఋణవిముక్తి తను బొందవలసినది. పరసీములో మనకు దిక్కెవ్వరని యడుగెదరా? ఏతద్విషయమయి గోల్డుస్మిత్తను ఇంగ్లీషుకవి చేసిన మహోపదేశమును మనము గమనింతము. అది యెద్దియనగా "అంధుల బుద్ధివిశేషము ననుసరింప నేర్చుకొనుము. ఏలయనగా వారెన్నడు తమ చేతి యూతకోలతో భూమిని దడవి తెలిసికొనకుండ నడుగుపెట్టరు." ఆ తీరుననే నేను సర్వశక్తి సంపన్నుడయిన నా పరమపితను నాకూతకోలగా జేసికొని యెదను. ఆయనయే నా మార్గమును బరిశీలించి నన్ను ముందుకు నడిపించుకొనిపోవును. దానికంటెను మహోత్తరమయిన చేతియూత నాకన్యమేమియు గనబడదు.

కొట్టకొనకు నాజాతివారెవ్వరును జేయనిపని నేనేల చేయవలెను? అనుదానికి నే విన్నవించునదేమనగా మన యొక్కరొక్కరము సంఘమునకు జెల్లింపవలసిన ఋణములు పెక్కులుగలవు. వీరీపని చేసిన ఋణవిముక్తత కలుగునని వేర్వేరుగ వక్కాణించుట దుస్తరము. ఒక్క కార్యముచే నొక్కరి కెప్పుడు మేలుగలుగగలదో యామువలన నందరికి మేలు కలుగుననియే యెంచవలసినది. సర్వత్రజనులందరికి శ్రేయస్కరమని చెప్పదగిన పనిని జేయుటకు మనలో నెల్ల

వారును ప్రయత్నపడవలసినది. మనుస్మృతియందు "చేయ దగిన ధర్మమును జేయక యుపేక్షించువారు క్షమియింపబడ గూడని మహాపాతకులు" అని చెప్పబడియున్నది. కావున నాతోడి స్త్రీలెవ్వరును నిదివరకు చేయనిపని నేనును జేయ గూడదనుట యాశ్చర్య జనకము గానున్నది. మృతజీవులని ప్రసిద్ధిగాంచిన మన పూర్వులకిట్టి యూహ యెన్నడును బుట్టి యుండలేదు. ఏదీ నా క్రైస్తవమిత్రులు నేనడుగబోవు నీక్రింది ప్రశ్నమున కేమి యుత్తరమునిత్తురో చూచెదము. ఓ నెచ్చెలులారా! మీ మతధర్మములనుబట్టి యేసుక్రీస్తు మీ యందరి కొరకు తన ప్రాణమును బలికొసంగక యుండిన మీకు పాప విమోచనము గలుగునని తలంతురా! ఆయన యట్లు లోకోపకారమును జేయుచుండగా వారికి గలిగిన ఘోరమయిన దండనమున కేమయిన నామహానుభావుడు జంకెనా? లేదు. ఆయన జంకినట్టు మీ రెప్పుడొప్పు కొనునట్టివారు కారని నిశ్చయముగా నేను జెప్పగలను. మా పూర్వపు రాజులలోనుగూడ శిబిమయూరధ్వజుడు మొదలగువారు పరోపకారార్థము ప్రాణత్యాగము చేయ వెరవరయిరి. మనకు విఘ్నమే కలుగునో, యాపదలే సంభవించునో యని చేయవలసిన ధర్మమును జేయకపోవుట న్యాయము కాదు. మనము చేయవలసినంత ప్రయత్నము చేసి తీరవలయును. మన కటుపిమ్మట జయమయినను సరే, యపజయ మయినను సరే. మనుజులను మూడు తరగతుల వారినిగా విభజించెను. అందు అధములు విఘ్నములు గలుగుననెడి భయమువలన నేపనినిగాని పూనుకొననివారు. మధ్యములు

తో మారంభించిన పనికి నడుమ నంతరాయము సంభవించిన తోడనే యా పనిని విసర్జించువారు. ఉత్తములు ప్రారంభించిన దాని కెన్ని యడ్డములు వచ్చినను, వానినెల్ల బూనికతో నిదానించి విజయము గాంచువారు.

కష్టము లెంత యుత్కృష్టములుగా నుండునో మనకు ధైర్య, స్థైర్యము లంత యధికముగా నుండును. కాబట్టి మన మారంభించినదాని నెన్నడును మానజాలను. ఇక నావిన్నపము ముగిసినది. ఇంతసేపు ప్రసంగించుటవలన మిమ్ము విసిగించితి నేమోయని భయపడుచున్నదానను. అందులకు నన్ను మీరు క్షమింతురుగాక్షుత."

ఈ ఉపన్యాస మిచ్చినపిదప ఆనందీబాయి యొక క్రైస్తవగురువుల కుటుంబముతో అమెరికా కరుగ నిశ్చయించెను. ఒకానొక హిందూ బ్రాహ్మణస్త్రీ అమెరికా కరుగు నని విని రావ్ సాహెబుదాంగేకర్ అను నాతనికి మిగుల విచారము కలిగెను. అంత నాతడనేక ప్రయత్నములచే నామె యమెరికాప్రయాణ మాపవలెనని యత్నించి చూచెను. కాని యాతని ప్రయత్నములవలన నేమియు ఫలము కానరాకుండెను. అంత నా పూర్వాచారపరాయణుడు ఆనందీబాయి యాప్తులకు వ్రాసి వారిచే నమెరికాకు బోవలదని యానందీబాయికి ననేకములయిన యుత్తరములను వ్రాయించెను. కాని వానివలనను ఆమె ప్రయాణమాగదయ్యెను! రేపు ప్రయాణ మనగా ఆనందీబాయి యక్కవద్దనుండి తమ్మునికి ప్రాణాంతముగా నున్నదనియు, నీవు తక్షణము బయలుదేరి రావలసిన

దనియు నుత్తరమువచ్చెను. దానింగని ఆనందీబాయి కొంచె మాలోచింపగా నాయుత్తరము నీ ప్రయాణము నాపుటకే వ్రాసిరనియు నీ తమ్మునికి నిజముగ ప్రాణాంతముగ నుండిన నీవుపోయి చూచునంతకు నుండడనియు, ఇందువలన నీవు చేయబోవు మహాకార్యమును మానుట మంచిదికాదనియు నామె మనోదేవత యామెకు జెప్పి యామె నిశ్చయము దొలగకుండ జేసెను. ఆహా! దృఢనిశ్చయమన నిట్టిదిగదా? చిన్నచిన్న సంకటములు ప్రాప్తించినను భయపడి మనవార లంగీకృతకార్యమును పరిత్యజింతురు. కాని యట్టివారు ఆనందీబాయి చరిత్ర జదివి దృఢనిశ్చయమును సద్గుణమును నేర్చుకొనియెదరుగాక.

అంత ౧౮౮౩ వ సంవత్సరము ఏప్రియల్ ౭ వ తేదీని ఆనందీబాయి కలకత్తా నగరమునుండి పాతాళలోకమున కరుగ బోగయోడ నెక్కెను. అప్పుడు ఆ దంపతుల కిరువురకును గలిగిన వియోగదుఃఖ మిట్టిదని చెప్ప నెవ్వరితరము? అయినను వారు తమ సుఖములను విడిచి స్వదేశ హితమునకై కష్టముల ననుభవించిరి. వారి స్వదేశభక్తి నెంత పొగడినను తీరదు. త్రోవలో సహవాసముగా నుండిన క్రైస్తవస్త్రీ లామెను తమ మతమునకు త్రిప్పవలయునని విశేషముగా బోధించిరి. కాని దృఢనిశ్చయురాలయిన యాయబల వారికి దగినయుత్తరముల నిచ్చి యా మతమును ఖండించెను. అందువలన నా యువతులామెను మిగుల తిరస్కారముగా జూచియు ఆమెకు శరీరమస్వస్థముగా నుండినను విచారింపక ఉపోషము

చేసినను, భోజనము చేయుమనక ఆమె తినదని యెరిగియు, మాంసాహారములు తినెదవా యని యామెను కేరడములాడి విశేష బాధపెట్టిరి. ఆనందీబాయి వారింత చేసినను వారిపై కోపపడక స్వదేశవియోగము, స్వజన వియోగములవలన గలిగిన దుఃఖమును తానే యాపుచు, దొరకినచో ధాన్యాహారము చేసియు, దొరకనిచో నుపోషముండియు గాలము గడుపుచు స్టీమరుపై వెళ్లుచుండెను. ఆహా! ఇట్టి స్వదేశాభిమానమును స్వధర్మాభిమానమును గల స్త్రీ సర్వజనవంద్య యనుటకు సందేహము గలదా! కొందరు క్రైస్తవమతబోధకులు మొదట తాము మిగుల ప్రేమకలవారుగా నగుపడి, తమ మతము నితరులకు బోధింతురు. వారు తమ బోధవలన దమ మతము నవలంబింపరని వారికి దెలియగా ననేకరీతుల వారి నవమానింతురు. ధర్మగురువులగు వారికిది యెంతమాత్రమును తగినపనికాదు. జోడివారలు తన నట్లు చూచి సహాయమేమియు జేయకుండినను ఆనందీబాయి తనకు బరమేశ్వరుడే సహాయుడని నమ్మియుండెను. పదునెనిమిది సంవత్సరముల వయసునందే యింతటి దృఢనిశ్చయమును ధైర్యమును, ఈశ్వరునియందు నమ్మికయు గలిగి వర్తించుట మిగుల స్తుత్యముగదా?

ఇట్లు స్టీమనౌకపై ప్రయాణము చేయుచు ననేక ద్వీపములను గడచి జూన్ ౧౪వ తేదిని ఆనందీబాయి అమెరికా చేరెను. అచటికి ఆనందీబాయి వచ్చుచున్న వార్తవిని యదివరకే కార్పెంటరు దొరసాని యోడవద్దకివచ్చి ఆనందీబాయి నెదుర్కొనెను. అప్పుడా యిరువురికిని గలిగిన యానంద

మింతంతయని చెప్పుటకు వీలులేదు. కార్పెంటరు దొరసాని ఆనందీబాయి సద్గుణములను నేటికిని మరువలేదు. ఇట్టి స్త్రీలు బహుసంఖ్యలో నొకరుండరని యామె యనుచుండెను.

ఆనందీబాయి అమెరికాలోని న్యూజరసీపట్టణమున కేగగా నచట కార్పెంటరు దొరసానిగారి కుటుంబీకు లందరును ఆమెను బహు మర్యాదచేసిరి. వీరింటనుండియే ఆనందీబాయి తన చదువున కనుకూలమగు తావు వెదకుకొనెను. అచట నున్న నాలుగు నెలలు వ్యర్థపుచ్చక ఆనందీబాయి కుట్టుపని, అల్లికపని, జలతారుపని నేర్చుకొనెను. తదనంతర మామె ఫిలడల్ఫియా యను మహాపట్టణమున వైద్యవిద్య నభ్యసించునటుల స్థిరమయ్యెను.

కొందరు పురుషులుగాని, స్త్రీలుగాని తమదేశమును వదలి పరదేశమున కరిగిన పిదప దమదేశాచారములను విడిచి యాదేశాచారములనే స్వీకరింతురు. కాని మాచరిత్రనాయిక యట్లుగాక పాతాళలోకమున కరిగియు దన దేశాచారమును మరువక యా దేశపువారికిని వాటిని నేర్పెను. ఆమె తన స్నేహితురాండ్రకును కార్పెంటరు నింటి వారికిని మహారాష్ట్ర స్త్రీలవలె జడలువేసి చీరలు కట్టించుచుండెను. తాను న్యూజరసీ పట్టణమున కేగుటకు ముందు తన స్నేహితురాండ్ర కందరకును మహారాష్ట్ర పద్ధతి ననుసరించి విందుచేసెను. ఆ దిన మామె తానే తమదేశపు పక్వాన్నములు వండి భోజనములకు కూర్చుండుటకు పీటలువేసి, తినుటకు విస్తరులును దొప్పలును కుట్టి మహారాష్ట్ర దేశాచార ప్రకారము సకల పదార్థములును

వడ్డించి విందారగింపవచ్చిన యువతులకు మహారాష్ట్ర స్త్రీవలె జీరలు, గాజులు, కుంకుము మొదలయిన వలంకరించి చేతితో భోజనము చేయువిధ మంతయు వారికి దెలిపి తానును వారితో గూర్చుండి భోజనము చేసెను.

తదనంతరమునం దామెను దీసికొని కార్పెంటరు దొరసాని ఫిలడల్ఫియా పట్టణమున కరిగి యచట నామె కనుకూలమగునటుల నిల్లు మొదలయినవి విచారించి, మరలి తన గ్రామమునకు వచ్చెను. ఆనందీబాయియు నచట విద్య నభ్యసింపుచు స్నేహితురాండ్ర గలసియుండెను. అచట నామె నాలుగు సంవత్సరములు విద్యాభ్యాసము చేసెను. ఆవ్యవధిలో నామె కనేక శారీరకమానసికదుఃఖములు కలిగి యామెదేహము నానాటికి క్షీణింపసాగెను. ఆమె చదువుకొను కాలములో హిందూదేశమునుండి యనేక స్త్రీ విద్యాశత్రువులు మిగుల హేయములగు జాబులను వ్రాసి యామెకు మిగుల విచారము కలుగజేసిరి. కొందరామె పరదేశమున కరిగి స్వధర్మమును విడిచెనని యామె భర్తకు జెప్పి యామెపై మనసు విరుప జూచిరి. కాని వారిప్రయత్నము లెంతమాత్రమును కొనసాగ నవికావు. ఇట్లు సత్కార్యములకు నెట్లయిన విఘ్నములు గావింపవలయునని తలపుగల ధర్మాచరణ పరాయణులు మన దేశమునం దున్నందుకు నెంతయు జింతిల్లవలసి యున్నది. అమెరికాలోనుండగా ఆనందీబాయి యనేకోపన్యాసముల నిచ్చి యచ్చటి విద్వాంసులను మెప్పించెను.

భార్యవెళ్ళిన రెండు సంవత్సరములకు గోపాలరావు గారు బయలుదేరి కాలినడకతో నమెరికా కరిగెను. ఆయన తన భార్య నడవడిని గనుగొనదలచి యామెకు దెలుపకయే యకస్మాత్తుగా నచటికిబోయెను. కాని యామె సత్ప్రవర్తన గనిన పిదపగోపాలరావు తా నామెనుగూర్చి శంకించినందుకు పశ్చాత్తాపపడెను. ఇట్లు గొప్ప విద్య నేర్చుకొని అమెరికా దేశమునకు జని, మహాగౌరవమును గాంచియు విశుద్ధచరితగా నుండి, యెల్లప్పుడును సంశయముతోనే యుండెడిపతిని మెప్పించిన యీ పతివ్రతా శిరోమణి ప్రాతఃస్మరణీయ యనుటకు సందేహములేదు.

నాలుగు సంవత్సరములు చదివినపిదప ఆనందీబాయి వైద్యవిద్యయందు ప్రవీణురాలని మెప్పుపొందెను. తదనంతర మా దంపతులు అచట జూడదగిన స్థలములను జూచి కార్పెంటరు దొరసానివద్ద సెలవుపుచ్చుకొని స్వదేశమునకు వచ్చిరి. ఆనందీబాయి అమెరికాలో నుండిన కాలముననే కోలాపురపు సర్కారువారామెను తమ స్త్రీ వైద్యశాల కధికారిణిగా నుండుమనియు, నెలకు మూడువందలరూపాయిలు వేతనమిత్తు మనియు బిదప నైనూరుదలవరకు వృద్ధిపొందింపగలమనియు నామెకు దెలిపిరి. కాన నామె యందునకు నొప్పుకొనెను. కాని దేశముయొక్కయు, స్త్రీలయొక్కయు దురదృష్టమువలన జదువుకొను కాలముననే యామెకు క్షయరోగ మంకురించి క్రమముగా వృద్ధియగుచుండెను. రోగముతోడనే యామె మన దేశమునకు వచ్చెను. సముద్ర ప్రయాణమువలన నామెదేహము

మరింత యస్వస్థ మయ్యెను. బొంబాయియందును, పూనా యందును, ఆమెకు ఔషధోపచారము లనేకములు చేసి చూచిరి. కాని ఫలము లేకపోయెను. తుదకు ౧౮౮౭ వ సంవత్సరము ఫిబ్రవరి ౨౬ వ తేది రాత్రి పదిగంటలకు దా జన్మించిన పూనాయందే యీ యద్వితీయస్త్రీ పరలోకమున కేగెను. మరణ కాలమున "నాచేతనయినంతవరకు నేనుచేసితి" నని పలికి యామె ప్రాణముల విడిచెను.

చూచితిరా! యీ ధైర్యవతి సాహసము! ఇట్టి రత్నము లనేకములు మనదేశమునందు గలవు. కాని యా రత్నములను సానబెట్టి ప్రకాశింపజేయుటకు గోపాలరావువంటివారు లేనందున నా రత్నములును రాళ్ళవలె కానిపించుచున్నవి. ఆనందీబాయి సద్గుణములకును, సద్విద్యకును, గోపాలరావే మూల కారణుడనుట కెంతమాత్రమును సందేహము లేదు. సాధారణముగా మొగపిల్లలును, ఆడుపిల్లలును వారి చిన్నతనపు చేష్టలవలన మిగుల చెడ్డవారని యనిపించుకొందురు. పురుషులు విద్య నేర్చిన పిదప తమయజ్ఞానమును కొంతవరకు విడిచి మంచివారగుదురు. స్త్రీలో, విద్య నేర్పువారులేక యింటియందు దల్లి ముత్తవ మొదలగువారివలెనె జ్ఞానవంతులును సుగుణ దుర్గుణములు కలవారును నగుదురు. ఆనందీబాయి చిన్నతనమునందు మిగుల చెడ్డదిగా గానుపించుచుండెనుగాని విద్యాభ్యాస మధికమయిన కొలదిని ఆమె మనసు మారెను. ఆమె పరద్వీపమున కేగి యిట్టివిద్యను నేర్చివచ్చినను, గర్వ మామె నంటజాలకుండెను. ఆమె చరితము గని వినినవారలు స్త్రీవిద్యాద్వేషు లయినను

తమ యభిప్రాయమును మాని స్త్రీ విద్యాభిమాను లగుదు రనుటకు సందేహము లేదు. ఈమె చరితము అమెరికాలోని వారును వ్రాసి మిగుల పూజ్యభావముతో జదువుచున్నారు.

ఇట్లీయు త్తమసతి దేశదేశాంతరములందును గీ ర్తిగాంచి విద్యచే స్త్రీలు బాగుపడుదురేగాని చెడిపోరనియు సద్గుణము లకు విద్యకు విరోధమేగాని విడలేని మైత్రిలేదనియు, స్వచరిత్రమువలన స్థాపించి, విద్య నేర్చిన స్త్రీ లందరు ధర్మము విడుతు రనియు, పతిని మన్నింపరనియు స్వచ్ఛంద లగుదురనియు గొందరుచెప్పినమాటలు ద్వేషజన్యములయిన యసత్యవాక్యము లనియు, స్థిరపరచినందునను ఆనందీబాయి చరిత్రమునకు నేను "స్త్రీ విద్యావిజయదుందుభి" యని పేరు పెట్టితిని.

* * * * *

# రాణి ఝాన్సీ లక్ష్మీబాయి

★

భరత ఖండమునందు శౌర్య మహిమవలన ప్రఖ్యాతలయిన యువతీ రత్నములలో ఝాన్సీలక్ష్మీబాయి యగ్రగణ్యురాలు. ఈమె శౌర్యాగ్ని ౧౮౫౭వ సంవత్సరము వరకును దాగియుండి యాకస్మికముగా ప్రజ్వలించెను. ఈమె రాజ్యము ఉత్తర హిందూస్థానమునందలి బుందేల ఖండమను ప్రదేశమునందలి యొక భాగము. ఈ రాజ్యము లక్ష్మీబాయిగారి మామగారి యన్నయగు రఘునాథరావుగారి ప్రతాపమునకు మెచ్చి పూర్వము ఈ పూనా పేష్వాగారిచ్చిరి. ఆయనకు పుత్రులు లేనందున ఆయన తమ్ముడగు శివరాంభావుగారి నభిషిక్తుని జేసిరి. ఈ శివరాంభావుగారి కాలమున పూనా పేష్వాల ప్రతాప మడుగంట నారంభించినందునను, రెండవ బాజీరావుగారి రాజకార్య నిపుణత్వ శూన్యతవలనను ఈయన వారి నతిక్రమించి స్వతంత్రుడాయెను. కాని యింతలో నాంగ్లేయప్రభుత్వ మెల్లెడలను వ్యాపించినందున శివరాంభావుగారాంగ్లేయులతో సఖ్యము చేసి యనేక సమయములయందింగ్లీషువారి కనేకవిధముల తోడుపడెను. శివరాంభావుగారికి కృష్ణారావు, రఘునాథరావు, గంగాధరరావులను ముగ్గురు పుత్రులుండిరి. వారిలో పెద్దవాడగు కృష్ణారావు తండ్రి బ్రతికి యున్న కాలములోనే మృతిజెందినందున శివరాంభావుగారి యనంతర మాయనకొమారుడగు రామచంద్రరావుగారికి

రాజ్యాధికారము దొరకెను. ఈయన పరిపాలన కాలములో పేష్వాల రాజ్యాధికారమెల్ల నింగ్లీషువారి యధీనమయినందున ఝాన్శీ సంస్థానాధీశునికి నాంగ్లేయప్రభుత్వమువారికి విశేష స్నేహభావము గలిగెను. ఈయన పుత్రహీనుడగుటవలన నాయనంతర మాయనపినతండ్రియగు రఘునాథరావు, ఆయన యనంతర మాయనతమ్ముడగు గంగాధరరావును రాజ్యమును పాలించిరి. ఈగంగాధరరావు చరిత్ర నాయికకు భర్త.

మోరోపంతు తాంబే యనుకరాడే బ్రాహ్మణుడు పూనానగరమున వసియించుచుండెను. ఆయనయందు రెండవ బాజీరావు సహోదరుడగు చిమాజీ యప్పాగారికి మిగుల విశ్వాసమును స్నేహమును కలిగియుండెను. ౧౮౧౮వ సంవత్సరమున ౮లక్షలపించెను పుచ్చుకొని సర్వరాజ్యమును ఇంగ్లీషువారికిచ్చినట్లు పత్రము వ్రాసియిచ్చి రెండవబాజీరావు బ్రహ్మావర్తమున వాసముచేయ జనెను. ఆసమయమునందా యన తమ్ముడగు అప్పాగారును తమకు దొరకు పించనును సేవకులనుతీసికొని కాశీక్షేత్రమున వసియింప దలచి దొరతనమువారి యనుజ్ఞవడసి కాశికి బోయిరి. ఆయన పరివారములోనివాడు కాన మోరోపంతుతాంబే సహిత మచటికేగెను. ఈతనిని శ్రీమంతులగు నప్పాగారికి దివానుగానుంచి, తత్ప్రీత్యర్థము నెలకు ఏబది రూపాయల వేతన మొసంగుచుండిరి.

మోరోపంతుగారి భార్యయగు భాగీరథీబాయి సద్గుణమునందును సౌశీల్యమునందును మిగుల ప్రఖ్యాతి వడసెను. భార్య యిట్టిదగుటవలననే మోరోపంతుగారికి సంసారయాత్ర

బహు సుఖకరముగా నడచెను. ఆభార్యాభర్తలిరువురును పరస్పరానురాగముగలవారై కాశీక్షేత్రమున వసింప గొన్ని దినములకు భాగీరథీబాయి గర్భముధరించి ౧౮౩౫వ సంవత్సరము నవంబరు నెల ౧౯వ తేదిని సుఖప్రసవమై స్త్రీశిశువును గనెను. తాంబేగారి శూరవంశమున గాశీ క్షేత్రమున జన్మించిన కన్యారత్నమే లక్ష్మీబాయి. జాతకర్మ నామకరణమహోత్సవములు బహుసంతోషముతో నడిపి మోరోపంతుగారు చిన్నదానిపేరు "మనూబాయి"యని పెట్టిరి. ఈబాలిక దినదినప్రవర్ధమానయగుచు దనముద్దు మాటలవలనను, మనోహరమగు స్వరూపమువలనను జననీ జనకులను, వారి పరివారమును మిగుల నానందపరుపుచుండెను. ఇట్టీబాలికా రత్నంబు సకల జనాహ్లాదకరంబుగా బెరుగుచుండ నామె మూడు నాలుగు సంవత్సరములదియగువరకు తన్మాత యగు భాగీరథీ బాయి పరలోకగతురాలాయెను. ఈసమయముననే యప్పాగారును కైలాసవాసులగుటవలన మోరోపంతుగారచటనుండి బ్రహ్మావర్తమునకు బోవ తటస్థించెను. అచట బాజీరావీయనను మిగుల ప్రేమించి కుటుంబసంరక్షణ చేయుచుండెను.

మనూబాయికి బాల్యముననే జననీ వియోగము తటస్థించినందున నామె తండ్రిగారి పోషణలోనే యుండుచు, నెల్లప్పుడు ఆయననువిడువక పురుషులలోనే సదా తిరుగుచుండెను. తల్లిలేని పిల్లయగుటవలనను, సుస్వరూప మధురభాషిణి యగుటవలనను శ్రీమంతులవద్ద నుండువా రందరును మనూభాయిని మిగుల గారాబము చేయుచుండిరి. పేష్వాగారి దత్త

పుత్రులగు నానాసాహేబు, రావుసాహేబు లాకాలమునందు బాలురేగాన వారితో నీ చిన్నది సదా కలసిమెలసి యుండుచు వచ్చెను. నానాసాహేబేమి నేర్చిన నది మనూబాయి నేర్చు కొనుచు, వారిద్దరన్న చెల్లెలి వరుసలతో బిలుచుకొనుచుండిరి. చదువు, అశ్వారోహణము, ఖడ్గము త్రిప్పుట మొదలయిన వన్నియు మనూబాయి నానాసాహేబుగారితోడనే నేర్చు కొనును! ఈమె స్వభావము బాల్యమునుండియే శౌర్యగుణ ప్రధానముగా నుండెను. దీని కంతకు క్షత్రియాగ్రగణ్యగుణ ములు గల శూరుల సంసర్గమే కారణము. ఇందువలన స్త్రీలు స్వభావము చేతనే పిరికివారనియు, వారికి శౌర్యధైర్యము లెన్నివిధములను పట్టువడనేరవనియు వాదించు విద్వాంసులకు సంశయనివృత్తి కాగలదు. స్త్రీలకును పురుషులవలెనే బాల్యమునుండి యెట్టి సంస్కరణ జరుగునో యట్టి గుణములే యబ్బునని సిద్ధమగును.

ఇట్లుండ నొకనా డాకస్మికముగా ఝూంశీ సంస్థానము నందలి జ్యోతిష్కుడగు తాత్యాదీక్షితులు బాజీరావును సందర్శింపవచ్చెను. ఆదీక్షితులతో సందర్భానుసారముగా మోరోపంతుగారు ఝూంశీవైపున మాచిన్నదానికి వరుడు కుదురునాయని విచారించెను. అందుకాయన "ఝూంశీ సంస్థానాధీశ్వరుడగు గంగాధరరావు బాబాసాహేబుగారికి ప్రథమపత్ని యగు రమాబాయి కాలధర్మమునొందెను కాన నీకొమార్తెకా సంబంధము విచారింపు"మని చెప్పెను. తద నంతర మీ వివాహమును గురించి బాజీరావు గంగాధరరావును

దెలుపగా నాతడు సమ్మతించెను. లగ్ననిశ్చయమైన పిదప గొందతాపులతో మోరోపంతుగారు ఝాన్సీకి వెళ్ళిరి. అచటనే ౧౮౪౨వ సంవత్సరమున మనూబాయి వివాహము మిగుల వైభవముతో జరిగెను. వివాహానంతరమునందు దేశాచారప్రకారము అత్తవారాచిన్నదానికి 'లక్ష్మీబాయి' యను పేరు పెట్టిరి. మామగారగు మోరోపంతు తాంబేగారికి 300 రూపాయల వేతనమిచ్చి గంగాధరరావుగారు తమ యాస్థానమునందొక సరదారుగా నుంచినందున లక్ష్మీబాయి మరల బ్రహ్మావర్తమున కరుగుట తటస్థించినదికాదు.

గంగాధరరావుగారి యన్నగారగు రఘునాథరావుగారి పరిపాలనలో రాజ్యము విశేష దుస్థితికి వచ్చినందున నారాజ్యాధికారమును పూర్ణముగా దొరతనమువారే స్వాధీనపరచుకొని రాజ్యమునకు గల ఋణములను దీర్చుచుండిరి. లక్ష్మీబాయి వివాహానంతరము గంగాధరరావుగారి యోగ్యతనుగని బుందేలుఖండముయొక్క పొలిటికల్ యేజంటగు కర్నల్ స్లీమన్ దొరగారు సర్వరాజ్య పాలనమును గంగాధరరావుగారి స్వాధీనము చేయించిరి.

గంగాధరరావు తనప్రజలను సుఖులనుగా జేయనెంచి రాజ్యమును బహునిపుణముగా బాలింపుచుండెను. ఈయన కాలమునందు ఋణము లన్నియు దీరి భాండాగారమున ధనము దినదినాభివృద్ధి బొందుచుండెను. ప్రజలును మిగుల సుఖులై యుండి సదా రాజును, రాణిని దీవింపుచుండిరి.

ఇట్లు కొన్నిరోజులు సౌఖ్యములో గడచిన పిదప లక్ష్మీబాయిగారి దుఃఖమునకు ప్రారంభమయ్యెను. ఆమె కొక పుత్రుడు గలిగి మూడుమాసములు జీవించి మృతిజెందెను. గంగాధరరావు మహారాజుగారి మనస్సునందు పుత్రశోక మధికమయినందున ఆయన నానాటికి క్షీణించి, వైద్యోపచారముల వల్ల నడుమనడుమ కొంచెము స్వస్థపడుచుండెను. ఇట్లు కొన్ని దినములు గడచినపిదప ౧౮౫౩ వ సంవత్సరము అక్టోబరు నెలనుండియు నాతని శరీరము మరింత క్షీణింపసాగెను. అనేక రాజవైద్యులు సదా సమీపమునందుండి యథౌషధోపచారములు చేయుచుండిరి. కాని యెంతమాత్రమును సుగుణ మగుపడు జాడ గానరాకపోయెను. నవంబరు ౧౫వ తేదీనుండి గంగాధరరావు ప్రకృతియందు వికారచేష్టలనేకములు కానిపించుచు వచ్చెను. అందువలన సంస్థానపుమంత్రియగు నరసింహరావును మోరోపంతు తాంబేగారును గలిసి ముందు సంస్థాన వ్యవస్థనుగూర్చి మహారాజులంగారితో ముచ్చటించిరి. వారి ప్రసంగమును వినిన పిదప దన కిప్పుడే రోగ మసాధ్యముగా లేదనియు, ముందసాధ్యమగునేని తన వంశమునందలి ఆనందరావును తనకు దత్తపుత్రునిగా జేసి యనంతర మాచిన్నవాడు స్వరాజ్యభారశక్తుడగు వరకును వానిపేరిట లక్ష్మీబాయియే రాజ్యము పాలింపవలయుననియు జెప్పెను. అందుపై వారందరా క్షణముననే ముహూర్తనిశ్చయము చేసి త్వరలోనే శాస్త్రోక్తముగా దత్తవిధి నడిపిరి. ఆ మహోత్సవమునకు ఝాశీయందలి యనేకప్రముఖులను బిలిచిరి. వారితోడనే బుందేల

ఖండ పొలిటికల్ అసిస్టెంటు యేజంటగు మేజర్ యేలీసు దొరగారిని, సేనాధిపతియగు క్యాప్టన్ మార్టిన్ దొరగారిని బిలిచిరి. వీరందరి సముఖముననే దత్తవిధానము జరిగి ఆనంద రావు పేరు దామోదరరావని పెట్టిరి.

ఇట్లు దత్తవిధానము యైన పిమ్మట గంగాధరరావుగారు దివానుగారిచే విజ్ఞాపనపత్రము హిందూస్థానపు దొరతనమువారికి వ్రాయించి దానిపై తమ వ్రాలు చేసి దానిని తమ హస్తములతో పొలిటికల్ అసిస్టెంట్‌గారి కిచ్చిరి. అందులో బూర్వ మింగ్లీషువారు తన తండ్రిగారితో జేసిన కరారు ప్రకారము తమ వంశ పారంపర్యముగా రాజ్యము దొరకవలయుననియు, తనకు నౌరససంతతి లేనందున నొక దత్తపుత్రుని స్వీకరించితిననియు, దొరతనమువారా దత్తవిధానమునకు సమ్మతించి వానికి రాజ్యమొసంగి వాడు పెద్దవాడగువరకు వాని పేర తనపత్నియగు లక్ష్మీబాయి పాలించునట్లు చేయుడనియు వ్రాసిరి. విజ్ఞాపన పత్రిక వ్రాసిన దినముననే గంగాధరరావు పరలోకగతుడయ్యెను. కులాచారప్రకారము రాజుగారికి ప్రేతవిధులన్నియు జరుపబడెను. తదనంతరము కొన్ని దివసంబులకు లక్ష్మీబాయి సర్వానుమతంబునం దన పుత్రునకు రాజ్యమిమ్మని దొరతనము వారికొక విజ్ఞాపన పత్రికను వ్రాసెను. కాని యామె యుద్దేశ్యము సిద్ధించినదికాదు.

ఆ విజ్ఞాపన ప్రకారము దొరతనమువారు తమదత్తతను స్వీకరించి రాజ్యమిత్తురని ఝాంశీ సంస్థానమున నందరును కొండంత యాసతోడ నుండగా ౧౮౫౪ వ సంవత్సరము

మార్చి నెల ౨౯ తేదీని దత్తవిధానము దొరతనమువా రంగీకరింపక రాజ్యమును తామే స్వాధీనపరచుకొని రనిన సంగతి తెలిసెను. కాన లక్ష్మీబాయికి బతి వియోగ దుఃఖమునకు దోడు రాజ్యవియోగవ్యసనము సంప్రాప్తమాయెను. దొరతనము వారా రాజ్యమును తాము స్వాధీనపరచుకొని పశ్చిమోత్తర పరగణా గవర్నరుగారి కచటి రాజ్యము నడుప ననుజ్ఞ యిచ్చిరి. వారు రాజ్యము స్వాధీనపరచుకొని రాజ్యమునకును రాజకుటుంబమునకు నిట్లు కట్టుబాట్లు చేసిరి.

గ్రామమునందున్న రాజభవనము రాణిగారి కుండుటకుగా నిచ్చి, కిల్లా తాము తీసికొనిరి. రాణిగారికి నిలువ ధనములోన గొంత యిచ్చి, మిగిలిన సంస్థానమునందలి నగలు మొదలగు ధనమంతయు దత్తపుత్రునకు మైనారిటీ తీరిన వెనుక నిచ్చుటకుగాను తమయొద్దనే దాచిరి. రాణిగారు జీవించి యుండునంతవరకు (౫౦౦౦) అయిదువేల రూపాయలా మెకు నెల వేతనముగా నేర్పరచి యంతవరకును ఆమెపైగాని, యామె యితర భృత్యవర్గముపైని గాని తను చట్టములు నడువగూడదనియు వ్రాసియిచ్చిరి.

అందుకు ముందున్న రాణిగారి సైనికులకు విశ్రాంతి గలుగజేసి వారికి బదులుగా దమసేన నుంచిరి.

రాణిగారికి అయిదువేలరూపాయల వేతన మిత్తుమని దొరతనమువారు వ్రాయుటయేగాని తన రాజ్యము తనకు దొరకవలయునన్న యుత్కటేచ్ఛగల రాణిగారా యల్పజీతమును మరణపర్యంతమును స్వీకరించినవారు కారు. అంత నూర

కుండక లక్ష్మీబాయి సీమలో నపీలు చేయుదలచి ఉమేశ చంద్రబానర్జీ యను వంగదేశీయునిని, మరియొక ఆంగ్లేయ ప్లీడరును ఆరులక్షలరూపాయలిచ్చి యింగ్లండునకు బంపెను. కాని వారచటి కరిగి యేమి చేసినదియు నెచట నున్నదియు నేటివరకును దెలియదు. వారచట ననేకోపాయములు జేసెద రనియు వారి ప్రయత్నములవలన దనకు రాజ్యము మరల ప్రాప్తించుననియు రాణిగారికి మిగుల నమ్మకముండెను.

౧౮౫౪ వ సంవత్సరమున దామోదరరావుగారికి నుప నయనము చేయదలచి ఆ పిల్లనిపేర దొరతనమువారు దాచి యుంచిన ౭ లక్షల రూపాయలలోనుండి యొక లక్షరూపాయ లిండని రాణిగారు దొరతనమువారిని నడిగిరి. అందుకు వారు నీవు దీనికొరకెవరి నైన జామీనుంచినంగాని యియ్యమనగా నదేప్రకారము వారు కోరినవారి జామీనిచ్చి లక్షరూపాయలు తీసికొని, యా సంవత్సర మాఘమాసమునందు మహావైభ వముతో గుమారుని యుపనయనము చేసెను. తన భర్తసొత్తు పుత్రుని యుపనయనమునకు దీసికొనుటకుగాను పరుల జామీను కావలసినందుకు రాణిగారి మనస్సెంత ఖేదపడి యుండెనో చదువరులే యోచింపగలరు.

ఇట్లు రాణిగా రత్యంతదుఃఖముతో గాలము గడుపు చుండగా ౧౮౫౭ వ సంవత్సరమున హిందూపటాలము ఇంగ్లీషువారిపై దిరుగబడిన విప్లవకాలము ప్రాప్తించెను. ఈ యుద్ధ మితిహాసప్రసిద్ధమేగాన నితిహాసజ్ఞుల కందరకు విదితమే.

పటాలములు తిరుగబడిన యీ వర్తమానము ఝాశీలోని హిందూపటాలములకు దెలిసి మునుపటినుండి కడగియున్న ద్వేషాగ్ని ప్రజ్వలింప జూన్ నెల ౧ వ తేదీని వారును స్వాతంత్ర్యసమరమునకు ప్రారంభించిరి. వారి సేనానాయకుడు వారిని నివారింప నెంత యత్నించినను వారు తిరుగకుండిరి. అదిగాక యతడు గ్రామమునందలి యాంగ్లేయుల నందరను మిగుల భద్రముగు కిల్లాలోని కరుగుడని గుప్తరీతిని దెలుపగా వారా ప్రకార మచటికి కరిగి కోటద్వారముల మూసికొనిరి. కాని మరునటిదినముననే యీ తిరుగబడిన పటాలములవారు సేనలో ముసల్మానుల జూపి యుప్పొంగి కిల్లాను చుట్టుముట్టి బహు ప్రయత్నముల నచటివారి నీవలకుదీసి వారినందరి నేకక్షణము ననే యమసదనమున కనిచిరి. వారట్లాయూరనొక యాంగ్లేయ శిశువు సహితము లేకుండ జేసి ఝాశీరాజ్యము మహారాణీలక్ష్మీ బాయిగారిదని ధ్వజమెత్తిరి. అప్పటినుండి రాణిగారు పటాలములతో గలిసి స్వతంత్రించి ఝాశీ సంస్థానమున తన రాజ్యమును స్థాపించ యత్నించ దొడగెను. ఆ నాలుగురోజులనైన రాణిగారు రాజ్యవ్యవస్థ మిగుల నిపుణతతో జేసిరి. ఆమె తన నేర్పువలన నేయే పనుల కెవ్వరెవ్వరు యోగ్యులో యాయా పనులకు వారివారిని నియమించెను. కాని పూర్వపు ఉద్యోగస్థులను దొరతనమువా రదివరకే తీసివేసినందున రాణిగారికి దగిన యుద్యోగస్థు లా సమయమున దొరకకుండిరి. అయినను ఆమె తనవలన నగునంతవరకును సిద్ధపఱచి దుర్గసంరక్షణనిమిత్తము క్రొత్త సైన్యమును సిద్ధపరచెను.

ఝాశీరాజ్యము మహారాణి లక్ష్మీబాయిగారు పాలింపుచున్నసంగతి విని వారి వంశీకుడగు సదాశివనారాయణ యనునాతడు ఝాశీ సమీపమునందున్న కరేరాయను దుర్గమును వశపరచుకొని యచట దాను ఝాశీరాజ్యాభిషేకము గావించుకొనెను. అబలయగు రాణిగారు రాణివాసము నందుండునదిగాన నామె తనకు లొంగుననని తలచెను. కాని రాణిగారు సబలయై సైన్యమునంపి యాతనిబట్టి తెప్పించి ఝాశీ కిల్లాలో బంధించి యుంచెను.

ఇట్లొకశత్రుని బరిమార్చునంతలో రెండవ శత్రుడుత్పన్నమాయెను. ఝాశీకి సమీపమునందున్న ఓర్ఛాసంస్థానపు దివాను, నథేఖా యనువాడు విశేష సైన్యముతోడ దాడి వెడలి రాణిగారి కిట్లువర్తమానమంపెను. "మీకిదివర కాంగ్లేయ ప్రభులిచ్చుజీతము మే మిచ్చెదముగాన రాజ్యమును మాస్వాధీనము చేయుడు". ఈవార్తనువిని రాణిగారి ప్రధానసామంతులందరును భయభీతులయి మనకు పించెను నిచ్చినయెడల సంగ్రామముతో బనిలేదనియు వారితో యుద్ధముచేసి గెలుచుట సాధ్యము కాదనియు జెప్పిరి. కాని యసామాన్య శౌర్యముగల రాణిగారు వారిమాటలను వినక యాశత్రువున కిట్లు వర్తమానమంపెను. "ఆంగ్లేయులు సార్వభౌములు. వారు నిగ్రహానుగ్రహములకు సమర్థులు. వారితో సమానులు కానెంచి యాజీత మిచ్చెదననెదవు. కానినీవంటివా రింక పదుగురు వచ్చినను స్త్రీనగు నేను వారినందరిని పౌరుషహీనుల జేయజాలుదుననగా నిన్ను లెక్కింపనేల?" ఇట్టివార్త నథేఖాకు

తెలిసిన వెంటనే పట్టరానిరోషముప్పతిల్లనతివేగముగా వాడు ఝూశీని సమీపించెను. లక్ష్మీబాయిగారును నట్లు వర్తమాన మంపి సంగ్రామమునకు సిద్ధముగానుండెను. అపుడామె తాను పురుషవేషముతో సేనాపతిత్వము వహించి ఘోరయుద్ధము చేసి నథేఖాను నోడించి వానియొద్దనుండి లక్షలకొలది ధనము గొని వానితో సంధిచేసెను.

మహారాణి లక్ష్మీబాయిగారి పరిపాలన మల్పకాలమె యైనను ప్రజలకు మిగుల సుఖకరముగా నుండెనట. కాన వారును రాణిగారి శుభమునే కాంక్షింపుచుండిరి. లక్ష్మీబాయి గారికి పురుషవేషముతో దరబారుచేయుట, అశ్వారోహణము చేయుట మిగులప్రియము. కాన నామె అనేకసమయముల యందు బురుషవేషముతోడనే యుండుచుండెను. సాధారణముగా నామె స్త్రీవేషముతో నుండినను అలంకారము లేమియు ధరియింపక శ్వేతవస్త్రమునే కట్టుకొనుచుండెను.

రాణిగారికి బీదలపై నధికప్రేమయుండెను. ఒకనాడామె మహాలక్ష్మీదర్శనమునకుబోయి వచ్చునపుడు కొందరు బీదలు మూకలుగా నామె నడ్డగించిరి. దాని కారణ మడుగగా వారు మిక్కిలి చలివలన బాధపడుచుండినందున వస్త్రదానము నపేక్షించి వచ్చిరని రాణిగారికి దెలిసెను. అందుపైనామె వారందరికిని టోపీలు, అంగీలు, గొంగళ్లు మొదలగునవి యిప్పించెను.

మధ్య హిందూస్థానమంతయు నించుమించుగా భారత విప్లవకారుల స్వాతంత్ర్య సైన్యముల స్వాధీన మయినందున నప్పటి హిందూస్థానపు గవర్నర్ జనరల్ లార్డు క్యానింగు

దొరగారు ఇంగ్లండు దొరతనమువారి యనుమతిగొని ఇంగ్లండు నందలియు, హిందూస్థానమునందలియు ప్రవీణులగు సేనా నాయకులను రప్పించి రాజభక్తిగల యితర సైన్యములను, సహాయార్థ మరుదెంచిన యితర భూపతుల సైన్యములను వారిపరము చేసి యాప్రచండ సేనను నడుపుటకు యుద్ధకళా విశారదుడగు సర్ హ్యూరోజ్ దొరగారిని నియమించి ఆయ నకు సర్వసేనాధిపత్య మిచ్చెను.

౧౮౫౭వ డిశంబరు ౧౭వ తేదీన సర్ హ్యూరోజ్ దొరగారు సేనానాయకత్వము స్వీకరించిరి. యుద్ధమునకుబోవు మార్గమును విచారించి వేరువేరు మార్గముల సైన్యములు నడుపవలసిన క్రమమును దెలిపెను. క్రమక్రమముగా సర్ హ్యూరోజ్ దొరగారు తమసంగ్రామ కౌశలమందరును గొనియాడ విప్లవవీర సైన్యములపాలయిన భూము లనేక ములు గెలిచి, ఝాంశీని గెలుచుతలంపున నచటికి ౧౪ మైళ్ళ సమీపమున తమసైన్యములను విడియించిరి. వారచటనుండి ఝాంశీ వర్తమానముల నరయుచు, ౧౮౫౮ వ మార్చి ౨౧వ తేదీని ఝాంశీపొలిమేరం బ్రవేశించి పురరచన నరసి తదనుసారముగా సైన్యములను యుద్ధమున కాయత్తము చేసిరి.

అప్పుడు శౌర్యరాశియగు రాణిగారాగ్రహించి యిక నింగ్లీషువారితో పొసగదని తెలిసికొని యుద్ధసన్నాహము చేయసాగెను. నత్థేఖాంతోడ రణ మొనర్చునపుడుంచిన విశేష సైన్యమున కనేక స్థలములనుండి పరతెంచివచ్చిన స్వాతంత్ర్య

వీరుల సైన్యములు తోడుపడెను. రాణీగారి సైనికులలో శూరు లగు ఠాకురులోకులును, విశ్వాసార్హులగు పఠాణులును విశేష ముండిరి. ఆసేనాధిపత్యమునంతను రాణిగారు తామే స్వీకరించి తగినబందోబసు చేయసాగిరి. ఝూాశీకోట మిగుల విశాలమై నదియు, నభేద్య మగునదియునై యుండెను. అచట గొప్ప గొప్పబురుజు లుండెను. ఆకిల్లాలో విశేషదినములనుండి నిరుప యోగములైయున్న యనేకఫిరంగులను రాణిగారు బాగుపరచి బురుజులపై కెక్కించిరి. ఒక్కొక్కఫిరంగి కొక్కొక్క యుద్ధ కలానిపుణుని నియమించిరి. ఇట్లామె తననేర్పుతోను సేవలను పడుపుచు యుద్ధసన్నద్ధురాలాయెను.

ఈ ప్రకార ముభయసైన్యములును యుద్ధసన్నద్ధములై ౨౩-వ తేదీని సంగ్రామమున కారంభించిరి. ఆ దినము శత్రు వులు ఝూాశీకిల్లాను సమీపింప యత్నించిరి. కాని కోటలోని వారి యాగ్నేయ బాణప్రవృష్టి వారి కసహ్యమయినందున సమీపింపజాలక పోయిరి. ఆ రాత్రి యింగ్లీషుసైనికులుకొందరు గ్రామము సమీపించి యచట నాలుగు స్థలముల బురుజులేర్ప రచి వానిపై ఫిరంగుల నునిచిరి. ఝూాశీలోనివారును ఆ రాత్రి యంతయు యుద్ధప్రయత్నమే చేయుచుండిరి. ౨౪-వ తేదినాడు సహితము యింగ్లీషుసైన్యంబులే దైన్యంబు నొందెను. ౨౫-వ తేది ప్రాతఃకాలముననే యింగ్లీషు సైన్యంబుల నుండి కిల్లా పైనిని, పురముపైనిని శతముఖ బాణవృష్టి కాసాగెను. ఆగోళ మొకటి వచ్చి శత్రుసైన్యములోపడి పగిలి నలుగురైనుగురిని జంపి; పది మందిని గాయపరచుచుండెను. కాన నాదిన మా పట్టణమునం

దెచటజూచినను హాహాకారములే వినబడుచుండెను. ప్రజలన్నాహారములకై తిరుగజాలకుండిరి. వారి దైన్యమును గని రాణిగారు వారికొక యన్నసత్రము నేర్పరచిరి. ఆంగ్లేయ సైన్యంబుల నుండి నారాయణాస్త్రతుల్యములగు గోళములవలన తనసైన్యంబులు దీనముఖంబు లగుట గని లక్ష్మీబాయి యంతటిపో ధైర్యము వదలక సైనికుల కుత్సాహమును గలుగజేసి యాంగ్లేయ సైన్యములను ధిక్కరించెను. ఇట్లీ యుభయ సైన్యములును బీరువోవక మార్చి 30-వ తేది వరకును సంగ్రామము బొనర్చుచుండెను. ప్రతిపక్షులగు ఆంగ్లేయ సైన్యమున కనేక సేనానాయకులుండి నడుపుటవలనను, సైనికు లదివరకే యుద్ధమున కనుకూలమగు శిక్షను గరచియుండుటచేతను, వారి సైన్యములు చెదరక యుద్ధము చేసి గెలుపొందుట యొక వింతకాదు. ఇక రాణిగారి సైన్యములన్ననో యుద్ధశిక్ష నెరుగనట్టి స్వాతంత్ర్య వీరులతో గలిసి జనసంఖ్య కెక్కువగా గానుపించినను, వారలందరొక ప్రకారము యుద్ధము చేయజాలకుండుట విశేషముగా చెదరుచుండిరి. ఇంతటి విశేష సైన్యమున కంతకును రాణిగారే సేనానాయకత్వము వహించి నడుపుట బహు దుర్ఘటమని యందరకును దెలిసినదే. అయినను ఆ వీరవనిత తన బుద్ధిచాతుర్యమువలనను, శౌర్యసంపదవలనను ప్రఖ్యాతులగు ఆంగ్లేయ సేనానాయకులతో ప్రతిఘటించి యుద్ధభూమిని నిలిచి యనేక దినములు సంగ్రామము సల్పి, వారిచే 'నీమెను గెలుచుట దుర్ఘట' మనిపించుట మిగుల వింత గదా?

ఆ యుద్ధసమయమునందు రాణిగారు సైన్యము దంత టను తన దృష్టి నిగిడింపుచు, సచటగల కొదవలను దొలగింపుచు, సైనికుల కనేక బహుమానము లిచ్చుచు, యుద్ధధర్మములను దెలుపుచు, వారిని యుద్ధమునకు బురికొల్పి వారి మనంబుల వీరరస ముద్భవిల్ల జేయుచుండెను. అప్పు డామె మిగుల జాలిపడి వచ్చినవారి కామె సమక్షముననే చికిత్స జరిగింపుచుండెను. అప్పుడామె మిగుల జాలిపడి వారిపైనుండి తన హస్తమును ద్రిప్పగా నా సైనికు లధికావేశపరులయి యుద్ధముచేయ నుంకింపుచుండిరి. ఇట్టి స్త్రీరత్నములు జన్మించుటవలననేగదా స్త్రీలకును పురుషులను బోలిన ధైర్యశౌర్యములు గలవని యందరకును దెల్లంబయ్యె.

ఇట్లు ౩౧-వ తేదివరకును యుద్ధము జరిగినను ఆంగ్లేయ బలంబులు రాణిగారి కోటను భేదింపజాలవయ్యె. ఈ రణరంగమునందు వారి యుద్ధసామగ్రి యంతకంతకు దక్కువగుట వలన వారు జయమునం దంతగా నమ్మకము లేకయుండిరి. ఇంతలో నానాసాహేబు* పేష్వాయొక్క సేనానాయకుడగు తాంతాటోపే యను వీరుడు లెక్కకెక్కువయగు సైన్యముతో రాణిగారికి దోడుపడుటకై కాల్పినుండి వచ్చుచుండెను. ఆ సైన్యము బహుదూరముననుండగానే యాంగ్లేయ సేనానాయ

---

* నానాసాహేబు (రెండవ) బాజీరావు దత్తపుత్రుడు. ౧౮౫౭-వ సంవత్సరపు సిపాయిల స్వామిద్రోహమునకు నితడే పురస్కర్త. ఇంగ్లీషువారి యొద్దనుండి తన పూనారాజ్యము మరల సంపాదించవలయునని యితని యత్నముండెను.

కులు దూరదర్శకయంత్రమువలన గనిరి. అంత నగ్నిదేవునకు వాయుదేవుడు సహాయమగుటవలన నీ రాణిగారికి నా సైన్యము వచ్చి తోడుపడిన మన జయము మసత్యమనుకొనిరి. సర్ హ్యూరోజ్ దొర యంత మాత్రమున జంకక యిచట రాణిగారితో బెనగ గొంత సైన్యమును నియమించి కోటలోనివారు వెరుగకుండ గొంతసైన్యమును కాల్పిమార్గమున కంపెను. వారు చని యా త్రోవత్రోవలో వచ్చుచున్న విపుల సైన్యములతో బెనగి తమ యుద్ధసామర్థ్యమువలన వానిని బారదోలిరి. తాత్యాటోపే సైన్యములవారి కోపజాలక తమ యుద్ధసాహిత్యము నచటనే విడిచి పలాయితములయ్యెను. కాన నా సాహిత్య మనాయాసముగ దొరికినందున సర్ హ్యూరోజ్ గారి బలంబులు మిగుల నుత్సాహముగలవయ్యె. వారికి నిదివరకుగల నధైర్యమంతయు నడుగంట శత్రువులపై నధికోత్సాహముతో తప్తగోలవర్షము గురిపింపసాగిరి.

ఏప్రియల్ ౨-వ తేదివరకును యుద్ధముజేసియు దాము పురప్రవేశము చేయలేకుండుటకు మిగుల చింతిల్లి సర్ హ్యూరోజ్ దొరగారు తమ బుద్ధిప్రవీణత వలన నా దినమున నా కిల్లాను చేకొనదలచిరి. ఆయన తదనుసారంబుగా బలంబుల నంప వారును మిగుల నుత్సాహముతో శత్రుపక్షమునుండి వచ్చు బాణములను సైచి గ్రామద్వారముల నుండియు, గోటగోడనుండియు బురము జొరసాగిరి. తాత్యాటోపేగారి పరాభవమును విని రాణిగారి సైనికులు మిగుల నిరుత్సాహులైరి. అయినను యుద్ధమునందు దెగగా మిగిలినవారికి రాణిగారు

తమ వాక్యములవలన శౌర్యము పుట్టించి సంగ్రామము నడుపు చుండిరి. 3-వ తేదిని తమ్ము నెదిరించువారు లేక హూణబలం బులు పురమంతటను వ్యాపించెను. ర-వ తేదిని పట్టణమంతయు వారి స్వాధీనమాయెను.

తానిన్ని దివసంబులు చేసినశ్రమ వృథయైపోవ శత్రువులు తన నగరము నాక్రమించుట గని రాణిగారు మిగుల విచారపడిరి. కాని యామె యంతటనైనా ధైర్యము విడువక కర్తవ్యము నాలోచించి జయోత్సాహులగు శత్రువులింక తనకిల్లా నాక్రమించి తనను బంధింతురని కని యామె యెట్లయిన రణరంగమున ప్రాణములువిడువ నిశ్చయించెను. అంత నామె పురుషవేషముతో బయలుదేర నిశ్చయించి తన దత్త పుత్రునియందధిక ప్రీతిగలదిగాన నా చిన్నవానిని తన మూపున గట్టుకొని అశ్వారోహణము చేసి నాల్గవ తేదీ రాత్రి స్వల్ప సైన్యముతో నాంగ్లేయ సైన్యంబులతో బెనగుచు దాని బాయగా జీల్చికొని కాల్పీమార్గమున నరిగెను.

రాణీగారు తమ సైన్యములలో నుండి కాల్పీమార్గమున వెళ్ళిన సంగతి విని సర్ హ్యూరోజ్ దొరగారు సఖేదాశ్చర్య మగ్నులయిరి. ఆయన యంతటితో నూరకుండక యొక సేనా నాయకుని గొంత సైన్యసహితముగా నామెను వెంబడింప నంపెను. కాని రాణిగారు వారికి దృగ్గోచరముగాక తన గుఱ్ఱము నతిత్వరగా నడుపుచుండెను. జన్మాదిగా యుద్ధమన్న మాట యెరుంగక సదా రాణీవాసమునందు వసియించు బ్రాహ్మణ వితంతువు వీరుల కభేద్యమగు హూణసైన్యమును

భేదించుకొని క్షణములో నదృశ్యయగుట కెవ్వ రాశ్చర్య పడకుందురు ?

మహారాణీ లక్ష్మీబాయిగా రారాత్రి బయలుదేరి తనను బట్టవచ్చువారికి దృగ్గోచరయుగాక సూర్యోదయమునకు ఝాశీ సంస్థానమునకు సరిహద్దయిన భాండేరయను గ్రామమున బ్రవేశించెను. అచట నామె గుఱ్ఱమును దిగి కొమారునకు ఫలహారము బెట్టి మరల నశ్వారోహణము చేసెను. ఇంతలో నాంగ్లేయ సైన్యాధిపతి కొంత సైన్యముతో దనను బట్టవచ్చెనని యామె వినెను. ఆ సమయమునం దామెయొద్ద బదునైదుగురు శూరులుదప్ప వేఱు సైన్యము లేదు. అట్లయ్యును ఆ శూరశిరోమణి జంకక తన ఖడ్గము నొరనుండి తీసి యుద్ధసన్నద్ధయై చనుచుండెను. ఇంతలో నా సైనికులామెను ముట్టడించిరి. కాని యామె తన యుద్ధనైపుణ్యమువలన నా సైనికులను చీకాకుపరచి కొందఱిని యమసదమున కనిచి క్షణములో నదృశ్యయయ్యెను. బహు సైన్యసమేతముగానున్న యాంగ్లేయ సేనాధ్యక్షుని స్వల్పసైనికులతో నొక యబల యోడించి పంపుట యెంతయు వింతగదా! అచటినుండి బయలుదేరి యారాత్రి యామె కాల్పినగరమున నానాసాహెబునొద్ద బ్రవేశించెను. ఇట్లు నిద్రాహారములు లేక యామె యశ్వారోహణము చేసి ౧౦౮ మైళ్ళు ప్రయాణముచేసెను. దీనినిబట్టి చూడగా నామె ధైర్యమును అశ్వారోహణ శక్తియు నందరికి నత్యద్భుతమని తోచక మానదు.

రాణీ లక్ష్మీబాయిగారు కల్పికి వచ్చిన సంగతి విని బందేవాలానవాబు సహితము తన సైన్యములతో రావు సాహెబు పేష్వాగారికి సహాయుడయ్యెను. వీరందరును తమ సైన్యములను యుద్ధసన్నద్ధముగా జేయుచుండిరి. రాణిగారి శౌర్యము నెరిగియు రావుసాహెబు పేష్వాగారు తనకుగల స్వాభిమానమువలన దన సర్వసేనాధిపత్యమును నొకస్త్రీ కిచ్చుటకు సమాధానపడడయ్యెను. కాన రాణిగారు కొంత వరకు యుద్ధమునందు నిరుత్సాహురాలయి యుండిరి.

సర్ హ్యూరోజ్ దొరగారు ఝాంశీనుండి బయలుదేరి కాల్పిని గెలుచుటకయి సైన్యసమేతముగా రాత్రిం దినప్రయాణములు చేయుచు కాల్పి సమీపమునందలి కూచయను గ్రామమున పేష్వాగారి సైన్యముల నెదిరించి క్షణములో నోడించిరి. కాన పేష్వా, బందేసంస్థానపు నవాబు మొదలగువారితో రాణిగారు కాల్పికి వెళ్ళవలసి వచ్చెను. ఆ సమయమునందామె సొంతసైన్యము లేనందున పేష్వాగారామెను మన్నింపనందునను ఈ యుద్ధమునందామె ప్రతాపమేమియు దెలిసినదికాదు. కాని కాల్పికి వెళ్ళినపిదప నామె సైన్యము బందోబస్తును గురించి తన యభిప్రాయము పేష్వాగారికి దెలిపెను. అప్పు డాతడు లక్ష్మీబాయిగారి తెలివిని గని తాత్యాటోపేని లక్ష్మీబాయిని సర్వసైన్యాధిపత్యమునకు నియమించెను. అందుపై వారిరువురు మిగుల దక్షతతో సైనికులకు యుద్ధము గరపుచుండిరి. ఇంతలో నాంగ్లేయసైన్యంబులు కాల్పినగరము నలు ప్రక్కల ముట్టడించెను. అప్పుడు రెండువందల గుఱ్ఱపుబలము

నిచ్చి యమునానది వైపున యుద్ధముచేయ రాణిగారి నంపిరి. ఆమెయు గడమసైన్యము మిగుల జాగ్రతగా నుండుట గని తన స్థలమునకు బోయెను. కాని యుద్ధమునందసమాన ప్రజ్ఞ గల హూణసైన్యంబు అల్పకాలములోనే పేష్వాగారి సైన్యంబుల దైన్యంబునొందించెను. అది గని రావుసాహెబు పేష్వా మొద లగువారధిక విచారమున మునుంగ రాణిగారు వారికి ధైర్యపు మాటలుచెప్పి తన స్వల్పసైన్యముతో శత్రువులను చీకాకుపర చెను. కాని వెనుకనుండి వచ్చు శత్రుసైన్యముల వలనను, తమ సైన్యమునందలి ఇతర సేనాధిపతులు పలాయితులగుట వలనను రాణిగారు యుద్ధమునుండి తొలగవలసినవారయిరి.

ఇట్లు కాల్పియందపజయమును బొందిన ఈ ప్రముఖు లందరును గ్వాలేరు వైపునగల గోపాలపురమునందుజేరి ముందు చేయవలసిన దానినిగూర్చి విచారించుచుండిరి. వారెంత విచా రించినను సైన్య మత్యల్పమగుటచే యుద్ధముచేయుటకు దోచ కుండెను. రాణిగారును వారితోడనే యుండెగాన నామె యాయల్పసైన్యముతో గ్వాలేరున కరిగి సిందేగారిని తమకు దోడుపడ వేడుకొనవలయుననియును, అందు కాయన సమ్మ తించినయెడల యుద్ధముచేయవలయుననియు నాలోచనచెప్పెను.

ఆమె గరపిన యాలోచన పేష్వాగా రంగీకరించి దిన ప్రయాణములు చేసి ౧౮౫౮ వ సంవత్సరము మే నెల ౩౦ వ తేదీని గ్వాలేరునకు సమీపమునందున్న మురారిపుర సమీప మున ప్రవేశించిరి. అంత వారందరును విచారించి సిందేగారిని తమకు సహాయులగుటకుగాను వర్తమాన మంపిరి.

ఆవార సిందేగారి దరబారున కరుగగా నదివరకు దాత్యాటోపే బోధవలన నాతనికి వశులైన సరదార్లందరును పేష్వాగారికి సహాయము చేయుదుమని చెప్పిరి; కాని ప్రభుభక్తిగల జయాజీరావు సిందేగారును, దివాను దినకరరావుగారును వారి వాక్యములను లెక్కింపక మిగులయుక్తిగా మరుసటిదినము పేష్వాసైన్యములను బారద్రోల నిశ్చయించిరి. కాని రాత్రి దివానుగారు లేనిసమయమున నెవరో మహారాజుగారిని యుద్ధమునకు బురికొల్పిరి. అంత నాయన తనకధిక విశ్వాస పాత్రములగు సైన్యములంగొని సూర్యోదయమువరకు మురారికీవల రెండు మైళ్లదూరమునగల బహాదురపురమునందు దనదండును నిలిపి యుద్ధ మారంభించెను. ప్రథమమునందు పేష్వాసైన్యములపైబడు గుండ్లను గని సిందే పూర్వము పేష్వాల బంటగుటవలన దమ కనుకూలుడై తమ నెదుర్కొన వచ్చుచున్నాడని తలచిరి. కాని యాబాణావృష్టి యంతకంత కెక్కువగుటవలన పేష్వామొదలగు పురుష శ్రేష్ఠులందరు రిచ్చివడి యేమియు తోచకుండిరి. కాని వారు తాను చెప్పినటుల సైన్యపు బందోబస్తు చేయకున్నను, కోపముంచక రాణీ లక్ష్మీబాయిగారు తగిన యుక్తిగరపి యుద్ధమారంభము చేసెను. అందువలన నారెండు సైన్యములును కొంతవరకు సమముగా బోరి పిదప సిందే సైన్యములకే గెలుపు దొరకునట్లయ్యెను. అదిగని రాణిగారు తాను ధైర్యముతో గొందరాశ్వికులనుగొని సిందేగారి ఫిరంగీలపై నాకస్మికముగానడరి మహా ఘోరముగాబోర, సిందే సైనికులు పారజొచ్చిరి. అదిగని

తాంత్యాటోపే సైనికులు మరింత యుత్సాహము గలవారయి శత్రుసైన్యములను నదలింపసాగిరి. కాని సిందేగారి పరాక్రమ మంతయు వ్యర్థమాయె నాతడును, దివాను దినకరరావును మరి కొందరు సరదార్లతో దనకు సహాయులగుడని యడుగుటకు గాను ఆగ్రా కిల్లాలోనున్న ఆంగ్లేయుల యొద్ద కరిగెను. విపుల సైన్యసమేతుడగు నొక తరుణ నృపుని నల్పసైన్యముగల యొక యబల తన శౌర్యముచే బారద్రోలెను. ఇందువలననే యొక కవి యిట్లు నుడివెను.

* 'క్రియాసిద్ధిః సత్త్వే భవతి మహతాం నోపకరణే'

సిందేగారు పురము విడిచి చనిన వెనుక నాతని రాణివాసపు స్త్రీ లందరు ఆత్మ సంరక్షణముకొరకు నరవర యను పురమున కరిగిరి. వీరందరు బయలుదేరి కొంచెము దూర మరిగినపిదప సిందే శత్రువులచే బడెనని విని గజరాయను నొక స్త్రీ చేత ఖడ్గముధరించి రాజభవనమునకు వచ్చి రాజు సురక్షితముగా వెళ్ళినవార్త విని వెనుకకు మరలెను. ఆహా యీ స్త్రీ యొక్క ధైర్యము అసామాన్యముగదా ?

రాజు పలాయితుడయిన వెనుక సకల సైన్యములు తమ కనుకూలము లయినందున పేష్వాగారికి నగరు ప్రవేశించుట కెంతమాత్రము ప్రయాసము కాలేదు. పేష్వాగారంతటితో దాము సార్వభౌముల మయితిమని తలచి పట్టాభిషేక మహోత్సవము గావించుకొని బ్రాహ్మణ సంతర్పణలు చేయ

---

* 'గొప్పవారి కార్యసిద్ధి వారి పరాక్రమమువలననే యగును, కేవల సామగ్రి బలమువలన గాదు.'

సాగిరి. లక్ష్మీబాయి యివన్నియు రాజ్యనాశన హేతువు లనియు, ఈ యాడంబరమును వదలి సైన్యపు బందోబస్తు చక్కగా జేసి యుద్ధసన్నద్ధులమయి యుండవలసిన దనియు జెప్పెను. కాని యవి స్త్రీ వాక్యములని పేష్వాగారును, ఆయన సేనానాయకుడగు తాత్యాటోపేగారును మన్నింపక మహోత్సవములలోను, బ్రాహ్మణ సంతర్పణములలోను మునిగియుండిరి.

జూన్ నెల ౧౬ వ తేదీని సర్ హ్యూరోజ్‌గారు సైన్యసహితులయి బహద్దరు పురము చేరిరి. కాని భోగపరాయణులగు పేష్వాగారి కాసంగతియే తెలియకుండెను. ఆంగ్లేయ సేనానాయకు లచటినుండి మురారీకోట చేకొనిరని వినియును పేష్వాగారు చింతదక్కి పుణ్యకృత్యములు చేయుచునేయుండిరి. ఆయన యనుజ్ఞవడసి తాత్యాటోపే సైన్య వ్యవస్థ చేయురీతిగానక లక్ష్మీబాయిగారిని వేడుకొనిరి. జయము కలుగు నాసలేదని తెలిసికొనియు రాణిగారు సమరమున దెగి స్వర్గము గాంచ నపేక్షించి యాయన మనవి చిత్తగించెను. తదనంతర మామె కొంతసైన్యమును చక్కబరచి మిగత నితర సేనానాయకులను జూడ నియమించెను. ఆమె తనసేన ననేక భాగములు విభజించి మిగుల భద్రముగా యుద్ధసన్నద్ధురాలై నిలిచెను. ఇతర సైన్యాధిపతులును తమతమ శక్త్యనుసారముగా వ్యూహములు వన్ని నిలచిరి. రాణిగారు గ్వాలేరు పూర్వదిక్కు సంరక్షింతుమని తన సైన్యము నచటనే మోహరించి నిలిచిరి.

౧౭ వ తేదీని బ్రిగోడియర్ స్మిత్ అను సైన్యాధిపతి గ్వాలేరు పూర్వదిక్కుననున్న సైన్యములపై బాణవృష్టి చేయసాగెను. అది రాణిగారి బలముగుటవలన నాసైనికు లింగ్లీషువారిబలముల నాదినమున ధైర్యముతో మార్కొని నిలిచిరి. రెండవదినమును లక్ష్మీబాయిగారి వీరోత్సాహవచనముల వలన నా సైన్యములు పరబలంబులం బొడిచి తాము మృతులగుచుండిరి. లక్ష్మీబాయిగారి శౌర్యము గని యాంగ్లేయ సేనానాయకులు మిగుల నద్భుతపడి యామె నోడింప నిశ్చయించిరి. ఇట్లు వారు నిశ్చయించి నలుదిక్కులనుండి యామె సైన్యముపై బాణపరంపరలు పరపుటచే నా సైన్యంబులు నిలువక పారజొచ్చెను. ఇట్లు తన ముఖ్యసేవకులు కొందరుదప్ప నందరును తనను విడిచినందునను, అంతకుముందే యితరసేనాధిపతు లపజయముఁబొంది పలాయితు లగుటవలనను, లక్ష్మీబాయి తన ఖడ్గబలముచే శత్రుసైన్యములలోనుండి యనేక శూరులం బొడుచుచు నావలకు బోవుచుండెను. ఇట్లామె బహుదూరము వెళ్ళినపిదప నామెతో పురుషవేషము ధరించియున్న 'ముందర' యను దాసియొక్క యంతిమశబ్ద మామె చెవినిబడెను. అందువలన నామె వెనుక తిరిగి తన ప్రియదాసిని జంపినవానిని యమపురమున కనిపి ముందుకుసాగెను. ఇట్లు ముందతిత్వరగా నరుగుచుండ నొక జలప్రవాహ మడ్డపడినందున ననేక గాయములచే క్షీణించియున్న యామె గుఱ్ఱ మాప్రవాహమును దాటజాలక నిలిచెను! లక్ష్మీబాయిగా రాగుఱ్ఱము నావలకు దీసికొనిపోవ ప్రయత్నించెనుగాని యాపని సిద్ధించి

నదికాదు. ఇంతలో శత్రుసైనికులు కొంద రామెను చేరరాగా నాయువతి మిగుల శౌర్యముతో వారిలో ననేకుల నంతక పురంబున కనిచెను! వారు బహుజనములును ఈమె యొంటరిది కాన వారిలో నొక డామె వాలునకు జంకక పక్కగా నిలిచి యామె తల కుడివైపుగా నరికెను. బంధింపబడిన సింహముపై మత్తగజమాదున ట్లాభటుడు చేసిన ఖడ్గప్రహారమువలన నామె తల కుడివైపంతయు తరగబడి రక్తము ప్రవహింపసాగెను. ఇంతలో నాయాశ్వికుడు తనఖడ్గము రాణిగారి యురమునందు గ్రుచ్చెను. పురుషవేషముతో నుండుటవలన నీమె రాణిగా రని పగవారికి గుర్తింప రాకున్నను, శత్రుపక్షమునందలి యొకానొక సైన్యాధిపతియగునని వారికి దోచెను. ఈదెబ్బతో రాణిగా రాసన్నస్థితిని బొందెను. కాని యావీరయువతి యట్టి సమయమునందును ధైర్యము విడువక తన నట్టిస్థితికి దెచ్చిన యాశ్వికుని బరలోకమున కనిచెను!

ఇట్లామె వానినిజంపి బొత్తుగా శక్తిహీనమయ్యెను. అంతవర కామెను విడువకున్న రామచంద్రరావు దేశముఖు సగము ముఖము కోయబడిన రాణిగారిని శత్రువులచేత బడ కుండ సమీపమునందున్న పర్ణకుటిలోనికి గొనిచనెను. ఆయన మిగుల దుఃఖించి రాణిగారికి నుపచారములు చేయుచుండెను. కాని ౧౮౫౮వ సంవత్సరము జూను నెల ౧౮వ తేదీని అద్వితీయశౌర్యగుణమండితు రాలగు ఝూశీ మహారాణి లక్ష్మీబాయిగా రీలోకమును విడిచి శాశ్వతసుఖప్రదమగు లోకమున కరిగెను. రామచంద్రరావు దేశముఖుగారును రాణిగారి యాజ్ఞ

పూజ్యభావము హెచ్చి యామెపక్షము మాకు భయంకర మయ్యెను"

"గ్వాలేరులో జరిగిన యుద్ధముయొక్క గొప్పపరిణామము ఝూశీరాణీయొక్క మృత్యువు. ఆమె యబల యయినను మాతో దిరుగబడినవారిలో నతిశూరయు నత్యుత్తమ సేనాగ్రణియునై యుండెను."

(౨) "ఆయుద్ధమునందు నత్యంత దృఢనిశ్చయమును, తేజమును, జనానురాగమును గలిగినట్టి సైన్యాధ్యక్షురాలయిన ఝూశీరాణి చంపబడెను." డాక్టరు లో.

(౩) "లక్ష్మీబాయి నడి తారుణ్యములో నుండినందున నత్యంత సుందరముగానుండెను. ఆమెమనసు ఉత్సాహపూర్ణముగాను, శరీరము మిక్కిలి సశక్తముగాను నుండెను. ఆమె యందు, ప్రాణముపోయినను చింతలేదు గాని మానహాని సహింపనన్న యభిమానముండెను." మార్టిన్ ద్వార.

(౪) "ఏ స్త్రీని రాజ్యతంత్రము నడుపుటకు నసమర్థురాలనియెంచి, మేము రాజ్యభ్రష్టనుగా జేసితిమో యా స్త్రీయే ప్రచండసైన్యముయొక్క యాధిపత్యమును స్వీకరించుటకు సంపూర్ణముగా సమర్థురాలని మాకు నిప్పుడు తెలిసెను." ఎడ్విను ఆర్నోల్డు ద్వార.

(౫) "శత్రువులలో నత్యుత్తమ మనీషి ఝూశీయొక్క మహారాణియే" జస్టిస్ మ్యాకర్తి ద్వార.

# విమలదేవి

(అచ్చతెనుగు)

ఈమె మార్వాడలోని రూపనగరమునకు రేడుగా నుండిన అమరసింగుని కూతురు. అప్పుడు ఢిల్లీలోనుండిన రారాజుపేరు ఔరంగజేబు. రజపూతదొరలు కొందరు ఔరంగజేబునకు జడిసి తమబిడ్డల నతనికిచ్చి యతని కనికరమునకు దగినవారయిరి. విమలదేవి తండ్రియు దన బెద్దకూతు నౌరంగజేబున కిచ్చి పెండ్లిచేసెను. రాచకన్నియల నిట్లు తురకల కిచ్చుటకు విమలదేవి యిచ్చ మెచ్చక, తన యుసురులు వోయినను తురకను పెండ్లాడననియు దల్లిదండ్రులు తనకు మంచి రాచకొమరుని వెదకి కూర్చనియెడల దనపాయమంతయు గన్నియగనే గడిపెదననియు దలచెను. ఇట్లుండ నౌరంగజేబున కిల్లాలగు కేసరిబాయను విమలయొక్క యక్క పుట్టినింటికి వచ్చెను. అప్పుడు విమలదేవి తల్లియగు కొమారదేవి మొదలయిన వారందరామె రారాజునకునింతి యగుట వలన నామెను మిగుల గారవించిరి. కాని విమలదేవి మాత్ర మామె మొగమును జూడక యేకతమున నుండి ముక్కంటిని గొలుచుచుండెను. అప్పుడచటికి కేసరిబాయి చెలియలిని జూడ వచ్చి యామె గొలుచు బూచుల దొరను దూరసాగెను. అప్పుడు విమలదేవి మిగుల కోపగించి తోబుట్టువునుజూచి "యచ్చపు రాచకులంబున బుట్టి మిగుల పనికిమాలిన కులము వాని జేపట్టిన నిన్నుజూచిన దోసమువచ్చును. నేను నా

యుసురులు బొంది విడిచిపోయినను తురకల చెట్టబట్టక మేటి మగండగు రజపూత పుడమిఱేని బెండ్లియాడెదననియు బ్రతిన బట్టెను. అందుకామె యక్క నిన్ను దురకల కిప్పించకుండిన నేను ఔరంగజేబున కింతినేకాను" అని ఢిల్లీకరిగి తన మగని కా కత యంతయు జెప్పి యతనిచే విమల నిమ్మని తన తల్లి దండ్రులకు జాబు వ్రాయించెను.

విమలదేవియు దాజేసిన ప్రతిన తల్లిదండ్రులకు జెప్పగా వారు మెచ్చి యామెను గొనియాడిరి. కాని ఔరంగజేబు వద్దనుండి వచ్చిన జాబును జూచుకొనినపిదప వారు మిగుల వెరచి విమల నతని కియ్యదలచిరి. దీనింగని విమల మిక్కిలి నొగిలి సిసోదియా రాచకులంబున బుట్టిన రాజసింహుడను నాబరగు రాచకొమరుని బీరమ్ము నదివరకు వినియున్నది గాన నతనికొక జాబువ్రాసి తమ యొజ్జలచేత నతనికి బంపెను ఆ జాబులో నామె 'ఆడయంచ కాకికి నాతియగుట దగును. ? దొరకులంబున బుట్టిన కన్నియ కోతిమూతి వాడును బోడితలవాడును నైన తురకగూడుట యింపగునా ? వెన్నుడు రుక్మిణిం దీసికొనిపోయినటుల నన్ను గొనిపొండు. మీరొకవేళ నన్ను గాపాడకుండిన నేను నా మేనుం జాలించెదను. ఇది నిజము' అని వ్రాసెను. ఈ జాబుంగొని చనిన పుడమివేల్పు విమలయొక్క మంచి గొనముల నా రాచ సింగంబునకు జెప్పగా నతడు తురకలపై కరంబలిగి గొప్ప దండుతో రూపనగరమునకు బయలుదేరెను. ఈలోపల బెండ్లి మూర్తము దగ్గర వచ్చినందున నౌరంగజేబు పెండ్లికొమారు

దగుటకై రారాజకుమారుఁడగినడంబముతోఁ గూడి నూపనగరమునకు బయలుదేరెను. ఔరంగజేబు రాకడ విని విమలదేవి డెందము మిగుల గుంది చచ్చుటకు నుంకించునంతలో రాజసింహుఁడు వచ్చి యామెను చేపట్టి మరల తన సీమకు దీసికొనిపోవ దొడగె. ఇట్లు పోవుచు నొకప్పుడు గొన్ని కొండల నడుమకు వచ్చిరి. అప్పుడచట వారు కొంతసేపు డప్పి దీర్చుకొనుటకై కూర్చుండిరి. అచ్చటికి గొంచెము దవ్వుననే ఔరంగజేబు తన మూకలతో విడిసియుండెను. అప్పు డౌరంగజేబు నాతియు విమలదేవి యక్కయు నగు కేసరిబాను ఒక చెంచువాడెట్టులనో పట్టుకొని తెచ్చి వీరు దిగిన కొండత్రోవునందొక పొదచాటున నుంచెను. అప్పుడామె "నన్నెవరయిన గాపాడు"డని యా కారడవిలో మొరపెట్టగా విని విమల తన మగని నంపగా నా రాచపట్టి యా చెంచువాని చేతినుండి కేసరిబాను విడిపించి తన యింటిముద్దికి దీసికొని వచ్చెను. కేసరిబా చెల్లెలి మొగముచూడ సిగ్గుపడి యామె తనకు జేసిన సాయమునకు గరంబు సంతసించి తాను విమలకు జేసిన యెగ్గునకు దన్ను మన్నింపుమని చెలియలిని వేడుకొనియెను. అప్పుడు విమలదేవి తన యక్కను వెరవవలదని చెప్పి కొందరు బంటుల వెంట నిచ్చి యామెను ఔరంగజేబువద్ద కంపెను. కేసరిబా చెప్పగా ఔరంగజేబు జరిగినకత యంతయు విని రాజసింహునిపై గల పగమూని ఢిల్లీకిబోయెను. రాజసింహుడును నెలతతో ఉదోపురమున కరిగి సుకంబుండె.

# లీలావతి

★

ఉ. ఇంతగ వాదమేల యువిదేయుల పోలిక? స్త్రీలవిద్య సి
ద్ధాంతము చేసినారు గుణతజ్ఞులు పూర్వులు— (వీరేశలింగకవి)

గణితశాస్త్ర పండితుడని ప్రసిద్ధి గాంచిన భాస్కరాచార్యుల కొక కూతురుండెను. ఆమె పేరు లీలావతి. సిద్ధాంత శిరోమణియందు భాస్కరాచార్యులవారు తానా గ్రంథము ౧౦౭౨ వ శాలివాహన శకసంవత్సరమునందు రచియించితినని వ్రాసినందున లీలావతి ౧౨-వ శతాబ్దమున నుండినట్లు తేలుచున్నది. లీలావతి బాలవితంతు వైనందున నామె భర్తృవంశ మేదియో తెలియదు. మన దేశమునందు జరిత్రములు వ్రాసియుంచు పద్ధతి పూర్వమునుండి లేనందున గణితశాస్త్రమునందసమానపండితయైన లీలావతిని గురించి కొన్ని సంభవాసంభవములగు కథలు దప్ప చరిత్రమున కితర సాధనంబు లేవియు లేనందున నా దంతకథలే యిచ్చట వ్రాసెదను. భాస్కరాచార్యులవారు జ్యోతిషమునందు మిగుల ప్రవీణులు. కాన లీలావతికి వైధవ్యము ప్రాప్తించునని జాతకమువలన దెలిసికొనెనట. అందువలన భాస్కరాచార్యులు పూర్ణాయువుగల వరుని వెదకి తెచ్చి, యొక మంచి ముహూర్తమునందులీలావతికి వివాహముచేయ నిశ్చయించిరి. వివాహమునకు బూర్వము చేయవలసిన విధులజరిపి, కన్యావరులను మండపమునందు గూర్చుండబెట్టెను. ముహూర్తము తెలియుటకై నీటిలో ఘటికాయంత్రము (సన్న చిల్లిగల గిన్నె) నొకదాని నునిచి, పురోహితసమే

తుడయి ముహూర్తము నెదురుచూచుచుండెను. అంత గొంత సేపటికి లీలావతి యా గిన్నెలోనికి నీరువచ్చు విధము చూడ గోరి కొంచెముజరిగి చూచుచుండెను. అట్లు చూచునపు డామె శిరోభూషణము నుండి యూడిన యొక సన్నని ముత్య మా గిన్నెలో బడి నీరువచ్చు మార్గము నరికట్టెను. ముత్యము పడిన సంగతి యెవరును చూచినవారు కారు. ఎంతసేపు చూచినను గిన్నె మునుగకుండుట గని, దాని కారణము నెరిగి ఆచార్యులవారు హతాశులై యేదో యొక ముహూర్తమునందు లీలావతి వివాహము గావించిరి.

వివాహానంతరము స్వల్పకాలములోనే లీలావతికి వైధవ్యము ప్రాప్తించెను. కూతున కిట్టి దురవస్థ సంభవించినందున దండ్రి మిగుల బరితపించెను. కాని యాయన యంతటితో దన కొమార్తెజన్మము నిరర్థకమని తలపడయ్యెను. లీలావతికి సంసార సౌఖ్యము లేకపోయినను ఆచార్యులవా రామెకు విద్యానంద మొసంగ దలచిరి. లీలావతి యదివరకే విద్యావతి యగుట వలన నామెకు దండ్రి గణితశాస్త్రమును నేర్పసాగెను. లీలావతియు విద్యాభిరుచిగలదై, తన దుఃఖమును మరచి సదా గణితాభ్యాసమే చేయుచుండెను. కొన్నిరోజుల కామెకు గణితశాస్త్రమునం దపార పాండిత్యము గలిగెను. ఈమె తన గణిత ప్రావీణ్యముచేత గణించి, యరగంటలో వృక్షమునకు గల యాకులసంఖ్య చెప్పుచుండెనని యొక లోకవార్త గలదు. ఈ లోకవార్త యెంతమాత్రమును నమ్మదగినది గాకపోయినను, లీలావతికి గణితశాస్త్రమునందుగల యసామాన్య ప్రజ్ఞను

చూచి లోకులీ వార్త పుట్టించి రనుటకు సందేహము లేదు. ఆమెకు గణితము చెప్పనెడ వేసిన ప్రశ్నలును, వాని యుత్తరములును నొకటిగా జేసి భాస్కరాచార్యులు లీలావతి గణితమనుపేర ప్రసిద్ధి జేసెనని యందురు. ఈ సంగతి లీలావతి గణితములోని "బాలే బాలకురంగలోలనయనే లీలావతీ ప్రోచ్యతాం" "అయే బాలే లీలావతీ మతి మతి బ్రూహి" (లీలావతి యను బాల యీ లెక్కను చెప్పుము అని యర్థము.) అనిన వాక్యమువలన నీ సంగతి నిజమేయయి యుండవచ్చునని తోచుచున్నది. లీలావతి గణితము వలననే, బాలవితంతువయిన లీలావతియొక్క కీర్తి సకల దేశములయందును నిండియున్నది. లీలావతిగణితము ఫారసీ, ఇంగ్లీషు మొదలయిన పరభాషల యందుగూడ భాషాంతరీకరింపబడినది. లీలావతి గణితములోని లెక్కలన్నియు జేయుటకు బురుషులకే మహా ప్రయాసముగా నుండును. కాన నిట్టి కఠినపు లెక్కలను నేర్చిన స్త్రీయొక్క బుద్ధికుశలత యెంత యుండవలయునో చదువరులే యూహింపగలరు.

ఈ లీలావతిచరితమువలన బూర్వకాలమున ఈ దేశము నందు స్త్రీవిద్య సర్వసాధారణమయి యుండెనని తెలియుచున్నది.

★ ★
★

# తా రా బా యి

★

క. విదళింప నురుకు సింగపు
గొదమయు మదచలితగండ కుంజరములపై ;
నిది బలశాలికి నైజము
గద, తేజోనిధికి వయసు కారణమగునే?

ఈమె క్షత్రియ వంశమునం దుద్భవించి, తన యందలి యనేక సద్గుణములకు దోడు శౌర్యమును సహితము ధరియించి మిక్కిలి వన్నె కెక్కెను. ఈమె కాలమును గనుగొనుటకు బ్రస్తుత మేమియు సాధనము లగుపడనందున విధిలేక యా ప్రయత్నమును మాని, యీమె పవిత్రచరిత్ర మిందుదాహరించెదను.

పూర్వము మ్లేచ్ఛరాజుల కాలమునందు మన దేశము నందలి సంస్థానికులును, రాజులును మిగుల కష్టదశ యందుండిరి. తురకలు చేయు నన్యాయమున కోర్వజాలక ప్రజలును మిగుల హీనస్థితియందు బాధ పడుచుండిరి. అట్టి సమయము నందు రాజపుతానాలో వేదనగరమను చిన్న సంస్థానమొకటి యుండెను. సూరనాథాన్ రావను నాయన అచటి ప్రభువుగా నుండెను. ఈయన పూర్వము మహాబల శౌర్యములు కలిగి శత్రుల నోడించినవాడయినను పిదప మిగుల వృద్ధుడగుటవలన వైరివీరుల నెదుర్చుటకు శక్తుడుగాకుండెను. ఇట్లుండ దిల్లాయను తురుష్కుడొక డాయనపై దండెత్తివచ్చెను. ఆ మ్లేచ్ఛునితోడ బోరుటకు శక్తిలేక యా రాజు రాజ్యమును వానికి విడిచి తన ముద్దుల కూతురగు తారాబాయిని దోడ్కొని తక్షశిలా లేక

తకపూరను స్థలమున కరిగి యచట వాసము చేయుచుండెను. ఆయనకీ కొమార్తె తప్ప మరి సంతానముకాని, దగ్గర ఆప్తులు కాని లేకుండిరి. ఈ కన్యకు బాల్యదశయందే మాతృవియో గము సంభవించెను. కాన తండ్రి యామెను ప్రాణపదముగా బెంచుచుండెను. అచట సూరథాన్‌రాయులు కన్యా సహిత ముగానుండుట విని, యాతని పగతుడగు నా మ్లేచ్ఛు డాతని నటనుండియు బారదోలెను. కాన నతిప్రియమయిన ఆథోదా పట్టణమును విడిచి యాతడు అబూయను పర్వతాగ్రమున వసి యింపవలసినవాడాయెను. ఆ సమయమునందు ప్రతి రాజునకు దన రాజ్యము రక్షించుకొనుట యత్యావశ్యకమై యున్నందున సూరథాన్‌రాయు లడిగినను రాజు లెవ్వరును అతనికి దోడు పడరయిరి.

సూరథాన్‌రాయుల కీ కన్య దప్ప పుత్రులు లేనందున నా కన్యచేతనే తన పగతీర్పింప నెంచి యాతడా చిన్నదానికి బుత్రునికిం బోలె యుద్ధవిద్య నేర్పుచుండెను. ఆ కన్యయు నా పర్వత ప్రాంతమునందు దండ్రికోడ నుండి యాతనికి సేవ చేయుచు నాతడు నేర్పిన రణవిద్య శ్రద్ధతో నేర్చుకొనుచుం డెను. తారాబాయికి గొంచెముజ్ఞానము తెలిసినప్పటి నుండియు దండ్రి తనకు శస్త్రవిద్యను నేర్పుటకు గారణ మామె తెలిసి కొని యామె యధికోత్సాహముతో శస్త్రాస్త్రవిద్య నభ్య సించి యందు ప్రవీణయయ్యెను. బాల్యదశనుండియు యుద్ధ విద్య నేర్చుకొనుటవలన నామె శరీరము మిగుల దృఢమైన దియు, జపలతగలదియు నయ్యెను. అరణ్యావాసమును, తండ్రి

యుపదేశమును విన, దేహమువలెనే యూమె మనసుగూడ మిగుల కఠినమై వజ్రసమమై యుండెను. ఆ బాల శుక్లపక్ష చంద్రుని పగిది నభివృద్ధినొందిన కొలదిని తండ్రికి గలిగిన యవమానమున కెంతయు గుందుచు, నతని కట్టి యవమానము గలుగజేసినవాని జంపి పగ తీర్చుకొనుటకు సమయము నెదురు చూచుచుండెను. ఆమె విద్యయందును, శౌర్యమునందును నే ప్రకార మసమానురాలో, రూపమునందును అటులే యనుపమేయమై యుండెను. తారాబాయి వివాహయోగ్య కాగా నామె సౌందర్యఖ్యాతి విని యూమెను వరించుటకు రాజపుత్రులనేకులు వర్తమానము లంపసాగిరి. ప్రథమమునందు మేవాడ రాజపుత్రుడగు జయమల్లుడు తన కామె నిమ్మని కోరెను. కాని తండ్రి పగవాసి నడపక వివాహ మాడనని తారాబాయి నిశ్చయించుకొనినందున నా రాజపుత్రునకు "ఎవడు నా జనకుని పగతుని జంపునో, వాడే నా భర్తయగుట కర్హుడు" అని యూమె వర్తమాన మంపెను.

సూరథాన్‌రాయులు మేవాడ రాణాగారి మాండలికుడగుటచే నాతడు (మేవాడరాజు) తన కొమార్తె నడుగుట సన్మానప్రదముగనే సూరథానునకు తోచెను. కాని కూతురి ప్రతిజ్ఞ నెరవేర్చినయెడల నామె నతనికి నియ్యవలయునని అతనికి నుండెను. జయమల్లుడు శౌర్యహీనుడును, గర్విష్ఠుడు నైనందున పంత మీడేరుటకు బూర్వమే వివాహము కావలయునని కోరెను. కాని యుందు కా పితాపుత్రిక లిరువురును సమ్మతింపకుండిరి. బలిష్ఠుడగు తురుష్కుని బోడించి గెలిచినంగాని

తన కన్యారత్నము దొరకదని తెలిసికొని యా రాజపుత్రు డాశారహితుడై యా వీరబాల నిట్లని నిందింప దొడగెను. "నీ తండ్రివలెనే నీవును దరిద్రలక్షణురాలవు. నేడు నావంటి గొప్ప రాజపుత్రుని దిరస్కరించితివి. కాన నీ యింటనుండు నొక హీనసేవకుని కంటె నన్యులు నిన్నెవరు వరింపజాలరని నమ్ముము." సూరథాన్‌రాయు లంతటి స్వాభిమాని కిట్టి నీచ వాక్యములు విని యూరకుండ మనసెట్లొప్పును? తత్‌క్షణమే యాతడు చేతి ఖడ్గముతో నా రాజపుత్రుని జంపెను. ఈ వర్తమాన మాతని తండ్రియగు రాయమల్లునకు దెలియగా నాత డెంతమాత్రమును చింతింపక "మా నిర్మలమైన వంశమును జెరుపనున్న యా దుష్టునికి దగిన శిక్ష గలిగె" నని నుడివెను. అట్లు దుష్టుని శిక్షించినందునకై సూరథాన్‌రాయులను మిగుల బొగడెను.

రాయమల్లునకు పృథివీరాజను మఱియొక కుమారు డుండెను. తండ్రి యా పుత్రుని నేలనో ద్వేషించి పూర్వము విడనాడెను. కాని పెద్దకుమారుడీ ప్రకార మడుగంటిన పిదప పృథివీరాజును రప్పించి యువరాజును గావించెను. పృథివీరాజు మిగుల సద్గుణవంతుడును న్యాయప్రియుడును నైనందువలన ప్రజలాతని రాకకు మిగుల సంతసించిరి. పృథివీరాజు రాజ్య పదవి నొందిన పిదప తారాబాయి సద్గుణములును రూప లావణ్యాదులును విని తన శౌర్యము గనపరచి యామెను వివాహమాడ నిశ్చయించి సూరథాన్ రాయుల శత్రునిపై దండెత్తిపోవ నిశ్చయించెను. ఆవార్త విని తారాబాయి

మిగుల సంతోషముతో దానును నాతనితో యుద్ధయాత్రకు వెడలెను. పృథివీరాజు ఏడెనిమిదివేల క్రొత్తసైన్యమును సిద్ధపరచి అఫగణ దేశస్థులను గెలుచుటకై ఘోదానగరముపైకి దండు వెడలెను. ఆ సమయమునందు తారాబాయి పురుష వేషధారిణియై గుఱ్ఱము నెక్కి ప్రత్యక్ష మహిషాసురమర్దని యన నా యవనుని నంతమొందింప ప్రయాణమయ్యెను !

వీరందరు ఘోదానగరమును సమీపించిన దినమున దురకల కధికోత్సాహకరంబగు మొహరం పండుగయొక్క-తుదిదినమయినందువలన నా నగరవాసులగు తురకలందరు పీర్లను గుమ్మటములలోనుంచి యూరేగించుచు నానంద మహోత్సవములో నిమగ్నులైయుండిరి. ఆ మహోత్సవావలోకన తత్పరుడయి యచటి ప్రభువగు దిల్లా తన మేడపై దివ్యవస్త్ర భూషణముల నలంకరించుకొనుచుండెను. అట్టి సమయమునందు దమ సైన్యము నంతను నగరద్వారమున నునిచి పృథివీరాజును, తారాబాయియు మరియొక భృత్యుడును, ఉత్సవము గనవచ్చినవారివలె నా మూకలో జేరిపోవుచుండిరి. ఇట్టులరుగునపుడు తారాబాయి తన జనకుని శత్రువు నెరింగి గురిపెట్టి యొక బాణమాతనికి దగులునట్లు వేసెను. మూకలోనుండి వచ్చిన యా శస్త్ర మా యవనుని రొమ్మునం దవిలి వానిని యమసదనమున కనిచెను. తక్షణమే యవను లానగర ద్వారమున నొక మత్తగజమును కావలియుంచి తమ ప్రభువు ప్రాణముల నపహరించిన యోధుని వెతుకజొచ్చిరి. కాని వారి కెచటను నాతడు పట్టుబడినవాడు కాడు.

తారాబాయి పగతుని దెగవేసినపిదప నా ముప్వురును గ్రామమావలనున్న తమ సైనికుల గలియబోవుచుండిరి. ఇట్లు పోవువారికి సింహద్వారముకడ మత్తగజమును కొంత సైన్యమును అగుపడి వారి నడ్డగించెను. దానిగని వారు ప్రథమము నందించుక జంకిరి కాని వీరులగు పృథ్వీరాజు తారాబాయియు మరల ధైర్య మవలంబించిరి. ఆ సమయమునం దామత్తగజము సమీపింపగా తారాబాయి తన చేతనున్న ఖడ్గముతో నా యేనుగు తొండమును నరికెను. అంత నా నాగము ప్రమరధ్వని సేయుచు నావలి కరుగగా నా ముప్వురు యోధులును నచటి స్వల్పసేనను సరకుగొనక నగరము వెల్వడిరి.

తామిట్టులు తమ యోధుల గలసికొనిన పిదప పృథ్వీరాజు థోదానగర సైన్యముల కెదురై పోరుడని తన సైనికుల కాజ్ఞాపించెను. రాజాజ్ఞయైన తక్షణమే యా వీరభటు లాపట్టణమును ముట్టడించి యచటి సేనలను నలుమొగంబుల బారదోలిరి. ఆ యుద్ధమునం దచటగల తురకలలో మూషవంతుల వరకు బగరచే జచ్చిరి. తదనంతరమునందు పృథ్వీరాజును తారాబాయియు మహోత్సవముతో నగరము ప్రవేశించిరి. తమకు జయము దొరికిన పిదప తమ సైనికులు మ్లేచ్ఛులను పట్టుకొని బాధించుటగని తారాబాయి అట్లు చేయవలదని స్వసైన్యముల కాజ్ఞాపించెను.

ఇట్లు సూరథాన్ రాయులకు రాజ్యము దొరకినపిదప తారాబాయి పృథ్వీరాజును వరించెను. సూరథాన్ రాయులు కూతురి వివాహానంతరము తనరాజ్య మల్లునకిచ్చి తాను

భగవత్స్మరణ చేసికొనుచు నిశ్చింతుండయ్యెను. తారాబాయియు నామె భర్తయు బరస్పరానురాగము కలవారై ప్రజలను కన్నబిడ్డలవలె బ్రోచుచుండిరి. వారిట్లు రెండు సంవత్సరములు సుఖముగా నుండగా వారికి నొక సంకటము ప్రాప్తించెను.

పృథివీరాజు బావయగు ప్రభురాయుడనువా డధిక దుష్టుడై తన భార్య నధిక బాధ పెట్టుచుండెను. పృథివీరాజు తన సహోదరికి గలుగు బాధలగని యూరకుండజాలక మంచి మాటలతో బావకు బుద్ధిచెప్పెను. ఆ దుష్టునికా వాక్యములు పామునకు బాలుపోసినట్లై యాతడు తన భార్యను విశేషముగా బాధింపదొడగెను. దానింగని పృథివీరాజు ప్రభురాయులకు గఠినోక్తులతో జాబు వ్రాసెను. అప్పటినుండి యా దుష్టుడు పృథివీరాజుపై మిగుల కోపించియు కుత్సితము బయలుపడనీక పైకి మిగుల మిత్రత్వముతో నగుపడుచుండెను. ఇట్లుండి యాతడొకదినము పృథివీరాజును తన గృహమునకు విందునకు బిలిచి యాతనికి విషాన్నము పెట్టించెను. కపట మెరుగని పృథివీరాజు భోజనముచేసి మరల తన నగరునకు వచ్చుచుండెను. ఇంతలో నాతనికి విషమెక్కినందున నా త్రోవలో యాయన మూర్ఛితుడాయెను. ఈ వర్తమానము తారాబాయికి దెలియగా నామె యాసన్నమరణుడగు భర్త కడకేగి యాతనికి దగు చికిత్సలు చేయుచుండెను. కాని యందువలన నెంతమాత్రమును సుగుణము కాక తుదకాయన స్వర్గస్థుడయ్యెను. అంతటితో తారాబాయి జీవనచరిత్ర ముగిసెను. రాజపుత్రుల కులాచారమగు అనుగమనముచేసి తారాబాయి పరమపదమున కేగెను.

# పద్మావతి

★

సా భార్యా యా శుచిర్దక్షా సా భార్యా యా పతివ్రతా
సా భార్యా యా పతిప్రీతా సా భార్యా సత్యవాదినీ.*

పద్మావతి జగన్నాథ నివాసస్థుఁడగు అగ్నిహోత్రుఁడను విప్రుని కూతురు. జయదేవుఁడను మహాకవి భార్య. ఈమె పాతివ్రత్యమునందు మిగుల ప్రసిద్ధిగాంచెను. పద్మావతి మిగుల సౌందర్యవతియు, గుణవతియు నైనందున నామె జనకుఁడామెకు దగినవరుని విచారించి వివాహము చేయ నిశ్చయించెను. అంత గొన్ని దినంబులకు జగన్నాథమునకు బిల్వాయను గ్రామములో నుండిన నారాయణభట్టను బ్రాహ్మణుని కుమారుఁడగు జయదేవుఁడు సకల సద్గుణపరిపూర్ణుఁడనియు దగిన వరుఁడనియు దెలిసి నందున బీదవాఁడని శంకింపక యా యగ్నిహోత్రి పద్మావతి నాతనికిచ్చి వివాహము చేసెను. వివాహానంతర మా దంపతులు మిగుల నైక్యముగలిగి కాపురము చేయుచుండిరి. పద్మావతి తమకు గలదానిలోనే కాపురము మిగుల చక్కగా గడపుచుండెను. ఆమె పూర్వకాలపు పతివ్రతలకథలు చదివియు వినియు దాను వారివలెనే ప్రవర్తించుటకు నెల్లప్పుడు యత్నించుచుండెను. కాని పరమభక్తుఁడగు జయదేవునకు సంసార మసారమని తోఁచక మిగుల సారముగా గానుపించు

---

* పవిత్రురాలును చాతుర్యవతియునై పతివ్రతయయి భర్త్రనుగ్రహము వడసి సత్యము పలుకునట్టిదియే సద్భార్య యనదగు.

చూడెను. జయదేవుడు పీయూషవర్షుడగు కవియని ప్రసిద్ధి గాంచెను. ఆతడు సాహిత్యసంగీత విద్యలయం దసమాన పాండిత్యము గలవాడై ప్రసన్నరాఘవ మనునాటకమును గీతగోవిందమను సంగీతగ్రంథమును రచియించెను.

ఇట్లు దంపతులు సుఖముగానుండ గొన్ని దినంబుల కొక యూరి సాహుకారు జయదేవుని మిగుల వేడుకొని సమీపము నందున్న తనగ్రామమునకు గొనిపోయెను. జయదేవుడచట గొన్ని దినంబులుండి యాగ్రామమునం దంతటను ననేకులను భక్తులనుగా జేసెను. తదనంతరమాతడు స్వగ్రామమునకు ప్రయాణమగుట గని యాసాహుకారు రాజునకు దెలుపక గుప్తముగా నాబండియందు గొంతద్రవ్యము నునిచియింటి కేగిన వెనుక పద్మావతిగారి కిమ్మని తనబంటగు బండితోలు వానితో జెప్పెను.

ఇట్లు బయలుదేరి జయదేవులు కొంతదూర మరిగిన పిదప నతనిబండిలో ధనమున్న సంగతి యరణ్యవాసులగు దొంగలకు దెలిసి వా రాబండిని నాపి సకలధనమును దోచుకొని జయదేవుని వదలి దమకు నతడు రాజభటులచే నపాయము చేయించునని తలచి, కాలు సేతులు కట్టి జయదేవులను నొక పాడునూతిలో బారవేసిరి. అంతపై గొంతసేపటికి క్రౌంచ దేశాధీశ్వరు డచటికి వేటాడవచ్చి జయదేవునిగని తన నగరమునకు గొనిపోయెను. అచట రాజవైద్యులచే ననేకౌషధోపాయములు చేయించగా జయదేవుల కాలు సేతుల గాయములు మానెను. జయదేవుల యసారపాండిత్యమును, నిర్మల

దైవభక్తియు, నప్రతిమ సాధువృత్తిగని క్రౌంచరా జాతనిని గురువుగా భావించి సేవింపుచుండెను.

ఇచట బద్మావతి భర్తకొరకు ననేకస్థలములు వెదకించియు వెదకియు జాడగానక మిగుల దుఃఖముతో బుట్టినింటనే యుండి భర్తజాడ లరయుచుండెను. ఇట్లు కొన్ని దినములు గడిచినవెనుక క్రౌంచాధీశ్వరుడు జయదేవుల వార్త దెలిపి పద్మావతిని దోడుకొని వచ్చుటకయి తనపరివారమును బంపెను. వారు చెప్పినవార్త విని పద్మావతి మిగుల సంతోషముతో భర్తకడ కేగెను.

పద్మావతి గురుభార్య యగుటవలనను మిగుల పతివ్రత యని ప్రసిద్ధిగాంచుటవలనను రాజపత్ని మిగులశ్రద్ధతో నామెవలన ననేకనీతులు వినుచుండెను. ఇట్లొకనాడు పద్మావతి పాతివ్రత్యమునుగూర్చి యుపన్యసింపుచుండగా నచటికి నొక సేవకుడు వచ్చి రాజపత్ని సమీపబంధువుడెవడో యొకడు లోకాంతరగతు డాయెననియు, ఆయన వియోగము సహింపలేక యాతని భార్య సహగమనము చేయుబోవు చున్నదనియు దెలిపెను. ఆసంగతి విని యచటి స్త్రీలందరు మిగుల నాశ్చర్యపడబొచ్చిరి. కాని పద్మావతికి నాసంగతియొక విశేషముగా దోచకపోవుటవలన నామెముఖమునం దాశ్చర్యభావ మించుకయు గానుపించదయ్యె. అందుకు రాజపత్ని పద్మావతిని "అమ్మా! ఆ మహాపతివ్రత సకల సుఖములను విడిచి భర్తతో సహగమనము చేయునన్నవార్తవిని మీ కాశ్చర్యము కలుగ లేదా? దయచేసి మీమనోగతము నెరిగింపు"డని వేడుకొనెను.

అందుకు బద్మావతి రాజపత్నితో నిట్లనియె "భర్త ప్రాణములు పోయినవెంటనే ప్రేమగల పత్నియొక్క ప్రాణములు బొందినుండి వెడలును. ఇదియె నిజమైన ప్రేమయొక్క లక్షణము. అట్లు వెంటనే బొందిని విడువక తరువాత ప్రాణత్యాగము చేయుట యాత్మఘాతమెగాని పత్నీధర్మముగాదు."

పద్మావతియొక్క శుద్ధాంతఃకరణమునుండి వెడలిన యీవాక్యములు ప్రభుపత్ని చెవులకు ములుకులవలె దోచగా నామె పద్మావతి తాను నిజమయిన పతివ్రతను అని వెల్లడించుటకై యీడంబములు పలికెనని యెంచి పద్మావతి నామె పరీక్షించి భంగపరచ వలయునని నిశ్చయించెను.

అంతపై గొన్నిరోజులయిన పిదప రాజుతో జయదేవులరణ్యమున కరుగుట సంభవించెను. అప్పుడు రాజపత్ని తన మంత్రినిం బిలిచి తన కుట్ర యభిప్రాయ మాతనికి దెలిపి, తదనుసారముగా కార్యము నిర్వహింప నాతనిని నియమించెను. అట్లు కుతంత్రము పన్ని యా రాజకాంత యా రోజునగూడ దన నియమప్రకారము పద్మావతి గృహమునకరిగి యామెతో బ్రసంగించుచుండెను! అంతలో దూతిక యొకత యతి దీనవదనయై వచ్చి, కారడవిలో నాకస్మికముగా జయదేవుడు పులినోటబడి ప్రాణములను విడిచెనని గద్గదస్వరముతో జెప్పెను! ఆ పిడుగువంటివార్త చెవిసోకినతోడనే పద్మావతి నిశ్చేష్టితయై కొంతవడి దేహము తెలియకుండి, మరల దేహస్మారకము గలిగి దుఃఖాతిరేకము పట్టజాలక పతినామము నుచ్చరించి మరణ

తుల్యమగు మూర్ఛనొందెను. కాని యచ్చటి వారందరును నామె మృతిజెందెనని యనుకొనిరి.

ఆమె పాతివ్రత్యమును బరీక్షింపవలెనని యీ తంత్రమును బన్నిన రాణిగారు పద్మావతి మరణమును గని యేమి చేయుటకు దోచక దుఃఖింపసాగెను. అదివర కామెకీకార్యమునందు దోడుపడినవా రిపు డామెనే నిందింపసాగిరి. ఇట్లు రాణిగారు సపరివారముగా శోకింపుచుండు నంతలో రాజుగారును జయదేవుడును పురమునకు వచ్చిరి. వా రిల్లుజొచ్చి పద్మావతి గతించుట విని యామెను సమీపించిరి. అంత జయదేవులు భార్యను గని తనదుఃఖము నాపజాలక కొంతవరకు దుఃఖించిన పిదప ధైర్యము నవలంబించి, తన సంగీతము పద్మావతికి మిగుల ప్రియమగుట యెరిగినవాడు గావున నామె ముందు రసవంతమయిన సంగీతము పాడ నిశ్చయించి తన వీణె దెప్పించి తాను రచించిన గీతగోవిందమును మిగుల మనోహరముగ బాడ జొచ్చెను. ఇట్లు సంగీతమున కుపక్రమించిన కొంతసేపటికి బద్మావతి మొగముపై గొంచెము తెలివి గానుపించెను. ఇరువదియెదవ అష్టపది ముగియుగానే పద్మావతి తెలివొంది కనులు విప్పి తనముందు గూర్చున్న జయదేవుని గాంచెను. అంతనామె మిగుల నానందముతో భర్తకు నమస్కరించి యానందబాష్పములతో నతని పదములను గడిగెను.

ఈ యనర్థమున కంతకు దన పత్నియే కారకురాలని క్రౌంచరాజు మిగుల కోపించి యామెను విసర్జింప దలచెను. కాని దయామయురాలగు పద్మావతి రాజును సమాధాన

పరచి భార్యాభర్త లెడబాయకుండ జేసెను. తదనంతరము పద్మావతీ జయదేవులు కాశీక్షేత్రమున కరిగి, యచటి పురుషులకు భక్తియు స్త్రీలకు పాతివ్రత్యమును ఉపదేశింపుచు తమ ప్రవర్తనవలన వారికి దారి జూపుచుండిరి. కొంతకాలమచట నుండి స్వగ్రామమునకు బోయి యచ్చటనే కొన్ని రోజులకు వారు కాలధర్మమునొందిరి.

పద్మావతీదేవి రాజుభార్య కుపదేశించిన యుపన్యాస మొకటి యాంధ్రమహాభక్తవిజయమునందు గానుపించుచున్నది; గాని మహారాష్ట్ర భక్తవిజయమునందు లేదు. ఆంధ్రభక్తవిజయ కారుడీ యుపన్యాసము నెచ్చటినుండి సంగ్రహించెనో తెలియదు. అయినను నా యుపన్యాసము స్త్రీలకు బాతివ్రత్యంబు గరపుటకు నత్యంతోపయుక్తముగా నుండుట వలన దాని నిట బొందుపరచుచున్నాను.

"అమ్మా! లోకములో సతులకు ముఖ్యముగా గావలసిన ధర్మమొక్కటిగలదు. పతికంటె వేరు దైవముగాని, పతికంటె వేరు గతిగాని, పతికంటె వేరు చుట్టముగాని, పతికంటె వేరు సంపదగాని, పతిసేవకంటె నుత్కృష్టమగు పూజగాని, పతి యనుమతి ననుసరించుటకంటె పరమసాధనముగాని లేదనియు, పాతివ్రత్యమున కెప్పుడును భంగమురాకుండ కాపాడుకొనుచుండుటే బ్రహ్మజ్ఞానమనియు, పతినామము ననవరతము సంస్మరించుటే బ్రహ్మధ్యానమనియు, పతి నెడబాయకుండుటే బ్రహ్మానందమనియు, పతి మృతినొందిన తోడనే ప్రాణములు విడుచుటె మోక్షమనియు నిశ్చయించుకొని వర్తించుచున్న

సతికి సర్వశుభములును సులభముగా సిద్ధించును. పాతివ్రత్యమునకన్న నుత్తమమయిన వ్రతము మరేదియును లేదు. లోకమునందుగల జప తపో నియమాదు లేవియు పాతివ్రత్యమునకు సమానములు కావు. పాతివ్రత్యమును పాడుచేసికొనక మిగుల జాగ్రత్తతో గాపాడుకొన్న గుణవతి భాగీరథి యనబడును. పాతివ్రత్యముగల వనితకు పరమపద మరచేతిలోనిదని పెద్దలు పలుకుదురు. పాతివ్రత్యమును రక్షించుకొన్న వనితలకు నే లోపములును రావు. పాతివ్రత్యమునకు భంగము కలిగించుకొన్నచో బహువిధములయిన బాధ లనుభవింపవలసివచ్చును. ప్రాణములకంటె పదిమడుగు లెక్కుడుగా పాతివ్రత్యమునందు ప్రీతిగలిగి కాపాడుకోవలసినది. భూషణములకెల్ల భూషణము పాతివ్రత్యమే సుమీ! పాతివ్రత్యమునకంటె బడతులకు పాలింపవలసిన పదార్థ మొక్కటిలేదు. పాతివ్రత్యమును పాడుచేసికొనిన పాపాత్మురా లొకవేళ సత్కర్మములను జేసినను అవి దుష్కర్మములక్రింద మారి తుదకు దుఃఖమును కలిగించును గాని లేశమయినను సుఖమును గలిగింపవు. పతివ్రతలయొక్క ప్రభావముచేతనే భూతలమంతయు నంతరమున నిలిచియున్నదనియు, పతివ్రతల విషయమున బ్రహ్మాది దేవతలు సహితము భయపడుచుందురనియు పెద్దలు పలుకుదురు. పూర్వము మృతి నొందిన తనపతిని సావిత్రీదేవి మరల బ్రతికించుకొన్నది కాదా? తన చిత్తశుద్ధిని దెలుపుటకై సీతాదేవి యగ్నిలో దుమికినది గాదా? తనకు హాని చేయవచ్చిన కిరాతుని దమయంతీదేవి భస్మముచేసినది గాదా? తన మాంగల్యము నితరులకు దెలియ

నీయక చంద్రమతీదేవి రక్షించుకొన్నది గాదా? రేణుకాదేవి యిసుకతో గుండను జేసి జలమును దెచ్చినది గాదా? బృంద తన భర్తవలె నను వర్తింపవచ్చిన విష్ణుమూర్తియొక్క మాయను దెలిసికొన్నది గాదా? అనసూయాదేవి నారదులిచ్చిన యినుప సెనగలను బొరుగులగునట్లు వేచినది కాదా? ఆమెయే బ్రహ్మ విష్ణుమహేశ్వరులనుతనకుబిడ్డలనుగా జేసికొన్నదికాదా? అరుంధతీదేవి యిసుకను నిమిషములో వండినది కాదా? లక్ష్మీదేవి పరమశివుని బట్టుకొన్న బ్రహ్మహత్యను వదలగొట్టినది కాదా? పార్వతీదేవి పరమేశ్వరుని యర్ధాంగమును సంపాదించుకొన్నది గాదా? ఇటువంటి మహాత్వమంతయు వారికి పాతివ్రత్యము వలననే గదా కలిగినది. చూడుము; అరుంధతీదేవి తక్కువ జాతిలో బుట్టినదయ్యును తన పాతివ్రత్యముచేత సప్తర్షిమండలమున వసిష్ఠులవారి దండను నిండుకాంతితో వెలయుచు లోకమునకు కన్నులపండువు చేయుచున్నది. ఒక్క పర్యాయము మునిపత్నులమీది మోహముచేత మిక్కిలి యార్తి జెందిన తన భర్తయగు అగ్నిహోత్రునియొక్క యిష్టాపూర్తి చేయునిమిత్తమయి స్వాహాదేవి తన మాహాత్మ్యమువలన ఆర్గురు ఋషిపత్నులరూపము దాల్చియు, పరమపవిత్రురాలన్న హేతువుచేత నరుంధతీదేవి రూపము మాత్రము ధరించుటకు శంకించినది గాదా? సత్కులప్రసూతయు, సకల సంపన్నయు నయిన అహల్యాదేవి మనోవైకల్యముచేత పాతివ్రత్యమును పాడుచేసుకొన్నందుననే గదా పాషాణమయి పడియుండి చిరకాలము దుఃఖ మనుభవించినది? ఇప్పుడును వివాహసమయములయందు

సన్నికల్లు మిషమున నహల్యను కన్యచేత ద్రొక్కించుటయు, నరుంధతీదేవి నగుపరచి భక్తిపూర్వకముగా మ్రొక్కించుటయు నాడుకగానున్నది కాదా? చక్కగా పాతివ్రత్యము నొక్కటిని గాపాడుకున్నచో బహువిధములయిన యుపవాసాది వ్రతము లక్కరలేదు. పాతివ్రత్యరక్షణ మొక్కటే పడతులకు పరమోత్కృష్ట వ్రతమని ధర్మశాస్త్రములు విధించుచున్నవి. దేవతాచార్యుని భార్యయైన తారాదేవి బుద్ధిమాంద్యముచేత చంద్రునితో వ్యభిచరించినందున గదా శాశ్వతమైన నింద ననుభవించుచున్నది? చేడియలతో గూడి జలక్రీడసలుపుచున్న చిత్రరథుని జూచి భ్రమసినందునగదా రేణుకాదేవి తన పాతివ్రత్యమును భంగము చేసికొని యిసుకతో గుండను చేయలేక తుదకు రట్టువడి పరశురాముని చేత ఖండింపబడినది? ద్రౌపదీదేవిని కర్ణునియందు గన్నిడినందునగదా తపోధనున కుపయోగపడు ఫలమును వృక్షమున కెక్కింపలేక సిగ్గుపడినది? కాబట్టి యత్నపూర్వకముగా పాతివ్రత్యమును రక్షించుకోవలసినది స్త్రీలకు ముఖ్యకర్తవ్యము. మృతులయినవారిని మరల బ్రతికింపవలెనన్నను, హరిహరబ్రహ్మలను రక్షించవలెనన్నను, భూతముల నెల్ల దలక్రిందులుగా జేయవలెనన్నను పతివ్రతల కొక లక్ష్యముగాదు. పాతివ్రత్యము బ్రహ్మనిష్ఠతో సమానమని పెద్దలు పలుకుదురు. సర్వోత్కృష్టమగు బ్రహ్మనిష్ఠ పురుషులకు జిత్తశుద్ధినిగలిగించి, పూజ్యమగు మోక్షసామ్రాజ్యమునను గ్రహించునట్టే పాతివ్రత్యము సతులకు పరమపదము నొసగూర్చును. ఏకపత్నీవ్రతులగువారికి నన్యస్త్రీ సహవాసమెట్లు

విసర్జనీయమో, ఆ ప్రకారమే పతివ్రతలకు సహితము పరపురుషసాంగత్యము సర్వదా వర్జనీయము. ఏకాంతమున నేకాసనమునందు కొమారునితో నైనను గూర్చుండుట కులభామినికి యుక్తముగాదు. ధనికుడయినను, నిర్ధనుడయినను, రూపవంతుడయినను, రూపహీనుడయినను, వివేకియయినను, అవివేకియయినను, రోగియయినను, నిరోగియయినను, మరి యెట్టివాడయినను చేపట్టిన పెనిమిటి విషయమున లేశమయిన పొరపొచ్చెములులేక మిక్కిలి మచ్చిక గలిగి యనువర్తింపవలసినది భార్యకు ముఖ్యధర్మము. భర్త తన కేమిచ్చినను మిక్కిలి సంతోషపడవలెను గాని చాలదని యెప్పుడును దుఃఖపడగూడదు. పతి తెచ్చియిచ్చిన వస్తువులను పదిలముగా దాచి యుంచి మరల నాత డడిగినప్పుడు నిష్కపటముగా నిచ్చివేయవలయును. బలిభిక్ష మెప్పుడును దప్పక పెట్టుచుండవలెను. దేవపితృపూజాకాలములయందు దన పతికి ననవరతము శుభములు గలుగునట్టుగా ప్రార్థింపవలెను. పతి యనుమతిలేక దేవతలనుగాని, పితరులనుగాని, యతిథులనుగాని పూజింపరాదు. పూజించినచో నది సద్గతి నొందనేరదు. ఈవిషయమున పార్వతీదేవి చెప్పిన యితిహాసము చెప్పెదను — పూర్వమొక బ్రాహ్మణున కిద్దరు ముద్దియలు గలరు. వారిలో నొక్కతె తన పెనిమిటి యనుమతి ప్రకార మడకువ గలిగి నడచుకొనుచుండెను. మరియొక్కతె స్వతంత్రతను వహించి తన యిష్టప్రకారము పితృదేవతాతిథిపూజలను జేయుచుండెను. కొంతకాలమునకు పిమ్మట విధివశమున వారు మువ్వురును నొక్కపర్యాయమే

మృతినొందిరి. అప్పుడు పతికి హితముగా నడుచుకొన్న సతి పతిపోయిన సుగతికి బోయెను. బతిసమ్మతికి విరోధముగా నడచుకొన్న రెండవపడతిని యముడు పోగూడదని యాటంక పరచినందున వెనుకనేనిలిచి కన్నుల నీరుపెట్టుకొని యేడువ మొదలుపెట్టెను. అది చూచి అతడు దయార్ద్రహృదయుడయి యామెను గనుకొని "పతికి సమ్మతిలేని ధర్మము సతి చేయ గూడదు. చేసినయెడల దుర్గతికి బాత్రమగును. ఇకమీద నయి నను నీవు బుద్ధిదెచ్చుకొని పతికి హితములగు వానిని జేసినచో నాతనిగతి నొందగల"వని చెప్పగా నామె మరలిపోయెను. కాబట్టి పతికి సమ్మతముగా ననువర్తింపవలసినదే సతికి పరమ ధర్మము. అధర్మవర్తనగల వనితలు ఆసురులని పైశాచులని రాక్షసులని చెప్పబడు మూడుతెగలవారైరని సాధారణముగా వ్యభిచారమునందనవరతమునిష్టము గలిగియుండును. వారిలో నాసురీ వర్గమువారు సదా హృదయమునందు క్రౌర్యముంచుకొని యుండుట' ధనధాన్యములను నాశముచేయుట, భోగములయందు కేవలమనురాగముకలిగియుండుట, అసూయపడుట, మొదలగు దుర్గుణములుకలిగి వర్తింతురు. పైశాచికా వర్గమువారు మనసునందు క్రోధమును సాధించుట, పతిసుతులయందు ద్వేషముకలిగి యుండుట, గృహకృత్య వర్తనముల నేర్పు చాలకుండుట, కలహములయందిచ్ఛగలిగియుండుట మొదలగు దుర్గుణములు కలిగి నడుచుకొనుచుందురు. రాక్షసీవర్గమువారు లేశమయిన సహనము లేకుండుట, యెల్లప్పుడు కల్లలాడుట, విశేషముగా నిద్రపోవుట, సిగ్గులేక యుండుట మొదలగు దుర్గుణములు గలిగి

నడుచుకొనుచుందురు. వీరందరు నిస్సంశయముగా బతివంశము వారిని నరకమునకు బంపి తాము నరకమునకు బోదురు. అట్టి దుష్ప్రవర్తనగల వనితలయినను తుదను తెలివి తెచ్చుకొని పతి భక్తి గలిగి మిక్కిలి యనురక్తితో సత్కృత్యములు చేసి శాంతినివహించి వర్తించుచున్నచో మునుపు చేసిన పాపముల నుండి తొలగిపోయి పురుషునితోగూడ స్వర్గలోకమునకు బోవగలుగుదురు. అట్లు వర్తింపక పోయినను పతుల యవసానకాలమునందయినను ఇతర చింతలేక యనుమరణము సేవ చేసినపక్షమున వారికి పతి సహితముగా సద్గతి సిద్ధించును.

* *

*

# కృష్ణాకుమారి

★

ఈ వీరబాల మేవాడదేశాధిపతి యగు మహారాణా భీమసింహుని కూతురు. ఈమె ౧౭౯౨వ సంవత్సరమున మేవాడదేశపు రాజధాని యగు ఉదేపూరున జన్మించెను. జాతకర్మాదిసంస్కారములు జరిగినపిదప నాబాలకు కృష్ణయని నామకరణముచేసిరి. కృష్ణయందామెజననికధిక ప్రీతి యగుటచే నామెమిక్కిలి గారాబముతో బెరుగుచుండెను. కృష్ణాకుమారి అత్యంత రూపవతిగా నుండెను. ఆమె పెరిగినకొలదిని నామెయందలి యనేక సద్గుణములచే నామె విశేషకీర్తింగనెను. ఇట్లుండగా కొన్ని సంవత్సరముల కాబాల వివాహయోగ్య యయ్యెను. కాన రాణీగారికి గూతు వివాహచింత విశేషమయ్యెను. ఆమెయొక్క యసమాన రూపమును మృదుమధుర భాషణములును నదివరకే దేశమంతటను వ్యాపించెను. కాన జనులామెను రాజస్థానమను కొలనిలో నీమె యపూర్వపద్మమని పొగడుచుండిరి.

ఇట్టి కన్యారత్నము నే వరునకు నియ్యవలయునని భీమరాణా మిగుల విచార సాగరమున మునింగెను. ఆయన కిట్టి చింతగలుగుట కొక కారణముకలదు. ఆకాలమునందా రజపుతస్థానమునంగల రాజులందరిలో ఉదేపురపు రాణాలు శ్రేష్ఠకులీనులుగా నెన్నబడుచుండిరి. తమకంటె నుచ్చవంశీకులకు గన్యనిచ్చిన సరి లేనియెడల రజపూతులలో మిగుల నవమాన

కరముగా నుండును. కాన రాణాగారు సమానవంశీకుని వెదకు
చుండిరి. కాని యట్టి వరునకు విద్యాగుణములు సరిపడవయ్యెను.
విద్యాగుణైశ్వర్యములు కలవరుని వెతకినచో వాడు కులీనుడు
గాకపోవుచుండెను. ఇందువలన కన్య నెవ్వరి కిచ్చుటకును
కొంతవడి నిశ్చయింపనేరక తుదకు మార్వాడదేశపు రాణా
యగు భీమసింహునకు కన్య నియ్యనిశ్చయించెను. కాని ప్రారబ్ధ
వశమున నల్పకాలములోనే మార్వాడ భీమసింహుడు స్వర్గస్థు
డయ్యెను.

తదనంతరము జయపురాధీశ్వరుడగు రాణాజయసిం
హుడు కృష్ణాకుమారిని తనకిమ్మని యడుగుట కొకదూత
నంపెను. ఉదేపురాధీశ్వరుడును అందుకు సమ్మతించి కన్యను
జయసింహున కిత్తునని చెప్పెను. ఇంతలో మార్వాడదేశపు
సింహాసనము నెక్కిన రాణామానసింహుడు భీమసింగున కిట్లు
చెప్పి పంపెను. "ఇదివర కీసింహాసనమున నున్నవానికి కన్య
నిచ్చుటకు నిశ్చయించితిరి. విధివశమున నాతడు కాలధర్మము
నొందెను. అయినను నీకన్య యీ సింహాసనమునకు వాగ్దత్త
యయియున్నది. కాన నాకియ్యవలయును" రాణాభీమసింగుడు
మార్వాడ రాణాదూతతో మీరాజునకు నాకూతు నియ్యనని
స్పష్టముగా దెలియజెప్పి పంపెను. అందువలన మార్వాడ దేశ
మునకును మేవాడదేశమునకును వైరము సంప్రాప్తమాయెను.
ఆ రెండుదేశముల యందు సంగ్రామ సన్నాహములు జరుగు
చుండెను. ఆ సమయమునందు గ్వాలేరురాజగు సిందేజయపు
రాధీశ్వరునిపై మిగుల వైరము కలవాడయి భీమసింగున కిట్లు

వర్తమానము నంపెను. "కృష్ణాకుమారిని జయపురపురాణా కిచ్చిన యెడల నేను మానసింహునకు దోడుపోయి నీతో యుద్ధము చేయుదును" ఈవార్తవిన్నంతమాత్రమున భీమసింహుడు తన నిశ్చయమును మరల్పకుండెను. తన మాటను ఉదేపూరు రాణా లక్ష్యపెట్టకుండుట గని సిందే మిగుల కోపించి యుద్ధసన్నాహముతో బయలుదేరి యుదయపురమును సమీపించెను. సిందే ఉదయపుర ప్రాంతమున విడిసినపిదప కొన్నిదినములకు భీమసింగుడును సిందేయును నొక దేవాలయములో గలిసి యేమో యాలోచించి జయసింహునకు గన్యనియ్యనని భీమసింగు వర్తమానము నంపెను. జయపురాధిపతి తనయాసలన్నియు నిరాశలలగుటవలన మిగుల కోపగించి మానసింహునితో యుద్ధము చేయుటకై సైన్యము సిద్ధపరుప నాజ్ఞాపించెను. మానసింహుడును యుద్ధమునకు కాలుద్రువ్వుచునే యుండెను. అతని శత్రువులు కొందరు లక్షయిరువదివేల సైన్యము పోగుచేసి జయసింహునకు సహాయులయిరి. అప్పుడారాజుల కిరువురకును పర్వతశిఖర మనుస్థలమున ఘోరసంగ్రామము జరిగెను. ఆ యుద్ధమునందు మానసింహుని సైనికులనేకులు జయసింహునితో గలియుటవలన మానసింహుడు యుద్ధమునుండి పలాయితుడయ్యెను. ఇట్లు పారిపోయి యాతడు యోధగడయను దుర్గములో దాగియుండెను. జయసింహునిసేన యోధగడను ముట్టడించి భేదింప దొడగెను. కాని యాదుర్గ మభేద్య మగుటచే వారు దానిని భేదింప నేరక మరలిపోయిరి. ఈయుద్ధమునందు జయసింహుని సైన్యము మిగుల నాశమొందెను. కాన

జయపురాధీశ్వరుడు తనపురమునకు బారిపోయెను. మానసింహుని శత్రుడయిన రాజొకడు తనసైన్యములోని నవాబుఅమీర్ ఖానను మ్లేచ్ఛునిచే చంపబడెను. ఈవిశ్వాసఘాతకుడగు తురుష్కుడే పిదప ననేకయుక్తులచే నుదేపూరు రాణాకుముఖ్య స్నేహితుడయి అజితసింహుడను నాతనిని కృష్ణాకుమారి తండ్రి కడ సేవకునిగా నుంచెను.

ఇంత సంగ్రామమయినను జయసింహ మానసింహుల కింకను యుద్ధమునందలి యిచ్ఛ తగ్గదయ్యెను. అందువలన వా రిరువురును దళములతోడ ఉదేపురమునకు వచ్చుచుండిరి. కాన నాసంగతివిని భీమసింహ రాణా మిగుల చింతతో నా యుభయులను సమాధాన పరచు నుపాయము విచారింపు చుండెను. ఆయన కేమియు దోచక అమీర్ ఖాను నేకాంత ముగా బిలిచి యాలోచనయడిగెను. అప్పుడా దుష్టుడు కృష్ణా కుమారిని మానసింహున కిచ్చుటొండె, చంపుటయొండె యుత్తమమని చెప్పెను. అంతలో కృష్ణాకుమారిని చంపుటయే యుత్తమమని రాజునకు దోచెను. కాని యాపని చేయుట కాతని సేవకులలో నొకడును నొడంబడడయ్యెను. భీమ సింగుడు ఒక సేవకునిం బిలిచి కొమారెను జంప నాజ్ఞా పించెను. అందు కాభృత్యుడు ప్రభువును తిరస్కరించి తానట్టి పనిని చేయనని నిశ్చయముగా జెప్పెను. తదనంతరము రాణా గారు యావనసింహుండను వానింబిలిచి యీ ఘోరకర్మ చేయుమని చెప్పెను. ఈ యావనసింహుం డట్టి కార్యము చేయుటకు దనకిష్టము లేకున్నను రాజాజ్ఞకు వెరచి దాని

కియ్యకొనెను. అంత నాతఁడు చేత ఖడ్గము ధరియించి యా కన్య నిద్రించు గృహమునకు జనెను. కాని యా నిద్రించు సౌందర్యరాశినిం గనినంతనే యాతని చేతులాడక ఖడ్గము చేతినుండి జారి క్రిందబడ నాతఁడా కార్యమును మాని మిగుల దుఃఖముతో మరలిపోయెను. తనుపరి అమీర్ ఖాను దుర్మంత్రము వెల్లడి కాగా రాజసతి దుఃఖమునకు మితము లేదయ్యెను.

రాజభవనమునం దంతటను దుఃఖమయముగా నున్నను కృష్ణాకుమారి ముఖమునం దెంతమాత్రమును మృత్యుభీతి కానరాదయ్యెను. ఆమె యెప్పటివలె సంతోషముగా నాడుచు పాడుచు చెలులకు నీతులను బోధింపుచు గాలము గడుపుచుండెను. నీ కూతును విషప్రయోగమువలన జంపుమని రాణాగారికి అమీర్ ఖా నాలోచన చెప్పెను. అట్టి నీచ కృత్యము రాణాగారికి సమ్మతమగుటవలన నొక బంగారు గిన్నెలో విషముపోసి దాని నాయన బిడ్డకడకంపెను. దానిని కృష్ణాకుమారి సన్నిధికి దెచ్చిన సేవకుఁడు విషము మీ తండ్రి మీకొఱకు బంపెను గాన దీనిని మీరు స్వీకరింపవలయునని చెప్పగా నాబాల తండ్రియాజ్ఞ శిరసావహించి యా విషపాత్ర నా భృత్యుని చేతినుండి తీసికొని పరమేశ్వరుని బ్రార్థించి తండ్రికి ధనాయుష్య సమృద్ధియగుంగాత యనియా విషము నామె త్రాగెను. విషప్రాశనానంతరమునందు సహితమామె మరణభయము నొందక తన యిష్టదైవమును బ్రార్థింపుచుండెను. ఇంతలో నామెతల్లి శోకించుట విని యాబాల

తల్లికిట్లు సమాధానము చెప్పెను. "అమ్మా! నీవేల శోకించెదవు? దుఃఖమెంత త్వరగా దగ్గిన నంత మంచిది. నేను క్షత్రియవీరుని బిడ్డనుగాన మరణమునకు వెఱవను. ఈ శరీరము పుట్టినప్పుడే చావు సిద్ధము. ఇక నా చావునకై వగచిన నేమి ఫలము." ఇట్టి వాక్యములచే దల్లికి సమాధానము చెప్పుచు నవ్వుచు నుండెనేకాని యాబాల యా విషముచే మృతిజెందదయ్యె. అంత రెండవభృత్యుడు మరియొక పాత్రలో విషము పోసికొనివచ్చి యామెచే త్రాగించెను. కాని యందువలనను ఆమె మరణచిహ్నము కానరాదయ్యెను.

దాన నామె చావనందుకు సమరసమను నొక భయంకరమయిన విషమంపెను. దానిని త్రాగినవెంటనే యా కన్యారత్నముయొక్క పవిత్రచరితము ముగిసెను. కృష్ణకుమారి ధైర్యము, నిర్భయత్వము, సత్యశీలతయు, దేశముకొరకు దండ్రికొరకు జూపిన యాత్మత్యాగమును మొదలగునవి యీ ప్రపంచమునందుండి యా నారిని నజరామరము చేయుచున్నవి.

# నాచి

★

ఈ విద్వాంసురాలు ఏలేశ్వరోపాధ్యాయుల రెండవ కూతురు. ఏలేశ్వరోపాధ్యాయులు ఆంధ్ర బ్రాహ్మణుడు; మిక్కిలి విద్వాంసుడు; ఈయన నివాసస్థలము ఏలేశ్వర పురము. ఈ ఏలేశ్వరపురము శ్రీశైలమునకు బశ్చిమమున నుండును. ఈయన విద్యార్థులకు జెప్పు సంస్కృతము నిత్యమును విని ఈతని యింటివారందరును సంస్కృత మతి స్వచ్ఛముగా మాటాడుచుండిరట. ఈయనయే మన ఆంధ్రదేశమునందంతటను నాడుల భేద మేర్పరచి యాయా నాడులలోనే వివాహాదికము లగునటుల నిబంధన జేసెనని చెప్పెదరు. ఆ విభాగంబులు నేటివరకును మన దేశమున బ్రచారములో నున్నవి. ఈయనకు బుత్రసంతతి లేదు. ముగ్గురు బిడ్డలుమాత్ర ముండిరి.

ఏలేశ్వరోపాధ్యాయులు శా. శకము యొక్క ౭ వ శతాబ్దమునందుండినట్లు తెలియుచున్నది. కాన నాచి సహిత మా శతాబ్దములోనిదనియే యూహింపవలసియున్నది. ఈమె యాంధ్రబ్రాహ్మణ స్త్రీయైనను నీమె చరితమున కాంధ్ర దేశమునం దెచటను సాధనములు దొరకకపోవుట కెంతయు వ్యసనపడుచు మహారాష్ట్రమునందు దొరకిన యాధారము వలన నీమె యల్పచరితము వ్రాయవలసినదాననైతిని. ఈమె బాలవితంతువు కాన తండ్రి ఈమెకా దుఃఖము తెలియకుండుటకై ఈమెను విద్వాంసురాలినిగా జేయదలచెను. అటుల

దలచి ఏతేశ్వరోపాధ్యాయులవా రామెకు విద్య నేర్ప మొదలు పెట్టిరి. కాని విద్య త్వరగా రాకుండినందుల కామె మిగుల చింతించి విద్యార్థులకు బుద్ధివైభవము కలుగుటకై తండ్రి చేసియుంచిన జ్యోతిష్మతియను తైలము నెవ్వరికిని జెప్పక త్రాగెను. అందువలన నామెకు దేహతాప మతిశయిల్ల నింటిలో నుండిన బావిలో దుమికెను. తదనంతరమున నింటిలోనివా రామెను వెదకి యెందును గానక తుదకు బావిలో చూచిరి. అప్పటికామె తాపము కొంత చల్లారినందున నామెకు దెలివి వచ్చి వారికి దన వృత్తాంతము నంతను జెప్పెను. అదివిని తండ్రి యామె నా బావిలో మరికొన్ని గడియలుంచి బైటికి దీసెను. నాడు మొదలామెకు విషక్ష్మైన తెలివియు జ్ఞాపక శక్తియు గలిగినందున నాచి తండ్రియొద్దగల సంస్కృత విద్య నంతను నేర్చెను.

విద్యావతి యైనపిదప నీమెకు తీర్థయాత్రలు చేయ వలయునని బుద్ధి పొడమగా దండ్రి యందున కంగీకరించి యామెను యాత్రలకంపెను. నాచియు దీర్థాటనమును జక్కగా జేసికొని వచ్చుచుండెను. అప్పుడు కాశీ మొదలగు స్థలముల యందీమెకు పండితులతో వాదముచేయుట సంభవించెను. అప్పుడా విద్యావతి వారి నోడించి మిగుల మెప్పుగాంచెను. ఇదిగాక యా పండిత ఢిల్లీ యాగ్రా మొదలగు స్థలములకరిగి రాజసభలయందు విద్వాంసులతో వాదముచేసి గెలిచి విశేష బహుమతులందెను. ఆమె యా కానుక లన్నియు దీసికొని వచ్చి తండ్రికి జూపి యతనికి దన యాత్రా వృత్తాంతమంతయు

వినిపించెను. బ్రాహ్మణుడు కౌమారికుంగల వైధవ్యదుఃఖము నంతను మరచి తన కూతును పుత్రునిగా నెంచి యామె యిట్టి విద్యాసంపన్న యగుటకు మిగుల సంతోషించెను. ఈమె తన చరితము ననుసరించి నాచి నాటకమను నొక నాటకమును సంస్కృతమున రచియించెను. ఈమె విద్యాసంపదలచే మిక్కిలి వైభవము గాంచినందున ఏలేశ్వరోపాధ్యాయులకు బుత్రులు లేని కొరత తెలియకుండెను.

# సరసవాణి

ఈ పండిత తన భర్తయగు మండన మిశ్రుడు శంకరాచార్యులవారితో వాదముచేసి యోడిపోగా దానాచార్యులతో వాదించెను. ఈమెకుగల యసమాన పాండిత్యమును సౌందర్యమును గని లోకు లీమెను సరస్వతి యవతారమని తలచిరి. అందువలన వారామెను ఉభయభారతి యని పిలుచుచుండిరి. ఈమె యాదిశంకరుల వారితో సమాకాలీను రాలయినందువలన శంకరులవారి కాలనిర్ణయమే ఈమెకాలనిర్ణయమని వేరుగ జెప్పనక్కర లేదు. ఆది శంకరులవారు క్రీ.శ. ౨వ శతాబ్దమునందుండిరని కొందరును, ౭వ శతాబ్దమునందుండిరని కొందరును ౮వ శతాబ్దమునందుండిరని కొందరును జెప్పుచున్నారు. కాని కొన్ని యాధారములవలన నాదిశంకరులవారు క్రీ. శ. ౭వ శతాబ్దాంతమునను ౮వ శతాబ్దాదిని నుండినట్లు పండితు లనేకులు నిర్ణయించియున్నారు.

శోణనది తీరమునందుండు విష్ణుశర్మయను బ్రాహ్మణునకు సరసవాణి యొక్కతయె కూతురు. అందువలన నతడామెను కడు గారాబముతో బెంచుచుండెను. తల్లిదండ్రులామెకు సకలవిద్యలను నేర్పిరి. సాంఖ్య, పాతంజల, వైశేషిక న్యాయ మీమాంసా, వేదాంతములనెడి యారు శాస్త్రములును, వ్యాకరణాది షడంగములును, కావ్యనాటకములును ఇతరవిద్యలన్నియు నామె నేర్చెను. ఇందువలన లోకులామెను గని యద్భుతపడుచుండిరి.

ఇట్లు విద్యాగుణ సంపన్నయగు నా చిన్నది వివాహ యోగ్యయయ్యెను. అప్పుడామె గుణవంతుడును, సురూప వంతుడును నగు విశ్వరూపాపరనామము గల మండనమిశ్రుని ఖ్యాతిని బ్రాహ్మణులవలన వినెను. మండన మిశ్రుడును సరసవాణియొక్క సద్గుణములు వినెను. అందువలనవారికి నుభయులకును నొకరి నొకరు చూడవలయునని యభిలాష జనించెను. కాని వారు తమతండ్రుల కాసంగతి దెలుపుటకు సిగ్గుపడి తమలో దామే కృశింపుచుండిరి.

ఇట్లు కొన్ని దినములు గడచినపిదప తమపిల్ల లిట్లు కృశించుట కేమికారణమోయని వారి జననీజనకులు చింతించి యొకదినమునందు దాని కారణమును చెప్పక తప్పదని వారిని వారితండ్రులు బలవంత పరుపగా వారు నిజమయిన కారణమును దెల్పినవారైరి.

అందుపై హిమమిత్రుడు సరసవాణి తండ్రియొద్దికి కన్యకను విచారించుటకు బ్రాహ్మణుల నంపెను. వారికి విష్ణుశర్మ తగిన మర్యాదలుచేసి యాగమన కారణమడుగగా వారును తాము వచ్చినసంగతి నతని కెరిగించి పిల్లను మండనున కిమ్మని యడిగిరి. అందున కతడు తనభార్య నడిగి నిశ్చయించి చెప్పెదనని వారితో జెప్పి యూమెనడుగగా నాయువతి యిట్లనియె.

"ధనము, కులము, శీలముగల వానికి బిల్ల నియ్యవలెనని శాస్త్రములయందును, వ్యవహారమునందును ప్రసిద్ధియే కదా ? ఈ పిల్లడు దూరమున నుండువాడు. ఇతనికులశీలములు మనకు దెలియవు. కనుక నిందునగురించి యేమి చెప్పగలను"

అంతట నతడు మండనమిశ్రుని విద్యాప్రభావమును బొగడి ధనముకన్నను విద్యయే శ్రేష్ఠమని చెప్పెను. అంత నా దంపతు లిరువురును కొమార్తె కా సంగతిని దెలిపి యామె మనోభావము నెరుగ దలచి యామె సన్నిధికరిగి యా సంగతి నెరుక పరచి నీ యభిప్రాయ మేమని యడిగిరి. వారావార్త చెప్పిన తోడనే యా బాల కపరిమిత సంతోషము కలిగి యా సంతోషమున కామె మనసునం దిముడుటకు చోటుచాలక రోమాంచ రూపమున బయటబడెను. దానివలననే యామె యభిప్రాయమును వారెరిగి యావచ్చిన బ్రాహ్మణులకు దోడు తా మొక బ్రాహ్మణుని వరుని జూచుటకును, లగ్నము నిశ్చయము చేయుటకును బంపిరి. నాటికి బదునాల్గవ దినసంబున దశమినాడు శుభచంద్రయుక్తమైన సుముహూర్తమని వ్రాసి గణితమునందు ప్రవీణయైన సరసవాణి తమ బ్రాహ్మణుని చేతికిచ్చెను.

అంత నా బ్రాహ్మణులు మువ్వురు కొన్నిదినములకు మండనుని గ్రామమునుండి యతని తండ్రికి శుభలేఖ నందిచ్చిరి. ఆయన దాని జదివికొని సంతసించి శుభదినమునందు బంధువర్గముతో దర్లిపోయి కొమారుని వివాహము చేసెను.

కూతు రత్తవారింటికరుగునపుడు సరసవాణి తల్లిదండ్రు లామె కిట్లు బోధించిరి. "ప్రియకుమారీ! నేటినుండియు నీకు నపూర్వమైనదశ ప్రాప్తమయినది. ఈ సుస్థితికి యోగ్యమైనటుల నీవు ప్రవర్తింపుము. బాల్యమునందలి క్రీడలు విడువుము. ఏలయనగా అట్టి నీయాటలు మాకు సంతోషజనకము

లైనటుల నితరులకు గానేరవు. స్త్రీలు వివాహమున కన్న బూర్వము తల్లిదండ్రుల యాజ్ఞలో నుండవలయును. తదనంతరము వారికి బతియేగతి. కనుక నీవు పతియాజ్ఞలోనుండుము. ఇందువలననీకు నుభయ లోకములలో గీర్తి గలుగును. పతి కంటెను మొదట లేచి స్నానము చేయుము. అతడు భోజనము చేయనిది భోజనము చేయకుము. పతి గ్రామాంతరము వెళ్ళిన యెడల అలంకారములను ధరియింపకుము. ఇటుల నరుంధత్యాది పతివ్రతలు నడిచినటుల నడుచుటయే నీకు భూషణము. పతి కోపగించినయెడల మారుమాటాడకుము. ఆయన కోపమునంతను నోర్చుకొనుము. ఇటుల జేసిన నతడు నీపై గోపమును వదలి ప్రేమింపగలడు. శాంతితో సాటి యేదియును లేదుసుమా. పతి యింట లేకుండినప్పుడు నతిథులెవరయిన వచ్చినయెడల వారిని దిన్నగా సన్మానించి యాదరించి పంపవలయును. అటుల జేయనిపక్షమున వారిలో నెవరయిన మహాత్ము లుండినయెడల గులదాహమగును. అత్తమామలను తల్లిదండ్రులవలె జూడుము. బావమరదులను నన్నదమ్ములవలె జూడుము. వీరికి గోపము వచ్చినయెడల నీకును నీభర్తకును నెంత యన్యోన్యప్రేమ ముండినను మీలో భేదము పుట్టింతురు.”

ఇట్లు వారు కూతునకు బుద్ధులుగరపి యామె నత్తవారియింటి కనిపిరి. ఆ భార్యాభర్తలు తమనగరమునకు నరిగి గృహస్థాశ్రమమును జక్కగా నడుపుచుండిరి. ఇట్లు కొన్ని సంవత్సరములు గడచినపిదప నీదంపతుల విద్యాప్రావీణ్యము

లోకమంతటను వెల్లడియైనందున శంకరులవారు వీరితో వాదించి గెలుపొంద నెంచి యాగ్రామమునకు వచ్చి నీళ్లు గొనిపోవు చున్న యువతులను మండనమిశ్రునిగృహ మెచటనని యడుగ గా వారిట్లు చెప్పిరి:-

"ఎవని ద్వారమునందు బంజరమున నుంచబడిన ఆడు చిలుక వేదము స్వతః ప్రమాణమా పరతః ప్రమాణమా యని చర్చించుచుండునో యాగృహమే మండనమిశ్రుని దని తెలిసికొనుము."

"పూర్వకృత కర్మవలన, మన మిప్పుడు చేయుకార్య మునకు, ఫలము కలుగునా లేక పురుషప్రయత్నమువలన ఫలము కలుగునా యని యేద్వారములో బాజరస్థలయిన శుక యువతులు వాదించుచుండునో యదేగృహము మండనపండితు నిది యను కొనుము."

"జగత్తు నిత్యమా యనిత్యమా యని యాడరామచిలుక ఏగృహముయొక్క సింహద్వారమునబాజరమందు ముచ్చటించు చుండునో యాగృహమే మండనునిది యనుకొనుము."

వారట్లు చెప్పగా శంకరులవారచటి కరిగి మండనునిచే వాదభిక్ష గొనిరి. తరువాత సమస్తవిద్యాశారద యయిన సరస వాణిని సభకు నధిపతినిగా నేర్పరచి వారు వాదవివాదము నకు నుద్యుక్తులయిరి.

ఇట్లు కొన్ని దినములు వాదము జరిగినపిదప మండనుడు వాదమునందోడుట తటస్థ మయ్యెను. అప్పు డాతని నను్గ్ర

హించి శంకరు లతనికి సన్యాస మియ్యదలపగా సరసవాణి శంకరులతో నిట్లనియె.

"ఓయతిశ్రేష్ఠ! నీయుద్దేశము నాకు దెలిసినది. నీవు నాపతిని గెలిచితివిగాన నతనిని నీశిష్యునిగా బరిగ్రహించుట యుక్తమే. కాని నీవింకను నాతనిని సంపూర్ణముగా నోడించ లేదు. అతని యర్థశరీరిణినగు నన్ను గెలిచినగదా మీగెలుపు పూర్ణమగును. మీరు గొప్పపురుషు లయినప్పటికిని మీతో వాదము చేయవలయునని నాకు చాల నుత్కంఠ యున్నది."

శంకరులు—"వాదవివాదమునం దుత్కంఠ గలదని నీవు చెప్పితివి కాని నీతో వాదము కానేరదు, గొప్పవారు స్త్రీలతో వాదము చేయరు."

సరసవాణి—"స్వమతమును స్థాపింప దలచువారు తమ మతమును ఖండించువారు పురుషులయినను, స్త్రీలయినను వారితో వాదము చేసి వారిని పరాజితులను చేయుట యత్యంతావశ్యకము. ఇందువలననే పూర్వము యాజ్ఞవల్క్యులవారు గార్గితోను, జనకుదు అబలయైన సులభతోను వాదముసల్పిరి. వారు యశోనిధులు కాకపోయిరా?"

ఇట్లుసరసవాణి చెప్పిన యుక్తివాదమువలనను, పూర్వోదాహరణములవలనను కుంఠితులయి శంకరులవారు సభయందు నామెతో వాదము చేయుట కొప్పుకొనిరి.

పరస్పర జయోత్సుకు లయినట్టియు తమబుద్ధిచాతుర్యము వలనను రచియించిన శబ్దమనెడి యమృతముచే విను

వారిని విస్మయ మొందించునట్టియు నా సరసవాణి శంకరులకు నత్యద్భుతముగా వాదము జరిగెను.

ఇట్లహోరాత్రములు పదియేడుదినములవరకునుఅసమానవిద్యావంతులగు సరసవాణీ శంకరులకు ఘోరమయినవాదము జరిగి తుదకు సరసవాణి యడిగిన ప్రశ్న కు త్తరము చెప్పజాలక శంకరు లామెను నారు నెలల వ్యవధి యడిగిపోయి మరికొంత విద్య నభ్యసించి మరలవచ్చి యామెకు సమాధానముచెప్పెను. అందుపై మండనమిశ్రుడు సన్యసింపగా సరసవాణి దివి కరిగెను.

ఈ సరసవాణి చరిత్రమువలన నామె కాలమునందలి హిందూసుందరులు గొప్ప విద్య నభ్యసింపుచుండి రనియును, వారు గొప్ప పండితులతో సహితము వాదవివాదములు చేయు చుండిరనియును దెలియబడుచున్నది. ఆ కాలమునందు నోరెరుగని పసిపాపలకు దల్లిదండ్రులు తమసమ్మతితో వివాహములు చేయు నాచారములేక కన్యావరులు యుక్తవయస్కు లయిన పిదప వారియనుమతి ననుసరించియే వివాహములు జరుగు చుండె ననియును స్పష్టముగా దెలియుచున్నది. అప్పటి సంఘస్థితినిబట్టి చూడగా నప్పటి స్త్రీ లత్యంతోచ్ఛదశయం దుండి నట్లు తేలుచున్నది. కాని ఆకాలమునం దట్టి యుచ్చపదవియందుండిన హిందూసుందరులు ప్రస్తుత మత్యంత హీనస్థితికివచ్చి తమ దుర్దశనే తెలిసికోజాలనంతటి యజ్ఞానిను లగుట మిగుల దుఃఖకరము. పూర్వకాలము నందలి స్త్రీలకును, ఈ కాలపు స్త్రీలకును గల తారతమ్యము సతీహితబోధినీ పత్రికో క్తముగా నిం దుదాహరించి యీచరితము ముగించెదను.

"ఈ భరతఖండమునం దిప్పుడున్న స్త్రీలస్థితికి పూర్వకాలమునం దుండిన స్త్రీలస్థితికిని మిక్కిలి వ్యత్యాసము గలదు. పూర్వకాలమునందలి సుందరులు విద్యలయందును, కళలయందును, పాండిత్యము కలవారయి పురుషులకుపదేశముచేయ దగినంత మంచిదశయందుగూడ నుండుచువచ్చిరి. వేదమునందు వర్ణింపబడిన గార్గి, మైత్రేయిమొదలయినవారినే యిందుకు నిదర్శనముగా జెప్పవచ్చును; ఆ కాలమునందలి స్త్రీలు వేద వేదార్థము లెరిగినవారని చూపుటకు శకుంతల మొదలయిన వారిని దృష్టాంతముగా గొనవచ్చును: యజ్ఞాదులయందును, వివాహాదులయందును స్త్రీలు పఠింపవలసిన మంత్రము లుండుటయె మన పూర్వులు స్త్రీలు భాషాపాండిత్యము కలవారయి మంత్రార్థముల నెరిగియుండవలెనని యుద్దేశించినట్లు స్పష్టముగుచున్నది. ఆకాలమునందు స్త్రీలు పురుషులవలెనే గౌరవింపబడుచుండిరిగాని యిప్పటివలె గదులలో మూసిపెట్టబడుచుండలేదు. వారికట్టి స్వాతంత్ర్యములు పూర్వకాలమునందు గలిగియున్నవని చూపుటకు సీత మొదలగు క్షత్రియస్త్రీలు సహితము భర్తలతో వచ్చి సభలలో సింహాసనములమీద గూరుచుండుచు వచ్చిన వార్తను సూచించుటకంటె విశేష మేమియు జెప్పనక్కరలేదు. ఇవియవి యని వేరుగ జెప్పనేల? ఆకాలమునందలి స్త్రీలకుండవలసిన స్వాతంత్ర్యములనన్నిటిని వారు గలిగియుండిరనుటకు సందేహములేదు. వారికప్పుడున్న విద్యాప్రభావమునుబట్టి వారట్టి గౌరవములకును స్వాతంత్ర్యములకును నర్హురాండ్రయి యుండిరి. మన పూర్వులు గృహిణీ

ధర్మములను వివరించుచు భర్తకు భార్య మంత్రివలె నాలోచన చెప్పవలెననియు, తల్లివలె నుపచారము చేయవలెననియు, గురువువలె హితోపదేశము చేయవలెననియు, వైద్యునివలె శరీరారోగ్యమును కాపాడవలయుననియు చెప్పియున్నారు.

ఇటువంటి పనులను యుక్తముగా నిర్వహింప గలుగుటకు స్త్రీలెంతటి విద్యావతులుగా నుండవలయునో చెప్పుటకంటె నెవరికి వారూహించుకొనుటయే సులభముగా నుండును. జ్ఞానమూలమయిన విద్యానిక్షేపమే హేతువుచేతనో క్రమక్రమముగా మనదేశపు స్త్రీలను విడిచిపోయినది. ఆ విద్యాధనముతోనే వారికిగల సమస్తలాభములును, సమస్త స్వాతంత్ర్యములును క్రమక్రమముగా నశించుచు వచ్చినవి. కడపట స్త్రీలకు విద్య కావలయునా యని సంశయపడునంత దురవస్థ మనదేశమున కిప్పుడు పట్టినది. స్త్రీలు విద్యాహీనురాండ్రగుటచే మూఢత్వములో మునిగియుండి సంసార భారమును చక్కగా నిర్వహించుటలో మునుపటివలె పురుషులకు సహాయురాండ్రు కాజాలకున్నారు. అందుచేత పురుషులకు స్త్రీలయందు పూర్వకాలమునందుండెడు గౌరవమంతయు తగ్గిపోయినది. ఏవిషయమునందయినను స్త్రీల నాలోచన యడుగుటయే యనర్థదాయకమని సామాన్యముగా పురుషులిప్పుడు భావించుచున్నారు. అందుచేత పురుషులనేకులు స్త్రీలయొక్క యభిప్రాయముగాని అంగీకారముగాని పొందకయే వారి వివాహమను మిషమీద నంగహీనులకును, వృద్ధులకునుగూడ గట్టిపెట్టుచున్నారు. మానవదేహమున కలంకారమయిన

విద్యాభూషణము వారికి లేకుండ జేసి లోహపు నగలను మాత్రము పెట్టి తమ వేడుక నిమిత్తమయి వారిని తోలు బొమ్మలవలె చేయుచున్నారు. వారిని గృహయజమానురాండ్రగా జూడక తమ యుపచారము నిమిత్తమయి దాసులనుగా జేయుచున్నారు. పురుషులు స్త్రీలవిషయమున జేసిన యిట్టి యన్యాయమువలన స్త్రీలను మూఢురాండ్రనుగా జేసి చెడగొట్టుటయే కాక తామును వారి తోడిపాటుగా మూఢశిరోమణులయి చెడిపోవుచున్నారు. అందుచేత పురుషులలో గూడ నిజమయిన ఈశ్వరభక్తియు సద్వర్తనమును బోయి మూఢభక్తియు, నీతిరాహిత్యమును వర్ధిల్లుచున్నవి. దానిని బట్టి నిజమయిన సౌఖ్యమును సంతోషమును లేక యనేకులకు భూతలస్వర్గముగా నుండవలసిన గృహము మహారణ్యమువలె నగుచున్నది. ఏయింట జూచినను నైకమత్యమునకు మారుగా కలహములును, మనస్తాపములును పెరుగుచున్నవి. ఈ స్థితి యంతయు పురుషుల లోపమువలనను స్వప్రయోజనపరత్వము వలనను గలుగుచున్నదే కాని స్త్రీల దోషమువలన నణుమాత్రము గాదు. ఏకాలమునందును ఏదేశమునందును తమ స్త్రీలను మంచిదశకు తీసికొనిరాక తాము బాగుపడిన పురుషులు లేరు. తాము బాగుపడదలచిన పక్షమున ముందుగా తమ స్త్రీలను బాగుచేయవలెను. స్త్రీలబాగే పురుషుల బాగు; స్త్రీలయోగే పురుషులయోగు. కాబట్టి పురుషులు తమ యోగక్షేమాభివృద్ధి నిమిత్తమే మూఢురాండ్రయిన యిప్పటి స్త్రీలను తొంటి యుత్తమదశకు మరల దీసికొని

వచ్చుటకై ప్రయత్నింపవలెను. స్త్రీల యభివృద్ధి నిమిత్తమయి యెక్కడెక్కడను తమపురుషులు చేయు ప్రయత్నములకు మూఢతా పిశాచావేశముచేత స్త్రీలే ప్రతిబంధకారిణులగుచున్నారు. ఇంటివద్ద స్త్రీల సహాయమున్నగాని కులాచార మతాచార విషయములయందు పూర్వాచారములకు విరుద్ధములైన నూతన సదాచారములను నెలకొలుపుట పురుషులకు సాధ్యముకాదు. కాబట్టి పురుషులు తమస్త్రీలను మూఢదశయందుంచియే దేశమున కేమో మహోపకారమును చేయుదుమన్న దురహంకారము విడిచి వారి తోడ్పాటును బొందియే సత్కార్యములను జేయ జూడవలెను. స్త్రీల సహాయమున్నప్పుడే పురుషులకు విజయముగలిగి లోకమునకు సత్యమైన యుపకారము కలుగును. సద్విషయములలో స్త్రీల తోడ్పాటును పొందదలచిన పక్షమున ముందుగా వారి నాశ్రయించియున్న మూఢతాపిశాచము తొలగునట్లుగా వారిని విద్యావతులనుగాను, వివేకురాండ్రనుగాను జేసి మనకు సరియైన తోడ్పాటు చేయుటకు వారిని శక్తురాండ్రను జేయవలెను."

# చాందబీబీ

ఈ శూరవనితకు నిజామ్‌శాహిలో మూడవపురుషుడగు హుసేన్ నిజామ్‌శహా తండ్రి. ఆదిల్‌శాహిలో నాల్గవపురుషుడగు అల్లీ ఆదిల్‌శహా భర్త. వీరిరువురికిని పరస్పరకలహములు కలిగియుండెను. కాని అహమ్మదనగరు బిజాపూరు, గోలకొండలకు ప్రభువులయిన తురకషహాలు కూడి విజయనగరముపై దండు వెడలుటకు నిశ్చయించుకొనిన కాలములో, అహమ్మదునగరమునకు నధిపతియయిన హుసేన్‌షహా, విజాపురమున కధిపుడయిన అల్లీషహాతో సఖ్యము చేయదలచి తన కూతురగు చాందబీబీని నతనికిచ్చి వివాహముచేసెను. తదనంతరము తెలికోటలో క్రీ. శ. ౧౫౬౫వ సంవత్సరమునందీ మహమ్మదీయులకును విజయనగరాధీశ్వరుడగు రామరాజునకును యుద్ధముజరిగి విజయనగర సంస్థాన మడుగంటెనను సంగతి హిందూదేశ చరిత్రము చదివినవారి కందరకును విదితమే గాని స్త్రీచదువరులకు నీ శాహీలసంగతి దిన్నగా దెలిసికొనినంగాని ప్రస్తుత చరితము బోధపడదు గాన వాని వివరము నిందు గొంత సంగ్రహముగా దెల్పెద.

క్రీ. శ. ౧౫౩౬-వ సంవత్సరమున *బ్రాహ్మణీరాజ్య

---

* ఢిల్లీలో గంగూయను బ్రాహ్మణుడు జఫీర్‌ఖానను తురకపిల్లవానిని బాల్యమున గొని పెంచి యింటిపని జేయుటకయి యుంచుకొనెను. పిదప నా చిన్నవాని బుద్ధివైభవము గని యాతని యజమానుడు ద్రవ్య మక్కర లేకయే యాతనిని దాస్యమునుండి విడిచెను. తదనంతర మా పిల్లవాడు దక్షిణమున రాజ్యము స్థాపించెను. అప్పుడతడు తన యజమానునియెడ కృతజ్ఞుడయి జఫీర్‌ఖాన్ గంగూ బ్రాహ్మణీ యని తన పేరు పెట్టుకొనెను. ఆతనిరాజ్యమే బ్రాహ్మణీరాజ్యమనం బరగెను.

మును తురకరాజ్య మంత్ర్య దశకు వచ్చెను. అప్పుడు దక్షిణమున నయిదుగురు తురుష్కులు స్వతంత్రులయిరి. వారిలో విజాపురమునందు రాజ్యము చేయువారిని 'ఆదిల్ షహా'లనియు, గోలకొండ యందలి రాజుల వంశమును 'కుదుబ్ షహా' లనియును, వర్హాడ (బీరారు) రాజులను 'ఇమాద్ షహా' లనియు, అహమ్మదనగర ప్రభుత్వము వారిని 'నిజామ్‌షహా'లనియు, అహమదాబాదునందలి వారిని 'బరీద్ షహా' లనియు వాడుచుండిరి. కాని కొన్ని రోజులైన పిదప 'ఇమాద్ శాహి' 'బరీద్ శాహీ'లు రెండును నాశనము నొంది 'ఆదిల్ శాహీ', 'నిజామ్ శాహీ', 'కుతుబ్ శాహీ'లు మూడును మాత్రము నిలిచెను. శాహి యనగా రాజ్యమనియు, షహా యనగా రాజనియు నర్థము.

భర్త జీవితకాలమునందు చాందబీబీయొక్క చాతుర్యమంతగా దెలియకుండెను. ఈమె భర్తయగు అల్లీ మిగుల భోగముల ననుభవింపుచు రాజ్యమునం దెంతమాత్రము దృష్టి లేకుండెను. ఇట్లుండగా కీ. శ. ౧౫౮౦-వ సంవత్సరము నందొక దినమునం దాయన యజాగ్రతగానున్న సమయమునం దొక డకస్మాత్తుగా నతనిని జంపెను. తదనంతరమునం దాతని తమ్ముని కొడుకగు రెండవ యిబ్రాహీం ఆదిల్ షహా సింహాసనారూఢుడయ్యెను. ఆయన ౯ సంవత్సరముల బాలు డగుట వలన నాతని పెత్తండ్రి భార్యయగు చాందబీబీయే కమాల్ ఖానను మంత్రి సహాయమువలన రాజ్యము నేలుచుండెను. కొన్ని దినములయిన వెనుక కమాల్ ఖానునకు రాజ్యకాంక్ష మిక్కుటమయ్యెను. దానిం గని చాందబీబీ కిశ్వరఖానను సరదారుని

సహాయముచే వాని జంపి కిశ్వరఖానునకు దివానగిరినిచ్చెను. కాని కొంతకాలమునకు వాడును కృతఘ్నుడయి రాణిమీద గొన్ని దోషముల నారోపించి యామెను సాతార కిల్లాలో కైదుచేసి యుంచెను. చాందబీబీని కైదుచేసిన పిదప కిశ్వర్ ఖాను రాజ్యమునందంతటను విశేషసంక్షోభము చేయసాగెను. దాని నెవరును మాన్పలేక యుండగా యెకసాల్ ఖానను సిద్దీ సరదారుడొకడు వాని నచటనుండి వెడలగొట్టి చాందబీబీని విడిపించి తెచ్చెను. తదనంతర మామె యెకసాల్ ఖానును వజీరుగా నేర్పరచి రాజ్యము నేలుచుండెను. అప్పుడాతడు పాత నౌకరుల నందరినితీసి క్రొత్తవారిని నియమించెను. అక్కాలము నందు విజాపురమునందలి జనులు మంత్రిత్వము ఉన్ ఉల్ ముల్క సిద్దీ కియ్యవలెనని కొందరును, అబ్దుల్ హాసనను దక్షిణీ తురక కియ్యవలెనని మరికొందరును ఇట్లు రెండు పక్షములుగానుండిరి.

ఇట్లు రాజ్యంబులో సంతతకలహంబులు జరుగుచుండగా మూర్తిజా, నిజామ్‌షహా కులీకుతుబ్ షహా వీరిద్దరును అహమ్మదనగరముపైకి దండువెడలి దానిని సమీపించిరి. అప్పుడచట ప్రజలలో బొత్తుగా నైకమత్యము లేకయుండినందున వైరులకు మిగుల ననుకూలముగా నుండెను. ఇట్టి సమయమునందు చాందబీబీ మిగుల యుక్తిగా లోకులను సమాధానపరచి అబ్దుల్ హాసనునకు ప్రధానిత్వ మిచ్చి రెండు పక్షములవారిని నొకటిగాజేసి శత్రువులను మరలిపోవునట్లు చేసెను! షహాలు తమతమ నగరముల కరిగిన పిదప దిలార్ ఖానను సిద్దీ మిక్కిలి గర్వించి అబ్దుల్ హాసనును జంపించి తానే ప్రధాని యయ్యెను.

ఇట్లీ రాజ్యమున నొక సంవత్సరముపై నారు మాసములలో ముగ్గురు మంత్రులయినను నొకరును నెగ్గకుండిరి. దిలార్ ఖాన్‌సిద్ధీ మిగుల చాతుర్యవంతుడైనందున నతడు తనకు రాజ్యకాంక్ష గలిగియు దానిని వెలిపుచ్చక మిగుల జాగరూకుడయి యుండెను. ఇతడు రాజ్యవ్యవస్థను బహు చక్కఁగా జూచెను గాని, చాందబీబీ యచటనుండిన తనయాట లేమియు సాగవని తెలిసికొని ఇబ్రాహీమ్ ఆదిల్‌షహా చెల్లెలగు ఖుదీజాసుల్తానా యను రాజపుత్రిని మూర్తిజా నిజాంషహా కొడుకగు మిరాన్‌హుసేనున కిప్పించి క్రీ. శ. ౧౫౬౪-వ సంవత్సరమున ఖుదీజాసుల్తానాకు దోడు చాందబీబీని నిజామ్‌శాహీకి బంపి బాలరాజును నాశ్రయహీనుని జేసెను.

చాందబీబీ నిజామ్‌శాహీకి వచ్చినపిదప నచట నైదారు సంవత్సరములలో మూర్తిజాను జంపి యాతని కొడుకగు మిరాన్‌హుసేను, అతనినిజంపి యాతని పినతండ్రియగు బురాణశహాయును, అతని వెనుక నాతని పుత్రుడగు ఇస్మాయెల్ షహాయును, తదనంతర మాతని తమ్ముఁడగు ఇబ్రాహీమ్‌నిజాంషహాయును రాజ్యము చేసిరి. ఇబ్రాహీమ్ మరణానంతరమునం దతనిపుత్రుడగు బహదుర్‌ను గారాగృహమునందుంచి మిఆన్ అను దక్షిణీ తురకమంత్రి, నిజామ్‌శాహీలోనివాడని చెప్పబడు అహమ్మదను వానిని సింహాసనముపై నుంచి తానే రాజ్యము చేయ మొదలుపెట్టెను. ఈ అహమ్మదునకు రాజ్యమునిచ్చుట సిద్దీ సరదారుల కిష్టములేక బహదురునకు సమవయస్కుఁడగు నొకబాలుని దెచ్చి వానినే రాజ్యార్హుడని చెప్పదొడగిరి. ఇట్లు

వారు రెండు పక్షముల వారయి సైన్యసహితులగుట గని మి ఆన్ మంజూ మిగుల చింతించి అక్బర్ బాదుషా కొడుకగు మురాదను నాతనికి మీరు నాకు సహాయము చేసినచో అహమ్మదనగరము మీస్వాధీనము చేయుదునని వర్తమానము నంపెను. కాని మురాద్ సైన్యసహితుడయి వచ్చులోపల అహమ్మద నగరమునం గల రెండుపక్షముల వారికిని యుద్ధము జరిగి సిద్దీలను మి ఆన్ మంజూ ఓడించెను. కాన దాననిన ప్రకారము అహమ్మద నగరము మురాద్‌న కిచ్చుటకు సమ్మతింపడయ్యె. అంత నారాజపుత్రుడు యుద్ధసన్నద్ధుడయ్యెను. ఆసమయమున నీప్రధాని సైన్యమునంతను ఆదిల్ షహా, కుతుబ్ షహాలను సహాయమునకు బిలువబోయెను. అంత జరిగినపిదప బహదుర్ రాజ్యమని చాటించి చాందబీబీ రాజ్యమును తానే నడుపుచుండెను.

ఆ సమయమునం దిద్దరు ముగ్గురు రాజ్యము తమకే కావలయునని యనుటవలన నచటి లోకులు రెండు మూడు పక్షములుగా నుండిరి. ఇట్టిసమయమున చాందబీబీ తన దృఢ నిశ్చయము విడువక, నేహాంగఖానునకును శహా అల్లీ సిద్దీకిని వర్తమానములనంపి వారిని రాజధానికి బిలువనంపెను. చాందబీబీ యాజ్ఞప్రకారము వారిరువురును వచ్చుచుండగా త్రోవలో శత్రువులు వారిని రానియ్యక నిలిపిరి. నేహాంగఖాన్ మాత్రను శత్రుసైన్యము నుపాయముగా జీల్చి రాజధానిం బ్రవేశించెను.

ఆదిల్‌షహా, కుతుబ్‌షహాలు మురాదునిరాక విని ప్రథమమునందు నిజామ్‌శాహీని గెలిచి పిదప మనపైకి వచ్చునని భయపడి విపులసైన్యములతో నిజామ్‌శాహీకి దోడుగా వచ్చుచుండిరి. ఈ సంగతివిని మురాద్ వారు వచ్చినచో గెలుపొందుట కష్టమని తలచి గ్రామమును చుట్టుముట్టి బురుజులను పడగొట్ట యత్నింపుచుండెను. మురాద్ సైనికులు బురుజులను బైటినుండి త్రవ్వి గూడు చేసి యాగూటిలో తుపాకిమందునుంచి దానికి నగ్నిని రవులుకొల్ప యత్నింపుచుండిరి. కాని చాతుర్యవతియగు చాందబీబీ లోపలినుండి బైటివరకు రంధ్రములు పొడిపించి వారాగూటిలోనుంచు మందు నీవలికి దీయింపుచుండెను. ఇంతలో వారొక బురుజునకు నిప్పంటించినందున నా బురుజులో గూడ ననేక సైనికులు నాశమునొందిరి. అంత నా త్రోవను మొగలులు పట్టణములోనికి జొరనుంకించగా నదివర కధిక శౌర్యముతో యుద్ధము చేయుచున్న నిజాము సైన్యములు ధైర్యమువిడిచి పారదొడగెను. అప్పుడు చాందబీబీ ధైర్య మవలంబించి, కవచమునుధరియించి మోముపై ముసుగు వేసికొని చేత ఖడ్గమును ధరియించి "నాబొందిలో ప్రాణములుండగా పట్టణము పగవారిచే జిక్కనియ్యన"ని కూలిన బురుజు వైపునకు బరుగెత్తెను. దానింగని సైనికు లధిక శౌర్యసాహసములు గలవారలై మరలి శత్రువులతో బోరసాగిరి. ఆ దినమంతయు యుద్ధము జరిగెనుగాని చాందబీబీ శత్రువులను పట్టణములోనికి జొరనియ్యకుండెను. అప్పుడామె యొక్కడ జూచినను దానయై బహుశౌర్యముతో బోరాడెను. ఆ సమ

యమునందలి యామె శౌర్యమునుగని శత్రుసైనికులు సహిత మాశ్చర్యపడిరని ప్రత్యక్షముగా జూచిన యతడే వర్ణించెను. అప్పుడు మురాద్ తనకు గెలుపు దొరకుట దుస్తరమని తెలిసి కొని "మాకు వర్హాడప్రాంతము నిచ్చిన యెడల మేము మా దేశమునకు బోయెదమ"ని చాందబీబీకి వర్తమాన మంపెను. త్వరగా రాజ్యమునందలి యితర సైనికులు వచ్చి తనకు దోడుపడు లక్షణము లేమియు నగుపడనందున వర్హాడ ప్రాంతము చాందబీబీ వారికి నిచ్చి సంధి చేసుకొనెను.

తదనంతరమునం దామె బహాదుర్‌ను కారాగృహము నుండి విడిపించి తెచ్చి యతనికి పట్టాభిషేకము గావించెను. అంత నామె అహమ్మదఖానను నాతని ప్రధానిగా నేర్పరచి యా పిల్లవానిపేర తాను రాజ్యము నేలుచుండెను. కాని అహమ్మద్ ఖానునకు రాజ్యకాంక్ష మిక్కుటమైనందున అతడు చాందబీబీమాటను సాగనియ్యకుండెను. ఈ సంగతి సైనికులకు దెలియగా వారాతనిబట్టి బంధించి చాందబీబీ స్వాధీనముచేసిరి. తదనంతర మాతనిపని నేహాంగఖానను నాతని కిచ్చినందున చాందబీబీ రాజ్యము సురక్షితముగా నేలదొడగెను. కాని త్వరలోనే నేహాంగఖాను రాణికి వైరియయ్యెను. ఈ సమ యముననే మురాద్ శహాపురమునందు కాలము చేసెను. అంత నక్బరుపాదుషా తన చిన్న కొమారుడగు డానియల్ అను నాతనిని మురాద్ పనిమీదికి బంపి యతనికి వజీరుగా ఖాన్ ఖా నను వానిని బంపెను. అప్పు డక్బరు బర్హాణ పురమునకు వచ్చి

డానియల్‌ను క్రీ. శ. ౧౫౯౯ వ సంవత్సరమున అహమ్మద్ నగరము పైకి యుద్ధమున కంపెను.

ఈ సమయమునందు నిజామ్‌శాహీలో మిగుల నవ్యవస్థగా నుండెను. చాందబీబీ వంటి చాతుర్యవతి రాజ్యము చేయుచున్నను ఆసమయమునందామెకు నచట విశ్వాసపాత్రులగువా రెవ్వరును లేకయుండిరి. కాన నామె ఏమియు జేయ లేక యుండెను. నేహంగఖాను చాందబీబీతో నేమియాలోచించి వైరులను త్రోవలో నాటంక బరుపబోయెను. కాని శత్రుపులాత డుండుత్రోవను రాక మరియొక త్రోవను వచ్చి పట్టణమును ముట్టడించిరి. అప్పుడు చాందబీబీ తనయాజ్ఞను వినువా రెవ్వరును లేక నప్పటికి రాజధానిని విడిచి బాలరాజునుకొని జున్నురను గ్రామమునకు బోవ నిశ్చయించెను. కాని యామె సమీపమునందుండు హమీద్‌ఖానను వానికాలోచన సరిపడక చాందబీబీ పగవారికి రాజ్య మిచ్చుచున్నదని యూరంతను సాట మొదలుపెట్టెను. అది విని దక్షిణతురకలు నిజమని తలచి హమీద్‌ఖానును ముందిడుకొని కొందరు భటులు చాందబీబీ యంతఃపురముజొచ్చి యామెను జంపిరి. ఇట్లు హిందూస్థానపు ఇతిహాసములో బ్రసిద్ధురాలయిన స్త్రీరత్నముయొక్క చరితము ముగిసెను. ఈమె ప్రథమమునందు విజాపురమున మరది కొమారుడగు ఇబ్రహీమ్ ఆదిల్ షహాచిన్న తనమున నతనికొరకు ఆదిల్ శాహీని రక్షించెను. పిమ్మటఅహమ్మద్‌నగరమున తనతమ్ముని మనుమడగు బహదురుకొరకు నిజామ్‌శాహీ సంరక్షణమును మిగుల కుశలతతో జేసిసార్వ

భౌముడగు అగ్బరుయొక్క కుమారుని సైన్యములను దిరగఁగొట్టెను. కాని తుదకు రాజ్యమునం దంతటను మూర్ఖులుండుటవలన నామె యోగ్యత నెరుఁగక మిగుల నన్యాయముగా నామెను జంపిరి. నేటివరకునుదక్షిణమున స్త్రీల శౌర్యమును గూర్చి ప్రసంగించునప్పుడు అచటి వారు చాందబీబీయొక్క శౌర్యమునే ప్రథమమున శ్లాఘింతురు.

# గణపాంబ

★

ఈమె బేటంరాజునకు భార్య; గణపతిదేవునకు కూతురు. ఈ గణపతిదేవుడు క్రీ. శ. ౧౨౯౦వ సంవత్సరము నుండి ౧౨౩౨ వ సంవత్సరము వరకును నోరుగంటి రాజ్యమును బాలించిన రాజైయె యుండినచో నీ గణపాంబ రుద్రమదేవికి కూతురై యుండును. కాని యిందునకు ప్రబల నిదర్శనము లేవియు గానరాకున్నవి. గణపాంబయు దన పతిమరణానంతరమునం దాతని యేలుబడిలో నుండిన యూరువేల గ్రామములను మిగుల నేర్పుతో బాలించెను. ఆమె మిక్కిలి యౌదార్యవతియై యనేక విధములైన ధర్మకార్యములను జేసెను. ఈమె ధర్మకృత్యములను జరితమును దెలుపు శిలాశాసన మొకటి కృష్ణా మండలములో జేరియున్న గుంటూరు తాలూకాలో నున్నది. దానిలోని కొన్ని సంగతుల నిందు బొందుపరచెదను.

మిగుల ప్రసిద్ధిగాంచిన కాకతీయవంశమునందు అనేక ప్రభువులు రాజ్యము చేసినమీదట వైరిభీకరుడగు బేటరాజు సింహాసనారూఢుడయ్యెను. శివునకు పార్వతివలెను, విష్ణువునకు లక్ష్మివలెను, ఈ బేటరాజునకు గణపాంబ ధర్మపత్ని యయ్యెను. ధర్మకరకపురిని మిక్కిలి యోగ్యముగా బాలించి బేటరాజు కీర్తిశేషుడయ్యెను. తదనంతరం బాతని భార్యయగు గణపాంబ సింహాసన మెక్కెను. ఈమె భర్తయొక్క సుగతి నభిలషించి యాయనపేరిట ధన్యకటకపురమునందొక దేవాలయము నిర్మించెను. యీ యుద్ధములోనే యీ రాణి

బంగారు శిఖరముగల యింకొక గుడిని గట్టించి దానిలో బేటేశ్వరుడను లింగమును బ్రతిష్ఠింపచేసెను. ఈ గుడికినై యీదేవి ఫలవంతమగు బీనదీవియను గ్రామము నొసంగెను. ఈ మహనీయురాలు ధన్యకటకపురిలో ౧౨ గురు బ్రాహ్మణోత్తములకు ౧౨ భూవసతులు ౧౨ గృహములును దానమొసంగెను. ఈమె తనతండ్రియగు గణపతిదేవుని పేర గణపేశ్వరుని (శివుని) యాలయమొకటి కట్టించెను. ఈ గుడికై యీ రాణి చింతపాడు గ్రామము నొసంగెను. ఈ రాణి హస్తములు సతతము శివుని నర్చించుటయందే వినియోగించెను. శివుని మాహాత్మ్యమును బ్రకటించు శ్లోకములే ఆమెకానందము నిచ్చుచుండెను. ఈ రాణి వేదములయం దధిక విశ్వాసము కలది కావుననే విశాల రాజ్యక్లేశము కలిగి యున్నను ఆనందముతో దినములు గడపెను. రెండవపార్వతి యనదగిన యీమె మాహాత్మ్యము నెవ్వరు తగినట్లుగ వర్ణింప గలరు? ఈ మహనీయురాలి చరితముగురించి యింతకంటె నధిక మేమియు దెలియదు కాన విధిలేక మిగుల చింతతో దీనిని ముగించుచున్నదాన.

★

★ ★

# జి జా బా యి

ఈమె మహారాష్ట్ర రాజ్య సంస్థాపకుడగు శివాజీకి దల్లి. ఈమె శా. శ. ౧౫౧౮-వ సంవత్సరమున జన్మించెను. ఈమె భర్త పేరు శహాజీ. ఈయన జిజాబాయి నంతగా గౌరవింపక తుకాబాయి యను నామెను మరల వివాహమాడెను. జిజాబాయికి శివాజీ సంభాజీలను నిరువురు పుత్రులు గలిగిరి. కాని సంభాజీ యొక యుద్ధమునందు చచ్చెను. భర్త యనుకూలవము లేకయుండినను జిజాబాయి తన కొమారుడగు శివాజీయొక్క తెలివితేటల కానందింపుచు నతని స్వదేశ స్వమతములయందలి యభిమానమును వృద్ధిపరచుచుండెను. ఆమె భర్త తురక ప్రభువులయొద్ద సరదారుగా నుండినను నామె కా మ్లేచ్ఛప్రభుత్వమునం దధిక ద్వేషము కలిగియుండెను. ఆమె సద్బోధ వలననే శివాజీ మిగుల శూరుడయి తన దేశమునందలి తురక ప్రభుత్వమును రూపుమాపి మరాఠీ రాజ్యమును స్థాపించెను. ఆయన చేసిన పరాక్రమమునకంతకును జిజాబాయియే మూలమనుటకు సందియము లేదని న్యాయమూర్తులగు మహాదేవ గోవిందరావు రానడేగారు వ్రాసియున్నారు. శివాజీ తా నే పనినిజేసినను దల్లి యనుజ్ఞ వడయనిది చేసెడివాడుకాడు. శివాజీ మ్లేచ్ఛులతో వైరముచేయుట యతని తండ్రి కెంతమాత్రమును సమ్మతి లేదు. కాని తల్లి సహాయము వలననే శివాజీ మిగుల విఖ్యాతి గాంచెను. జిజాబాయి తా నేమి మహాకార్యము చేయజాలకున్నను దనకుగల స్వదేశ స్వమతాభిమానములను కొడుకునకు బోధించి తనకు గల యుద్దేశముల నతనిచే నెరవేరజేసెను. ఈ వీరమాత యెనుబదిరెండు సంవత్సరములు జీవించి శా. శ. ౧౬౦౦ సంవత్సరమున కాలము చేసెను.

# రూపమంజరి

బంగాళప్రాంతమున వర్ధమాన్ జిల్లాలోనిదగు కలాయింగటీ యను గ్రామమునందుండు నారాయణదాసు భార్యయగు సుధాముఖికి ఈమె క్రీ.శ. ౧౭౭౫-వ సంవత్సరమున జన్మించెను. నారాయణదాసు గొప్ప విద్వాంసుడు. వారికి రూపమంజరి దప్ప వేరు సంతానము లేనందున నామెను కడు గారాబముగా బెనుచుచుండి యామెకు బాల్యముననే విద్య నేర్ప మొదలుపెట్టిరి. రూపమంజరి తీవ్రబుద్ధి కలదగుటవలన నల్పకాలముననే విశేషవిద్య నార్జించెను. ఆమెకుగల విద్యాభిలాషనుగని నారాయణదాసామెకు వ్యాకరణశాస్త్ర శబ్దశాస్త్రములను నేర్పెను. అవి త్వరలో నేర్చుకొనినందున నారాయణదాసు తన కూతును బహాదుర్ పురమునందలి వదాన్ చంద్ర తర్కాలంకారు నింటికి విద్య నేర్చుకొనుటకు బంపెను. అచట నామె మగపిల్లలతో గూడ పాఠశాలయందు వదనచంద్రు నొద్ద విద్య నేర్చుకొనుచుండెను. తదనంతరము నారాయణదాసు త్వరలోనే మృతుడయ్యెను. అప్పుడు రూపమంజరి స్వగ్రామమునకువచ్చి తండ్రికి జరుపవలసిన ప్రేతకర్మల నన్నిటిని జరిపెను. పిదప నామెకు గావ్యముల జదువవలయునని యిచ్ఛ పొడమగా సరగామునందుండు పండిత గోపాలానంద వద్దికరిగి విశేషవిద్య నేర్చి యతని యొద్దనే వైద్యశాస్త్రమును సహితము నభ్యసించెను.

ఈ విద్వాంసురాలు మిగుల సుగుణవతిగా నుండెను. ఈమె వైష్ణవమతావలంబిని. రూపమంజరి గొప్ప విద్వాంసు

రాలయి పురుషులవలెనే క్షౌరము చేయించుకొని తల వెనుక జుట్టుమాత్ర ముంచుకొనెను. ఆమె పురుషవస్త్రములనే ధరి యించుచుండెను. రూపమంజరి జన్మమంతయు నవివాహితగా నుండి తాను విద్యాభ్యాసము చేయుచు ననేకులకు విద్యా దానము చేయుచుండెను. ఆమె వద్ద నెల్లప్పుడు వ్యాకరణము కావ్యములు నేర్చుకొనుచు విద్యార్థు లనేకు లుండుచుండిరి. మానక గ్రామవాసియగు కవినాథ బోలానాథు డనునాత డీమె యొద్ద వైద్యశాస్త్రము నభ్యసించి గొప్ప ప్రవీణుడయ్యెను. రూపమంజరికి వ్యాపారులయొక్కయు, సంసారులయొక్కయు లెక్కలు బాగుగా దెలియుచుండెను. వైద్యమునం దామె కపార పాండిత్యము కలిగియుండెను గాన నామె దాని వలననే జీవన మునకు మూలమగు ధనమును సంపాదించుచుండెను. సాధారణ లోకులీమెను విద్యాలంకారయనియు, తర్కాలంకారయనియు బిలుచుచుండిరి. ఈమె ౯౦ సంవత్సరముల ముసలిదయి సర్వ తీర్థములను సేవించుకొని స్వగ్రామమునకు వచ్చి కొన్ని సంవ త్సరములు జీవించి ౧౦౨ సంవత్సరముల ప్రాయమున క్రీ. శ. ౧౮౭౫-వ సంవత్సరమున గతించెను.

# సులీబా పండిత

★

ఈమె కాశికి సమీపమునందున్న రామనగర నివాసి యగు కృష్ణవర్మయను బ్రాహ్మణుని కూతురు. ఈ కృష్ణవర్మ గొప్ప విద్వాంసుడు. ఆయన తన కూతురగు సులీబాకు విశేషవిద్య నేర్పి వేదాంతము, జ్యోతిషము, వేదములు, స్మృతులు, పురాణములు మొదలైనవన్నియు జెప్పి గొప్ప విద్వాంసురాలిని జేసెను. ఈమె దుర్బలయైనను నామెమనసు దుర్బలముగాక నీతి, ధర్మ, పాతివ్రత్యములను గలిగి సబలమై యుండెను. సులీబా వివాహయోగ్య కాగా నామె తండ్రి యాయూరనే యుండు జగన్నాథశాస్త్రియను నతని కామె నిచ్చి వివాహముచేసెను. జగన్నాథశాస్త్రియు విద్వాంసుడే గాన నా దంపతులు పరస్పరానురాగము కలిగియుండిరి. సులీబా పాతివ్రత్య ధర్మములను దప్పక నడుపుచుండెను. అందువలన నామెభర్త యామెపై నధికప్రేమ గలవాఁడయి యుండెను. ఆ గ్రామమునందామె యొక సంస్కృతపాఠశాలను స్థాపించి కన్యలకును వితంతువులకును మిగుల శ్రద్ధతో విద్య నేర్పుచు వారికి ధర్మశాస్త్రములను నేర్పి వానియందు జెప్ప బడిన ధర్మములను వారి మనసులకు నాటునట్లు చేయుచుం డెను. ఈమె తత్వదర్శనమను గ్రంథము నొకదానిని రచి యించెను. ఈ గ్రంథములో ధర్మ, నీతి, వేదాంతములను గూర్చి చెప్పబడియున్నది.

ఒక సమయమునందీమె రామేశ్వర యాత్రకుం బోవు చుండెను. అప్పుడు త్రోవలో శ్రీరంగపట్టణమున పండితులకు జీవబ్రహ్మల విషయమున నొక గొప్పవాదము సంభవించెను. సులీబా యచటి కరిగి తన విచారములను జెప్పి వారిని మెప్పించెను. వారామె పాండిత్యమున కచ్చెరువంది యామెకు 'పండిత' యనిన బిరుదునిచ్చిరి. నాటినుండియు నామె సులీబా పండిత యనంబరగె. తదనంతర మామెయాత్ర గావించుకొని తన గ్రామమునకు వచ్చి స్త్రీలకు నీతి నేర్పుచుండెను. ఇటుల నామె బహుదినములు పతితో సుఖముల ననుభవించి పతి మరణసమయమున నతనితో ననుగమనము చేసెను.

# మారుల

★

ఈమె యొక విఖ్యాతయయిన సంస్కృతకవయిత్రి. ఈమెను గురించియు నితర కవయిత్రులను గురించియు ధన దేవుడను కవి యిట్లు వ్రాసియున్నాడు.

శ్లో. శీలా విజ్జా మారులా మోరికాద్యాః
కావ్యం కర్తుం సంతి విజ్ఞాః స్త్రియోపి
విద్యాం వేత్తుం వాదినో నిర్విజేతుం
విశ్వంవక్తుం యః ప్రవీణః స వంద్యః.

అనగా శీలా, విజ్జా, మారులా, మోరిక మొదలయిన స్త్రీలు కావ్యములు చెప్పుటకు సమర్థురాండ్రై యున్నారు. విద్య నేర్చినవారును, వాదులను గెలువ నేర్చినవారును, విశ్వమును వర్ణింప నేర్చినవారును, నెవరయినను వంద్యులే.

ఈ శ్లోకమువలన నాకాలమునందనేక స్త్రీలు విశేష విద్య నేర్చి పండితులతో వాదించి వారి నోడింపుచుండిరనియు, విద్వాంసులు మెచ్చదగిన కావ్యములు రచియింపుచుండి రనియు స్పష్టమగుచున్నది.

□ □
□ □

# విజ్జిక

★

ఈమెకు విజ్జకాయనియు నామాంతరము కలదు. ఈమెచే రచియింపబడిన శ్లోకములనేక గ్రంథములలో నుదహారింపబడియున్నవి. ఈమెను లోకులు సరస్వతియొక్క యవతారమని తలచుచుండిరి. ఇందువలననే యీమె యభిమానముతో నిట్లు చెప్పుకొనినది.

శ్లో. నీలోత్పలదలశ్యామాం విజ్జకాం మామజానతా
వృథైవ దండినా ప్రోక్తంసర్వశుక్లా సరస్వతీ.

అనగా నల్లకలువవంటి దేహమునుగలనన్ను నెరుగక దండికవి యూరక సరస్వతీదేవి దేహమంతయు దెల్లనిదేయని వర్ణించెను.

# సుభద్ర

★

ఈ సంస్కృత కవయిత్రిని గురించి రాజశేఖరుడను కవి యిట్లు వ్రాసెను.

శ్లో. పార్థస్యమనిసి స్థానం లేభేఖలు సుభద్రయా
కవీనాంచవచోవృత్తి చాతుర్యేణ సుభద్రయా.

అనగా పూర్వము సుభద్రచే పార్థుని మనమున స్థలము సంపాదింపబడెను. ఇప్పుడు సుభద్రయను కవయిత్రి కవితారచనచాతుర్యముచే కవుల మనమునందు స్థానము సంపాదించెను.

★

# హఠీ విద్యాలంకార్

★

ఈమె హఠాజాతి బ్రాహ్మణులబిడ్డ; ఈమె న్యాయము స్మృతులు మొదలైన శాస్త్రములన్నియు నేర్చిన విద్వాంసురాలు. ఈ పండితకాశీలో నొక సంస్కృత పాఠశాల స్థాపించెను. ఆకాలమునందు హిందూస్థానమునందలి విద్యార్థులనేకు లాపాఠశాలలో విద్యనభ్యసింప వచ్చుచుండిరి. హఠి మిగుల నేర్పుతో విద్యార్థులకు శాస్త్రములను నేర్పుచుండెను. అసామాన్య శాస్త్రాభిజ్ఞత్వము వలన నామెను పండితులు విశేషముగా మన్నింపుచుండిరి. న్యాయనిర్ణయముచేయు సభలకును సమారంభములకును నీమెను మిగుల గౌరవముతో బిలుచుచుండిరి. ఆమెయు వారి యామంత్రణమును వ్యర్థపుచ్చక సభలకుబోయి యచట శాస్త్రీయ విషయములపైని వాదము చేయుచుండెను.

# కర్ణాటి

★

ఈ ప్రౌఢకవయిత్రి నామమే మోహనాని యీమె కర్ణాట దేశస్థురా లయినందువలన నీమెను కర్ణాటియనియే వాడుదురు. ఈమెను గురించి సూక్తిముక్తావళిలో నిట్లు వ్రాసియున్నది:-

శ్లో. సరస్వతీవ కర్ణాటీ విజయాంకా జయత్యసౌ
యా వైదర్భగిరాంవాసః కాళిదాసా దనంతరం.

అర్థము:- 'విజయ' యనుబిరుదుగల 'కర్ణాటి' సరస్వతి వలె జయమందుచున్నది. కాళిదాసు తరువాత నీమెయందే వైదర్భీరీతి వాసము చేయుచున్నది.

ఈమె తన రమ్యకవిత్వముచే నందరు కవులను గెలిచి 'విజయ' యను బిరుదును చెందినది. గనుక పూజ్యులగు వ్యాస వాల్మీకులను దప్ప మరి యితరకవుల నేరిని మెచ్చకయుండెను ఈమెదియని చెప్పబడెడి యీక్రింది ప్రౌఢోక్తివలన నీమె 'విజయ' యను బిరుదు అన్వర్థకమే యని తోచకమానదు:-

శ్లో. ఏకోభూన్నలినా త్తతశ్చ పులినా ద్వల్మీక తశ్చాపరః
తేసర్వే కవయోభవన్తి గురవస్తేభ్యో నమస్కుర్మహే;
అర్వాంచో యది గద్యపద్యరచనై శ్చేతశ్చమత్కుర్వతే
తేషాంమూర్ధ్ని దదామి వామచరణం కర్ణాట రాజప్రియా.

అర్థము—పూర్వకవులయిన బ్రహ్మ, వ్యాస, వాల్మీకాదులు నాకు గురువులు, వారికి నమస్కారము చేసెదను: కాని యాధునికు లెవరయిన గద్యపద్యరచనచేత జిత్తమును

రంజింపజేసెద మనినయెడల వారిశిరస్సుపయి నాయెడమకాలు మోపుచున్నాను.

ఈశ్లోకములోని 'కర్ణాటరాజప్రియా' పదమువలన నీమె 'మోహనాంగియా' యేమి యని సంశయము కలుగుచున్నది. మోహనాంగి కృష్ణదేవరాయుల కూతురనియు, రామరాజు భార్యయనియు, కవయిత్రియనియు వాడుకగలదు. ఐనను ఇందునుగురించి శోధన చేయవలసి యున్నది.

# మదిన సుభద్రమ్మ

*

ఈమె శ్రీసర్ మహారాజా గోడే నారాయణ గజపతి రాయనింగారి మేనత్త. శతకములు రచియించిన స్త్రీలలో నీమె యగ్రగణ్యురాలని రావుబహదూరు కందుకూరి వీరేశలింగము పంతులుగారు కవిచరిత్రమునందు వ్రాసియున్నారు. ఈమె [illegible] గొండ వెంగమాంబకు సమకాలీనురాలు. ఈమె శ్రీరామ దండకము, రఘునాయక శతకము, కేశవశతకము, కృష్ణశతకము, రాఘవరామ శతకము రచియించెను. ఈమె కవనధోరణిని దెలుపుటకయి యీమె రచితములని కవిచరిత్రలో వ్రాసిన రెండు పద్యముల నిందుదాహరించెదను.

ఉ. శ్రీరమణీకళత్ర సరసీరుహ నేత్ర జగత్పవిత్ర స  
త్సారసబృందమిత్రసురసన్నుతిపాత్ర నరేంద్రపుత్ర శృం  
గారసమగ్రగాత్ర జనకర్మవిదారణకృచ్చరిత్ర శ్రీ  
నారదమౌనిగీతచరణా రఘునాయక దీనపోషకా.

ఉ. మన్ననదప్పియున్నయెడ మక్కువగల్గినవారి నేనియుం  
దిన్నగ మందలించినను దెల్లముగామది నొవ్వకుండు నే  
యన్నకు ధార్తరాష్ట్రునకు నాదరమొప్ప హితోపదేశమి  
ట్లెన్నగ జేసి యావిదురు డేమి ఫలంబును జెందె గేశవా!

అభ్యుదయ ప్రెస్, గవర్నరుపేట బెజవాడ. [redacted] కాపీలు 1000. 4-12-47